శుక్రవారం
16•3•2018
హైదరాబాద్
• వెల.5 రూ.

బడ్జెట్ 2018-19 ₹

నమస్తే తెలంగాణ

మన రాష్ట్రం • మన పత్రిక

• సంపుటి 7 • సంచిక 278 • పేజీలు : 18 + (24/20/16)

WWW. NTNEWS.COM
/NTDAILYONLINE

PUBLISHED FROM HYDERABAD I KARIMNAGAR I WARANGAL I KHAMMAM I NALGONDA I MAHABUBNAGAR I NIZAMABAD

నీటిపారుదలకు **25 వేల కోట్లు** | పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధికి **15 వేల కోట్లు** | పంట పెట్టుబడికి **12 వేల కోట్లు** | రైతు బీమాకు **500 కోట్లు** | డబుల్ బెడ్‌రూం ఇండ్లకు **1500 కోట్లు** | ఆలయాల అభివృద్ధికి **550 కోట్లు**



అన్నదాతా సుఖీభవ!

రాష్ట్ర బడ్జెట్
1.74 లక్షల కోట్లు
భారీ పద్దును సమర్పించిన ఆర్థికమంత్రి ఈటల రాజేందర్

సంక్షేమ పద్దు.. అందరికీ ముద్దు

మొత్తం బడ్జెట్	:	రూ.1,74,453.84 కోట్లు
ప్రగతి పద్దు	:	రూ.1,04,757.90 కోట్లు
నిర్వహణ పద్దు	:	రూ.69,695.94 కోట్లు

2017-18లో రాష్ట్ర ఆర్థిక వృద్ధి రేటు 14.1%
జాతీయ సగటు వృద్ధిరేటు 9.5% కంటే అధికం

- సామాజిక సేవారంగాలకు రూ.45 వేల కోట్లు
- ఒక్క బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీల సంక్షేమానికే రూ.35 వేల కోట్లు

కొన్ని కీలక శాఖలకు కేటాయింపులు ఇలా ఉన్నాయి

- ఎస్సీ కులాల అభివృద్ధిశాఖ: రూ.12,708.73 కోట్లు
- గిరిజన సంక్షేమశాఖ: రూ.8,063.48 కోట్లు
- వైద్యారోగ్యం, కుటుంబ సంక్షేమశాఖ: రూ.7,375.20 కోట్లు
- పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ: రూ.7,250.56 కోట్లు
- హోంశాఖ: రూ.5,790.35 కోట్లు
- రోడ్లు, భవనాలశాఖ: రూ.5,575.23 కోట్లు
- విద్యుత్‌శాఖ: రూ.4,393.50 కోట్లు
- ఉన్నతవిద్యాశాఖ: రూ.2,447.88 కోట్లు
- మహిళా, శిశు, వికలాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ: రూ.1,798.82 కోట్లు



గురువారం శాసనసభలో రాష్ట్ర వార్షిక బడ్జెట్‌ను ప్రవేశపెట్టేముందు ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావును కలుసుకున్న ఆర్థిక మంత్రి ఈటల రాజేందర్

ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన కొన్ని పథకాలకు కేటాయింపులు

- ఆసరా పింఛన్లు : రూ.5,366.89 కోట్లు
- విద్యుత్ సబ్సిడీ : రూ.4,984.30 కోట్లు
- ఉపకారవేతనాలు : రూ.3,282.24 కోట్లు
- కల్యాణలక్ష్మి, షాదీముబారక్ : రూ.1,450.46 కోట్లు
- కేసీఆర్ కిట్స్ పథకం : రూ.560.50 కోట్లు

అన్నదాత క్షేమంగా ఉంటే.. రాష్ట్రం కడుపు నిండుతుంది! సబ్బండవర్ణాల సంక్షేమంతోనే అభివృద్ధి వేగవంతమవుతుంది! రాష్ట్ర సమగ్రాభివృద్ధికి, ప్రజల జీవన వికాసానికి దోహదం చేసే ఈ రెండు అంశాలపై ప్రధానంగా దృష్టిసారించింది 2018-19 వార్షిక బడ్జెట్! రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ పురోగతిని ప్రతిబింబిస్తూ రూ.1,74,453.84 కోట్ల భారీ బడ్జెట్‌ను గురువారం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన ఆర్థిక మంత్రి ఈటల రాజేందర్.. 'ప్రతి ఇంటికీ సంక్షేమం.. ప్రతి ముఖంలో సంతోషం' అన్న నినాదంతో ఏ రంగాన్నీ విస్మరించకుండా, ఏ వర్గానికీ లేదనకుండా కేటాయింపులు చేశారు. రూ.5,520 కోట్ల మేరకు రెవెన్యూ మిగులు చూపారు.

ప్రత్యేక ప్రతినిధి, నమస్తే తెలంగాణ:


అన్నదాతా.. సుఖీభవ.. అంటూ గతంలో ఎన్నడూ లేని విధంగా వ్యవసాయం, దాని అనుబంధ రంగాలకు, రైతుకు అవసరమైన సాగు నీటి ప్రాజెక్టులకు ఆర్థిక మంత్రి ఈటల రాజేందర్ పెద్ద మొత్తంలో కేటాయింపులు చేశారు. సంక్షేమరంగానికి రూ.45,479.57 కోట్లు ప్రతిపాదించగా, వ్యవసాయ అనుబంధరంగాలు, గ్రామీణాభివృద్ధికి రూ.20,820.08 కోట్లు, సాగునీటిరంగానికి రూ.25వేల కోట్లు కేటాయించారు. గతేడాది 2017-18 బడ్జెట్‌లో వ్యవసాయ, అనుబంధ రంగాలకు సుమారు రూ.13,640 కోట్లు కేటాయించగా, ఈసారి రూ.7,179 కోట్లు పెంచడం విశేషం. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న పంట పెట్టుబడి పథకం అమలుకోసం ఏకంగా రూ.12వేల కోట్లను, తాజాగా ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రకటించిన విప్లవాత్మక నిర్ణయం రైతు బీమా అమలు కోసం రూ.500 కోట్లు బడ్జెట్‌లో కేటాయించడం గమనార్హం. పేదల సంక్షేమానికి ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తున్న రాష్ట్ర ప్రభుత్వం.. సంక్షేమ రంగానికి రూ.45వేల కోట్లపైనే కేటాయించగా, ఇందులో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీల సంక్షేమానికి రూ.35వేల కోట్లపైనే కేటాయించింది. మొత్తంగా ఈ వర్గాలకు రూ.5,200 కోట్లకుపైగా కేటాయింపులు పెరుగడం గమనార్హం. ఆరోగ్యరంగానికీ అత్యంత ప్రాధాన్యం ఇచ్చిన ఆర్థికమంత్రి.. ఈసారి బడ్జెట్‌లో వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖకు రూ.7,375.20 కోట్లు కేటాయించారు. ఇది గతంతో పోల్చితే రూ.1,579.03 కోట్లు అదనం. ఇందులో ఆరోగ్యశ్రీకి రూ.699.44 కోట్లు, కేసీఆర్ కిట్ల పథకానికి రూ.560.50 కోట్లు, ఉద్యోగులు, జర్నలిస్టుల ఆరోగ్య పథకానికి రూ.300 కోట్లు ప్రతిపాదించారు. ఈ ఏడాది నుంచి రాష్ట్రంలోని ప్రతి పౌరునికీ ఆరోగ్య పరీక్షలు నిర్వహించి హెల్త్ ప్రొఫైల్ తయారుచేసేందుకు, అన్ని గ్రామాల్లో ఉచితంగా కంటిపరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి ఆపరేషన్లు నిర్వహించి, కంటి అద్దాలు పంపిణీ చేసేందుకు ప్రభుత్వం సిద్ధమవుతున్న తరుణంలో ఆరోగ్యరంగానికి కేటాయింపులు పెరిగాయి. నిరుపేదలకోసం ఉచితంగా నిర్మించి ఇస్తున్న డబుల్ బెడ్‌రూం ఇండ్ల పథకానికి ఈ బడ్జెట్‌లో రూ. 2,795.15 కోట్లను కేటాయించారు. గత బడ్జెట్‌లో రూ.1898.39 కోట్లను

మిగతా 2వ పేజీలో



బంగారు తెలంగాణకు నిండైన బడ్జెట్


రూపాయి రాక - 2018-19



ఆదాయ మార్గాలు

ఆదాయమార్గాలు	రూ. కోట్లలో
రెవెన్యూ వసూళ్లు	1,30,975.11
ప్రభుత్వ రుణాలు	33,200.00
రుణ చెల్లింపులు	7,807.17
ప్రభుత్వ ఖాతాలు	2,500
మొత్తం ఆదాయం	1,74,487.28

రూపాయి పోక - 2018-19



వ్యయ చెల్లింపులు

వ్యయం	రూ. కోట్లలో
రెవెన్యూ వ్యయం	1,25,454.70
మూలధన వ్యయం	33,369.10
ప్రభుత్వ రుణ చెల్లింపులు	6,594.48
రుణాలు, అడ్వాన్స్‌లు	9,035.55
మొత్తం వ్యయం	1,74,453.83
నికర మిగులు	28.45

అభివృద్ధి, సంక్షేమాల బడ్జెట్

అన్నిరంగాలకు, అన్నివర్గాలకు సానుకూలం

సీఎం కేసీఆర్ ప్రశంస

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: 2018-19 ఆర్థిక సంవత్సరానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ అన్నిరంగాల అభివృద్ధికి, అన్నివర్గాల సంక్షేమానికి ఉపయోగపడేలా ఉన్నదని ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు అభిప్రాయపడ్డారు. పూర్తి సమతుల్యంతో బడ్జెట్ రూపొందించారని అన్నారు. తెలంగాణ రాష్ట్రానికి ఉన్న ఆదాయ వనరులను, రాష్ట్రానికి ఉన్న అవసరాలు, ప్రభుత్వ లక్ష్యాలకు మధ్య పూర్తి సమన్వయం కుదురుస్తూ బడ్జెట్ తయారుచేశారని సీఎం కేసీఆర్ ప్రశంసించారు. రాష్ట్రాభివృద్ధి ప్రణాళికలు సమర్థంగా అమలుచేసే విధంగా వార్షిక ఆర్థిక ప్రణాళిక రూపొందించిన ఆర్థికశాఖ మంత్రి ఈటల రాజేందర్, ఆర్థికశాఖ ముఖ్య కార్యదర్శి రామకృష్ణారావు, ఆర్థికశాఖ సలహాదారు జీఆర్ రెడ్డిని సీఎం కేసీఆర్ అభినందించారు. ఎక్కువశాతం మంది ఆధారపడిన వ్యవసాయరంగానికి అత్యధిక నిధులు ప్రతిపాదించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. సాగునీటి ప్రాజెక్టులు, పంట పెట్టుబడి మద్దతు పథకం, విద్యుత్ సబ్సిడీలకు ఎక్కువ నిధులు సమకూర్చడం వల్ల తెలంగాణలో వ్యవసాయరంగాభివృద్ధికి ప్రభుత్వం చిత్తశుద్ధితో అమలు చేస్తున్న కార్యక్రమాలు విజయవంతంగా ముందుకు సాగుతాయని సీఎం కేసీఆర్ అన్నారు.

ఉద్యోగులు, జర్నలిస్టుల హెల్త్‌స్కీంలు

యథాతథం

సీఎంవో స్పష్టీకరణ

మరింత సమర్థంగా నిర్వహిస్తాం: మంత్రి లక్ష్మారెడ్డి


హైదరాబాద్, నమస్తేతెలంగాణ: ఉద్యోగుల హెల్త్‌స్కీం, జర్నలిస్టుల హెల్త్‌స్కీంలు యథాతథంగా కొనసాగుతాయి. వీటిని ఆరోగ్యశ్రీలో కలుపాలని బుధవారం క్యాబినెట్ నిర్ణయం తీసుకున్నట్టు వచ్చిన వార్తల్లో నిజం లేదని సీఎం కార్యాలయం గురువారం ఒక ప్రకటనలో స్పష్టంచేసింది. ఆరోగ్యశ్రీ,

మిగతా 8వ పేజీలో

బంగారు తెలంగాణ దిశగా..



14.1 శాతం వృద్ధిరేటుతో పరుగులు
సామాజిక, ఆర్థిక ముఖచిత్రం-2018లో వెల్లడి
జాతీయ తలసరి ఆదాయం కన్నా..
రాష్ట్ర తలసరి ఆదాయమే ఎక్కువ
సర్వతోముఖాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలే కారణం
15





బీసీ సంక్షేమశాఖ
రూ.5,919.83 కోట్లు

ఎస్సీ కులాల అభివృద్ధిశాఖ
రూ.12,708.73 కోట్లు

మైనారిటీల సంక్షేమశాఖ
రూ.2,000 కోట్లు

గిరిజన సంక్షేమశాఖ
రూ.8,063.48 కోట్లు






అసెంబ్లీలో బడ్జెట్ ప్రతులను ఆసక్తిగా పరిశీలిస్తున్న ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు



ఇది ప్రజా సంక్షేమ బడ్జెట్

ఇది ఎన్నికల బడ్జెట్ కాదు, ప్రజాసంక్షేమ బడ్జెట్. అన్నివర్గాలవారికి న్యాయం జరిగేలా రూపొందించిన బడ్జెట్ ఇది. రైతులకు అధిక ప్రాధాన్యం ఇచ్చారు. మైనారిటీల సంక్షేమానికి రూ.2 వేలకోట్లు కేటాయించిన సీఎంకు కృతజ్ఞతలు. రాష్ట్ర ప్రభుత్వం బడుగు, బలహీనవర్గాలు, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీవర్గాల సంక్షేమానికి పెద్దపీట వేసిందనడానికి ఈ బడ్జెట్ కేటాయింపులే నిదర్శనం.

- మహమూద్ అలీ, డిప్యూటీ సీఎం



వ్యవసాయ, సహకారశాఖ
12,601.47 కోట్లు



గురువారం బడ్జెట్ అనంతరం రాజ్‌భవన్‌లో గవర్నర్ నరసింహన్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు

గవర్నర్‌తో సీఎం భేటీ

బడ్జెట్ సమావేశాలపై చర్చ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్ర ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు గురువారం రాజ్‌భవన్‌లో గవర్నర్ ఈఎస్ఎల్ నరసింహన్‌తో భేటీ అయ్యారు. శాసనసభలో బడ్జెట్ సమావేశం ముగిసిన తర్వాత మధ్యాహ్నం ముఖ్యమంత్రి రాజ్‌భవన్‌కు వెళ్లారు. ఇద్దరు దాదాపు గంటపాటు చర్చించారు. బడ్జెట్ సమావేశాలు జరుగుతున్న తీరును సీఎం గవర్నర్‌కు వివరించినట్లు సమాచారం. బడ్జెట్ సమావేశాల తొలిరోజు కాంగ్రెస్ సభ్యులు దురుద్దేశపూర్వకంగానే రభస సృష్టించారని, విచక్షణ మరిచి వ్యవహరించారని సీఎం పేర్కొన్నట్లు తెలిసింది. సభా సంప్రదాయాలను విస్మరించి మితిమీరి వ్యవహరించినందుకే కాంగ్రెస్ సభ్యులను సస్పెండ్ చేయాల్సి వచ్చిందని ముఖ్యమంత్రి గవర్నర్‌కు వివరించినట్లు సమాచారం. శాసనసభలో ప్రవేశపెట్టిన బడ్జెట్ తీరుతెన్నులపై గవర్నర్‌కు విశ్లేషించి చెప్పినట్లు తెలిసింది. రైతులకు పంటలు లాభసాటిగా మార్చడానికి తీసుకుంటున్న చర్యలను వివరించారు. ఈసారి బడ్జెట్‌లో రైతుల సంక్షేమానికి అత్యధిక ప్రాధాన్యమిచ్చినట్లు తెలిపారు.


కేంద్రం చర్చలకు ముందుకు రావాలి

పార్లమెంట్ సెంట్రల్‌హాల్‌లో టీఆర్ఎస్ ఎంపీల నిరసన



గురువారం పార్లమెంట్ సెంట్రల్‌హాల్‌లో నిరసన తెలుపుతున్న టీఆర్ఎస్ ఎంపీలు జితేందర్‌రెడ్డి, వినోద్‌కుమార్, కల్వకుంట్ల కవిత, మల్లారెడ్డి, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, బూర నర్సయ్యగౌడ్, కొత్త ప్రభాకర్‌రెడ్డి, బీబీ పాటిల్, పసునూరి దయాకర్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రిజర్వేషన్లు పెంచుకునే అధికారాన్ని రాష్ట్రాలకు కల్పించాలని కోరుతూ టీఆర్ఎస్ ఎంపీలు గురువారం పార్లమెంట్ సెంట్రల్‌హాల్‌లో ఆందోళన చేపట్టారు. రాష్ట్రపతి ప్రసంగం, బడ్జెట్ సమావేశాలు, వివిధ దేశాల అధ్యక్షులు భారత పార్లమెంటును ఉద్దేశించి మాట్లాడే సందర్భంలోనే సెంట్రల్ హాల్‌ను ఉపయోగిస్తారు. అయితే తొలిసారిగా సెంట్రల్ హాల్‌లో ఆందోళనకు దిగడం ద్వారా టీఆర్ఎస్ ఎంపీలు రిజర్వేషన్ల డిమాండ్ తీవ్రతను కేంద్రానికి తెలియజేశారు. రాజస్థాన్, గుజరాత్, హర్యానా, మహారాష్ట్ర, ఏపీ ఇలా అనేకరాష్ట్రాల్లో రిజర్వేషన్ల కోసం పోరాటాలు జరుగుతున్నాయని లోక్‌సభ టీఆర్ఎస్ పక్షనేత ఏపీ జితేందర్ రెడ్డి పేర్కొన్నారు. వెంటనే కేంద్రం చర్చలకు రావాలని డిమాండ్ చేశారు. ప్రజా సమస్యపై కేంద్రం వైఖరి సరిగాలేదని, రిజర్వేషన్ల అంశాన్ని వెంటనే పరిష్కరించేలా కేంద్రం చొరువ చూపాలని విజ్ఞప్తి చేశారు.



అన్నదాతా సుఖీభవ!

మొదటిపేజీ తరువాయి...


డబుల్ బెడ్‌రూం నిర్మాణాలకు కేటాయించగా, ఈసారి సుమారు 900 కోట్ల మేరకు అదనంగా కేటాయించనున్నారు. వ్యవసాయ అనుబంధ రంగాలైన పాడి, మత్స్య, పట్టుపరిశ్రమలకు రూ.1126 కోట్లను కేటాయించారు. గత ఏడాదితో పోల్చితే ఈసారి 582 కోట్లు పెరుగడం విశేషం.

మొత్తం బడ్జెట్ రూ.1.74 లక్షల కోట్లు

వచ్చే ఆర్థిక సంవత్సరానికి రూ.1,74,453.84 కోట్లతో ఆర్థికమంత్రి ఈటల రాజేందర్ బడ్జెట్ ప్రతిపాదనలు సమర్పించారు. దీనిలో రెవెన్యూ వ్యయం రూ.1,25,456.70 కోట్లు కాగా, మూలధన వ్యయం రూ.33,369.10 కోట్లుగా ఉంది. ఇది మొత్తం వ్యయంలో 19 శాతంగా ఉంది. రూ.1,04,757 కోట్లను ప్రగతి పద్దు (స్కీమ్ ఎక్స్‌పెండిచర్) కింద ప్రతిపాదించారు. నిర్వహణ పద్దు రూ.69,695.94 కోట్లుగా చూపారు. రాష్ట్రంలో ఏ ఏటికాయేడు రెవెన్యూ రాబడులు పెరుగుతున్నాయి. రెవెన్యూ ఖర్చులకంటే రాబడులు ఎక్కువగా ఉండటంతో వరుసగా నాలుగోసారి రాష్ట్ర బడ్జెట్‌లో రెవెన్యూ మిగులు కనిపించింది. తెలంగాణ ఆవిర్భవించిన తర్వాత 2014-15 సంవత్సరం పదినెలల కాలానికి తొలి బడ్జెట్‌ను ప్రభుత్వం ప్రవేశపెట్టింది. ఆ తర్వాత 2015-16 నుంచి రెవెన్యూ ఖర్చులను అధిగమించి రెవెన్యూ రాబడులను ఎక్కువ మొత్తంలో సాధించి వరుసగా మిగులు రాష్ట్రంగా నిలుస్తున్నది. ఈ నేపథ్యంలో వచ్చే ఆర్థిక సంవత్సరానికి రెవెన్యూ మిగులు రూ.5,520.41 కోట్లుగా ఉండవచ్చని ఆర్థిక మంత్రి ఈటల రాజేందర్ తన బడ్జెట్ ప్రతిపాదనల్లో అంచనావేశారు. ఈ ఏప్రిల్ నుంచి వచ్చే ఆర్థిక సంవత్సరం మార్చి వరకు రెవెన్యూ రాబడులు రూ.1,30,975.11 కోట్లు, రెవెన్యూ ఖర్చులు రూ.1,25,454.70 కోట్లుగా అంచనావేశారు. వెరసి, రూ.5,520 కోట్లు మిగులు ఉంటుందని అంచనావేశారు. గత వార్షిక బడ్జెట్లను గమనిస్తే 2015-16లో మిగులు రూ.238 కోట్లుగా ఉంది. 2016-17 వాస్తవ బడ్జెట్‌లో రూ.1,385.76 కోట్లు, 2017-18లో సవరించిన బడ్జెట్ అంచనాల ప్రకారం రూ.1,545.39 కోట్లు మిగులు ఉంది.

రెట్టింపయిన మూలధన వ్యయం

ఉమ్మడి రాష్ట్రంలో క్యాపిటల్ వ్యయం కింద 2013-14లో ఖర్చయిన మొత్తం కేవలం రూ.15,280 కోట్లుగా ఉండగా తెలంగాణ ఏర్పడిన తర్వాత అది రెట్టింపు కావడం విశేషం. 2018-19లో ద్రవ్యలోటు రూ.29,077.07 కోట్లు ఉంటుందని అంచనా వేశారు. ద్రవ్యలోటు రాష్ట్ర జీడీపీలో 3.45 శాతంగా ఉంది. ఇది మొత్తంగా ఎఫ్ఆర్బీఎం పరిమితికి లోబడి ఉండటం విశేషం. వాస్తవానికి జీఎస్డీపీ రూ.7లక్షల కోట్లు దాటిందని తాజా లెక్కలు చెప్తున్నాయి. కాగా ఈసారి కేంద్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన నిధులలో పెరుగుదల పెద్దగా ఉండదని ప్రభుత్వం భావిస్తున్నది. కేంద్రం నుంచి వివిధ రూపాలలో 2017-18 ఆర్థిక సంవత్సరానికి రూ.26,857.67 కోట్లు సమకూరుతాయని భావించగా, 2018-19లో అది రూ.29,041.88 కోట్లుగా అంచనా వేశారు. కాగా ఈసారి ప్రభుత్వం సొంత రాబడులనే ఎక్కువగా నమ్ముకున్నది. వచ్చే ఏడాది మొత్తం రెవెన్యూ రాబడులు రూ.1,30,975 కోట్లు ఉంటాయని, అందులో రాష్ట్ర సొంత పన్నులద్వారానే రూ.73,751.88 కోట్లు వస్తాయని అంచనావేశారు. క్యాపిటల్ రాబడులు ఈసారి రూ.43,50,717.41గా ఉండవచ్చని అంచనా వేశారు. రెవెన్యూ, క్యాపిటల్ రాబడులు కలిపి 2018-19 బడ్జెట్‌లో రూ.1,74,482,28గా ఉంటుందని అంచనా. ఇది 2017-18 బడ్జెట్ అంచనాలతో పోలిస్తే 16.9% అధికం.



శాసనమండలిలో బడ్జెట్‌ను ప్రవేశపెట్టడానికి ముందు స్పీకర్ మధుసూదనాచారిని మర్యాదపూర్వకంగా కలిసిన ఉపముఖ్యమంత్రి కడియం శ్రీహరి



బడ్జెట్‌లో వ్యవసాయ రంగానికి అత్యధిక నిధులు కేటాయించడాన్ని స్వాగతిస్తూ నల్లగొండ మండలం బుద్ధారం గ్రామంలో సీఎం కేసీఆర్, ఆర్థిక మంత్రి ఈటల రాజేందర్ ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేస్తున్న రైతులు

ఐదోసారి ఈటల బడ్జెట్

రాష్ట్ర ఆర్థిక మంత్రి ఈటల రాజేందర్ ఐదోసారి శాసనసభలో బడ్జెట్ ప్రవేశపెట్టారు. గురువారం ఉదయం బడ్జెట్ ప్రతులు ఉన్న సూట్‌కేసుతో సమావేశమందిరంలోకి ప్రవేశించిన ఈటలను పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు లేచి, నవ్వుతూ ఆహ్వానించారు. తన సీటు దగ్గరికి వస్తున్న క్రమంలోనే ఆయనకు అభినందనలు తెలియజేస్తూ పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు జిల్లాలవారీగా ఆయన పక్కన నిలబడి ఫొటోలు తీయించుకున్నారు. అనంతరం సుమారు గంటా 22 నిమిషాలపాటు బడ్జెట్ ప్రసంగం చేసిన ఈటల రాజేందర్ తన ప్రసంగం ముగియగానే ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు వద్దకు వెళ్లారు. ఈ సందర్భంగా ఈటలను సీఎం అభినందించారు.

శాసనమండలిలో బడ్జెట్ ప్రవేశపెట్టిన డిప్యూటీ సీఎం కడియం

రాష్ట్ర వార్షిక బడ్జెట్ 2018-19ను గురువారం శాసనసభలో డిప్యూటీ సీఎం కడియం శ్రీహరి ప్రవేశపెట్టారు. ఉదయం 11 గంటలకు బడ్జెట్ ప్రసంగం ప్రారంభించిన కడియం.. గంటా ఐదు నిమిషాలపాటు ప్రసంగాన్ని కొనసాగించారు. వివిధ పథకాలు, అభివృద్ధిని కడియం వివరిస్తున్న సమయంలో సభ్యులు బల్లలు చరిచి హర్షం ప్రకటించారు. బడ్జెట్ ప్రసంగం ముగిసిన తర్వాత మండలిని సోమవారానికి వాయిదా వేస్తున్నట్లు డిప్యూటీ స్పీకర్ నేతి విద్యాసాగర్‌రావు ప్రకటించారు.

ముహూర్తం

సూర్యోదయం: 6.27 గంటలకు

సూర్యాస్తమయం: 6.22 గంటలకు

హేవళంబి నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరరుతువు, ఫాల్గుణమాసం, కృష్ణపక్షం చతుర్దశి సాయంత్రం 6.20 వరకు, తదుపరి అమావాస్య, నక్షత్రం: శతభిషం సాయంత్రం 6.45 వరకు తదుపరి పూర్వాభాద్ర, అమృతఘడియలు: ఉదయం 11.06 నుంచి మధ్యాహ్నం 12.42 వరకు, రాహుకాలం: ఉదయం 10.55 నుంచి మధ్యాహ్నం 12.25 వరకు, దుర్ముహూర్తం: ఉదయం 8.50 నుంచి 9.38 వరకు, తిరిగి మధ్యాహ్నం 12.49 నుంచి 1.36 వరకు, వర్జ్యం: రాత్రి 12.53 నుంచి తె. 2.29 వరకు.

లోకం పోకడ



గత నాలుగు బడ్జెట్లలో రెవెన్యూ రాబడుల తీరు

2015-16నుంచి రెవెన్యూ రాబడుల తీరును ప్రభుత్వం గురువారం శాసనసభలో ప్రవేశపెట్టిన బడ్జెట్ ట్రెండ్స్‌లో వెల్లడించింది.


	2015-16	2016-17	2017-18 (సవరించిన అంచనా)	2018-19 (బడ్జెట్ అంచనా)
1.పన్నులు, సుంకాలు	52,425.35	63284.35	77,789.06	92,959.31
i.కేంద్ర పన్నులలో వాటా	12,350.72	14,876.57	16420.06	19,207.43
ii.రాష్ట్ర సొంత పన్నులు	39,974.63	48,407.78	61,369.00	73,751.88
ఏ.ల్యాండ్ రెవెన్యూ	103.71	6.70	15.00	4.64
బీ.వాణిజ్యపన్నులు	29,846.91	34,234.69	30,336.41	25,942.00
సీ.ఆబ్కారీ	3,809.07	5,580.71	9,000.00	10,600.00
డీ.ఇతర పన్నులు	6,225.80	8,585.68	22,017.59	37,205.24
2.పన్నేతర ఆదాయం	14,414.36	9,781.71	6,599.51	8,973.92
3.గ్రాంట్ ఇన్ ఎయిడ్	9,394.12	9,751.90	23,751.67	29,041.88
	76,133.83	82,817.96	1,08,148.24	1,30,975.11

- కేంద్ర పన్నుల వాటా, రాష్ట్ర సొంతపన్నుల రాబడి కలిపి పన్నులు, సుంకాల మొత్తంగా చూపారు.
- రాష్ట్ర సొంత పన్నుల రాబడి కింద వాణిజ్యపన్నులు, ఆబ్కారీ, ఇతర పన్నులను చూపారు.

అన్నదాతల సంక్షేమ బడ్జెట్

- **స్టేట్ ట్యాక్స్ రెవెన్యూలో 22.84 శాతం వృద్ధి.. ట్విట్టర్‌లో మంత్రి కేటీఆర్ వెల్లడి**

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో కీలక రంగాలకు భారీ కేటాయింపులు చేశారని రాష్ట్ర ఐటీ, పురపాలకశాఖల మంత్రి కేటీఆర్ కొనియాడారు. అత్యుత్తమ కేటాయింపులతో మంత్రి ఈటల అసాధారణ బడ్జెట్ ప్రవేశపెట్టారని ప్రశంసించారు. ఈ మేరకు వరుస ట్వీట్లలో తన అభిప్రాయాన్ని పంచుకున్నారు. రైతుల సంక్షేమానికి భారీగా కేటాయింపులు సంతోషకరమన్నారు. వ్యవసాయానికి రూ.12 వేలకోట్లు, రైతులక్ష్మి పథకానికి రూ.8 వేల కోట్లు కేటాయించడం అభినందనీయమన్నారు. రాష్ట్ర ఆర్థికవృద్ధి గణనీయంగా పెరుగుతున్నదని కేటీఆర్ సంతోషం వ్యక్తంచేశారు. 2013-14లో 5.4 శాతం, 2014-15లో 6.8 శాతం, 2015-16లో 8.6 శాతం, 2016-17లో 10.1 శాతం, 2017-18లో 10.4 శాతం వృద్ధి నమోదైందని తెలిపారు. జాతీయ జీడీపీ 6.6 శాతమేనని గుర్తుచేశారు. ఈ ఆర్థిక సంవత్సరంలోని 11 నెలల పన్ను వసూళ్లలో రాష్ట్రం దేశంలోనే అత్యధిక వృద్ధి సాధించిందని తెలిపారు. జీఎస్టీ, పెద్దనోట్ల రద్దు వంటి అంశాలున్నా.. రాష్ట్ర పన్నుల రాబడి (స్టేట్ ట్యాక్స్ రెవెన్యూ)లో తెలంగాణ 22.84 శాతం వృద్ధి సాధించినట్టు మంత్రి కేటీఆర్ ట్విట్టర్‌లో పేర్కొన్నారు.



మంత్రి కేటీఆర్ చేసిన ట్వీట్

ఉమ్మడి మెదక్ జిల్లాలో భూపంపిణీ



గురువారం అసెంబ్లీ కమిటీహాల్‌లో మెదక్, సిద్దిపేట, సంగారెడ్డి జిల్లాల అభివృద్ధిపై అధికారులతో సమీక్షిస్తున్న మంత్రి హరీశ్‌రావు. చిత్రంలో డిప్యూటీ స్పీకర్ పద్మాదేవేందర్‌రెడ్డి, ఉమ్మడి మెదక్ జిల్లా ప్రజాప్రతినిధులు ఉన్నారు.

- **మూడువేల ఎకరాల పంపిణీకి మంత్రి హరీశ్ ఆదేశం**
- **కొత్తగా నర్సాపూర్, నారాయణఖేడ్, తూప్రాన్, రామాయంపేట, చేర్యాల మున్సిపాలిటీలు**
- **2014 వరకున్న చేనేత రుణాలు మాఫీ**

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: జిల్లాకు వెయ్యి ఎకరాల చొప్పున సిద్దిపేట, మెదక్, సంగారెడ్డి జిల్లాల్లో మూడువేల ఎకరాలను దళితులకు పంపిణీ చేయాలని రాష్ట్ర నీటిపారుదల, మార్కెటింగ్ శాఖల మంత్రి హరీశ్‌రావు ఆదేశించారు. అసెంబ్లీ హాల్‌లో గురువారం ఆయన ఉమ్మడి మెదక్ జిల్లా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను సమీక్షించారు. శాసనసభ్యులు ప్రతిపాదించిన భూమికి ప్రాధాన్యం ఇవ్వాలని ఈ సందర్భంగా సూచించారు. దళితులకు భూ పంపిణీ కార్యక్రమంలో విమర్శలు రాకుండా జాగ్రత్తగా వ్యవహరించాలని అధికారులను మంత్రి కోరారు. ఉమ్మడి మెదక్ జిల్లాలో కొత్తగా నర్సాపూర్, నారాయణఖేడ్, తూప్రాన్, రామాయంపేట, చేర్యాల పట్టణాలు మున్సిపాలిటీలుగా ఏర్పడబోతున్నాయని తెలిపారు. కొత్తగా ఏర్పాటయ్యే మున్సిపాలిటీలకు స్టార్టప్ నిధులున్నాయని, వాటితో అభివృద్ధి కార్యక్రమాలు వెంటనే ప్రారంభించాలని కోరారు. ఏయే గ్రామాలను మున్సిపాలిటీల్లో విలీనం చేస్తున్నారో రెండురోజుల్లో తెలుపాలని సూచించారు. విలీనం సందర్భంగా ప్రజల నుంచి వ్యతిరేకత రాకుండాచూడాలని చెప్పారు. ఈ బడ్జెట్ సమావేశాల్లోనే గ్రామపంచాయతీ చట్ట సవరణ బిల్లును ఆమోదించేందుకు సన్నాహాలు జరుగుతున్నట్లు తెలిపారు. నియోజకవర్గ అభివృద్ధి నిధులను వెంటనే ఖర్చు చేయాలని సూచించారు. ఈ నెలాఖరులోగా ఏసీడీపీ నిధులు ఖర్చు చేయాలని కోరారు. ప్రతి పురపాలక సంఘానికి ఒక స్పెషలాఫీసర్‌ను నియమించి అభివృద్ధి పనులు యుద్ధప్రాతిపదికన పూర్తిచేయాలని మంత్రి ఆదేశించారు. మున్సిపల్ చైర్మన్లు, కమిషనర్లు ఉదయమే పాదయాత్ర చేయాలని, దీంతో ప్రజా సమస్యలు తెలుస్తాయన్నారు. ప్రతీ మున్సిపాలిటీలో ఒక రైతుబజార్‌ను మంజూరు చేశామని, అయితే నాలుగైదుచోట్ల పనులు నత్తనడకన సాగుతున్నాయని, కొన్నిచోట్ల అసలు పనులు మొదలుపెట్టనేలేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. అదేవిధంగా ప్రతీ మున్సిపాలిటీలో వైకుంఠధామం ఏర్పాటు చేయాలని, ఇందుకు స్వచ్ఛంద సంస్థలు, దాతలు, ఇతర మార్గాల్లో నిధులు సమకూర్చుకుని, వాటిని తీర్చిదిద్దాలని సూచించారు. సిద్దిపేటలోని వైకుంఠధామాన్ని మోడల్‌గా తీసుకోవాలన్నారు. మూడు జిల్లాల్లో మహిళా భవనాలు, గ్రామాల్లో కొత్తగా మహిళా భవనాలు నిర్మించాలని పేర్కొన్నారు. మిషన్ భగీరథ పనులపై సీఎం కేసీఆర్ దృష్టి కేంద్రీకరించారని, ఉమ్మడి మెదక్ జిల్లాలో మిషన్ భగీరథ కార్యక్రమం పురోగతిపై ప్రత్యేక సమావేశాన్ని నిర్వహిస్తామని చెప్పారు. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు, ఏజెన్సీ ప్రతినిధులు, జిల్లా కలెక్టర్లతో సమీక్షించాలన్నారు. మూడు జిల్లాల్లో డబుల్ బెడ్‌రూం నిర్మాణపనులను క్షేత్రస్థాయిలో పరిశీలించాలని జిల్లా కలెక్టర్లకు సూచించారు. డబుల్ బెడ్‌రూం, మిషన్ భగీరథ పనులను ప్రతీవారం ప్రత్యేకంగా సమీక్షించాలని అధికారులకు సూచించారు. సమావేశంలో డిప్యూటీ స్పీకర్ పద్మాదేవేందర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు బాబూమోహన్, మదన్‌రెడ్డి, మహిపాల్‌రెడ్డి, భూపాల్‌రెడ్డి, చింతా ప్రభాకర్, రామలింగారెడ్డి, ఎమ్మెల్సీలు ఫరీదుద్దీన్, భూపాల్‌రెడ్డి, కలెక్టర్లు వెంకట్రామిరెడ్డి, వెంకటేశ్వర్లుతోపాటు వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

కందిరైతుల బకాయిలు చెల్లించాలి

- **మార్క్‌ఫెడ్, హాకా, నాఫెడ్ సంస్థలకు మంత్రి హరీశ్‌రావు ఆదేశం**

కంది రైతుల బకాయిల చెల్లింపునకు వెంటనే చర్యలు తీసుకోవాలని మార్క్‌ఫెడ్, హాకా, నాఫెడ్ సంస్థలను మార్కెటింగ్‌శాఖ మంత్రి హరీశ్‌రావు ఆదేశించారు. అసెంబ్లీ కమిటీహాలులో గురువారం కందులు, మినుములు, శెనగలు, ఎర్రజొన్నల కొనుగోళ్లు, చెల్లింపులపై మంత్రులు పోచారం శ్రీనివాస్‌రెడ్డి, హరీశ్‌రావు సమీక్షించారు. మార్క్‌ఫెడ్, నాఫెడ్ హాకా తదితర ఏజెన్సీల పనితీరుపై మంత్రులు అసంతృప్తి వ్యక్తంచేశారు. సమావేశంలో వ్యవసాయశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ పార్థసారథి, మార్కెటింగ్ డైరెక్టర్ లక్ష్మీబాయి, జాయింట్ డైరెక్టర్లు లక్ష్మణుడు, రవికుమార్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



గురువారం ఢిల్లీలో కేంద్రమంత్రి థావర్‌చంద్ గెహ్లాట్‌కు వినతిప్రతం ఇస్తున్న టీఆర్‌ఎస్ ఎంపీలు బూర నర్సయ్యగౌడ్, బాల్కసుమన్, పసునూరి దయాకర్

రిజర్వేషన్లకు తూట్లు పొడిచేలా కేంద్ర ఉత్తర్వులు

- **ఉత్తర్వులపై కేంద్రమంత్రికి వినతిపత్రం అందజేసిన టీఆర్‌ఎస్ ఎంపీలు**

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: కేంద్ర ప్రభుత్వ ఆధీనంలోని వివిధ విద్యాలయాలు, విశ్వవిద్యాలయాల్లో సిబ్బంది నియామకంపై కేంద్ర మానవ వనరుల మంత్రిత్వశాఖ జారీ చేసిన నూతన మార్గదర్శకాలు ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ రిజర్వేషన్లకు తూట్లు పొడిచే విధంగా ఉన్నాయని టీఆర్‌ఎస్ ఎంపీలు కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. గురువారం ఢిల్లీలో కేంద్ర సామాజిక న్యాయశాఖ మంత్రి గెహ్లాట్‌ను టీఆర్‌ఎస్ ఎంపీలు బూర నర్సయ్యగౌడ్, బాల్క సుమన్, పసునూరి దయాకర్ కలిసి వినతిపత్రం సమర్పించారు. నూతన నిబంధనతో ఒక డిపార్ట్‌మెంట్‌లో కనీసం పది పోస్టులు ఉన్నప్పుడే రిజర్వేషన్లు వర్తిస్తాయని, చాలా సందర్భాల్లో ఒక్కో డిపార్ట్‌మెంట్‌లో రెండు మూడు పోస్టులకు మించి ఉండవని మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. పది పోస్టులు ఒకేసారి ఖాళీ కావడమనేది చాలా అరుదైన విషయమని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలు శాశ్వతంగా రిజర్వేషన్లకు దూరమయ్యే అవకాశమున్నదన్నారు.

ట్రేడర్లు, కమీషన్ ఏజెంట్లకు ఊరట

- **బ్యాంకు గ్యారంటీల నుంచి సడలింపు ఇచ్చిన మంత్రి హరీశ్‌రావు**
- **జిన్నింగ్, రైస్ మిల్లుల యాజమానుల సంఘాల ప్రతినిధులతో చర్చలు**


హైదరాబాద్, నమస్తే తెలంగాణ: టర్నోవర్‌నుబట్టి బ్యాంకు గ్యారంటీలను సమర్పించాలన్న నిబంధనలపై ట్రేడర్లు, కమీషన్ ఏజెంట్ల అభ్యంతరాలపై మార్కెటింగ్‌శాఖ మంత్రి హరీశ్‌రావు సానుకూలంగా స్పందించారు. వ్యవసాయ మార్కెట్ కమిటీలతో బ్యాంకు గ్యారంటీలను కొంత సడలించారు. గురువారం అసెంబ్లీ కమిటీ హాలులో జిన్నింగ్, రైస్ మిల్లుల యాజమానుల సంఘాల ప్రతినిధులతో ఆయన చర్చించారు. రూ.కోటి వరకు టర్నోవర్ ఉన్న వ్యాపారులు, కమీషన్ ఏజెంట్లు రూ.ఐదు లక్షలు, రూ.కోటికిపైగా టర్నోవర్ ఉంటే రూ.10 లక్షల బ్యాంకు గ్యారంటీ ఇవ్వాల్సి ఉంటుంది. కోటి టర్నోవర్ వ్యాపారులు రూ.50 వేలు, కోటికి పైగా టర్నోవర్ ఉంటే రూ.లక్ష, ఐదు కోట్లకుపైగా టర్నోవర్ ఉంటే రూ.రెండు లక్షల బ్యాంకు గ్యారంటీ సమర్పించాలని మంత్రి మినహాయింపులు ఇచ్చారు. వ్యాపారవర్గాలకు అనుకూలంగా ప్రభుత్వం అనేక నిర్ణయాలు తీసుకుందని, ప్రభుత్వానికి సహకరించాలని కోరారు. కేసీఆర్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాతే తమకు మంచిరోజులు వచ్చాయని, త్వరలో బహిరంగ సభ నిర్వహించి కృతజ్ఞతలు తెలుపు తామని రైస్ మిల్లర్ల సంఘం నాయకులు తెలిపారు.

నేడు స్టాఫ్‌నర్స్ రాత పరీక్ష ప్రిలిమినరీ కీ విడుదల

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: వైద్యారోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ స్టాఫ్‌నర్స్ నియామకాల కోసం ఈ నెల 11వ తేదీన నిర్వహించిన రాత పరీక్ష ప్రిలిమినరీ కీని శుక్రవారం నుంచి వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచనున్నట్టు టీఎస్‌పీఎస్సీ కార్యదర్శి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏవైనా అభ్యంతరాలు ఉంటే www.tspsc.gov.in వెబ్‌సైట్ ద్వారా ఈ నెల 20వ తేదీ నుంచి 26వ తేదీ వరకు స్వీకరిస్తామని పేర్కొన్నారు. 26వ తేదీ తర్వాత అభ్యంతరాలు స్వీకరించబోమని వివరించారు.

ఏఈఈ దరఖాస్తుల్లో పొరపాట్ల సవరణకు అవకాశం

రూరల్ వాటర్ సప్లై అండ్ సానిటేషన్ (ఆర్‌డబ్ల్యూఎస్ అండ్ ఎస్) శాఖలో అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు తమ దరఖాస్తుల్లో తప్పులను సవరించుకునే అవకాశం కల్పిస్తున్నట్టు టీఎస్‌పీఎస్సీ కార్యదర్శి వాణి ప్రసాద్ గురువారం ఓ ప్రకటన తెలిపారు. దరఖాస్తులను తప్పులు లేకుండా ఈ నెల 16 నుంచి 18 మధ్య www.tspsc.gov.in వెబ్‌సైట్ ద్వారా పంపించాలన్నారు.



సమకాలీన ప్రపంచంలో యువత తీవ్రవాదం వైపు ఆకర్షితులు కావడం అనేది ప్రధాన సమస్యగా ఉన్నది. చాలా దేశాలు ఉగ్రవాద సమస్యను ఎదుర్కొంటున్నాయి. దీనికిగాను అన్ని దేశాలు వనరుల సద్వినియోగంతో అభివృద్ధిబాటన నడువాలి. భారతదేశం ఉగ్రవాద నిరోధానికి అన్నిచర్యలు తీసుకుంటున్నది.

రాజ్‌నాథ్ సింగ్, కేంద్రహోం మంత్రి

యూపీలోని గోరఖ్‌పూర్, ఫూల్‌పుర్ ఉప ఎన్నికల చరిత్రాత్మక విజయం నాకు గొప్ప మార్గాన్ని చూపింది. సామాజిక సమీకరణలకు మేం చేసిన కసరత్తు మంచి ఫలితాన్నిచ్చింది. ఈ క్రమంలో మాయావతి చూపిన చొరవ అభినందనీయం. ఇదే బాటలో రాబోయే కాలంలోనూ నడుస్తాం. బీజేపీని ఓడిస్తాం.

అఖిలేశ్ యాదవ్, ఎస్పీ జాతీయ అధ్యక్షుడు



చరిత్రలో నేడు



1527
కణ్వా యుద్ధంలో రాజ్‌పుత్ సేనలను ఓడించిన మొగల్ చక్రవర్తి బాబర్.

1827
ఆఫ్రికన్ అమెరికన్ల ఆధ్వర్యంలో మొదటి దినపత్రిక 'ఫ్రీడమ్ జర్నల్' ప్రచురణ ప్రారంభం.





1869
అమెరికా సెనెట్‌లో మొదటిసారి అధికారికంగా ప్రసంగించిన హిరామ్ ఆర్.రివెల్స్.

యూపీ ఉప ఎన్నికల ఫలితాలు సరికొత్త రాజకీయ సమీకరణాలకు ఊపిరిపోశాయి. అప్పటిదాకా వైరిపక్షాలుగా ఉన్న ఎస్పీ, బీఎస్పీలు బీజేపీని ఎదుర్కొని తిరుగులేని విజయాన్ని సాధించాయి. ఎస్పీకి తెలిపిన మద్దతు ఏ మేరకు ఫలితాన్ని ఇస్తుందోనన్న దానికి పరీక్షగా మాయావతి చేసిన ప్రయోగం విజయవంతమైంది. దీంతో బీజేపీకి కంచుకోటలుగా ఉన్న గోరఖ్‌పూర్, ఫూల్‌పుర్ స్థానాలను ఎస్పీ-బీఎస్పీ కూటమి కైవసం చేసుకున్నది. వరుసగా ఐదుసార్లు గెలిచిన ఆదిత్యనాథ్ స్థానాన్నీ, ఉపముఖ్యమంత్రి కేశవ్ ప్రసాద్‌మౌర్య స్థానాలను కోల్పోవటం బీజేపీకి చేదు అనుభవమే.

ది హిందూ

మార్చి 31లోగా అన్ని సేవలకు ఆధార్‌ను తప్పనిసరిగా అనుసంధానం చేయాలన్న దానిని భారత అత్యున్నత న్యాయస్థానం తాత్కాలికంగా నిలిపివేసింది. తుది తీర్పు వచ్చే దాకా ఎవరూ ఒత్తిడి చేయరాదని సూచించింది. దీంతో ముంచుకొస్తున్న గడువుతో భయాందోళనలో ఉన్న ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. ఇప్పటికే అన్నిరకాల సబ్సిడీలకు ఆధార్ తప్పనిసరి చేసిన ప్రభుత్వం, సేవలకు కూడా తప్పనిసరి చేయటం పట్ల ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వచ్చింది. వ్యక్తిగత గోప్యతకు భంగకరమన్న భయాలూ ఉన్నాయి. ఈ నేపథ్యంలో సుప్రీం తీర్పు హర్షణీయం.

ది టైమ్స్ ఆఫ్ ఇండియా

రైతన్నకు పెద్ద పీట


కేసీఆర్ దార్శనికతకు అనుగుణంగా ఆర్థిక మంత్రి ఈటల రాజేందర్ గురువారం ప్రవేశపెట్టిన 1,74,453 కోట్ల రూపాయల భారీ బడ్జెట్ యధారీతిలో రైతన్నలకు పెద్దపీట వేయడం సముచితంగా ఉన్నది. గత బడ్జెట్ 1,49,000 కోట్లను తాజా బడ్జెట్ మించిపోయింది. తెలంగాణ ఏర్పడితే బతికి బట్టకట్టలేదనే దుష్ప్రచారాన్ని తిప్పికొడుతూ రాష్ట్రం పలురంగాలలో పరుగులు పెట్టడం ప్రజలకు ధీమా కలిగిస్తున్నది. నాలుగేండ్లలో రాష్ట్రం జోరుమీదున్నదనడానికి వృద్ధి రేటే సాక్ష్యం. 2013-14లో జాతీయ సగటు 5.9 కన్నా తక్కువగా 4.2 శాతం ఉన్న స్థూల రాష్ట్ర దేశీయోత్పత్తి ఆ తర్వాత ఏటేటా పెరుగుతూనే ఉన్నది. తాజా ఆర్థిక సంవత్సరంలో 10.4 శాతం అంచనాకు రావడం విశేషం. రాష్ట్ర ప్రభుత్వం నాలుగేండ్లలో మౌలిక వసతుల నిర్మాణంపై కృషిని కొనసాగిస్తూనే వ్యవసాయరంగంలో పలు నిర్మాణాత్మక మార్పులు చేపట్టడం వల్ల రైతులోకమే కాకుండా, మొత్తం గ్రామీణ రంగమే సంపద్వంతం అవుతుందనడంలో సందేహం లేదు. తెలంగాణ రాష్ట్ర బడ్జెట్‌ను అర్థం చేసుకోవడానికి అంకెలను మాత్రమే చూస్తే సరిపోదు. ఈ బడ్జెట్ ప్రతిపాదనలలో సామాజికాభివృద్ధి దృక్కోణం, అభివృద్ధి వ్యూహం మిళితమై ఉన్నది. సామాజిక పరివర్తనకు సాధనంగా ఉండాలన్న ఆధునిక రాజ్య ధ్యేయానికి అనుగుణంగా బడ్జెట్ రూపకల్పన జరిగింది. సామాజిక కోణంలో చూసినా, భౌగోళికంగా పరికించినా బడ్జెట్ సమతులాభివృద్ధికి లక్ష్యంగా ఉందని తెలుస్తుంది. అట్టడుగువర్గాలకు చేయూతతోపాటు అభివృద్ధి వికేంద్రీకరణ లక్ష్యం పూలదండలో దారం మాదిరిగా దాగి ఉంది.

> **వ్యవసాయం లాభసాటిగా మారితే గ్రామీణరంగ స్వరూపమే మారిపోతుంది. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ అనుబంధ రంగాలపైనా, కులవృత్తులపైనా దృష్టిసారించింది. తద్వారా గ్రామాలను ఉత్పత్తి కేంద్రాలుగా, వృత్తి నిపుణులను సంపద సృష్టికర్తలుగా మార్చతలపెట్టింది. దేశానికి మార్గదర్శిగా ఉండేవిధంగా తెలంగాణ ప్రభుత్వం గ్రామీణ ఆర్థిక వ్యవస్థను పరిపుష్టం చేస్తున్నది. గొర్రెలు, చేపల పెంపకం వంటి కులవృత్తులకు నిధులు కేటాయించడం ఇందులో భాగమే. పౌల్ట్రీ రంగాన్ని కూడా ప్రోత్సహిస్తున్నది. దీనికితోడు అత్యంత వెనుకబడిన కులాల కోసం ఇప్పటికే ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటుచేసిన రాష్ట్ర ప్రభుత్వం ఆయా సామాజిక వర్గాల సాధికారత కోసం ప్రయత్నిస్తున్నది.**

దేశంలోనే సాగునీటి ప్రాజెక్టులకు అత్యధిక నిధులను కేటాయించి మొదటి స్థానంలో నిలిచిన తెలంగాణ తాజా బడ్జెట్‌లో ఆ ఘనతను కాపాడుకున్నది. కోటి ఎకరాలకు సాగునీరు అందించాలనే లక్ష్యంతో గోదావరి, కృష్ణా నదులపై 23 భారీ, 13 మధ్యతరహా ప్రాజెక్టుల నిర్మాణంతో పాటు మిషన్‌కాకతీయ ద్వారా చెరువుల తవ్వకం సాగుతున్నది. రాష్ట్ర ప్రభుత్వం నీటి పారుదల ప్రాజెక్టులకు 25 వేల కోట్లు కేటాయిస్తూనే, రైతులకు పెట్టుబడి చేయూతకు 12 వేల కోట్లు, పంట బీమాకు 500 కోట్లు, సూక్ష్మ వ్యవసాయానికి 127 కోట్లను కేటాయించింది. వ్యవసాయ యాంత్రీకరణకు 522 కోట్లు, పాలీహౌజ్, గ్రీన్‌హౌజ్ సాగు కోసం 120 కోట్లు కేటాయించింది. ఇప్పటికే భారీగా యంత్ర, పరికరాలను సబ్సిడీతో సరఫరా చేసింది. ఈ కేటాయింపులతోపాటు రాష్ట్ర ప్రభుత్వం తలపెట్టిన నిర్మాణాత్మక మార్పులు ముఖ్యమైనవి. ప్రతి మండలానికి కనీసం ఒక గిడ్డంగి ఉండాలనే లక్ష్యాన్ని నిర్దేశించుకున్నది. ఈ కేటాయింపులతో పాటు రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన మౌలిక సంస్కరణలు గమనార్హమైనవి. వ్యవసాయాన్ని గిట్టుబాటుగా చేయడానికి కావలసిన మౌలిక సంస్కరణలను ప్రభుత్వం చేపట్టింది. భూ రికార్డులను ప్రక్షాళన చేయడం కూడా ఇందులో భాగమే. రైతు సమన్వయ సమితుల ఏర్పాటు ఇందులో కీలకమైనది. ఈ సమితులు అన్నివిధాలుగా రైతులకు అండగా ఉంటూ క్రియాశీల పాత్ర పోషిస్తాయనేది తెలిసిందే. రైతులు వ్యవసాయాన్ని వ్యాపారం మాదిరిగా లాభసాటిగా నిర్వహించడానికి రైతులు సమన్వయ సమితులు కీలకపాత్ర వహిస్తాయి. దేశవ్యాప్తంగా వ్యవసాయరంగం సంక్షోభంలో పడి రైతులు గగ్గోలు పెడుతున్న దశలో, తెలంగాణ ప్రభుత్వం మాత్రం వ్యవసాయాన్ని ఆధునిక పద్ధతుల్లో లాభసాటిగా సాగించడానికి కావలసిన నిర్మాణాన్ని సిద్ధం చేస్తున్నది. ఇందుకు మౌలిక వసతులను, సంస్థాగత నిర్మాణాలను రూపొందిస్తున్నది.

వ్యవసాయం లాభసాటిగా మారితే గ్రామీణరంగ స్వరూపమే మారిపోతుంది. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ అనుబంధ రంగాలపైనా, కులవృత్తులపైనా దృష్టిసారించింది. తద్వారా గ్రామాలను ఉత్పత్తి కేంద్రాలుగా, వృత్తి నిపుణులను సంపద సృష్టికర్తలుగా మార్చ తలపెట్టింది. దేశానికి మార్గదర్శిగా ఉండేవిధంగా తెలంగాణ ప్రభుత్వం గ్రామీణ ఆర్థిక వ్యవస్థను పరిపుష్టం చేస్తున్నది. గొర్రెలు, చేపల పెంపకం వంటి కులవృత్తులకు నిధులు కేటాయించడం ఇందులో భాగమే. పౌల్ట్రీ రంగాన్ని కూడా ప్రోత్సహిస్తున్నది. దీనికితోడు అత్యంత వెనుకబడిన కులాల కోసం ఇప్పటికే ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటుచేసిన రాష్ట్ర ప్రభుత్వం ఆయా సామాజిక వర్గాల సాధికారత కోసం ప్రయత్నిస్తున్నది. కుల వృత్తులకు ప్రోత్సాహం వల్ల సామాజిక పరివర్తన జరుగుతుంది. అయితే గ్రామం ఒక యూనిట్‌గా అభివృద్ధి చెందాలంటే, అందుకు అనుగుణమైన అధికారాలు, బాధ్యతలను అప్పగించాలె. దీనికి అనుగుణంగా గ్రామీణ స్థానిక సంస్థల బలోపేతానికి పదిహేనువందల కోట్లు, నగర సంస్థలకు వెయ్యి కోట్లు తాజా బడ్జెట్‌లో కేటాయించింది. స్థానిక సంస్థలకు అధికారాల బదలాయింపుపై సూచనలు ఇవ్వడానికి ఫైనాన్స్ కమిషన్ అధ్యయనం సాగిస్తున్నది. జిల్లాల స్థాయిలో సాఫ్ట్‌వేర్ కంపెనీలను పెట్టడం వంటి చర్యలు అభివృద్ధి వికేంద్రీకరణలో భాగమే. భారీ ఎత్తున అభివృద్ధి పథకాలను చేపడుతున్న తెలంగాణ ప్రభుత్వం, సంక్షేమ పథకాలను కూడా కొనసాగిస్తూ, తగినంత నిధులను కేటాయించింది. తాజా బడ్జెట్ ప్రతిపాదనలు రాష్ట్ర సమితుల అభివృద్ధికి తోడ్పడుతాయి.

వ్యవసాయం



డాక్టర్ పిడిగెం సైదయ్య

దేశానికే ఆదర్శం మన బడ్జెట్

రాష్ట్ర ఏర్పాటు తర్వాత తెలంగాణ ప్రభుత్వం సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణానికి పెద్దపీట వేసింది. గడిచిన నాలుగు బడ్జెట్లలో సరాసరిన రూ.25 వేల కోట్ల మేర సాగునీటి కల్పనకు కేటాయించారు. ఈ సారి కూడా దాన్ని కొనసాగిస్తూనే వ్యవసాయ పురోగతి, రైతు అభివృద్ధే ప్రధాన కేంద్రంగా 2018-19 బడ్జెట్‌లో కేటాయింపులు జరిగాయి.'రైతు లక్ష్మి, రైతన్న బీమా, రైతు వేదికలు', ఇలా పథకం ఏదైనా రైతు సంక్షేమమే లక్ష్యంగా కేటాయింపులు ఉన్నాయి.

ఉమ్మడి రాష్ట్రంలో నిరాదరణకు గురైన సాగును సంక్షేమం వైపు మళ్లించేందుకు శాస్త్రీయ, ఆర్థిక, ప్రణాళికబద్ధ, విధానపర నిర్ణయాలకు బడ్జెట్ వేదికగా నిలిచింది. వ్యవసాయ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు సస్యశ్యామల తెలంగాణ సాధనకు బాటలు వేస్తాయి అంటే అతిశయోక్తి కాదు. ఈ సారి బడ్జెట్‌లో రైతు సంక్షేమం, ఆదాయం పెంచే అంశాలకు ప్రాధాన్యం ఇచ్చింది.

రాష్ట్రంలో 55 శాతం ప్రజలకు వ్యవసాయమే ప్రధాన వనరు. అందులో 86 శాతం చిన్న, సన్నకారు రైతులే. ఉమ్మడి రాష్ట్ర పాలనలో తెలంగాణలో నీటి వనరులను అభివృద్ధి చేయలేదు. ప్రధాన పంటలకు ప్రాధాన్యం ఇవ్వలేదు. రైతు సంక్షేమం పట్టలేదు. దీంతో తెలంగాణలో రైతు పరిస్థితి అగమ్యగోచరం. కానీ 45 నెలల స్వరాష్ట్ర పాలనలో 'రైతే ఎజెండా'గా పథకాలు, ప్రణాళికల రూపకల్పన జరిగింది. అందుకు అనుగుణంగా బడ్జెట్‌లో ఆర్థిక కేటాయింపులు జరిగాయి.

'పంట పెట్టుబడి మద్దతు పథకం'ను రాష్ట్రం మొట్టమొదటిసారిగా ప్రవేశపెట్టింది. ఈ పథకం కోసం బడ్జెట్‌లో రూ.12,000 కోట్లు ప్రతిపాదించారు. 2018-19 నుంచి రైతులకు తాము పండించే పంటలకు వానకాలం పంటకు ప్రతి ఎకరానికి రూ.4వేలు, అలాగే యాసంగి పంటకు ఎకరానికి రూ.4 వేలు అందించనున్నారు. దేశవ్యాప్తంగా ఇది నమూనా అవుతుంది. రైతుకు నేరుగా సహాయం చేయాలన్న ఆలోచనే వ్యవసాయానికి జవసత్వాలు అందించనున్నది.

వ్యవసాయంలో ఏటికేటికి పెట్టుబడి ఖర్చులు పెరుగుతున్నాయి. నేలల్లో భూసారం తగ్గిపోతున్నది. పంటల దిగుబడులు తగ్గుతున్నాయి. వరుసగా అనావృష్టి పరిస్థితులు, ఆ తర్వాత గిట్టుబాటులేని ధరలతో రైతుకు సాగు ద్వారా నికర లాభాలు ఉండటం లేదు. దీనికితోడు చిన్న, సన్న కారు రైతుల సంఖ్యే ఎక్కువ. అప్పులు, ఆస్తుల నిష్పత్తిలో అంతగా అంతరం లేకపోవడం వల్ల దిగుబడులు తగ్గినా, ఖర్చులు పెరిగినా, పంట కోల్పోయినా రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు. దీంతో పంట పెట్టుబడి కోసం రైతులు వడ్డీ వ్యాపారులపై ఆధారపడాల్సిన పరిస్థితి నెలకొన్నది. ఫలితంగా రైతులు కష్టాల పాలవుతున్నారు. 'సాగు'ను రైతుకు భరోసా ఇచ్చేలా చేసే మహోపాయం 'రైతు లక్ష్మి-పెట్టుబడి మద్దతు పథకం'. రైతు సాగు సాఫీగా చేసుకునేందుకు ఈ పథకం కొండంత భరోసా ఇవ్వనున్నది. ఈ పథకాన్ని కేంద్రం ఆదర్శంగా తీసుకొని దేశవ్యాప్తంగా ప్రవేశపెడితే బాగుంటుంది.

పంటల బీమాలు, వ్యక్తిగత బీమాలు ఎన్ని వచ్చినా రైతు గురించి ఆలోచించిన పార్టీలు, ప్రభుత్వాలు గాని లేవు. 'ప్రధాని పంటల బీమా పథకం'లో 'రైతు వ్యక్తిగత బీమా'ను పైలట్‌గా కొన్నిజిల్లాల్లో అమలుచేసినా రైతుకు అక్కరకురావటం లేదు. ఇలాంటి పరిస్థితుల్లో పంటనే నమ్ముకొని దేశానికి అన్నం పెడుతున్న రైతుకు ఉచిత వ్యక్తిగత బీమాగా 'రైతు బీమా పథకం'ను రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. ఇది దేశ చరిత్రలో నిలిచిపోనున్నది. రైతుకు పూర్తిభరోసా ఇవ్వనున్నది. రాష్ట్రంలోని 71 లక్షల మంది రైతులకు ఉచితంగా ప్రభుత్వమే రైతు తరపున ప్రీమియం చెల్లించి రూ.5 లక్షల బీమా సదుపాయాన్ని కల్పించనున్నది.

ముఖ్యంగా వర్షాధార వ్యవసాయం ఉన్న రాష్ట్రాలు కచ్చితంగా ఈ పథకాన్ని మార్గదర్శకంగా తీసుకోవాలి.

రైతులను సంఘటితశక్తిగా మార్చి గిట్టుబాటు ధరలు పొందేలా 'రైతు సమన్వయ సమితి'లకు ఈ బడ్జెట్ ఆర్థిక జవసత్వాలు అందించింది. అసలుసిసలైన రైతులు, శాస్త్రవేత్తలు వ్యవసాయరంగ నిపుణులు సభ్యత్వం కలిగిన రైతు సమన్వయ సమితులు ప్రభుత్వానికి-రైతుకు అనుసంధానంగా ఉండనున్నారు. విత్తనం వేసే దగ్గరినుంచి దిగుబడికి గిట్టుబాటు ధర పొందేవరకు వీరిదే కీలకపాత్ర. మార్కెట్లో మద్దతు ధర లభించకపోతే నేరుగా సమితులే కొనుగోలు చేసేందుకు అవసరమైన యంత్రాంగం ఇప్పటికే క్షేత్రస్థాయిలో ఉన్నది. దీనికి ఆర్థిక నిధులు రాష్ట్రం కేటాయించనున్నది. దీంతో 'గిట్టుబాటు' ధర తప్పక అందుతుందన్న భరోసా లభించనున్నది. లక్షా 61 వేల మంది రైతులు వీటిలో సభ్యులు. ఏ రంగంలోనూ ఇంత పెద్దసంఖ్యలో సభ్యులుండరు. గ్రామం, మండలం, జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో ఈ సమితులు పనిచేయనున్నాయి.

ఆధునిక సాగు పద్ధతులు పరస్పరం చర్చించుకోవటంతో సంపూర్ణ నిర్ణయాలు తీసుకునేందుకు ప్రతి ఐదు వేల ఎకరాల ఒక క్లస్టర్లను రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ప్రభుత్వ పథకాలు ఈ వేదికల ద్వారా మరింతవేగంగా, పారదర్శకంగా రైతులకు చేరనున్నాయి. పక్కా భూముల గణాంకాల కోసం సమగ్ర భూ సర్వేను రాష్ట్రం పూర్తిచేసింది. త్వరలోనే ఆ రికార్డుల వివరాలను, 'ధరణి' వెబ్‌సైట్‌లో పొందుపరుస్తామనటం ముదావహం. దీంతో సాగు భూముల వివరాలు పండించాల్సిన పంటలు, పెట్టుబడి మద్దతు పథకం అమలు సులువు వుతుంది.

సాగునీటి ప్రాజెక్టులే ఆధునిక దేవాలయాలు. పంటల దిగుబడుల్లో పెరుగుదలకు ఇవే ప్రధాన భూమికలు. ఉమ్మడి రాష్ట్రంలో నీటి కేటాయింపులు, సాగునీటి కాల్వల, ప్రాజెక్టుల నిర్మాణంలో 40 ఏండ్ల పాటు జరిగిన అన్యాయాన్ని 45 నెలల్లో సవరించే భగీరథ ప్రయత్నం తెలంగాణ ప్రభుత్వం చేస్తున్నది. మిషన్ కాకతీయ ద్వారా చెరువుల పునరుద్ధరణ జరుగుతున్నది. దీంతో అదనపు ఆయకట్టు పెరుగనున్నది. కోటి ఎకరాలకు సాగునీటి కల్పనే ధ్యేయంతో ఏటా బడ్జెట్‌లో రూ. 25 వేల కోట్లు కేటాయిస్తున్నది. దీంతో శరవేగంగా ప్రాజెక్టులు పూర్తవుతున్నాయి. కృష్ణా, గోదావరి నదులపై 23 మేజర్, 13 మీడియం సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం ప్రభుత్వం చేపట్టింది. దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న పాలమూరు ప్రాజెక్టు పూర్తికి ప్రభుత్వం కృషిచేస్తున్నది. ఇప్పటికే ఉమ్మడి మహబూబ్‌నగర్‌లో ఆరున్నర లక్షల ఎకరాలకు సాగునీటిని అందించింది. దీనికితో పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం, భక్త రామదాసు ఎత్తిపోతల పథకం, సీతారామ ఎత్తిపోతల పథకం, కాళేశ్వరం ప్రాజెక్టులు రికార్డు స్థాయిలో పూర్తిచేసేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తున్నది. ఇందుకు బడ్జెట్ కేటాయింపులు సాగుభూముల దశను మార్చనున్నాయి.

దిగుబడులు వచ్చి, ధరలు లేనప్పుడు కొంతకాలం నిల్వచేసి అమ్ముకునేందుకు అవసరమైన గిడ్డంగుల సామర్థ్యం పెంచేందుకు, కోల్డ్ స్టోరేజీ లింకేజీలు పెంచేందుకు ఈ బడ్జెట్‌లో 132 కోట్లు కేటాయించారు. రాష్ట్రంలో కూరగాయల కొరత తీర్చటంతో పాటు రైతులు పండించేందుకు గాను హరితగృహాలు, పాలీహౌజ్‌ల నిర్మాణానికి ప్రపంచంలోనే తెలంగాణ అత్యంత ఎక్కువ సబ్సిడీనిస్తున్నది. ఈ బడ్జెట్‌లో కూడా దీని కోసం రూ.120 కోట్లు ప్రకటించింది. తక్కువనీటితో ఎక్కువ పంటలు సాగు చేసేందుకు ప్రత్యేకించి రాష్ట్రానికి అత్యంత అక్కరకొచ్చే బిందు, తుంపర సేద్యాలను ప్రోత్సహించటానికి రూ.127 కోట్లు ప్రకటించింది. దీనిద్వారా ఒక్క రైతుకు 12 ఎకరాల వరకు, రూ.6.25 లక్షల వరకు సబ్సిడీ అందనున్నది. 29 లక్షల ఎకరాలను రాష్ట్రంలో మైక్రో ఇరిగేషన్ కిందికి తీసుకురావాలన్నది రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం. పెరుగుతున్న కూలీల ఖర్చులతో వ్యవసాయంలో నష్టం జరుగుతున్నది. యాంత్రీకరణతో సమయం, శ్రమ ఆదాతోపాటు పెట్టుబడి తగ్గుతుంది. ముఖ్యంగా చిన్న, సన్నకారు రైతులకు చిన్న పనిముట్లు చాలా అవసరం. వ్యవసాయం యాంత్రీకరణ ప్రోత్సహించేందుకుగాను బడ్జెట్‌లో రూ.522 కోట్లు కేటాయించారు. ట్రాక్టర్లు, స్ప్రేయర్లు, టార్పాలిన్‌లు, సేద్య పరికరాలు వీటి ద్వారా సబ్సిడీపై రైతులకు అందనున్నాయి. వ్యవసాయ అనుబంధ రంగాలైన గొర్రెలు, చేపల పెంపకం ప్రోత్సహించటంతోపాటు 'ఎగ్ బాస్కెట్ ఆఫ్ ఇండియా'గా పేరుపొందిన తెలంగాణలో పౌల్ట్రీ రంగం మరింత ఎదుగుదలకు రూ.109 కోట్లు కేటాయించారు.

> **చివరగా మహారాష్ట్ర రైతుల పోరాటం ఇటీవల వార్తల్లో ప్రధాన అంశమైంది. ఈ ధర్నాలో పొందుపరిచిన డిమాండ్లు అన్ని రాష్ట్రాల రైతులకు వర్తిస్తాయి. అయితే తెలంగాణలో రైతులు అడక్కుండానే ప్రభుత్వమే ఈ డిమాండ్లను శోధించి తీరుస్తున్నది. స్వామినాథన్ సిఫార్సులను అమలు చేస్తున్నది. రూ.16 వేల కోట్ల పైచిలుకు రుణాలను చెల్లించి 35.29 లక్షల మంది రైతులను రుణ విముక్తులను చేసింది. అందుకే దేశానికే తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విధానం ఆదర్శంగా నిలుస్తుంది.**

చివరగా మహారాష్ట్ర రైతుల పోరాటం ఇటీవల వార్తల్లో ప్రధాన అంశమైంది. ఈ ధర్నాలో పొందుపరిచిన డిమాండ్లు అన్ని రాష్ట్రాల రైతులకు వర్తిస్తాయి. అయితే తెలంగాణలో రైతులు అడక్కుండానే ప్రభుత్వమే ఈ డిమాండ్లను శోధించి తీరుస్తున్నది. స్వామినాథన్ సిఫార్సులను అమలు చేస్తున్నది. రూ.16 వేల కోట్ల పైచిలుకు రుణాలను చెల్లించి 35.29 లక్షల మంది రైతులను రుణ విముక్తులను చేసింది. అందుకే దేశానికే తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విధానం ఆదర్శంగా నిలుస్తుంది.

(వ్యాసకర్త: శాస్త్రవేత్త, రాష్ట్ర ఉద్యాన విశ్వవిద్యాలయం)

మానవీయ విలువలకు ప్రతీక

బడ్జెట్



డాక్టర్ వకుళాభరణం కృష్ణమోహన్‌రావు

'ప్రతి ఇంటికి సంక్షేమం, ప్రతి ముఖంలో సంతోషం' నినాదం అక్షర సత్యమనే ఈ నాలుగేండ్ల సీఎం కేసీఆర్ ప్రభుత్వ పరిపాలనా తీరు 2018-19 ఆర్థిక బడ్జెట్‌తో స్పష్టమైంది. ఏటా వేల కోట్లు వెచ్చిస్తూ దేశంలో ఎక్కడా లేనన్ని సంక్షేమ పథకాలు తెలంగాణలో అమలవుతున్నాయి. ఈ పథకాలు పేదల జీవితాలకు కనీస భద్రతను ఇవ్వడం గమనించదగినది. కేసీఆర్ పాలనను సబ్బండ వర్గాలు స్వర్ణయుగంగా భావిస్తున్నాయని చెప్పడం ఏ మాత్రం అతిశయోక్తి కాదు.

సంక్షేమ పథకాలు మానవాభివృద్ధి కోణంలో, కుటుంబ ప్రాతిపదికగా ప్రవేశపెట్టి, నిధులు కేటాయించి అమలు చేస్తుండటం గమనించదగినది. జనాభాలో అధిక శాతం వెనుకబడిన వర్గాల వారే. గత ప్రభుత్వ విధానాల వల్ల వీరి పరిస్థితి కడుహీనంగా మారింది. ఆంధ్ర వలసవాద విధానాల వల్ల అట్టడుగున ఉన్న బీసీ కులాలు మరింత సంక్షోభంలోకి నెట్టివేయబడినాయి. పెరుగుతున్న సాంకేతిక నైపుణ్యం, యాంత్రీకరణ కారణంగా కొన్ని కులవృత్తులు పునరుద్ధరణకు వీల్లేకుండా అంతరించిపోయాయి. తెలంగాణ సమాజానికి ఉన్న ప్రత్యేకతలను పట్టించుకోకపోవడంతో మరికొన్ని కులవృత్తులు కొట్టుమిట్టాడుతున్నాయి. వీటిని అధ్యయనం చేసిన ప్రభుత్వం నిర్దిష్టమైన ప్రణాళికలను రూపొందించింది. కులవృత్తుల ద్వారా సమాజానికి సేవ చేస్తున్న మంగళి, రజక, మేదరి, వడ్డెర, విశ్వకర్మ, గౌడ, తదితర కులవృత్తులందరికీ అధునాతన పరికరాలను పంపిణీ చేయాలని నిర్ణయించడం శుభపరిణామం. దశాబ్దాలుగా ఎలాంటి గుర్తింపునకు నోచుకోకుండా నిర్లక్ష్యం కాబడిన ఎంబీసీ కులాల సంక్షేమం కోసం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటుచేసి వారి సంక్షేమానికి వెయ్యి కోట్ల బడ్జెట్‌ను కేటాయించడం విప్లవాత్మకం.

తరగతి గదిలోనే దేశ నిర్మాణం జరుగుతుందని ప్రముఖ విద్యావేత్త రజనీ కొఠారి అన్నట్లు రేపటి సామాజిక నిర్మాతలను తయారుచేసే దిశగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల కోసం వందల సంఖ్యలో రెసిడెన్షియల్ పాఠశాలలను ఏర్పాటుచేసి ఏటా రూ.2,823 కోట్లను కేటాయించి ఖర్చుచేస్తూ రేపటి ఉత్తమపౌరులుగా తీర్చిదిద్దే నూతన సమాజ నిర్మాణానికి కేసీఆర్ ప్రభుత్వం బాటలు వేసింది. దేశంలోనే ఎక్కడా లేనివిధంగా పేదరికం కారణంగా విదేశాల్లో ఉన్నత విద్యను ఏ పేద బిడ్డా కోల్పోకూడదని అంబేద్కర్, జ్యోతిబాపూలేల పేర్ల మీద 'ఓవర్‌సీస్ స్కాలర్‌షిప్' పథకానికి రూపకల్పన చేసి బలహీనవర్గాలతో పాటుగా ఈబీసీ విద్యార్థులకు కూడా ఈ పథకాన్ని విస్తరించి అమలుచేస్తున్న ఘనత ఈ ప్రభుత్వానిదే. అన్ని సామాజిక వర్గాలకు వికాస కేంద్రాలుగా ఉపయోగపడాలని హైదరాబాద్ నగరంలో స్థలాలు కేటాయించి, భవనాలు నిర్మించతలపెట్టడం ఓ వినూత్న ప్రక్రియ. ఇప్పటికే ముదిరాజ్, యాదవులకు 5 కోట్లు చొప్పున బడ్జెట్ కేటాయింపులు చేయడంతో పాటు మరిన్ని కులాలకు కూడా స్థలాల కేటాయింపులు, భవన నిర్మాణాల నిమిత్తం ఈ బడ్జెట్‌లో కేటాయింపులున్నా యి. బీసీ సామాజిక వర్గాల ఆత్మగౌరవాన్ని ఇనుమడింపజేసే విధంగా ఈ నిర్ణయాలు ప్రశంసలు అందుకుంటున్నాయి.

గొల్లకుర్మల సంప్రదాయ వృత్తికి పెద్దపీట వేస్తూ గొర్రెల పంపిణీ విధానానికి శ్రీకారం చుట్టిన ప్రభుత్వం, ఈ ఏడాది ఇప్పటివరకు 2 లక్షల 35 వేల కుటుంబాలకు 50 లక్షల గొర్రెలను 75 శాతం సబ్సిడీపై పంపిణీ చేసింది. ఇలా రూ.5,000 కోట్ల అంచనా వ్యయంతో ఈ పథకానికి బడ్జెట్ కేటాయింపులు చేయడం జరిగింది. మొదటి దశలో 4 లక్షల కుటుంబాలకు 84 లక్షల గొర్రెలను పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. రాష్ట్ర ప్రగతికి, గ్రామీణ ఆర్థిక వ్యవస్థను పరిపుష్టం చేయడానికి ఈ పథకం గొప్పగా ఉపయోగపడుతుంది. చేపలు పట్టడమే వృత్తిగా జీవిస్తున్న గంగపుత్ర, ముదిరాజ్, బోయ, బంటు కులస్థులను ఆర్థికంగా బలోపేతం చేయడానికి వీలుగా ఉచితంగా చేప పిల్లలను పంపిణీ చేసే విధానానికి ప్రభుత్వం ముందుకువచ్చింది. ఏటా 3 లక్షల 20 వేల టన్నుల చేపలను ఉత్పత్తిచేసే లక్ష్యంగా కార్యాచరణను రూపొందించింది. పౌల్ట్రీ పరిశ్రమను కూడా విశేషంగా అభివృద్ధి చేసి అనేక సామాజిక వర్గాలకు చేయూతనందించేందుకు కృషిచేయడం స్పష్టంగా కనిపిస్తున్నది.

ఆకలి చావుల నుంచి చేనేత కార్మికులను తప్పించి వారికి అండగా నిలబడింది టీఆర్ఎస్ ప్రభుత్వం. కార్మికులకు నెలకు కనీసం 15 నుంచి 20 వేల రూపాయల వేతనం ఇచ్చేటట్టు యాజమాన్యాలను ఒప్పించింది. వారి కుటుంబాలను నిలబెట్టింది. 1,190 ఎకరాల విస్తీర్ణంలో రూ. 1075 కోట్లతో టెక్స్‌టైల్ నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. ఇలా 22 సంస్థలతో రూ.3,440 కోట్ల పెట్టుబడుల ఒప్పందంతో వరంగల్‌లో ప్రతిష్ఠాత్మకంగా మెగా టెక్స్‌టైల్ పార్కును నెలకొల్పడం గమనించాలి. ఈ బడ్జెట్‌లో చేనేత, టెక్స్‌టైల్ రంగానికి 1200 కోట్లు ప్రతిపాదించడం జరిగింది.

ఆడపిల్లల పెండ్లిండ్లు చేయలేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న తల్లిదండ్రులకు చేదోడువాదోడుగా ప్రభుత్వం కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకం ప్రవేశపెట్టి అన్నిసామాజిక వర్గాలకు అండగా నిలబడటం గొప్ప విషయం. ఇప్పటికే రూ.1625 కోట్లు ఖర్చుచేసింది. ఈ బడ్జెట్‌లో 1450 కోట్లు కేటాయించడం హర్షణీయం.

'బడ్జెట్ అంటే జీవంలేని అంకెలు. సారంలేని గణాంకాలు కాదు. చిట్టాపద్దుల పట్టిక కాదు. బడ్జెట్ అంటే తెలంగాణ ప్రజల ఆకాంక్ష. వారి కళ్లల్లో తొణికిసలాడుతున్న కలలు. వారి ఆశలను, ఆకాంక్షలను నిజంచేసే నిర్మాణాత్మకమైన ప్రణాళిక. ప్రజాధనాన్ని, ప్రజల నిజమైన అభివృద్ధి కోసం వెచ్చించే గంభీరమైన బాధ్యతాయుతమైన ప్రక్రియ. మా బడ్జెట్‌లు తెలంగాణ నెలకొల్పిన సామాజిక విలువల ఆధారంగా రూపొందించిన సజీవమైన ఆర్థిక ప్రణాళికలు' అని మొదటి బడ్జెట్‌లో ఆర్థికమంత్రి ఈటల చెప్పిన మాటలు నాలుగేండ్లలోనే నూటికి నూరుశాతం అక్షరసత్యాలు కావడం 2018-19 బడ్జెట్ కేటాయింపులను ఆసాంతంగా పరిశీలించినప్పుడు నిజమవడం రాష్ట్రంలోని కేసీఆర్ సామాజిక న్యాయ పరిపాలనా తీరును స్పష్టం చేస్తున్నది.

> **2014-15లో జీడీపీ వృద్ధిరేటు 6.8 శాతంగా నమోదైంది. అది 201 7-18లో 7.6 శాతంగాను నమోదవడం గొప్ప పరిణామం. ఒకవైపు వేల కోట్లతో సంక్షేమ పథకాలను కొనసాగించడం, ఏటా అనేక సంక్షేమ పథకాలను రూపొందించి అమల్లోకి తేవడం, అనతికాలంలోనే ఎవరూ ఊహించనివిధంగా నిరంతర 24 గంటల విద్యుత్‌ను సాధించడం. మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ పథకాలను శరవేగంగా ముందుకుతీసుకెళ్లడం చూసిన ఆర్థిక నిపుణులు కూడా ఊహించని విధంగా ప్రభుత్వం జీడీపీ వృద్ధిరేటును సాధించడం గమనించదగింది.**

2014-15లో జీడీపీ వృద్ధిరేటు 6.8 శాతంగా నమోదైంది. అది 2017-18లో 7.6 శాతంగాను నమోదవడం గొప్ప పరిణామం. ఒకవైపు వేల కోట్లతో సంక్షేమ పథకాలను కొనసాగించడం, ఏటా అనేకమైన సంక్షేమ పథకాలను రూపొందించి అమల్లోకి తేవడం, అనతికాలంలోనే ఎవరూ ఊహించనివిధంగా నిరంతర 24 గంటల విద్యుత్‌ను సాధించడం. మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ పథకాలను శరవేగంగా ముందుకుతీసుకెళ్లడం చూసిన ఆర్థిక నిపుణులు కూడా ఊహించని విధంగా ప్రభుత్వం జీడీపీ వృద్ధిరేటును సాధించడం గమనించదగింది.

2018-19లో 1,74,453.84 కోట్ల వ్యయాన్ని ప్రతిపాదించిన ఈ బడ్జెట్‌లో సమస్త సామాజికవర్గాల సర్వతోముఖాభివృద్ధిని కాంక్షిస్తూ మెజార్టీ నిధులు కేటాయించడం ప్రభుత్వ సమసమాజ న్యాయస్ఫూర్తికి, మహోన్నత లక్ష్యాలకు, మానవీయ విలువలకు నిలువెత్తు దర్పణం.

(వ్యాసకర్త: రాష్ట్ర బీసీ కమిషన్ సభ్యులు)

జనగళం

ప్రకృతి పర్వదినం

ఉగాది అంటే..
కోయిల కుహు కుహు రాగాలు
పక్షుల కిలకిలా రావాలు
పచ్చదనపు చిగుళ్లు
పూల పరిమళాలు
మధురమైన పండ్ల రుచులు..
కష్టసుఖాలను సమానంగా చూడాలని
చెప్పేది షడ్రుచుల ఉగాది పచ్చడి!
మోడువారిన శిశిర ప్రకృతి కోసం
వసంతాన్ని తెచ్చేది ఉగాది.

– కాయల నాగేంద్ర,8500286697

నిజమైన ఉగాది

కాలగర్భంలో కలిసిన మరో యేడాది
హేవళంబిని సాగనంపుతూ యేతెంచిన విళంబి
నవ వసంతానికి ఉగాది.. యుగాది!
నిజమైన ఉగాది ఎప్పుడంటే..
జలకళ నిండిన చెరువులు
మత్తడి దుంకిన చెరువుల గలగలలు
పగుళ్లు బారిన పంటపొలాలు
పసిడి పంటల సింగిడీలు వేసినప్పుడు
సబ్బండ వర్గాలు
సుఖసంతోషాలతో రేపటి ఉషోదయం అయినప్పుడు.

– నోముల సంజీవరెడ్డి, 99488 86550

ఉత్తరాలు, రచనలు పంపవలసిన చిరునామా: 8-2-603/1/7,8,9, కృష్ణాపురం, రోడ్‌నంబర్.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034. editpage@namasthetelangaana.com Fax-040-23291118

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.437, Near Velama Kalyana Mandapam, Devara Yamjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078, Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Katta Shekar Reddy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.

బడ్జెట్‌లో ప్రతి కుటుంబానికీ భాగం

- ఎక్కడా లేనివిధంగా ఎవుసానికి 26 శాతం కేటాయింపు
- సీఎం కేసీఆర్ ఆధ్వర్యంలో దేశానికే ఆదర్శంగా బడ్జెట్‌కు రూపకల్పన
- సంక్షేమమే ప్రభుత్వ తొలిప్రాధాన్యం: ఆర్థిక మంత్రి ఈటల వెల్లడి



గురువారం బడ్జెట్ అనంతరం అసెంబ్లీలో మీడియాతో మాట్లాడుతున్న ఆర్థికశాఖ మంత్రి ఈటల రాజేందర్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలోని ప్రతి పేద వాడి జీవితం గురించి మానవత్వంతో ఆలోచించి బడ్జెట్‌ను రూపొందించినట్టు ఆర్థికమంత్రి ఈటల రాజేందర్ చెప్పారు. గతానికి భిన్నంగా రాష్ట్రంలోని ప్రతి కుటుంబం బడ్జెట్‌లో తమభాగం ఉందని ఆలోచించే పరిస్థితిని టీఆర్ఎస్ ప్రభుత్వం తీసుకొచ్చిందని పేర్కొన్నారు. 2018-19 వార్షిక బడ్జెట్‌ను అసెంబ్లీలో ప్రవేశపెట్టిన తర్వాత అసెంబ్లీ కమిటీహాల్‌లో మీడియా సమావేశంలో ఈటల రాజేందర్ మాట్లాడారు. కేంద్ర బడ్జెట్‌తోపాటు ఇటీవల ఇతరరాష్ట్రాలు ప్రవేశపెట్టిన బడ్జెట్లను నిశితంగా పరిశీలించి, సీఎం కేసీఆర్ ఆధ్వర్యంలో పూర్తిస్పష్టతతో తాజా బడ్జెట్‌ను రూపొందించినట్టు తెలిపారు. ప్రజల ప్రాథమ్యాలు, రాష్ట్ర ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని బడ్జెట్‌ను రూపొందించామన్నారు. ఇది ఎన్నికల బడ్జెట్ అని, ఓట్లకోసం కేటాయింపులు ఉంటాయని అనుకున్నారని, కేవలం రాష్ట్ర ప్రయోజనాలకే ప్రాధాన్యం ఇచ్చామని, గత నాలుగేండ్ల కేటాయింపులకు కొనసాగింపుగానే ఈ సారి బడ్జెట్ ప్రవేశపెట్టామని స్పష్టంచేశారు. నాలుగేండ్లుగా బడ్జెట్ ప్రజల ఆమోదం పొందిందని, ప్రతి కుటుంబానికి తండ్రిలా ప్రభుత్వం అండగా ఉందన్న భావన ప్రజల్లో వచ్చిందని చెప్పారు. వ్యవసాయం, అనుబంధరంగాలకు దేశంలోనే తొలిసారిగా బడ్జెట్‌లో 26 శాతం పైబడి నిధులు కేటాయించామని తెలిపారు. ఈ ఏడాదిలోనే ప్రతి సీజన్‌లో ఎకరాకు రూ.4వేల చొప్పున ఇవ్వనున్న పెట్టుబడి పథకం కోసం రూ.12 వేల కోట్లు కేటాయించినట్టు చెప్పారు. రైతు కుటుంబాలకు అండగా ఉండేందుకు రైతు బీమా పథకాన్ని తీసుకొచ్చామని చెప్పారు. గత బడ్జెట్‌లో నీటిపారుదల రంగానికి రూ.25 వేల కోట్లు కేటాయిస్తే, రూ.22 వేల కోట్లు ఖర్చుచేసినట్టు తెలిపారు. ఈ ఏడాది కూడా ప్రాజెక్టులను వేగవంతంగా పూర్తిచేసే లక్ష్యంతో రూ.25 వేల కోట్లు కేటాయించినట్టు తెలిపారు. ఏడాదిలోపే కాళేశ్వరం ప్రాజెక్టును మిడ్‌మానేరుతో అనుసంధానం చేసి పొలాలకు నీళ్లివ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నామని చెప్పారు. 2019-20 నాటికి కాళేశ్వరం ప్రాజెక్టును మల్లన్నసాగర్‌తో అనుసంధానం చేస్తామన్నారు.

కులవృత్తులకు నిధులు: సంక్షేమమే ప్రభుత్వ తొలి ప్రాధాన్యంగా తీసుకున్నామని, ఆసరా లేని వృద్ధులకు పెద్దకొడుకులా ప్రభుత్వం అండగా నిలిచి.. పింఛన్లు ఇస్తున్నదని మంత్రి ఈటల గుర్తుచేశారు. రాష్ట్ర జనాభాలో అధిక సంఖ్యలో ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ కులాలకు ఆర్థికంగా చేయూతనిచ్చేందుకు భారీగా నిధులు కేటాయించినట్టు తెలిపారు. అప్పులు చేయకుండా ఏ రాష్ట్రం ముందుకుపోలేదని.. రాష్ట్ర అభివృద్ధి కోసం, సంపద సృష్టికోసమే అప్పులు తీసుకుంటున్నామని స్పష్టంచేశారు. అడ్డగోలుగా అప్పులుచేసే వీలుండదని, రాష్ట్ర జీఎస్డీపీలో 25 శాతంలోపు అప్పులు తీసుకోవచ్చని.. ఆ మేరకే అప్పులు తీసుకున్నామని చెప్పారు. గత ఏడాది కేంద్రం వాటా కింద రాష్ట్రానికి రూ.24 వేలు కోట్లు రావాల్సి ఉండగా, రూ.15 వేల కోట్లే వచ్చాయని.. నెలాఖరుకు రూ.22 వేల కోట్లకు చేరుతుందని ఆశిస్తున్నట్టు చెప్పారు. ప్రభుత్వ ఆర్థిక సలహాదారు జీఆర్‌రెడ్డి, ఆర్థికశాఖ ముఖ్య కార్యదర్శులు రామకృష్ణారావు, శివశంకర్ పాల్గొన్నారు.


మూడు జలాశయాలకు మంత్రివర్గం ఆమోదం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: చనాక-కొరాట ప్రాజెక్టులో రెండు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్లతోపాటు సాగునీటి సమస్య ఎదుర్కొంటున్న కడెం ఆయకట్టును ఆదుకునేందుకు చేపట్టిన కుప్టి జలాశయ నిర్మాణ ప్రతిపాదనలకు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపినట్లు సమాచారం. ప్రగతిభవన్‌లో బుధవారం జరిగిన మంత్రివర్గ సమావేశంలో రాష్ట్ర బడ్జెట్‌ను ఆమోదించడంతోపాటు నీటిపారుదలశాఖకు చెందిన ఈ ప్రతిపాదనలను కూడా ఆమోదించినట్లు తెలిసింది. చనాక-కొరాట బ్యారేజీ వద్ద నీటి నిల్వ కేవలం 0.85 టీఎంసీలే ఉన్నందున పెనుగంగ నదిలో నీటి ప్రవాహాలు తగ్గిపోయిన తర్వాత రెండో పంటకు నీటిని సరఫరా చేసే అవకాశం ఉండదు. ఈ నేపథ్యంలో బ్యాలెన్సింగ్ రిజర్వాయర్లు అవసరమని ప్రభుత్వం గుర్తించింది. గత నెల 27న సీఎం కేసీఆర్ ఆదిలాబాద్ జిల్లా పర్యటనలో ప్రాజెక్టు పనుల పరిశీలన సందర్భంగా సమీక్ష నిర్వహించారు. ఇందులో భాగంగానే పిప్పల్‌కోటి, గోమూత్రి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ల నిర్మాణానికి ఆదేశాలు జారీచేశారు. పిప్పల్‌కోటి వద్ద 1.423 టీఎంసీల సామర్థ్యంతో జలాశయం, గోమూత్రి వాగుపై 0.7 టీఎంసీల సామర్థ్యంతో మరో జలాశయాన్ని నిర్మించాలని సీఎం కేసీఆర్ ఇంజినీర్లను ఆదేశించారు. పిప్పల్‌కోటి జలాశయం ఆదిలాబాద్ జిల్లా భీంపూర్ మండలం బోథ్ నియోజకవర్గంలో ఉంది. పెనుగంగలో నీటి ప్రవాహాలు ఉన్నపుడు చనాక-కొరాట బ్యారేజీ నుంచి నీటిని ఎత్తిపోసి పిప్పల్‌కోటి జలాశయంలో నిల్వచేస్తారు. పెనుగంగలో ప్రవాహం తగ్గినపుడు ఈ జలాశయం గ్రావిటీ కాల్వ 47 కిలోమీటర్ నుంచి నీటిని వదులుతారు. తద్వారా 37,500 ఎకరాలకు రెండోపంటకు సాగునీరు అందుతుంది. గోమూత్రి వాగుపై నిర్మించే జలాశయంలో వాగు పరివాహక ప్రాంతం నుంచి వచ్చే నీటిని నిల్వ చేస్తారు. దీనిద్వారా పెనుగంగ గ్రావిటీ కాల్వ ఎగువ రీచ్.. అంటే 13-47 కిలోమీటర్ల వరకు ఉన్న పదివేల ఎకరాలకు సాగునీరు అందుతుంది. పిప్పల్‌కోటి జలాశయానికి నిర్మాణం, భూసేకరణకు రూ.368.78 కోట్ల వ్యయం అవుతుండగా.. గోమూత్రి జలాశయం నిర్మాణానికి రూ.215 కోట్ల వ్యయం అవుతుందని అధికారులు అంచనా వేశారు.

రూ.870 కోట్ల వ్యయంతో కుప్టి

కడెం జలాశయం నిల్వ సామర్థ్యం 7.20 టీఎంసీలు కాగా.. పలు కారణాలతో దాని సామర్థ్యం 4.7 టీఎంసీలకు పడిపోయింది. దానికింద ఉన్న 68వేల ఎకరాల్లో చాలా భూములకు సాగునీరు అందే పరిస్థితి లేదు. ప్రత్యామ్నాయంగా కుప్టి గ్రామం వద్ద 5.30 టీఎంసీల సామర్థ్యంతో జలాశయం నిర్మాణానికి నిర్ణయించారు. కడెం జలాశయానికి అవసరమైనపుడు నీటిని సరఫరా చేయడం, మూడు మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి, దిగువన ఉండే కుంటాల జలపాతానికి సంవత్సరంలో జనవరి నుంచి జూన్ దాకా నీటి ప్రవాహం ఉండేలా చూడొచ్చు. కుప్టి జలాశయం నిర్మాణం, భూసేకరణ, పునరావాసానికి కలిపి రూ.870 కోట్ల వ్యయం అవుతుందని అంచనా వేశారు.

పంచాయతీరాజ్ సంస్థలకు ఎస్ఎఫ్‌సీ గ్రాంట్లు - రూ.**1,500** కోట్లు
పట్టణ, స్థానిక సంస్థలకు ఎస్ఎఫ్‌సీ గ్రాంట్లు - రూ.**1,500** కోట్లు
కల్యాణలక్ష్మి, షాదీముబారక్ - రూ.**1,450.46** కోట్లు
చేనేత కార్మికులకు సహాయం - రూ.**1,200** కోట్లు
ఉపకారవేతనాలు - రూ.**3,282.24** కోట్లు
బియ్యం సబ్సిడీ - రూ.**2,744.43** కోట్లు
విద్యుత్ సబ్సిడీ - రూ.**4,984.30** కోట్లు
ఎకనామిక్ సపోర్ట్ స్కీం - రూ.**1,682.53** కోట్లు
ఆసరా - రూ.**5,366.89** కోట్లు
ఎంబీసీ కార్పొరేషన్ - రూ.**1,000** కోట్లు
కేసీఆర్ కిట్లు - రూ.**560.50** కోట్లు




గురువారం అసెంబ్లీలో బడ్జెట్ ప్రవేశపెట్టడానికి ముందు మంత్రులు ఈటల రాజేందర్, కేటీఆర్ మాటామంతీ. చిత్రంలో ప్రభుత్వ చీఫ్‌విప్ కొప్పుల ఈశ్వర్, టీఎస్ ఎంఎఫ్‌సీ చైర్మన్ అక్బర్ హుస్సేన్ తదితరులు కూడా ఉన్నారు.



ఆరోగ్య తెలంగాణ సాధ్యం

బడ్జెట్ దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నది. బడ్జెట్‌తో ఆరోగ్య తెలంగాణ సాధించగలం. మందులు, వైద్య పరికరాలు, మౌలిక సదుపాయాలు, ఆధునీకరణ, కొత్త నియామకాలు వంటివి పూర్తిచేసేందుకు అవకాశం కలిగింది. అమెరికా తరహాలో తెలంగాణలో వైద్య సదుపాయాలే కాకుండా.. పౌరులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి హెల్త్ ప్రొఫైల్‌ను సిద్ధంచేస్తాం.


– సీ లక్ష్మారెడ్డి, వైద్యారోగ్యశాఖ మంత్రి



డబుల్ బెడ్ రూం ఇండ్ల నిర్మాణానికి కేటాయింపు
2,795.15 కోట్లు

ఉచిత విద్యుత్‌కు రూ.3,728 కోట్లు

- కోతలనే మాటను ప్రజలు మర్చిపోయారు
- 10 వేల మెగావాట్ల గరిష్ఠ డిమాండ్ ఏర్పడినా సరఫరా
- సోలార్ విద్యుత్ ఉత్పత్తిలో దేశంలోనే అగ్రగామిగా రాష్ట్రం
- విద్యుత్ రంగానికి రూ.5,650 కోట్లు



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: విద్యుత్ రంగంలో రాష్ట్రప్రభుత్వం అనూహ్యమైన ప్రగతిని సాధించిందని ఆర్థికశాఖ మంత్రి ఈటల రాజేందర్ తెలిపారు. 'రాష్ట్ర ఏర్పాటుకు ముందు నిరంతర విద్యుత్ కోతలతో వెతలు పడిన ప్రజలకు రాష్ట్ర ప్రభుత్వం 24 గంటల నిరంతర విద్యుత్ సరఫరా అందిస్తున్నది. రాష్ట్రం ఏర్పడితే అంధకారం అవుతుందని ఎగతాళి చేసిన వారే ముక్కున వేలేసుకునేలా అనతికాలంలోనే అద్భుతాన్ని ఆవిష్కరించింది. దేశంలో మరే రాష్ట్రం ఇవ్వని విధంగా వ్యవసాయానికి 24 గంటల విద్యుత్‌ను ఉచితంగా సరఫరా చేస్తున్నది. కరంటు కోతలనే మాటలను ప్రజలు పూర్తిగా మర్చిపోయారు. చరిత్రలో ఏనాడు లేనివిధంగా 10 వేల మెగావాట్ల గరిష్ఠ డిమాండ్ ఏర్పడినా రాష్ట్ర విద్యుత్ సంస్థలు సరఫరా చేస్తున్నాయి. విద్యుత్ సరఫరాలో వచ్చిన అద్భుతమైన అభివృద్ధి రాష్ట్ర ప్రగతికి ఉత్తేజాన్ని ఇచ్చింది. వ్యవసాయ ఉత్పత్తి గణనీయంగా పెరిగింది. పరిశ్రమలు రోజుకు మూడు షిఫ్టులు పనిచేస్తున్నాయి. సోలార్ విద్యుత్ ఉత్పత్తిలో రాష్ట్రం దేశంలోనే అగ్రగామిగా ఉన్నది. రాష్ట్రం ఏర్పడే నాటికి 31 మెగావాట్ల సౌర విద్యుత్ ఉత్పత్తి అవుతుండగా.. నేడు 3,283 మెగావాట్లు ఉత్పత్తి అవుతున్నది. తెలంగాణను మిగులు విద్యుత్ రాష్ట్రంగా అభివృద్ధి చేయడానికి 28,275 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తున్నది. ఇప్పటివరకు రూ.10వేల కోట్లకు పైగా ఖర్చుచేసి 15,344 మెగావాట్ల విద్యుత్‌ను అందుబాటులోకి తెచ్చింది. ఈ నెలాఖరుకు కేటీపీఎస్ 7వ దశ ద్వారా 800 మెగావాట్ల విద్యుత్ అందుబాటులోకి వస్తుంది. అలాగే ఈ ఏడాది చివరికి 1080 మెగావాట్ల భద్రాద్రి పవర్ ప్లాంట్ మొదటి దశ అందుబాటులోకి రానున్నది. యాదాద్రి పవర్ ప్లాంట్ నిర్మాణానికి శరవేగంగా పర్యావరణ అనుమతులు తీసుకొస్తున్నాం' అని ఈటల వివరించారు. విద్యుత్ రంగానికి 2018-19 వార్షిక బడ్జెట్‌లో రూ.5,650 కోట్లు ప్రతిపాదించారు. ఇందులో ప్రగతి పద్దు కింద రూ.3,770.633 కోట్లు కేటాయించగా వ్యవసాయానికి ఉచిత విద్యుత్ సరఫరాకు సబ్సిడీ కింద రూ.3728.256 కోట్లు ప్రతిపాదించారు. స్పిన్నింగ్ మిల్లులకు గ్రాంట్ ఇన్ ఎయిడ్ కింద రూ.35 కోట్లు, తెలంగాణ పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్‌కు రూ.30 లక్షలు, ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్‌కు రూ.1.37 కోట్లు, ఇంధన పరిరక్షణ నిధికి రూ.2 కోట్లు గ్రాంట్స్ ఇన్ ఎయిడ్‌గా ప్రతిపాదించారు. సోలార్ ఎనర్జీకి రూ.4 కోట్లు కేటాయించారు. విద్యుత్ ప్రాజెక్టుల నిర్మాణాలకు తీసుకున్న రుణాలకు ఈ ఏడాది వార్షిక బడ్జెట్‌లో రూ.598.24 కోట్లు చెల్లించడానికి ప్రతిపాదించింది.

భూముల పరిరక్షణకు భారీగా నిధులు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: భూముల పరిరక్షణకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇచ్చింది. గతేడాది ప్రగతి పద్దు కింద రూ.2.75 కోట్లు కేటాయించగా ఈసారి 86.69 కోట్లను బడ్జెట్‌లో ఆర్థికమంత్రి ఈటల రాజేందర్ ప్రతిపాదించారు. పట్టాదార్ పాస్ పుస్తకాల ముద్రణకు రూ.2.85 కోట్లు, నేషనల్ ల్యాండ్ రికార్డు మోడరైజేషన్ (ఎన్ఎల్ఆర్ఎంపీ) ప్రాజెక్టుకు రూ.3.78 కోట్లు, ధరణి వెబ్‌సైట్ నిర్వహణకు రూ.75 కోట్లు, తహసీల్దార్ కార్యాలయాలు కంప్యూటరీకరించడానికి రూ.5.67 కోట్లు, ప్రభుత్వ భూముల పరిరక్షణకు రూ.2.30 కోట్లను కేటాయించారు. దీంతోపాటు ఆపద్బంధు పథకం కింద రూ. 15.05 కోట్లు కేటాయిస్తున్నట్టు ప్రకటించారు.

న్యాయశాఖకు పెరిగిన కేటాయింపులు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: న్యాయశాఖకు గత ఏడాది కంటే ఈసారి బడ్జెట్‌లో రూ.160 కోట్లు అధికంగా కేటాయించారు. 2018-19 బడ్జెట్‌లో ఆర్థికమంత్రి ఈటల రాజేందర్ న్యాయశాఖకు రూ 894.22 కోట్లు కేటాయించారు. గత ఏడాది రూ 740.35 కోట్ల అంచనాను రూ 738.35 కోట్లుగా సవరించారు. ప్రస్తుత బడ్జెట్ అంచనాల ప్రకారం అడ్వకేట్ జనరల్ కార్యాలయం కోసం రూ 13.82 కోట్లు, ప్రాసిక్యూషన్ల శాఖకు రూ 18.06 కోట్లు, తెలంగాణ రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థకు రూ 17.78 కోట్లు, జ్యుడీషియల్ అకాడమీకి రూ. 3.20 కోట్లు కేటాయించారు. హైకోర్టు కార్యకలాపాల నిర్వహణ కోసం రూ.775 కోట్లు కేటాయించారు.



ఐటీలో మౌలిక వసతులకు ప్రాధాన్యం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: తెలంగాణ బడ్జెట్‌లో ఆర్థికమంత్రి ఈటల రాజేందర్ ఐటీ రంగానికి సముచిత ప్రాధాన్యమిచ్చారు. గత ప్రభుత్వాలు ఐటీ రంగాన్ని ఆదాయమార్గంగా భావించాయే తప్ప దాని అభివృద్ధికి ప్రత్యేకంగా నిధులు కేటాయించిన దాఖలాల్లేవు. ప్రస్తుతం తెలంగాణ ప్రభుత్వం ఈ రంగానికి అధిక ప్రాధాన్యమిచ్చింది. ఐటీ అభివృద్ధికి మౌలిక సదుపాయాల కల్పన, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, కమ్యూనికేషన్స్ తదితర శాఖలకు ఆర్థికమంత్రి బడ్జెట్‌లో రూ.289.20 కోట్లు కేటాయించారు. రాష్ట్రప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించిన ఇంక్యుబేటర్ కేంద్రం టీ హబ్ అధికంగా నిధులు కేటాయించారు. మహిళ పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించేందుకు రూపొందించిన వీహబ్‌కు రూ.15 కోట్లు కేటాయించారు.ఐటీరంగానికి అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు రూ.90 కోట్లు, సచివాలయంలో టెక్నాలజీ పరమైన సేవలకు సంబంధించి ఖర్చుకోసం రూ.7.49 కోట్లు, విద్యార్థులను నైపుణ్యవంతులుగా తీర్చిదిద్దేందుకు ఉద్దేశించిన టాస్క్‌కోసం రూ.10 కోట్లు, మండలాల్లో వోఎఫ్‌సీ కేంద్రానికి రూ.5 కోట్లు, ఆవిష్కరణల కేంద్రమైన టీ హబ్ కోసం 5 కోట్లు, ఫొటోనిక్స్ వ్యాలీకి రూ.1 కోటి కేటాయించారు.

ఉజ్వాల తెలంగాణ

చీకటి నుంచి వెలుగుల వైపు పయనం.. అపనమ్మకం నుంచి ఆత్మవిశ్వాసంతో ముందుకు

వలస బతుకుల నుంచి వ్యవసాయ ప్రగతి వైపు ■ వర్తమాన విజయాలతో ప్రజల్లో ఆత్మవిశ్వాసం ■ బంగారు తెలంగాణ నిర్మాణమే సర్కారు ధ్యేయం
45 నెలల్లోనే ఎన్నో అద్భుత ఆవిష్కరణలు ■ అభివృద్ధి, సంక్షేమ ఫలాలు పేదలకు అందాలనేదే సీఎం కేసీఆర్ సంకల్పం
అందుకు అద్దంపట్టేలా తెలంగాణ రాష్ట్ర ఐదో బడ్జెట్ ■ శాసనసభలో ఆర్థికశాఖ మంత్రి ఈటల రాజేందర్ బడ్జెట్ ప్రసంగం



(హైదరాబాద్, నమస్తే తెలంగాణ)

'అనేక ప్రతికూల పరిస్థితులు, అస్పష్టతలు, అనుమానాలు, సవాళ్ల మధ్య ఏర్పడిన నూతన రాష్ట్రం అనతికాలంలోనే అనేక విషయాల్లో దేశానికి ఆదర్శంగా నిలిచేస్థాయికి ఎదిగింది. ప్రజాసంక్షేమం, మౌలిక వసతుల కల్పన, పాలనా సంస్కరణల్లో తెలంగాణ చూపిన మార్గం తమకు కూడా అనుసరణీయమని ఇతరరాష్ట్రాల ప్రభుత్వాలు భావిస్తున్నాయి. వర్తమానంలో ప్రభుత్వం సాధిస్తున్న విజయాలతో భవిష్యత్తు ఉజ్వలంగా ఉంటుందనే ఆత్మవిశ్వాసం నేడు తెలంగాణ సమాజంలో తొణికిసలాడుతున్నది.ఆ విశ్వాసమే ప్రాతిపదికగా, బంగారు తెలంగాణ నిర్మాణం ధ్యేయంగా రాష్ట్ర ప్రజల సమగ్రాభివృద్ధి కోసం ఈ వార్షిక బడ్జెట్‌ను రూపొందించాం' అని ఆర్థికశాఖమంత్రి ఈటల రాజేందర్ పేర్కొన్నారు. శాసనసభలో గురువారం ఉదయం 11 గంటలకు ఆయన రాష్ట్ర బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. వరుసగా ఐదోసారి బడ్జెట్ ప్రవేశపెట్టి రికార్డుల్లోకి ఎక్కారు. ఈ సందర్భంగా ఈటల ప్రసంగిస్తూ.. తెలంగాణ గతం, వర్తమానం, భవిష్యత్తును ఆవిష్కరించారు. పేదలకు కనీస భరోసా అందించాలనే దృష్టితో ప్రభుత్వం సంక్షేమరంగంమీద ఎక్కువ నిధులు ఖర్చు చేస్తున్నదన్న ఆయన.. దేశంలో ఎక్కడాలేనన్ని సంక్షేమ పథకాలు తెలంగాణలో అమలవుతున్నాయని చెప్పారు. 'ప్రతీ ఇంటికి సంక్షేమం.. ప్రతీ ముఖంలో సంతోషం' అనే నినాదంతో ప్రభుత్వ సంక్షేమ పథకాలు కనీస జీవన భద్రత కల్పిస్తున్నాయన్నారు. సీఎం పరిపాలన సంక్షేమానికి స్వర్ణయుగంగా మంత్రి ఈటల అభివర్ణించారు. సుమారు గంటా 22 నిమిషాలపాటు సాగిన ఆర్థికమంత్రి బడ్జెట్ ప్రసంగంలోని ముఖ్యాంశాలు.. క్లుప్తంగా ఆయన మాటల్లోనే..

ఆకాంక్షలను నెరవేర్చుకునే దిశలో..

తెలంగాణ రాష్ట్రంలో వరుసగా ఐదోసారి బడ్జెట్ ప్రవేశపెట్టే అవకాశం నాకు రావడం ఎంతో సంతోషంగా ఉంది. నాపై విశ్వాసంతో ఈ గురుతర బాధ్యతను అప్పగించినందుకు సీఎం కేసీఆర్‌కు హృదయపూర్వక కృతజ్ఞతలు. ఈ సందర్భంలో రాష్ట్ర సాధనకు మూడున్నర కోట్ల ప్రజానీకం చేసిన బహుముఖ పోరాటం, ఆ పోరాటం వెనుక ఉన్న ఎదురులేని నాయకత్వం, ఉమ్మడి రాష్ట్రంలో నీళ్లు, నిధులు, నియామకాల్లో మనకు జరిగిన అన్యాయం, రాష్ట్రం ఏర్పడిన నాడు ఉన్న అస్తవ్యస్త పరిస్థితులు, ఆ పరిస్థితులను చక్కదిద్దే దిశగా వినూత్నమైన పథకాలను ప్రారంభించి రాష్ట్ర ఆర్థికస్థితిని గాడిలోకి తెచ్చిన అంశాన్ని మనం తప్పకుండా మననం చేసుకోవాలి. తెలంగాణ ప్రజల ఆకాంక్షలు నెరవేర్చడం కోసం మొదలైన ప్రయాణంలో ఎన్నో మైలురాళ్లను అధిగమించాం. 45 నెలల స్వల్పకాలంలో ఎన్నో అద్భుతాలను ఆవిష్కరించాం. చీకటి నుంచి వెలుగులోకి, అపనమ్మకం నుంచి ఆత్మ విశ్వాసంలోకి, అణగారిన స్థితినుంచి అభ్యున్నతిలోకి, వలసబతుకుల నుంచి వ్యవసాయ ప్రగతి వైపు రాష్ట్ర ప్రజలను నడిపిస్తున్నాం.

'ఆమె'కు భరోసా..

సమాజంలో సగభాగమైన మహిళల్లో తమకు సమన్యాయం లభించడం లేదనే ఆవేదన ఉంది. చట్టసభల్లో 33శాతం రిజర్వేషన్ కావాలని మహిళలు ఎంతోకాలంగా డిమాండ్ చేస్తున్నారు. సహేతుకమైన వారి డిమాండ్‌ను సమర్థిస్తూ మనం అసెంబ్లీలో తీర్మానం చేశాం. ప్రభుత్వం, రాష్ట్ర పరిధిలో ఉన్న అన్ని సంస్థల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పిస్తున్నాం. తెలంగాణ ఏర్పడిన తర్వాత వ్యవసాయ మార్కెట్ కమిటీల చైర్మన్లలో వారికి తొలిసారి రిజర్వేషన్లను ప్రవేశపెట్టాం. పోలీసుశాఖలో కూడా 33 శాతం రిజర్వేషన్లు ప్రవేశపెట్టిన ఘనత ఈ ప్రభుత్వానికే దక్కుతుంది. మహిళా శిశు సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన కార్యక్రమాలు క్షేత్రస్థాయిలో పక్కాగా అమలయ్యేందుకు 16 మంది మహిళా ఆర్గనైజర్లను సముచిత గౌరవ వేతనంతో నియమించాం.

వివిధ వర్గాలకు ఎన్నోరకాలుగా..

ఎస్సీ, ఎస్టీల అభ్యున్నతి కోసం నిధులు ఖర్చుచేసే విషయంలో ప్రభుత్వం జనాభా నిష్పత్తికి అనుగుణంగా ప్రత్యేక ప్రగతినిధిని ఏర్పాటుచేసింది. ఈ నిధిలో ఒక ఏడాదికి కేటాయించిన నిధులు పూర్తిగా ఖర్చు కాకుంటే మిగిలినవాటిని మరుసటి ఏడాదికి బదలాయించేలా ప్రభుత్వం చట్టం చేసింది. ఎస్సీ, ఎస్టీ ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం తెలంగాణ స్టేట్ ప్రోగ్రామ్ ఫర్ రాపిడ్ ఇంక్యుబేషన్ ఆఫ్ దళిత్ ఎంటర్‌ప్రెన్యూర్స్ (టీ-ప్రైడ్) అనే కొత్త కార్యక్రమాన్ని అమలుచేస్తున్నది.

- షెడ్యూల్డ్ తెగల సంస్కృతికి చిహ్నాలు అయిన జంగుబాయిజాతర, నాగోబా జాతర, సంత్ సేవాలాల్ జయంతి ఉత్సవాలను ఘనంగా జరుపుకుంటున్నాం.
- ఎస్సీ, ఎస్టీల చిరకాలవాంఛను నెరవేరుస్తూ తెలంగాణలో తండాలు, ఆదివాసీగూడేలను గ్రామ పంచాయతీలుగా ప్రభుత్వం గుర్తించబోతున్నది.
- తమ వృత్తుల ద్వారా సమాజానికి సేవచేస్తున్న నాయీబ్రాహ్మణులు, రజకులు, మేదరి, వడ్డెర, విశ్వకర్మలు, గౌడ తదితర కులవృత్తులవారందరికీ అవసరమైన ఆర్థిక సహకారం ఇచ్చి, పరికరాలు పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. నిర్దిష్ట పథకాల రూపకల్పన జరుగుతున్నది.
- ఎస్సీ, ఎస్టీల సర్వతోముఖాభివృద్ధికి చేపట్టిన కార్యక్రమాలన్నీ, మైనార్టీలకూ అందించాలని నిర్ణయించాం.
- నిరుపేదలు కూడా సౌకర్యవంతంగా ఉండే డబుల్ బెడ్‌రూం ఇండ్ల నిర్మాణం వేగం పుంజుకుంది.
- నిరుపేద గర్భిణుల కోసం అమలుచేస్తున్న 'అమ్మ ఒడి' పథకం దేశంలో అనేక రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచింది.
- కేసీఆర్ కిట్ల పథకం దేశ, విదేశాల నుంచి అవార్డులు, ప్రశంసలు అందుకుంటున్నది.
- కేజీ నుంచి పీజీ వరకు ఉచిత విద్య విధానం ఈ 45 నెలల పరిపాలన కాలంలో తొలి అడుగులు వేసింది. ఆడపిల్లలు చదువులో మరింత ముందంజవేస్తున్నాం.
- మిషన్ భగీరథ పథకం ద్వారా శుద్ధిచేసిన నదీజలాలను నల్లాలద్వారా ప్రతీ ఇంటికి ప్రతిరోజూ అందిస్తాం. ఈ నెలాఖరు వరకు నదీజలాలు అన్ని గ్రామాలకు చేరుకుంటాయి.
- రహదారుల అభివృద్ధికి కొత్త దిశను కల్పిస్తున్నాం.
- తెలంగాణ పారిశ్రామిక అభివృద్ధి కోసం ప్రభుత్వం తెచ్చిన టీఎస్-ఐ పాస్ చట్టం మంచి ఫలితాలను సాధిస్తున్నది. ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన ఐటీ విధానంతోనూ ఎన్నో అగ్రశ్రేణి ప్రపంచ ఐటీ సంస్థలు తమ కార్యకలాపాలను హైదరాబాద్‌కు విస్తరించాయి. ఐటీ ఎగుమతుల్లో రాష్ట్రం వరుసగా మూడేండ్లపాటు జాతీయ సగటును మించింది.
- ఒక జాతి ఆత్మ ఆ జాతి సంస్కృతిలో ప్రతిఫలిస్తుంది. ప్రతీ ఏటా బతుకమ్మ, బోనాల పండుగలను రాష్ట్ర పండుగలుగా అధికారికంగా ఘనంగా నిర్వహిస్తున్నది. తెలంగాణ మహనీయుల పేరిట అవార్డులను అందిస్తున్నది.
- నిత్యం అలజడి, అశాంతులతో అట్టుడికిన తెలంగాణ సమాజం ఇప్పుడు ప్రశాంతంగా జీవనం కొనసాగిస్తున్నది.
- ప్రభుత్వ ఉద్యోగులకు పీఆర్సీ వేతన పెంపుదలలో దేశంలోనే ఆదర్శంగా ఉన్నాం. ఉద్యోగులు, జర్నలిస్టులకు కార్పొరేటు దవాఖానల్లో నగదురహిత వైద్యం అందుబాటులోకి తెచ్చాం. వెల్‌నెస్ సెంటర్ల ద్వారా ఓపీ సేవలు కూడా అందుబాటులోకి వచ్చాయి.

కీలక రంగాల్లో ప్రగతిపథాన..



తెలంగాణ ప్రభుత్వం అన్ని రంగాల్లో అనుపమాన ప్రగతిని సాధిస్తున్నది. కీలకమైన విద్యుత్ రంగంలో, నీటిపారుదలలో వచ్చిన అభివృద్ధి వల్ల రాష్ట్రంలో సాగు విస్తీర్ణం పెరిగింది. వ్యవసాయ అభివృద్ధి ఆశాజనకంగా ఉంది. ప్రాజెక్టులు, చెరువుల ద్వారా సాగునీరు లభించడం, కోతల్లేని 24 గంటల కరంటు సరఫరా, భూగర్భజలాల సద్వినియోగంతో వ్యవసాయఅభివృద్ధి గణనీయంగా ఉంటుందని అంచనా వేస్తున్నాం. వృద్ధి రేటు, తలసరి ఆదాయంలోనూ ఊహించనిరీతిలో ఎంతో ముందుకువెళుతున్నాం. నూతన పారిశ్రామిక విధానం వల్ల తయారీరంగంలో వృద్ధి నమోదైంది. తెలంగాణ వ్యవసాయానికి పునరుజ్జీవం కల్పించడం ద్వారా గ్రామీణ ఆర్థికవ్యవస్థను పటిష్ఠపరుచాలని ప్రభుత్వం సంకల్పించింది. పంటకు అవసరమైన పెట్టుబడిని ప్రభుత్వమే సమకూర్చాలని నిర్ణయించి సీఎం కేసీఆర్ నాయకత్వంలోని తెలంగాణ.. దేశానికే మార్గదర్శకంగా నిలిచింది. భూమి రికార్డుల వివరాలన్నింటిని పొందుపరిచిన 'ధరణి' వెబ్‌సైట్‌ను త్వరలో ఆవిష్కరించనున్నాం. రైతు కుటుంబానికి బాసటగా నిలువాలన్న సీఎం ఆశయం నుంచి రూపుదిద్దుకున్నదే 'రైతు బీమా పథకం'. తెలంగాణలో కోటి ఎకరాలకు సాగునీరు అందించడం లక్ష్యంగా ప్రభుత్వం గోదావరి, కృష్ణ నదులపై 23 మేజర్, 13 మీడియం ప్రాజెక్టుల నిర్మాణానికి సంకల్పించింది. పాలమూరు ప్రాజెక్టులను శరవేగంగా పూర్తిచేస్తున్నాం. మిషన్ కాకతీయ ద్వారా చెరువుల పునరుద్ధరణ కొనసాగుతున్నది. పంచాయతీ వ్యవస్థ బలోపేతానికి ఈ సమావేశాల్లోనే 'కొత్త పంచాయతీరాజ్ బిల్లు' ప్రవేశపెడుతున్నాం. స్థానిక సంస్థల బలోపేతం కోసం రాష్ట్ర ప్రభుత్వం అందించాల్సిన నిధులపై అధ్యయనం చేసేందుకు కొత్తగా 'తెలంగాణ రాష్ట్ర మొదటి ఫైనాన్స్ కమిషన్'ను నియమించాం.

శాంతిభద్రతలకు బడ్జెట్‌లో భరోసా

- **హోంశాఖకు రూ.5,790 కోట్లు కేటాయింపు**

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: 2018-19 వార్షిక బడ్జెట్‌లో హోం శాఖకు రూ.5,790 కోట్లు కేటాయించి శాంతిభద్రతల పరిరక్షణకు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యమిచ్చింది. గతఏడాది కంటే సుమారు రూ.వెయ్యి కోట్లు అదనంగా కేటాయించింది. నిర్వహణ పద్దు కింద రూ.4,400.66 కోట్లు, ప్రగతి పద్దుగా రూ.1,389.66 కోట్లు కేటాయించింది. రాష్ట్ర రాజధాని హైదరాబాద్ శాంతిభద్రతలపై ప్రత్యేక దృష్టిసారించిన సర్కార్ బడ్జెట్‌లో రూ.574 కోట్లు కేటాయించింది. వీటిలో సిటీ భవనాల్లో కమాండ్ కంట్రోల్ సెంటర్, టెక్నాలజీ కోసం రూ.280.80 కోట్లు కేటాయించారు. భద్రత, అంతర్గత భద్రత, నిఘా, సీసీ కెమెరాలు, టెక్నాలజీకి ప్రత్యేక ప్రాధాన్యం ఇచ్చారు. ట్రాఫిక్, టెక్నాలజీ కోసం రూ.10 కోట్లు, నిఘా విభాగానికి రూ. 30.48 కోట్లు, గ్రేహౌండ్స్‌కు రూ.10.83 కోట్లు, సైబరాబాద్ కమిషనరేట్‌కు రూ.42.97 కోట్లు, ఆక్టోపస్‌కు రూ.15.05 కోట్లు, అంతర్గత సర్వీస్ కోసం రూ.24 కోట్లు, పరిపాలనా ఖర్చులకు రూ.83.40 కోట్లు, శిక్షణకు రూ.10 కోట్లు, దళాల అవసరాల కోసం రూ.86.64 కోట్లు, కొత్త పోలీస్ స్టేషన్ భవనాల కోసం రూ.40 కోట్లు, కమ్యూనికేషన్, టెక్నాలజీ కోసం రూ.50 కోట్లు, పోలీస్‌స్టేషన్ సిటిజన్ ఫ్రెండ్లీ సర్వీస్ యూనిట్ల కోసం రూ.75 కోట్లు, వరంగల్ కొత్త పోలీసు కమిషనరేట్ భవనం కోసం రూ.20 కోట్లు, టెక్నాలజీసాయంతో నేరస్థులపై నిఘా కోసం రూ.25 కోట్లు, సీసీ టీవీ టెక్నాలజీ కోసం రూ.10 కోట్లు, జిల్లా పోలీసు కార్యాలయ సముదాయాల నిర్మాణానికి రూ.486.64 కోట్లు, పోలీసుశాఖ ఆధునీకరణకు రూ.604.86 కోట్లు, ఆయుధాలు, మందుగుండు సామగ్రి కోసం రూ.5 కోట్లు, రైల్వేపోలీసు కోసం రూ.20.50 కోట్లు కేటాయించారు.

జైళ్లశాఖకు రూ.21.26 కోట్లు కేటాయింపు

జైళ్లశాఖకు ఈసారి బడ్జెట్‌లో కూడా రూ.21.26 కోట్లు కేటాయించారు. రాష్ట్రవిపత్తు నిర్వహణ అగ్నిమాపకశాఖకు రూ.14.68 కోట్లు కేటాయించారు. రాష్ట్ర పోలీసుఅకాడమీకి రూ.16 కోట్లు కేటాయించారు. గతఏడాది కూడా ఇంతేమొత్తం ప్రతిపాదించారు.


నిర్మాణంలో పోలీస్ కమాండ్ కంట్రోల్ సెంటర్



సీఎం కేసీఆర్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు

బడ్జెట్ కేటాయింపుల్లో పోలీసుశాఖకు ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రత్యేక స్థానం కల్పించారు. శాంతి భద్రతలపై ప్రత్యేక దృష్టిపెట్టారు. ఇందుకు అనుగుణంగా నిధులు కేటాయిస్తున్న ముఖ్యమంత్రికి ప్రత్యేక కృతజ్ఞతలు. సీఎం లక్ష్యం, ఆశయాలకు అనుగుణంగా టెక్నాలజీ వినియోగంలో, శాంతి భద్రతల పరిరక్షణలో రాష్ట్ర పోలీసుశాఖ దేశంలోనే నంబర్‌వన్ స్థానంలో ఉన్నది. సీఎం ప్రత్యేక చొరువతో భవనాల నిర్మాణం, టెక్నాలజీ, పోలీసు వాహనాలు, కమాండ్ కంట్రోల్ సెంటర్ నిర్మాణం, సిటిజన్ ఫ్రెండ్లీ పోలీసింగ్, భరోసాతో ముందుకు వెళ్తున్నాం.

–డీజీపీ ఎం మహేందర్‌రెడ్డి

ఎన్నారైల సంక్షేమానికి ఎక్కువ నిధులు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఉద్యోగ, ఉపాధి అవకాశాల కోసం విదేశాలకు వలస వెళ్లిన వారి సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దఎత్తున నిధులు కేటాయించింది. తెలంగాణ ఏర్పడకముందు ఎన్నారైశాఖ బడ్జెట్ కేవలం రూ.5కోట్లు ఉండగా, ప్రస్తుత బడ్జెట్‌లో రూ.100కోట్లు ప్రతిపాదించింది. ఎన్నారైశాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన మంత్రి కేటీఆర్..ప్రవాస తెలంగాణీయుల సంక్షేమం కోసం అనేక కార్యక్రమాలు చేట్టారు. ఈసారి బడ్జెట్లో భారీఎత్తున నిధులు కేటాయించడంతో ప్రవాస తెలంగాణవాసుల అభివృద్ధి, సంక్షేమానికి నూతన కార్యక్రమాలను ప్రవేశపెట్టే అవకాశం ఉన్నది. ముఖ్యంగా గల్ఫ్‌లో తెలంగాణవాసుల కష్టాలు తీర్చేందుకు ఈ బడ్జెట్ ఉపయోగపడనున్నది.

మండలి, శాసనసభ సచివాలయానికి 127 కోట్లు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: శాసనమండలి, అసెంబ్లీ సచివాలయానికి ప్రభుత్వం 2018-19 బడ్జెట్‌లో రూ.127 కోట్లు కేటాయించింది. గతేడాది 101.16 కోట్లు కేటాయించగా ఇప్పుడు రూ.127 కోట్లను ప్రతిపాదించింది. శాసనమండలికి రూ. 105.00 కోట్లు, ప్రజాపనులకు రూ.3 కోట్లు, సభ్యుల పింఛన్లు, పదవీవిరమణ ఇతరప్రయోజనాలకు రూ.24 కోట్లని తెలిపింది. మొత్తం రూ.132.00 కోట్లు అవుతుండగా, పైకముల మొత్తం రూ.4.61 కోట్లను అందులోంచి తీసివేస్తే రూ.127 కోట్ల గ్రాంట్ కోసం డిమాండ్ (కోటు చేసినది) చేసింది.

వైద్యారోగ్యం, కుటుంబ సంక్షేమశాఖ–రూ.**7,375.20** కోట్లు
రైతులకు పెట్టుబడి సహాయ పథకం – రూ.**12,000** కోట్లు
మార్కెటింగ్, సహకారశాఖ – రూ.**243.08** కోట్లు
పశుసంవర్ధక, మత్స్యశాఖ – రూ.**1,126.73** కోట్లు
విద్యుత్‌శాఖ – రూ.**4,393.50** కోట్లు
గృహ నిర్మాణశాఖ – రూ.**2,795.15** కోట్లు
పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ – రూ.**7,250.56** కోట్లు
టీఎస్‌ఆర్టీసీ – రూ.**975.55** కోట్లు
రోడ్డు రవాణ, భవనాలశాఖ – రూ.**5,575.23** కోట్లు
మిషన్ భగీరథ – రూ.**1,803.35** కోట్లు
వడ్డీలేని రుణాలు – రూ.**930** కోట్లు



పంచాయతీరాజ్‌కు భారీగా కేటాయింపులు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: 2018–19 వార్షిక బడ్జెట్‌లో రాష్ట్రప్రభుత్వం పంచాయతీలకు పెద్దపీట వేసింది. పంచాయతీలకు నేరుగా నిధులు కేటాయిస్తామని హామీఇచ్చిన ప్రభుత్వం.. అందుకు అనుగుణంగానే బడ్జెట్‌లో కేటాయింపులు చేసింది. పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధిశాఖకు రూ. 15,500 కోట్లు కేటాయించింది. వీటిలో పంచాయతీరాజ్‌శాఖకు 8,929.14 కోట్లు కేటాయించారు. ఈ బడ్జెట్‌లో నిర్వహణపద్దు కింద రూ. 2,727.08 కోట్లు, ప్రగతి పద్దు కింద రూ. 6,202.06 కోట్లు ఉన్నాయి. 2017–18 బడ్జెట్‌తో పోలిస్తే పంచాయతీరాజ్‌శాఖకు రూ.2005 కోట్లు అదనపు కేటాయింపులు జరిగాయి. తెలంగాణ స్టేట్ ఫైనాన్స్ కమిషన్‌ను ఏర్పాటుచేసి, దానికి రూ.1,477 కోట్లు కేటాయించారు.

పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధికి రూ.15,562.84 కోట్లు

పంచాయతీరాజ్‌శాఖకు కేటాయించిన నిధుల్లో పంచాయతీ రాజ్, పంచాయతీరాజ్ ఇంజినీరింగ్, ఆర్‌డబ్ల్యూఎస్, సెర్ప్ విభాగాలున్నాయి. తండాలను పంచాయతీలుగా ఏర్పాటుచేయడం, కొత్త పంచాయతీరాజ్‌చట్టం ఏర్పాటుదిశగా ప్రభుత్వం అడుగులు వేస్తుండడంతో ఈ మేరకు నిధుల కేటాయింపులు పెరిగినట్లు విశ్లేషకులు పేర్కొంటున్నారు. అదేవిధంగా గ్రామీణాభివృద్ధి శాఖకు 6,633.69 కోట్లు కేటాయించారు. వీటిలో ప్రగతి పద్దకింద రూ.6,574 కోట్లు, నిర్వహణ పద్దుకింద రూ.59.69 కోట్లు ఇచ్చారు. గ్రామీణాభివృద్ధిశాఖకు గత ఏడాదితో పోలిస్తే బడ్జెట్‌లో కేటాయింపులు స్వల్పంగా తగ్గాయి.



గురువారం తన నివాసం నుంచి అసెంబ్లీకి బయలుదేరేముందు ఆర్థికమంత్రి ఈటల రాజేందర్‌కు తిలకం దిద్దుతున్న ఆయన సతీమణి జమున. చిత్రంలో రసమయి, శంకర్‌నాయక్, ఈద శంకర్‌రెడ్డి, వకుళాభరణం తదితరులు

సబ్బండవర్గాలకు ప్రాధాన్యం

భవిష్యత్‌లో దేశంలోని అన్ని రాష్ట్రాలు వ్యవసాయ ఆధారిత బడ్జెట్‌ను ప్రవేశపెట్టేందుకు తెలంగాణ బడ్జెట్ దోహదపడుతుంది. సీఎం కేసీఆర్ రైతు పక్షపాతి. ఆయన మనోభావాలకు ఈ బడ్జెట్ అద్దం పడుతున్నది. రైతులను దృష్టిలో పెట్టుకొని విద్యుత్‌రంగానికి రూ.5,650 కోట్లు కేటాయించారు. అభివృద్ధి, సంక్షేమాన్ని సమపాలల్లో రంగరించి రూపొందించిన బడ్జెట్ ఇది. సబ్బండవర్గాల సంక్షేమానికి ఈ బడ్జెట్ దోహదపడుతున్నది. దేశంలో వ్యవసాయానికి ఈ బడ్జెట్ ఒక దిక్సూచి. **- జీ జగదీశ్‌రెడ్డి, విద్యుత్‌శాఖమంత్రి**



నీటిపారుదలశాఖ 25,000 కోట్లు



ఆరోగ్య తెలంగాణ!

వైద్యరంగానికి రూ.7,375 కోట్లు
ప్రజలందరికీ రోగనిర్ధారణ, కంటి పరీక్షలు
సోషియో ఎకనామిక్ సర్వే ప్రశంస

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ప్రభుత్వం చేపట్టిన చర్యలతో ఆరోగ్య తెలంగాణదిశగా మన రాష్ట్రం పయనిస్తున్నది. 2018–19 వార్షిక బడ్జెట్‌లో వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖకు రూ.7,375.20 కోట్లు ప్రతిపాదించింది. గత ఏడాది కంటే రూ.1,579.03 కోట్లు పెరిగాయి. బడ్జెట్లో ఆరోగ్యశ్రీ హెల్త్‌కేర్ ట్రస్ట్‌కు రూ.699.44 కోట్లు, కేసీఆర్ కిట్ల పథకానికి రూ.560.50 కోట్లు, ఉద్యోగులు, జర్నలిస్టుల ఆరోగ్య పథకానికి రూ.300 కోట్లు ప్రకటించారు. రాష్ట్రంలోని 34 సర్కారు దవాఖానల్లో డయాలసిస్ కేంద్రాలను ఏర్పాటుచేసింది. 22 దవాఖానల్లో ఐసీయూలు, 12 చోట్ల క్యాన్సర్ పరీక్షా కేంద్రాలు ఏర్పాటుచేసింది. ఈ ఏడాది నుంచి రాష్ట్రంలోని ప్రతి పౌరునికి ఉచిత వైద్య పరీక్షలు, హెల్త్ ప్రొఫైల్ రూపొందించనున్నది.

ఆయుర్దాయం వృద్ధిరేటులో మూడోస్థానం

సోషియో ఎకనామిక్ సర్వే నివేదికలో తెలంగాణ సర్కారు వైద్యరంగంలో చేపట్టిన చర్యలపై ప్రశంసలు దక్కాయి. ఆయుర్దాయం వృద్ధిరేటులో 21 పెద్దరాష్ట్రాల్లో తెలంగాణకు మూడోస్థానం దక్కింది. కేసీఆర్ కిట్ల పథకం, అమ్మఒడి కార్యక్రమాలతో సర్కారు దవాఖానల్లోనే ప్రసవాలు జరిగి మాతాశిశు మరణాల రేటు తగ్గుముఖం పట్టాయని సర్వేలో వెల్లడించారు. 2016లో దేశవ్యాప్తంగా మరణాల రేటు 6.4శాతం ఉండగా.. రాష్ట్రంలో 6.1 ఉన్నట్టు గుర్తించారు.

సాగుకు రెట్టింపు సాయం

ప్రస్తుత బడ్జెట్‌లో రూ.12,844 కోట్లు.. గతేడాది కేటాయింపులు రూ.5942కోట్లు
రాష్ట్రాభివృద్ధికి కీలకరంగంగా గుర్తింపు.. 2018-19 నుంచి పంట పెట్టుబడి పథకం
ఎకరానికి రూ.8000 చొప్పున సాయం.. రైతు సమన్వయ సమితుల ఏర్పాటు
100 రోజుల్లో పూర్తయిన రికార్డుల ప్రక్షాళన.. త్వరలో ధరణి వెబ్‌సైట్ ప్రారంభం



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్ర అభివృద్ధిలో వ్యవసాయ రంగం కీలకమని భావించిన ప్రభుత్వం వార్షిక బడ్జెట్‌లో అందుకు తగ్గట్టుగా కేటాయింపులు జరిపింది. రాష్ట్ర వ్యవసా యం, సహకార రంగానికి 2018–19 ఆర్థిక సంవత్సరానికి రూ.12,844 కోట్లు కేటాయించింది. ఇది గత బడ్జెట్‌లో పోలిస్తే దాదాపు రెట్టింపు. 2017–18 ఆర్థిక సంవత్సరంలో ఈ కేటాయింపులు రూ.5,942 కోట్లుగా ఉన్నాయి. 2018–19 ఆర్థిక సంవత్సరం నుంచి అమలుచేయనున్న పంట పెట్టుబడి పథకం కోసం 12,000 కోట్లను బడ్జెట్‌లో కేటాయించారు. 2018–19 ఆర్థిక సంవత్సరం నుంచి ఏప్రిల్, నవంబర్ నెలల్లో ఎకరానికి రూ.4వేలు చొప్పున అందిస్తారు.

రైతు బీమాకు రూ.500 కోట్లు

ఇటీవల సీఎం కేసీఆర్ ప్రకటించిన రైతు బీమా పథకం కోసం మరో రూ.500 కోట్లు కేటాయించారు. రైతు కుటుంబానికి జరుగరానిది జరిగి పెద్దదిక్కును కోల్పోతే, వారిని ఆదుకునేందుకు రైతు బీమా పథకాన్ని ప్రకటించారు. ఈ పథకం కింద ప్రతి రైతుకు రూ.5 లక్షల వరకు ఉచితంగా బీమా సౌకర్యం కల్పిస్తారు.

రైతుల సంక్షేమం కోసం అనేక చర్యలు

రైతుల సమగ్రాభివృద్ధికి, సంక్షేమానికి ప్రభుత్వం వివిధ చర్యలు చేపడుతున్నది. పంట పెట్టుబడి అర్హులకు సాయం అందించేందుకు ముందుగా భూరికార్డులను ప్రక్షాళన చేసింది. నిజాం హయాం అనంతరం మరెవరూ ఈ సాహ సం చేయలేదు. వంద రోజుల వ్యవధిలో రాష్ట్రంలోని 10,823 గ్రామాల్లో 1,507 బృందాలు.. 72,13,111 ఖాతాలను పరిశీలించి, రికార్డులను ప్రక్షాళన చేశారు. 96% భూరికార్డులు వివాదరహితంగా ధ్రువీకరించారు. భూరికార్డుల వివరాలతో 'ధరణి' వెబ్‌సైట్ త్వరలో ఆవిష్కారం కానుంది. మరోవైపు వ్యవసాయ, వ్యవసాయేతర భూముల రిజిస్ట్రేషను సులభతరం చేయడానికి రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లేని మండలాల్లో రిజిస్ట్రేషన్ బాధ్యతలను తహసీల్దార్లకు అప్పగించి, రైతులకు వెసులుబాటు కల్పించింది. రైతుల మధ్య ఐక్యతను, సమన్వయాన్ని పెంచే లక్ష్యంతో రైతు సమన్వయ సమితులకు అంకురార్పణ చేసింది. ప్రభుత్వానికి, రైతులకు మధ్య అనుసంధానంగా సమన్వయ సమితి పనిచేస్తుంది. కొనుగోలుదారులతో మాట్లాడి గిట్టుబాటు ధర ఇచ్చేలా కృషిచేస్తుంది. తగిన ధర రాని సమయాల్లో రైతు నుంచి పంటను కొనుగోలు చేస్తుంది. దీనితోపాటు రైతులు పరస్పరం చర్చించుకోవడానికి వీలుగా ప్రతి ఐదువేల ఎకరాలను ఒక క్లస్టర్‌గా విభజించి ప్రతి క్లస్టర్‌లో ఒక రైతు వేదికను ఏర్పాటుచేస్తున్నది.

వ్యవసాయ యాంత్రీకరణకు ప్రోత్సాహం

శ్రమ, ఖర్చు, తద్వారా పెట్టుబడిని తగ్గించే యంత్రాల వినియోగం పెంచేందుకు వాటిని ప్రభుత్వం సబ్సిడీపై అందిస్తున్నది. ఇప్పటికే 50%–90% సబ్సిడీపై రైతులకు 13,934 ట్రాక్టర్లు, 31,274 స్ప్రేయర్లు పంపిణీ చేసింది. నాట్లువేసే యంత్రాలను కూడా సబ్సిడీపై అందించనుంది. దీనికోసం బడ్జెట్‌లో రూ.522 కోట్లు కేటాయించింది. తక్కువనీటితో ఎక్కువ విస్తీర్ణంలో సాగు చేసేందుకు ఉపకరించే బిందు, తుంపర సేద్యాన్ని ప్రోత్సహిస్తున్నది. ప్రస్తుతం 14 లక్షల ఎకరాల్లో ఈ తరహా వ్యవసాయం జరుగుతున్నది. దీన్ని మరో 29 లక్షల ఎకరాలకు విస్తరించాలని లక్ష్యంగా పెట్టుకుంది.

మార్కెటింగ్ సదుపాయాల అభివృద్ధి

తెలంగాణ ఆవిర్భావం తర్వాత మార్కెటింగ్‌శాఖను బలోపేతం చేసేందుకు ప్రభుత్వం అనేక చర్యలు చేపట్టింది. డిమాండ్‌కు అనుగుణంగా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నది. కూరగాయలు, పండ్ల కోసం ప్రత్యేక మార్కెట్లను, వినియోగదారుల సౌకర్యం కోసం సమీకృత మార్కెట్లను, ఆధునిక హంగులతో రైతు బజార్లను నిర్మిస్తున్నది. రహదారుల పక్కన కూరగాయలు అమ్ముకునే వారికోసం సకల సదుపాయాలతో రోడ్‌సైడ్ వెజిటబుల్ మార్కెట్లను నిర్మిస్తున్నది. తెలంగాణ ఏర్పడేనాటికి 4 లక్షల టన్నుల నిల్వ సామర్థ్యం కలిగిన గోదాములు ఉండేవి. ఈ మూడున్నరేండ్లలో కొత్తగా 356 గోదాములు నిర్మించి, నిల్వ సామర్థ్యాన్ని 22.47 లక్షల టన్నులకు పెంచింది. వ్యవసాయ ఉత్పత్తులు ఎక్కువకాలం నిల్వ చేసుకోవడానికి వీలుగా రాష్ట్రవ్యాప్తంగా కోల్డ్ స్టోరేజ్ లింకేజీ ఉండాలని నిర్ణయించిన ప్రభుత్వం..మార్కెటింగ్ శాఖ చేపడుతున్న విస్తరణ, అభివృద్ధి కార్యక్రమాలకోసం ఈ వార్షిక బడ్జెట్‌లో రూ.132 కోట్లు కేటాయించింది.

సంక్షేమం సమున్నతం!

బీసీ, ఎస్సీ, ఎస్టీల ప్రగతికి రూ.33,065.73 కోట్లు కేటాయింపు
ఎంబీసీలకు రూ.వెయ్యికోట్లు.. విద్యాపథకాలకు భారీగా నిధుల పెంపు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: పేదల సంక్షేమానికి తెలంగాణ సర్కారు ప్రత్యేక ప్రాధాన్యం ఇసున్నది. ఆర్థికంగా, సామాజికంగా ఏండ్లతరబడి అభివృద్ధికి నోచుకోని దళిత, గిరిజన, వెనుకబడిన తరగతుల సంక్షేమాభివృద్ధికి ప్రభుత్వం 2018–19 వార్షిక బడ్జెట్‌లో పెద్దపీట వేసింది. బీసీ, ఎస్సీ, ఎస్టీల సంక్షేమం కోసం రూ.33,065.73 కోట్లు ప్రతిపాదించగా.. బీసీలకు రూ.5,919.83 కోట్లు, ఎస్సీలకు రూ.16452.79 కోట్లు, ఎస్టీలకు రూ.9693.11 కోట్లు కేటాయించింది. ఎస్సీ, ఎస్టీ, బీసీలకు గత ఏడాది రూ.28,611.36 కోట్లు కేటాయించగా.. ఈసారి రూ.4,454.37 కోట్ల మేర పెంచారు.



విద్యకు ప్రాధాన్యం!

బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాలు విద్యాపరంగా ప్రగతి సాధించేందుకు ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణను అమలు చేస్తున్నది. గురుకులాల కోసం ఈసారి బడ్జెట్‌లో రూ.2,283 కోట్లు కేటాయించారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు విదేశాల్లో ఉన్నతవిద్యను అభ్యసించేందుకు రూ.20 లక్షలు ఆర్థికసహాయాన్ని అందిస్తున్నది. ఈ పథకం అమలుకు రూ.174.50 కోట్లు కేటాయించారు. విద్యార్థుల స్కాలర్‌షిప్స్, ఫీజు రీయింబర్స్‌మెంట్ కోసం రూ.3282.24 కోట్లు కేటాయించారు.

కులవృత్తులకు ప్రాధాన్యం!

బీసీ వర్గాల్లో ప్రధానంగా కులవృత్తులనే నమ్ముకొని జీవిస్తున్న కుటుంబాలు ఆత్మగౌరవంతో జీవించేందుకు అవకాశాలు కల్పించడంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి నిలిపింది. రజక ఫెడరేషన్‌కు ఈసారి కూడా రూ.200 కోట్లు ప్రత్యేక బడ్జెట్ కేటాయించారు. ఎంబీసీ అభివృద్ధి సంస్థకు ఈ ఏడాది కూడా రూ.1000 కోట్లు కేటాయించారు. దళితులకు మూడెకరాల వ్యవసాయ భూపంపిణీ పథకం అమలుకు రూ.1469 కోట్లు కేటాయించారు. డబుల్ బెడ్రూం ఇండ్ల నిర్మాణానికి పలు మార్గాల్లో రుణాలు తీసుకొంటున్నది. గృహ నిర్మాణానికిగాను ఈ ఏడాది బడ్జెట్‌లో రూ.1,500 కోట్లు కేటాయించారు.

కేటాయింపుల్లో ప్రధానమైనవి

ఫీజురీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్స్‌కు	రూ.3282.24 కోట్లు
ఆర్థిక సహకార పథకాలకు	రూ.1,682.53 కోట్లు
గురుకులాలకు	రూ.2,283 కోట్లు
కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలకు	రూ.1,450.46 కోట్లు
ఎంబీసీ కార్పొరేషన్‌కు	రూ.1,000 కోట్లు
రజక కోఆపరేటివ్ సొసైటీ ఫెడరేషన్	రూ. 200 కోట్లు
ఓవర్సీస్ స్టడీ పథకం	రూ.174.50 కోట్లు
విశ్వబ్రాహ్మణ కోఆపరేటివ్ కార్పొరేషన్	రూ.10 కోట్లు
డబుల్ బెడ్రూం ఇండ్ల నిర్మాణానికి	రూ.1,500 కోట్లు
దళితులకు మూడెకరాల భూపంపిణీకి	రూ.1469 కోట్లు

శాఖలవారీగా	2016-17 రూ.కోట్లలో	2017-18 రూ.కోట్లలో	2018-19 రూ.కోట్లలో	ఈసారి పెరిగింది రూ.కోట్లలో
బీసీ సంక్షేమం	2,537.51	5070.36	5,919.83	849.47
ఎస్సీ ప్రత్యేక అభివృద్ధి నిధి	7,122.21	14,375.12	16452.79	2,077.67
ఎస్టీ ప్రత్యేక అభివృద్ధి నిధి	3752.37	8,165.88	9693.11	1,527.23
ఎంబీసీల కొరకు	———	1000	1000	—–
	13,412.09	**28,611.36**	**33,065.73**	**4,454.37**


తెలంగాణలో బీసీలకు స్వర్ణయుగం



రాష్ట్ర బడ్జెట్‌లో బీసీలకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇచ్చింది. రాష్ట్రంలో బీసీలకు స్వర్ణయుగం వచ్చింది. గతేడాది బీసీ సంక్షేమ బడ్జెట్ రూ.5,070 కోట్లు కాగా ఈసారి రూ.5,920 కోట్లు కేటాయించారు. ఉమ్మడి రాష్ట్రంలో బడ్జెట్ కేటాయింపు రూ.2 వేల కోట్లు దాటలేదు. ఈ బడ్జెట్‌లో ఎంబీసీలకు వెయ్యి కోట్లు, రజక, నాయీ బ్రాహ్మణులకు రూ.450 కోట్లు ప్రతిపాదించారు. సీఎం కేసీఆర్ నాయకత్వంలో రాష్ట్రం బంగారు తెలంగాణ వైపు అడుగులు వేస్తుంది. **-జోగురామన్న, బీసీ సంక్షేమ, అటవీశాఖల మంత్రి**

'డబుల్' ధమాకా

రెండు పడక గదుల ఇండ్లకు రూ. 1,500 కోట్లు
గృహ నిర్మాణశాఖకు రూ.2,795.14 కోట్లు కేటాయింపు



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: నిరుపేదల కోసం ప్రభుత్వం ఉచితంగా నిర్మించి ఇస్తున్న డబుల్ బెడ్‌రూం ఇండ్ల కోసం బడ్జెట్‌లో భారీగా నిధులు కేటాయించింది. ఇప్పటి వరకు పురోగతిలో ఉన్న ఇండ్ల నిర్మాణాలను పూర్తి చేయడమే లక్ష్యంగా ఈ సారి రూ. 1,500 కోట్లను కేటాయించారు. ఇప్పటి వరకు రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటివరకు 2,72,763 డబుల్ బెడ్‌రూం ఇండ్లు మంజూరుచేయగా, 9,552 ఇండ్లను పూర్తి చేసి లబ్ధిదారులకు అప్పగించారు. 1,68,981 ఇండ్లు వివిధ దశల్లో నిర్మాణాల్లోఉన్నాయి. ఈ ఏడాదిలో వీటన్నింటినీ పూర్తి చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం బడ్జెట్‌లో పెద్దపీట వేసింది. బడ్జెట్‌లో డబుల్ బెడ్‌రూం ఇండ్ల కోసం గృహ నిర్మాణశాఖ నిర్వహణ పద్దు రూ.652.04 కోట్లు ఉండగా, ప్రగతి పద్దు 2,143.10 కోట్లు కలిపి మొత్తం రూ.2,795.14 కోట్ల కేటాయించారు.

రాజసంగా రహదారులు

రోడ్లు, భవనాలకు 5,575 కోట్లు.. వంతెనలకు 1804 కోట్లు



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రోడ్లు భవనాలశాఖకు బడ్జెట్‌లో ఆర్థికమంత్రి ఈటల రాజేందర్ రూ.5,575 కోట్లు ప్రతిపాదించారు. రవాణాశాఖకు ప్రగతి పద్దు కింద రూ.21.05 కోట్లు, రోడ్లు,భవనాలశాఖకు ప్రగతి పద్దు కింద 3501.19 కోట్లు కేటాయించారు. రోడ్లపై వంతెనల నిర్మాణాలకు రూ. 1604.93 కోట్లు, మౌలిక వసతుల కల్పనకు రూ.27.24 కోట్లు, గ్రామీణ రోడ్లకు రూ.163.75 కోట్లు, రీజినల్ ఎయిర్‌పోర్టు నెట్‌వర్క్ డెవలప్‌మెంట్ కోసం రూ.27.24 కోట్లు, గృహనిర్మాణం, రహదారుల మరమ్మతుల కోసం రూ.1123.12 కోట్లు, కొత్త కలెక్టరేట్లకు రూ.500 కోట్లు ప్రతిపాదించారు. 26 జిల్లా కేంద్రాల్లో కలెక్టరేట్లు, 13 చోట్ల పోలీస్ కార్యాలయాలు నిర్మాణంలో ఉన్నాయి. అసెంబ్లీ నియోజకవర్గంలో ఎమ్మెల్యేలకు కార్యాలయాలను రూ.కోటి అంచనా వ్యయంతో 32 చోట్ల నిర్మిస్తున్నారు. రాష్ట్రం ఏర్పడిన తర్వాత రోడ్లు భవనాల శాఖ పరిధిలో 24,950 కిలోమీటర్లు, పంచాయతీరాజ్ పరిధిలో 69,500 కిలోమీటర్ల రహదారులను అభివృద్ధిచేశారు. అన్ని మండల కేంద్రాలు, జిల్లా కేంద్రాల మధ్య డబుల్‌లేన్ రోడ్లు నిర్మిస్తున్నారు.

కడుపునిండా బువ్వ


- రేషన్ బియ్యం కోసం రూ.1833.60 కోట్లు
- రూపాయికి కిలో బియ్యానికి పెరిగిన నిధులు
- పౌరసరఫరాలశాఖకు 2,946 కోట్ల కేటాయింపు



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: పేదల కడుపు నింపే రూపాయికి కిలో బియ్యం పథకానికి ప్రభుత్వం బడ్జెట్‌లో నిధులను పెంచింది. రేషన్‌బియ్యం కోసం గతేడాది రూ.1,575.24 కోట్లు కేటాయించగా ఈసారి రూ.1,833.60 కోట్లను మంత్రి ఈటల ప్రతిపాదించారు. పౌరసరఫరాలశాఖకు గత బడ్జెట్‌లో రూ.1732.68 కోట్లు కేటాయించగా, ఈ సారి రూ.2946 కోట్లను ప్రతిపాదించారు. రేషన్‌కార్డులు పెరిగే అవకాశం ఉండటం, రాష్ట్రవ్యాప్తంగా ఎక్కడినుంచైనా రేషన్ సరుకులు తీసుకొనే అవకాశం కల్పిస్తుండటంతో పేదల బియ్యానికి లోటురాకుండా ఉండేందుకు నిధులను పెంచారు. రాష్ట్రంలో ఇప్పటివరకు 17,027 రేషన్ దుకాణాల ద్వారా రేషన్ సరుకులు అందిస్తున్న ప్రభుత్వం.. ఈ పాస్ మెషిన్ల ఏర్పాటుతో వల్ల లబ్ధిదారులకు మేలు జరిగింది. ఎక్కడినుంచైనా రేషన్ సరుకులు తీసుకొనే విధానాన్ని ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలో ప్రయోగాత్మకంగా చేపట్టారు. వచ్చేనెల నుంచి రాష్ట్రవ్యాప్తంగా అమలు చేయబోతున్నారు. తెల్లరేషన్ కార్డులు, అంత్యోదయకార్డులకు రేషన్ బియ్య సబ్సిడీ కోసం ప్రభుత్వం నిధులు కేటాయించింది. నిర్వహణ పద్దుకు రూ.86 కోట్లు కేటాయించారు. పౌరసరఫరాల్లోని లీగల్ మెట్రాలజీ విభాగానికి రూ.57.30 కోట్లు, వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్‌కు రూ.కోటి కేటాయించారు. గ్రామీణ ప్రాంతాల్లో మహిళలకు కష్టాలు రాకుండా రూ.50 కోట్లు కేటాయించారు. వినియోగదారుల సంక్షేమనిధిని యథావిధిగా కొనసాగించనున్నారు. తెలంగాణ గ్రామీణ అభివృద్ధి పథకం కింద ప్రజాపంపిణీ వ్యవస్థను నిర్వహించేందుకు రూ.47.91 కోట్లు వెచ్చించనున్నారు. ధాన్యం కొనుగోళ్లను యథావిదిగా కొనసాగించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నది. ఈ ఏడాది కూడా రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేయనున్నారు. ఆన్‌లైన్‌లో రైతులకు ధాన్యం చెల్లింపులు చేయనున్నారు. వానకాలంలో ఎన్నడూలేనంతగా 5,217 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటుచేసి 11 లక్షలమంది రైతుల నుంచి 53.67 లక్షల టన్నుల ధాన్యాన్ని కొనుగోలుచేశారు. ఈ ధాన్యానికి రూ.8,100 కోట్లు ఖర్చుచేశారు. ఈసారి కూడా ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా రైతులకు మద్దతుధర చెల్లించి కొనుగోలు చేయనున్నారు.

మైనారిటీల్లో వెలుగులే లక్ష్యం

- మైనారిటీల సంక్షేమానికి రూ.2 వేలకోట్లు
- గత ఏడాదితో పోలిస్తే పెరిగిన రూ.750 కోట్లు



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: మైనారిటీల సర్వతోముఖాభివృద్ధే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌లో భారీగా నిధులు కేటాయించింది. 70 ఏండ్లపాలనలో ఎన్నడూలేనివిధంగా 2018–19 వార్షిక బడ్జెట్‌లో మైనారిటీ సంక్షేమానికి రూ.2,000 కోట్లు కేటాయించింది. గత వార్షిక బడ్జెట్‌తో పోలిస్తే రూ.750.51 కోట్లు అదనంగా ప్రతిపాదించింది. నాలుగేండ్లలో మైనారిటీల సంక్షేమానికి సుమారు వెయ్యి కోట్ల నిధులు పెరిగాయి. 206 మైనారిటీ గురుకులాలకు బడ్జెట్‌లో రూ.735 కోట్లు కేటాయించింది. గతబడ్జెట్‌లో రూ.425 కోట్లు ఇవ్వగా, ఈసారి రూ.310 కోట్లు అదనంగా పెంచింది. షాదీముబారక్, కల్యాణలక్ష్మి పథకానికి బ్రడ్జెట్‌లో రూ.1450 కోట్లు కేటాయించింది. షాదీముబారక్ ద్వారా నాలుగేండ్లలో 78,003 మందికి ప్రభుత్వం రూ.1,625 కోట్ల వరకు ఖర్చుపెట్టింది. ఐదువేల మసీదుల్లో ప్రార్థనలు చేయించే ఇమామ్‌లు, మసీదుల పర్యవేక్షకులుగా ఉండే మౌజన్లు మొత్తం 8,934 మందికి నెలకు రూ.1500 భృతిని అందిస్తున్నది. ముస్లిం అనాథ పిల్లలకు ఆశ్రయం కల్పిస్తున్న నాంపల్లిలోని అనీసుల్ గుర్బాకు 4300 చదరపు గజాల స్థలంతోపాటు అధునాతన భవన నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.20 కోట్లు కేటాయించింది. అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో హైదరాబాద్‌లో ఇస్లామిక్ సెంటర్–కమ్–కన్వెన్షన్ హాల్ నిర్మాణానికి కోకాపేటలో 10 ఎకరాల స్థలాన్ని కేటాయించింది.

టీఆర్‌ఎస్ పాలనలో మైనారిటీ సంక్షేమానికి కేటాయింపులు

ఆర్థిక సంవత్సరం	నిధుల కేటాయింపు
2015–16	రూ.1130.36 కోట్లు
2016–17	రూ.1204.00 కోట్లు
2017–18	రూ.1249.00 కోట్లు
2018–19	రూ.2000.00 కోట్లు

రెట్టింపైన మైనారిటీల బడ్జెట్



రాష్ట్ర బడ్జెట్‌లో మైనారిటీ సంక్షేమానికి నిధులు రెట్టింపుస్థాయిలో పెంచడాన్ని ఎంఐఎం తరపున స్వాగతిస్తున్నాం. రాష్ట్రం ఏర్పడిన నాటినుంచి ఇప్పటివరకు సీఎం కేసీఆర్ మైనారిటీల సంక్షేమంపై శ్రద్ధ తీసుకుంటున్నారనడానికి బడ్జెట్ కేటాయింపులే నిదర్శనం. **- అక్బరుద్దీన్ ఒవైసీ, ఎంఐఎం శాసనసభాపక్ష నేత**

మైనారిటీలకు భారీ కేటాయింపులపై హర్షం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్ర బడ్జెట్‌లో మైనారిటీల సంక్షేమానికి రూ.2 వేలకోట్లు కేటాయించడంపై టీఆర్‌ఎస్ పార్టీ మైనారిటీ నాయకులు గురువారం హర్షం వ్యక్తంచేశారు. టీఆర్‌ఎస్ మైనారిటీ నేతలు షర్ఫుద్దీన్, భద్రుద్దీన్ ఆధ్వర్యంలో కొందరు డిప్యూటీ సీఎం మహమూద్ అలీ నివాసానికి వెళ్లి ఆయనకు స్వీట్లు తినిపించారు. నాంపల్లిలో మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ కార్యాలయం వద్ద ఆ సంస్థ చైర్మన్ సయ్యద్ అక్బర్‌హుస్సేన్, తెలంగాణ హజ్ కమిటీ చైర్మన్ మహ్మద్ మసీఉల్లాఖాన్ పార్టీ నేతలతో కలిసి స్వీట్లు పంచిపెట్టారు.



డిప్యూటీ సీఎం మహమూద్ అలీకి మిఠాయి తినిపిస్తున్న టీఆర్‌ఎస్ మైనారిటీ నేతలు

ఈటలను కలిసిన అక్బర్‌హుస్సేన్

మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ సయ్యద్ అక్బర్‌హుస్సేన్ టీఆర్‌ఎస్ మైనారిటీ నేతలతో కలిసి గురువారం ఆర్థికమంత్రి ఈటల రాజేందర్‌ను ఆయన చాంబర్‌లో కలిశారు. శాసనసభలో బడ్జెట్‌ను ప్రవేశపెట్టడానికి బయలుదేరే ముందు ఈటల చేతికి ఇమామే జామీన్ కట్టారు.

ఆర్థికశాఖ	-	రూ.30,802.15 కోట్లు
ప్రణాళికశాఖ	-	రూ.3,060.46 కోట్లు
రెవెన్యూశాఖ	-	రూ.2,468.49 కోట్లు
ఉన్నతవిద్యాశాఖ	-	రూ.2,447.88 కోట్లు
పౌరసరఫరాలశాఖ	-	రూ. 1,920.99 కోట్లు
పరిశ్రమలు	-	రూ.1,285.72 కోట్లు
న్యాయశాఖ	-	రూ.894.22 కోట్లు
కార్మిక, ఉపాధికల్పనశాఖ	-	రూ. 596.33 కోట్లు
అటవీ, పర్యావరణ	-	రూ.349.55 కోట్లు
ఐటీశాఖ	-	రూ.289.20 కోట్లు
శాసనసభా వ్యవహారాలు	-	రూ.132.01 కోట్లు
మౌలిక సదుపాయాలు, పెట్టుబడులశాఖ	-	రూ.29.79 కోట్లు


అసెంబ్లీలో బడ్జెట్ పత్రాలను పరిశీలిస్తున్న ఐటీశాఖ మంత్రి కే తారకరామారావు. చిత్రంలో విద్యుత్‌శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి ఉన్నారు.


అసెంబ్లీలో స్పీకర్ మధుసూదనాచారిని కలిసి బడ్జెట్ పత్రాలు అందజేస్తున్న ఆర్థికశాఖమంత్రి ఈటల రాజేందర్. చిత్రంలో ఎమ్మెల్యేలు రసమయి బాలకిషన్, గంగుల కమలాకర్, శ్రీనివాస్‌గౌడ్, ఐడీసీ చైర్మన్ ఈద శంకర్‌రెడ్డి తదితరులు ఉన్నారు



బంగారు తెలంగాణకు బడ్జెట్ హామీ



బంగారు తెలంగాణ సాధనకు బడ్జెట్ హామీ ఇచ్చింది. రాష్ట్రంలోని అన్నివర్గాల అభివృద్ధికి కేటాయింపులున్నాయి. తెలంగాణ అభివృద్ధి చిత్రాన్ని ఈ బడ్జెట్ ఆవిష్కరించింది. యాదాద్రి దేవాలయం బృహత్ప్రణాళికలను వేగవంతం చేసేందుకు ఈ ఏడాది రూ.250 కోట్లు కేటాయించారు. డబుల్‌బెడ్‌రూంల ఇండ్ల నిర్మాణానికి రూ.1500 కోట్లు కేటాయించి వాటిపై ప్రభుత్వానికి ఉన్న శ్రద్ధను మరోసారి తెలియజెప్పింది.

- అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి, దేవాదాయశాఖ మంత్రి

హోంశాఖ కేటాయింపులు

5,790.35 కోట్లు

సబ్బండవర్గాలకు ప్రాధాన్యం




హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ప్రజల ఆకాంక్షలు నెరవేర్చేలా బడ్జెట్ ఉన్నది. ప్రభుత్వానికి బడుగు, బలహీనవర్గాల సంక్షేమంపై ఉన్న చిత్తశుద్ధిని ఇది అద్దం పట్టింది. మైనారిటీల అభివృద్ధికి ప్రభుత్వం ఎంత నిబద్ధతతో పనిచేస్తుందో చెప్పడానికి బడ్జెట్ కేటాయింపులే నిదర్శనం. **– కొప్పుల ఈశ్వర్, చీఫ్ విప్– భూపాల్‌రెడ్డి, ఎమ్మెల్యే**



గ్రామీణ ఆర్థికవ్యవస్థ, రైతు సంక్షేమానికి బడ్జెట్ పెద్దపీట వేసింది. భద్రాచలం రామాలయ అభివృద్ధికి రూ.100కోట్లు కేటాయించినందుకు సీఎం కేసీఆర్‌కు ధన్యవాదాలు.
– జలగం వెంకటరావు, ఎమ్మెల్యే, కొత్తగూడెం




ఇది పేదల బడ్జెట్. ఇందులో అన్నివర్గాల అభివృద్ధి కనిపించింది. నీళ్లు, నిధులు, ఉద్యోగాలకు పెద్దపీట వేశాం. ఇతర రాష్ర్టాలకు తెలంగాణ రోల్‌మోడల్‌గా నిలుస్తున్నది. సంక్షేమానికి ప్రాధాన్యత ఇచ్చిన సీఎం కేసీఆర్‌కు ధన్యవాదాలు.
– శ్రీనివాస్‌గౌడ్, ఎమ్మెల్యే



బడ్జెట్‌లో రైతులకు, సంక్షేమవర్గాలకు అధిక ప్రాధాన్యం ఇచ్చారు. అన్నివర్గాల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి చేస్తున్నదని ఈ బడ్జెట్‌లో తేలింది. ప్రతిపక్షాలు కూడా ఈ బడ్జెట్‌ను మెచ్చుకుంటున్నాయి. **– గణేశ్ గుప్తా, ఎమ్మెల్యే**



గతంలో బడ్జెట్ కేటాయింపులపై పెదవి విరుపు ఉండేది. ప్రస్తుతం అటువంటి పరిస్థితి లేదు. ప్రకటించిన పథకాలన్నింటికీ నిధులు కేటాయించాం. **– కర్నె ప్రభాకర్, ఎమ్మెల్సీ**



నిధుల కేటాయింపుల్లో గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసేలా ప్రాధాన్యం ఇచ్చారు. వ్యవసాయరంగానికి భారీగా నిధులు కేటాయించారు.
– నారదాసు లక్ష్మణరావు, ఎమ్మెల్సీ



ఎన్‌ఆర్‌ఐల కోసం రాష్ట్ర బడ్జెట్లో రూ.100 కోట్లు కేటాయించడం చరిత్రాత్మకం. సీఎం కేసీఆర్, మంత్రులు ఈటల రాజేందర్, కేటీఆర్, ఎంపీ కల్వకుంట్ల కవితకు ధన్యవాదాలు. గల్ఫ్ బాధితులకు అండగా నిలువాలని మంత్రి కేటీఆర్‌కు రెండురోజుల కిందట విన్నవించా. నిధుల కేటాయింపు హర్షణీయం. **– బాజిరెడ్డి గోవర్ధన్, ఎమ్మెల్యే**



అత్యంత వెనుకబడిన తరగతుల కులాల అభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టింది. బీసీ బడ్జెట్‌ను చూస్తే సీఎం కేసీఆర్ హయాంలో ఇది బీసీ నామ సంవత్సరం అనిపిస్తున్నది. ఎంబీసీల్లోని సంచార కులాల ప్రగతికి ప్రభుత్వం రూ.వెయ్యికోట్లు కేటాయించడం హర్షణీయం.
– తాడూరి శ్రీనివాస్, ఎంబీసీ కార్పొరేషన్ చైర్మన్



బడ్జెట్‌లో వ్యవసాయరంగానికి ఎక్కువ నిధులు కేటాయించడం హర్షణీయం. విళంబి కొత్త సంవత్సరానికి ముందుగా ప్రవేశపెట్టిన బడ్జెట్ ఉగాది నుంచి తెలంగాణలో కొత్త వెలుగులు వస్తాయని హామీ ఇస్తున్నది.
– దేవీప్రసాద్, బేవరేజెస్ కార్పొరేషన్ చైర్మన్



ఉద్యోగుల సంక్షేమం కోసం రూ.1030 కోట్లు కేటాయించడం సంతోషదాయకం. ఉద్యోగసంఘాల జేఏసీ తరపున సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞతలు. ఈ బడ్జెట్ ఉద్యోగుల సమస్యలన్నీ పరిష్కారమవుతాయని హామీ ఇస్తున్నది.
– కారం రవీందర్‌రెడ్డి, టీఎన్జీవో అధ్యక్షుడు



బీసీల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని అధిక మొత్తంలో బడ్జెట్ కేటాయించిన సీఎం కేసీఆర్, మంత్రి ఈటల రాజేందర్‌కు కృతజ్ఞతలు. **– కొండూరి సత్యనారాయణ, తెలంగాణ రజక సంఘాల సమన్వయ సమితి అధ్యక్షుడు**

సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను సమన్వయం చేస్తూ రూపొందించిన బడ్జెట్ ఇది. పరిశ్రమలశాఖకు కేటాయింపులు పెంచడం వల్ల రాయితీలు త్వరగా యాజమాన్యాలకు అందే అవకాశముంటుంది.
– గౌర శ్రీనివాస్, ఎఫ్‌టాప్సీ అధ్యక్షుడు

టీఆర్‌ఎస్ సర్కారు బీసీల సంక్షేమానికి ప్రత్యేక ప్రాధాన్యమిస్తున్నది. ఎన్నడూ లేనంతగా ఈ ఏడాది రూ.5,919 కోట్లు కేటాయించడం హర్షణీయం.
– గడ్డం సాయికిరణ్, ఎంబీసీ సంక్షేమ సంఘం కన్వీనర్

దేవాదాయశాఖలో పనిచేస్తున్న అర్చకులకు, ఉద్యోగులకు పీఆర్సీ -2015 చెల్లించేలా బడ్జెట్‌లో రూ.72 కోట్లు కేటాయించడం సంతోషకరం. సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞతలు. దేవాదాయశాఖలోని ఐదు వేలమంది ఉద్యోగులకు పీఆర్సీ అమలులోకి వస్తున్నది. **– జీ రమేశ్, తెలంగాణ దేవాదాయశాఖ అర్చక ఉద్యోగసంఘాల జేఏసీ చైర్మన్, చించాపట్టణం రంగాచార్యులు, వైస్ చైర్మన్**

ఉద్యోగులు, జర్నలిస్టుల హెల్త్‌స్కీంలు యథాతథం

మొదటిపేజీ తరువాయి...

ఎంప్లాయిస్-పెన్షనర్లు, జర్నలిస్టుల హెల్త్‌స్కీం ప్రస్తుత తరహాలోనే కొనసాగుతాయని, ఎలాంటి మార్పు ఉండదని తెలిపింది. ఎంప్లాయిస్-పెన్షనర్లు, జర్నలిస్టుల హెల్త్‌స్కీం నిర్వహణకు కావల్సిన ఉద్యోగులను నియమించడానికి బుధవారం నాటి క్యాబినెట్ సమావేశం ఆమోదముద్ర వేసిందని సీఎంవో పేర్కొన్నది. రాష్ట్రంలోని ఉద్యోగులు, పెన్షనర్లు, జర్నలిస్టులకు ఉద్దేశించిన హెల్త్‌స్కీం మరింత సమర్థవంతంగా నిర్వహిస్తామని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సీ లక్ష్మారెడ్డి తెలిపారు. ఉద్యోగులు, జర్నలిస్టుల హెల్త్‌స్కీం కోసం ప్రభుత్వం ఈ ఏడాది బడ్జెట్‌లో రూ.300 కోట్లు కేటాయించినట్టు ఆయన పేర్కొన్నారు. ఆరోగ్యశ్రీ పరిధిలో కాకుండా ఈజేహెచ్‌ఎస్ పథకాన్ని స్వతంత్రంగానే నిర్వహించనున్నట్టు మంత్రి వివరించారు.

మరింత మెరుగైన సేవలు: ఎమ్మెల్యే శ్రీనివాస్‌గౌడ్

ఎంప్లాయిస్ హెల్త్‌స్కీం, జర్నలిస్టుల హెల్త్‌స్కీం బ్రహ్మాండంగా, మరింత మెరుగైన సేవలతో కొనసాగుతుందని టీఎన్జీవో గౌరవ అధ్యక్షుడు, ఎమ్మెల్యే శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, ఈ స్కీంపై ఎలాంటి అపోహలు వద్దని తెలిపారు. భవిష్యత్తులో కూడా ఎలాంటి మార్పు లేకుండా మరింత మెరుగైన సేవలతో పథకం కొనసాగుతుందని పేర్కొన్నారు.

బీడు భూముల్లో జల సవ్వడి!

ఐదోసారి బడ్జెట్‌లోనూ సాగునీటిరంగానికి పెద్దపీట • నీటిపారుదలశాఖకు రూ.25వేల కోట్లు


బడ్జెట్‌లో 14 శాతానికిపైగా కేటాయింపులు • 2017-18లో రికార్డుస్థాయిలో ఇప్పటికే రూ.20వేల కోట్లు దాటిన వ్యయం

తాజా కేటాయింపుల్లో అత్యధికంగా కాళేశ్వరానికి రూ.6,094.41 కోట్లు

చిన్న నీటి వనరుల పూర్వ వైభవానికి రూ.2,743.65 కోట్లు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

పాత పాలమూరు జిల్లాలోని ఆన్‌గోయింగ్ ప్రాజెక్టుల ద్వారా ఈ ఏడాది 8 లక్షల ఎకరాలకు సాగునీరు.. దేశ సాగునీటిరంగ చరిత్రలోనే నూతన ఒరవడికి శ్రీకారం చుట్టిన కాళేశ్వరం ఎత్తిపోతల పథకంతో ఈ వానాకాలానికి గోదావరిజలాలను ఎత్తిపోయడం.. సాగునీటిరంగంలో రాష్ట్ర రైతాంగం అందుకుంటున్న ఫలాలకు ఇవి మచ్చు తునకలు. ప్రాజెక్టులంటే సర్వేలు, డిజైన్లు అంటూ దశాబ్దాలు కాలయాపన చేయడం కాదు .. కంటిమీద కునుకులేకుండా శ్రమిస్తే రెండు, మూడేండ్ల లోనే నదీజలాలను బీడు భూముల్లోకి పారించవచ్చని ప్రభుత్వం నిరూపించింది. కోటి ఎకరాల సంకల్పాన్ని తీసుకున్న సీఎం కేసీఆర్.. అంతే చిత్తశుద్ధితో బడ్జెట్ కేటాయింపుల్లో సాగునీటి రంగానికి ఇస్తున్న ప్రాధాన్యాన్ని ఈ ఏడాదీ కొనసాగించారు. రాష్ట్ర బడ్జెట్‌లో దాదాపు 14 శాతానికి పైగా.. అంటే రూ.25వేల కోట్లను నీటిపారుదలశాఖకు కేటాయించారు. 2016లో అసోచామ్.. 2017లో పీఆర్‌ఎస్ లెజిస్లేటివ్ రిసెర్చ్ సర్వేల్లో వెల్లడైనట్టుగా దేశంలో సాగునీటిరంగానికి పెద్దపీట వేస్తున్న రాష్ట్రంగా తెలంగాణ మరోసారి ఘనతను నిలబెట్టుకున్నది. కనీవినీ ఎరుగనిరీతిలో తాజా ఆర్థిక సంవత్సరంలో సాగునీటి ప్రాజెక్టులపై ఏకంగా రూ.20వేల కోట్లకు పైగా నిధులను వెచ్చించాలనుకోవడం మరో రికార్డు.



కోటి ఎకరాల స్వప్నం సాకారం దిశగా..

స్వీయపాలనలో కృష్ణా, గోదావరి జలాలు ఇప్పటికే లక్షల ఎకరాల్లోని బీడు భూములకు జీవం పోయగా.. సీఎం కేసీఆర్ సంకల్పించినట్టు కోటి ఎకరాల స్వప్నాన్ని సాకారం చేసుకునే దిశగా సాగునీటిరంగం పరుగులు పెడుతున్నది. భారీ ప్రాజెక్టులు మొదలు మారుమూల పల్లెల్లోని చెరువుల వరకు అన్నదాతకు అండగా నిలిచేలా జలభాండాగారాలుగా తయారుచేసేందుకు ప్రభుత్వం చేపడుతున్న పనులు శరవేగంగా సాగుతున్నాయి. సీఎం కేసీఆర్ మొదటినుంచీ చెప్తున్నట్లు ప్రతి సంవత్సరం ఈ రంగానికి రూ.25వేల కోట్ల కేటాయింపులు చేపడుతుండటం.. నీటిపారుదలశాఖ మంత్రి హరీశ్‌రావు రేయింబవళ్లు సమీక్షలు, క్షేత్రస్థాయి తనిఖీలతో పర్యవేక్షిస్తుండటం ఫలితంగా ఆన్‌గోయింగ్ ప్రాజెక్టులే కాకుండా కొత్త ప్రాజెక్టులు సైతం అందుబాటులోకి వస్తున్నాయి. ఈ ఆర్థిక సంవత్సరంలో కాళేశ్వరం ఎత్తిపోతల పథకం నుంచి గోదావరి జలాలను ఎత్తిపోసేందుకు సిద్ధమవుతుండటం, పాలమూరు-రంగారెడ్డి, డిండి, సీతారామ వంటి ఎత్తిపోతల పథకాల పనులు కీలక దశకు చేరుకోవడంతో కీలకంగా మారింది. అందుకే 2018-19 ఆర్థిక సంవత్సరంలో రూ.25వేల కోట్లు కేటాయించింది.

రాష్ట్రంలోని ప్రధాన ప్రాజెక్టులకు 2016-17 నుంచి 2018-19 వరకు బడ్జెట్ కేటాయింపుల వివరాలు

ప్రాజెక్టు	కేటాయించిన నిధులు (అంకెలు రూ.కోట్లల్లో...)			
	2016-17	2017-18	2017-18 (సవరణ)	2018-19
పాలమూరు-రంగారెడ్డి	7,860.88	4,000.00	1,660.45	3,035.10
కాళేశ్వరం ఎత్తిపోతల	6,286.00	6,681.87	8,298.11	6,094.41
ఎస్సెల్బీసీ-ఏఎమ్మార్పీ	918.10	899.50	652.85	700.00
డిండి ఎత్తిపోతల పథకం	500.00	500.00	301.36	1,349.79
సీతారామ ఎత్తిపోతల	1,028.02	981.00	380.00	1,225.01
దేవాదుల ఎత్తిపోతల	695.00	1,499.00	1,373.86	1,966.46
ప్రాణహిత	685.30	775.44	220.00	350.00
వరద కాలువ	505.27	799.30	890.59	689.93
సాగర్ ఆధునీకరణ	448.25	467.59	488.17	197.30
ఎల్లంపల్లి	350.00	397.97	150.00	300.00
కల్వకుర్తి	300.00	999.00	370.00	500.00
ఎస్సారెస్పీ-1	270.83	190.00	190.00	200.00
ఎస్సారెస్పీ-2	36.00	150.00	118.86	200.00
తుపాకులగూడెం	200.00	505.00	120.00	500.00
నెట్టెంపాడు	125.00	234.10	70.00	200.00
భీమా	125.00	200.00	118.00	170.00
దిగువ పెనుగంగ	124.69	360.00	200.00	250.00
జూరాల	100.00	50.00	25.00	45.00
కోయిల్‌సాగర్	59.71	197.36	20.00	120.00
ఆర్డీఎస్	14.00	20.00	28,82	144.50

(కేటాయింపులు రూ. కోట్లలో)
కడెం-159.54, మోదికుంటవాగు-111.50, నిజాంసాగర్-110.10, కుమ్రం భీం-100, సింగూరు-50, లెండి-40, సంగంబండ -9, నల్లవాగు-10, పాలెంవాగు-20, సుద్దవాగు-4.90, స్వర్ణ-16, మత్తడివాగు-6, ఎన్టీఆర్‌సాగర్-10, ఘణపూర్-40, శనిగరం-82.40, జగన్నాథపూర్-50, మూసీ-25, ఆసిఫ్‌నహర్-25.

దశాబ్దకాలంగా తెలంగాణ ప్రాజెక్టులకు బడ్జెట్ కేటాయింపులు - వ్యయం చేసిన మొత్తం పరిశీలిస్తే.. (రూ.కోట్లలో)

సంవత్సరం	బడ్జెట్ కేటాయింపు	వ్యయం
2007-08	4,908.23	4,586.10
2008-09	5,612.75	3,186.37
2009-10	6,523.34	4,379.51
2010-11	5,347.58	3,559.45
2011-12	5,347.58	3,914.62
2012-13	5,002.34	5,047.45
2013-14	3,849.89	4,738.06
2014-15	7,426.64	6,000.00 (సుమారు)
2015-16	10,933.57	6,500.00
2016-17 (సవరణ)	16,543.81	14,918.00
2017-18	25,008.69 20,040.04 (సవరణ)	20,051.20 (ఈనెల 14వ తేదీ నాటికి)

రికార్డుస్థాయిలో వ్యయం

నీటిపారుదలశాఖ మంత్రి హరీశ్‌రావు అన్ని ప్రాజెక్టుల పనులు వేగంగా జరిగేందుకు అహర్నిశలు కృషిచేస్తుండటంతో రికార్డుస్థాయిలో నిధులు సద్వినియోగమవుతున్నాయి. ఉమ్మడి రాష్ట్రంలో 23 జిల్లాల్లోని ప్రాజెక్టులకు ఏటా రూ.పదివేల కోట్లు కూడా సరిగ్గా వెచ్చించలేకపోయేవారు. ఇప్పుడు మూడు షిఫ్టుల్లో 24 గంటలపాటు జరుగుతున్న పనులతో నెలల వ్యవధిలోనే సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణ ముఖచిత్రాలు మారిపోతున్నాయి. 2017-18 ఆర్థిక సంవత్సరంలో నీటిపారుదల శాఖ వ్యయం రూ.20వేల కోట్లను దాటడమనేది దేశంలోనే ఒక రికార్డు. ఈ నెల 14వ తేదీ అధికారిక లెక్కల ప్రకారం నీటిపారుదలశాఖ ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.20,051.20 కోట్ల మేర నిధులను ఖర్చుచేసింది. ఇందులో సుమారు రూ.6880 కోట్ల వరకు బిల్లుల చెల్లింపు పెండింగులో ఉన్నది. వ్యయాల్లో అత్యధికంగా కాళేశ్వరం ఎత్తిపోతల పథకానికి రూ.13వేల కోట్లకుపైగా ఖర్చు చేశారు. కాళేశ్వరం ఎత్తిపోతల పథకం కార్పొరేషన్ నుంచి బ్యాంకు రుణా ల ద్వారా రూ.9వేల కోట్లకుపైగా బిల్లులు చెల్లించారు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి కూడా ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.1600 కోట్లకు పైగా ఖర్చుచేశారు. ఇలా ఈ ఆర్థిక సంవత్సరం భారీ సాగునీటి ప్రాజెక్టులకు రూ.18,606.14 కోట్లు ఖర్చు చేయగా, చిన్ననీటిపారుదల కింద రాష్ట్రంలో రూ.1298.82 కోట్లు ఖర్చు చేశారు.

గత మూడేండ్లలో నీటిపారుదలశాఖకు కేటాయింపుల తీరు..

ప్రాజెక్టులు	2015-16	2016-17 (సవరణ)	2017-18	2018-19
భారీ, మధ్యతరహా ప్రాజెక్టులు	9,488.13	14,320.15	22,365.55	21,890.87
చిన్న నీటిపారుదల	1,366.33	1,944.52	2,318.66	2,743.65
కమాండ్ ఏరియా డెవలప్‌మెంట్	13.28	30.14	220.88	251.00
వరదల నియంత్రణ	65.84	249.00	103.60	114.48
మొత్తం	10,933.57	16,543.81	25,008.69	25,000.00


అన్నింటికీ ప్రాధాన్యం

కేటాయింపుల్లో అన్ని ప్రధాన ప్రాజెక్టులకూ సముచిత ప్రాధాన్యం దక్కింది. కాళేశ్వరం ఎత్తిపోతల పథకానికి అత్యధికంగా రూ.6,094.41కోట్లు, పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతలకు రూ.3,035.10 కోట్లు కేటాయించారు. ఖమ్మం జిల్లాలోని సీతారామ, డిండి ఎత్తిపోతల పథకం, ఎస్సెల్బీసీకి సముచిత కేటాయింపులు దక్కాయి. గోదావరిపై కడుతున్న దేవాదుల, శ్రీరాంసాగర్-1, 2, వరదకాల్వ, తుపాకులగూడెం బ్యారేజీ వంటి ప్రాజెక్టులకు తగిన నిధులు కేటాయించింది. పాత పాలమూరు జిల్లాలోని కల్వకుర్తి, నెట్టెంపాడు, భీమా, కోయిల్‌సాగర్ వంటి ఆన్‌గోయింగ్ ప్రాజెక్టుల ద్వారా ఈ ఏడాది 8 లక్షల ఎకరాలకు సాగునీరు అందించనున్నందున ప్రత్యేక దృష్టి సారించింది. ఆర్డీఎస్ ఆయకట్టు రైతుల వెతలు తీర్చేందుకు చేపడుతున్న తుమ్మిళ్ల పథకానికీ భారీ నిధులు దక్కాయి. ఆదిలాబాద్ జిల్లాలోని చనాక-కొరాటకు రూ.250 కోట్లు కేటాయించింది. మిషన్ కాకతీయకు బడ్జెట్‌లో రూ.2743 కోట్లు కేటాయించారు.


వ్యవసాయ అనుబంధ రంగాలకు ప్రోత్సాహం

- **పాడి, మత్స్య, పట్టు పరిశ్రమలకు ప్రాధాన్యం..**
- **2018-19 వార్షిక బడ్జెట్‌లో నిధులు రెట్టింపు**

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: గ్రామీణ ప్రజల ఆర్థికాభివృద్ధిని పెంచేందుకు వ్యవసాయంతో పాటు అనుబంధ రంగాలకు బడ్జెట్‌లో ప్రభుత్వం ప్రాధాన్యం కల్పించింది. పాడి, మత్స్య, పట్టు పరిశ్రమలశాఖకు బడ్జెట్‌లో రూ.1126 కోట్లను కేటాయించింది. గత ఏడాది ఈ రంగాలకు రూ.544 కోట్లను కేటాయించింది. గొర్రెల పెంపకాన్ని పరిశ్రమగా అభివృద్ధి చేసి, గొల్ల, కురుమల జీవితాల్లో మార్పుతెచ్చేందుకు ప్రభుత్వం గొర్రెల పంపిణీ చేపట్టిన విషయం తెలిసిందే. తొలిదశలో 4 లక్షల కుటుంబాలకు 84 లక్షల గొర్రెలను పంపిణీచేయాలని లక్ష్యం నిర్ణయించుకోగా, ఇప్పటి వరకు 2.35 లక్షల కుటుంబాలకు 50 లక్షల గొర్రెలను 75 శాతం సబ్సిడీపై అందజేశారు. ఆ గొర్రెలు మరో 17 లక్షల గొర్రె పిల్లలకు జన్మనిచ్చాయి. మొదటిదశలో రూ.ఐదు వేల కోట్ల అంచనా వ్యయంతో ప్రారంభించిన గొర్రెల పంపిణీ పథకానికి బడ్జెట్ కేటాయింపులే కాకుండా, బడ్జెటేతర పద్ధతిలో ఆర్థిక సంస్థ నుంచి రుణాల రూపంలో ప్రభుత్వం నిధులు సమకూరుస్తున్నది. గంగపుత్ర, ముదిరాజ్, బోయ, బంటు కులస్థులు ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు మిషన్‌కాకతీయ ద్వారా పునరుద్ధరించిన చెరువుల్లో ఏటా 3,20,000 టన్నుల చేపలను ఉత్పత్తి చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం కార్యాచరణను రూపొందించింది. దీనికోసం ఉచితంగా చేపపిల్లలను పంపిణీ చేస్తున్నది. చేపలు అమ్ముకోవడానికి జిల్లాకోటి చొప్పున 31 హోల్‌సేల్ మార్కెట్‌లు , 200 రిటైల్ మార్కెట్లు నిర్మించనున్నది. హైదరాబాద్ కేంద్రంగా పౌల్ట్రీ పరిశ్రమ అభివృద్ధి చెందింది. తెలంగాణ ఎగ్ బాస్కెట్ ఆఫ్ ఇండియాగా పేరు పొందింది. కోళ్ల దాణా ఉత్పత్తిలో, కోడి పిల్లల ఉత్పత్తిలో తెలంగాణ తొలిస్థానంలో ఉంది. కోడి మాంసం ఉత్పత్తిలో దేశంలో రెండోస్థానం పొందింది. పౌల్ట్రీ పరిశ్రమపై ఆధారపడి ప్రత్యక్షంగా, పరోక్షంగా లక్షలాది మంది ఉపాధి పొందుతున్నారు. కోళ్ల పరిశ్రమకు ప్రభుత్వం సబ్సిడీపై కరంటును అందిస్తున్నది. తాజాగా బడ్జెట్‌లో కోళ్ల పరిశ్రమ అభివృద్ధికి రూ.109 కోట్ల నిధులను కేటాయించింది.



దేశచరిత్రలోనే కొత్త అధ్యాయం



- **దేవాదాయశాఖకు రూ.672కోట్లు**

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: దేవాదాయశాఖకు రాష్ట్ర బడ్జెట్‌లో రూ.672 కోట్లు కేటాయించి దేశచరిత్రలోనే తెలంగాణ ప్రభుత్వం కొత్త అధ్యాయాన్ని నెలకొల్పింది. యాదగిరిగుట్ట దేవాలయం అభివృద్ధికి రూ.250 కోట్లు, భద్రాద్రి దేవాలయం బృహత్ప్రణాళికల కోసం రూ.100 కోట్లు, వేములవాడ క్షేత్రానికి రూ.100 కోట్లు, గోదావరితీరంలోని ధర్మపురి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయాభివృద్ధికి రూ.50 కోట్లు బడ్జెట్‌లో ప్రతిపాదించారు. బాసర దేవస్థానానికి రూ.50 కోట్లు, ఐదువేల మంది అర్చకులు, ఉద్యోగులకు పీఆర్సీ-2015 అమలుకు వీలుగా రూ.72 కోట్లు కేటాయించారు. గత బడ్జెట్‌లో కేటాయించిన రూ.50 కోట్లలో దాదాపు రూ.30 కోట్లు దేవాదాయశాఖ పద్దులో అందుబాటులో ఉన్నాయి. కామన్‌గుడ్‌ఫండ్ నిధులతో చేపడుతున్న జీర్ణ దేవాలయాల ఉద్ధరణకోసం ప్రత్యేకంగా సర్వశ్రేయోనిధికి రూ.50 కోట్లు కేటాయించారు.

ధర్మానికి ప్రాధాన్యమిచ్చిన బడ్జెట్: శ్రీచినజీయర్‌స్వామి

తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ ధర్మానికి చాలా ప్రాధాన్యం ఇచ్చిందని పరమహంస పరివ్రాజకులు త్రిదండి శ్రీమన్నారాయణ చినజీయర్ స్వామీజీ శుభాశీస్సులు తెలిపారు. దేవాలయాల అభివృద్ధి కోసం కేటాయించిన పద్దులను చూసి ఆనందాన్ని వ్యక్తంచేశారు. గురువారం తనను కలిసిన తెలంగాణ అర్చక సమాఖ్య అధ్యక్షుడు గంగు ఉపేంద్రశర్మ, వేదపండితులు గుదిమెళ్ల విజయ కుమారాచార్యులు, ఇతర అర్చక సంఘాల నాయకులతో ఆయన మాట్లాడారు. యాదాద్రి శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవాలయం పనుల పట్ల ముఖ్యమంత్రి కేసీఆర్ చాలా శ్రద్ధ తీసుకుంటున్నారని, పనుల్లో జాప్యం జరిగితే ఆయన వెంటనే అధికారులకు తగినవిధంగా ఆదేశాలను ఇస్తున్నారని స్వామీజీ ముఖ్యమంత్రికి మంగళాశాసనం చేశారు. ఈ సందర్భంగా విళంబి పంచాంగాన్ని స్వామీజీ ఆవిష్కరించారు. అర్చకులకు, ఉద్యోగులకు జీతభత్యాలు నిర్ణయించడం, ప్రతీ దేవాలయం అభివృద్ధికి శ్రద్ధ తీసుకోవడం తెలంగాణ ప్రభుత్వ ప్రత్యేకతలని స్వామీజీ వ్యాఖ్యానించారు.


శంషాబాద్‌లోని జీయర్ ఆశ్రమంలో విళంబి పంచాంగాన్ని ఆవిష్కరిస్తున్న త్రిదండి శ్రీమన్నారాయణ చినజీయర్ స్వామి, తెలంగాణ అర్చక సమాఖ్య అధ్యక్షుడు గంగు ఉపేంద్రశర్మ తదితరులు

జిందగీ పేజీ పై మీ అభిప్రాయాలు, సలహాలు తెలియజేయండి.
zindagi@ntdaily.news
www.ntzindagi.com
/nt.zindagi
హైదరాబాద్
శుక్రవారం 16 మార్చి 2018
WWW. NTNEWS.COM

పండుగ.. పరికిణీ!



పండుగ వచ్చిందంటే.. పడుచులదే హవా అంతా! మరి తెలుగు సంవత్సరాది వచ్చేస్తున్నది.. పదహారణాల పండుగకు.. పరికిణీలు వేసుకోకపోతే ఎలా? పట్టు పరికిణీలను రీప్లేస్ చేయడానికి.. ఇప్పుడు డిజైనర్ లంగా-ఓణీలు వచ్చేశాయి.. విళంబి నామ సంవత్సరం సందర్భంగా.. ఆ పరికిణీల కలెక్షన్ మీ కోసం..





అర్చితా నారాయణం
బంజారాహిల్స్, హైదరాబాద్
archithanarayanam@gmail.com

రెండు లేయర్లుగా టిష్యూ, నెట్‌తో ఈ లెహంగాని డిజైన్ చేశాం. వైన్ కలర్‌తో మెరిసిపోతున్న దీనికి గోల్డెన్ జరీ బార్డర్ జత చేశాం. దీనికి బ్లాక్ కలర్ బెనారస్ బుటీ వచ్చిన మెటీరియల్‌తో బ్లౌజ్ కుట్టాం. దీనికి బ్లాక్ కలర్ నెట్‌తో స్లీవ్స్ ఇచ్చి దానికి గోల్డెన్ లేస్ జతచేయడంతో సూపర్ లుక్ వచ్చింది. ఇక వైన్, బ్లాక్ కలర్స్ టై అండ్ డై జార్జెట్ దుపట్టా మీద కర్దానా బుటీస్ ఇచ్చాం. హెవీగా దుపట్టా ఉండే విధంగా డిజైన్ చేశాం.







ఆకుపచ్చని వెల్వెట్ లెహంగా ఇది. దీని మీద పింక్ కలర్ వెల్వెట్, సీక్వెన్స్, జరీలతో ప్యాచ్ వర్క్ చేశాం. దీనికి గోల్డెన్ సీక్వెన్స్ బార్డర్‌ని జత చేశాం. దానిపైన పింక్ కలర్ రాసిల్క్‌తో చిన్న బార్డర్‌లా కుట్టాం. పింక్ కలర్ సిల్క్ బ్లౌజ్‌కి గోల్డెన్ సీక్వెన్స్‌తో చెక్స్‌లా డిజైన్ చేశాం. ఇక పింక్ కలర్ జార్జెట్ దుపట్టా మీద జరీ, సీక్వెన్స్‌తో ఆలోవర్ బుటీస్ ఇచ్చాం. దీంతో హెవీ లుక్ వచ్చేసింది.

పండుగ రోజు మెరిసేందుకు ఈ పట్టు లంగా ఓణీ వేయాల్సిందే! పింక్ కలర్ మీద సిల్వర్ బుటీస్ వచ్చిన బెనారస్ లెహంగా ఇది. దీనికి బ్లూ కలర్ రాసిల్క్ మీద జర్దోసీ, ముత్యాలతో బార్డర్ ఇచ్చాం. దానికి కింద షిమ్మర్‌తో కుచ్చుల మాదిరిగా బార్డర్ జత చేశాం. ఈ బార్డర్‌కి ఎర్రని, పచ్చని రంగు రాసిల్క్‌తో పైపింగ్ చేశాం. టిష్యూ సిల్వర్ బ్లౌజ్‌కి నెక్, స్లీవ్స్ దగ్గర పింక్ రాసిల్క్‌ని కుట్టాం. పిస్తా గ్రీన్ జార్జెట్ దుపట్టా మీద థ్రెడ్, మిర్రర్, సీక్వెన్స్‌తో హెవీగా వర్క్ చేయడంతో మరింత అందంగా మెరిసిపోతున్నది. దీనికి చివరల పింక్ కలర్ రాసిల్క్‌తో పైపింగ్ చేయడంతో పర్‌ఫెక్ట్ మ్యాచింగ్‌గా కనిపిస్తున్నది.

గోల్డెన్ జ్యూట్ లెహంగాని ఎక్కువ కలీస్ వచ్చేలా డిజైన్ చేశాం. దీనికి టస్సెల్ అదనపు ఆకర్షణ. సీక్వెన్స్ బ్లౌజ్ ఇవ్వడంతో మరింత మెరిసిపోతున్నది. దీనికి క్రీమ్ కలర్ జార్జెట్ దుపట్టా మీద థ్రెడ్, మిర్రర్, సీక్వెన్స్‌తో హెవీగా వర్క్ చేయడంతో మరింత అందంగా మెరిసిపోతున్నది. దీనికి చివరన ఆరెంజ్ కలర్ రాసిల్క్‌తో పైపింగ్ చేయడంతో పర్‌ఫెక్ట్ మ్యాచింగ్‌గా కనిపిస్తున్నది.

సింపుల్ అండ్ స్వీట్‌గా వెలిగిపోవాలంటే ఈ లంగాఓణీ కట్టాల్సిందే! ఆకుపచ్చని జార్జెట్ లెహంగా మీద జర్దోసీ, సరోస్కీ, సీక్వెన్స్‌లతో మొత్తం బుటీస్‌తో నింపేశాం. దీనికి టిష్యూ బార్డర్ హైలైట్‌గా నిలిచింది. ఆకుపచ్చ, నీలిరంగు షేడెడ్ నెట్ దుపట్టా మీద కూడా బుటీస్ ఇచ్చాం. దీనికి గోల్డెన్ జరీ బార్డర్ జత చేయడంతో మెరిసిపోతున్నది. ఆకుపచ్చని రాసిల్క్ ఫ్యాబ్రిక్‌తో బ్లౌజ్ కుట్టాం. స్లీవ్స్‌కి పెద్ద బుటీ ఇచ్చి డీటేలింగ్ చేశాం. చివరన బ్లూ కలర్ సిల్క్‌ని అటాచ్ చేశాం.

ఈ ఇంజక్షన్‌తో నొప్పి వస్తుందా?



నా వయసు 23సంవత్సరాలు. ఐదు నెలల క్రితం నాకు పాప పుట్టింది. నేను పాపకు పాలు ఇస్తున్నాను. పాప పుట్టినప్పటి నుంచి నడుము నొప్పి విపరీతంగా వస్తున్నది. అంతకు ముందు నేను చాలా చురుకుగా ఉండేదాన్ని. నాకు సిజేరియన్ డెలివరీ ద్వారా ప్రసవం జరిగింది. ఆసమయంలో మత్తు కోసం నడుము దగ్గర ఇచ్చిన ఇంజక్షన్ వల్ల అని కొంత మంది మిత్రులు అంటున్నారు. నిజంగా నా నొప్పికి అదే కారణమా? నొప్పి తగ్గడానికి తగిన సలహా ఇవ్వండి. రెండో బిడ్డ కోసం మరో రెండేళ్లు సమయం తీసుకోవాలని నిర్ణయించుకున్నాం. దీనికి తగిన పద్ధతులు తెలుపండి?

-విశాల, జమ్మికుంట

మీరు మీ పాపకు తల్లిపాలు ఇస్తున్నందుకు అభినందనలు. ప్రసవానంతరం నడుము నొప్పి అనేది సాధరణం. సిజేరియన్ ద్వారానే కాకుండా నార్మల్ డెలివరీ అయిన వారిలో కూడా నడుము నొప్పి వస్తుంది. గర్భం ధరించినపుడు శరీరంలో జరిగే మార్పులు, వెన్నెముక పైన కలిగిన ఒత్తిడి, కాల్షియం లోపము వంటివి దీనికి కారణం. చాలా మంది అనుకున్నట్టు నడుము దగ్గర ఇచ్చే ఇంజక్షన్ వల్ల ఈ నొప్పి రాదు. ఇది తగ్గడం కోసం కూర్చునే పద్ధతిని సరిచేసుకుని వీపుకు ఆధారం తీసుకొని కూర్చోవడం మంచిది. పాపకు పాలు పడుతున్నపుడు సరియైన పద్ధతిలో ఎక్కువగా వెన్నెముకను వంచకుండా నిటారుగా కూర్చోవాలి. వీలును బట్టి ప్రతిరోజు 20 నుంచి 30 నిమిషాలు వాకింగ్ చెయ్యడం కూడా చాలా మంచిది. రెండో గర్భానికి 2 సంవత్సరాల ఎడం తీసుకోవడం కూడా చాలా మంచి విషయం. నెలసరి ఇంకా మొదలవక పోతే గర్భం రాదు అనేది అపోహ మాత్రమే. కాబట్టి ముందు నుంచి జాగ్రత్త తీసుకోవడం ఎంతో అవసరం. క్యాలెండర్ పద్ధతి పాటించవచ్చు. సరైన పద్ధతిలో నిరోధ్ వంటి సాధనాలు ఉపయోగించవచ్చు. కాపర్ టీ వేయించుకుంటే మూడు నుంచి ఐదు సంవత్సరాల వరకు అలాగే ఉండనివ్వవచ్చు. అవసరమనుకుంటే మధ్యలో తీయించేయవచ్చు. పాలు పట్టే సమయంలో వాడుకోవడానికి ప్రత్యేకమైన కాంట్రాసెప్టివ్ పిల్స్ దొరుకుతాయి . మూడు నెలలకొకసారి తీసుకునే ఇంజక్షన్ కూడా దొరుకుతుంది. వీటి గురించి మీ డాక్టర్‌తో చర్చించి మీరు మీకు అనుకూలమైన పద్ధతిని ఎంచుకోండి.



డాక్టర్ జి. వింధ్య
కన్సల్టెంట్ గైనకాలజిస్ట్
కేర్ హాస్పిటల్స్
హైదరాబాద్

జర్నలిస్టు హత్య నేపథ్యంలో స్లొవేకియా ప్రధాని రాజీనామా



రాబర్ట్ ఫికో

బ్రాటిస్లావా: ఒక జర్నలిస్టు హత్య నేపథ్యంలో స్లొవేకియా ప్రధాని రాబర్ట్ ఫికో తన పదవికి రాజీనామా చేశారు. గత నెలలో జర్నలిస్టు జాన్ కుసియాక్, అతడి స్నేహితురాలిని అతడి ఇంటికి సమీపంలోనే కొందరు ఆగంతకులు తుపాకీతో కాల్చి హత్య చేశారు.. అంతకు ముందు ఫికో ప్రభుత్వంపై జాన్ కుసియాక్ ఒక వార్తాకథనం రాశారు. స్లొవేకియా రాజకీయ నేతలకు, ఇటలీ మాఫియాకు మధ్య గల సంబంధాల పైనా ఆయన పరిశోధన జరిపారు. ఈ నేపథ్యంలోనే కుసియాక్ హత్య జరిగి ఉండవచ్చునని పోలీసులు తెలిపారు. కుసియాక్ హత్యతో ఫికోకు సంబంధం ఉన్నదని, ప్రజల నుంచి తీవ్ర నిరసన వ్యక్తమైంది. దీనికి తోడు ఫికో ప్రభుత్వంపై వచ్చే సోమవారం అవిశ్వాస తీర్మానం చర్చకు రానున్నది. ఈ నేపథ్యంలో ప్రధాని రాబర్ట్ ఫికో (53) రాజీనామా చేశారు. ఆయన రాజీనామాను ఆమోదించినట్లు స్లొవేకియా అధ్యక్షుడు అండ్రేజ్ కిస్కా తెలిపారు.

పంజాబ్ మాజీ మంత్రికి కేజ్రీవాల్ సారీ!

త్వరలో కేంద్రమంత్రి అరుణ్‌జైట్లీకి కూడా క్షమాపణలు చెప్పే అవకాశం



న్యూఢిల్లీ: తప్పుడు ఆరోపణలు చేసినందుకు పంజాబ్ మాజీ మంత్రి బిక్రమ్‌సింగ్ మజీథియాకు ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) అధినేత, ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ క్షమాపణలు చెప్పారు. మాదకద్రవ్యాల వ్యాపారంతో సంబంధాలున్నాయని మజీథియాపై కేజ్రీవాల్ గతంలో అవినీతి ఆరోపణలు చేశారు. తాము పంజాబ్‌లో ఆధికారంలోకి వచ్చాక మజీథియాను గల్లాపట్టి కోర్టుకు ఈడుస్తామని గత ఏడాది ఎన్నికల బహిరంగసభలో బీరాలు పలికారు. ఇప్పుడు అందుకు లిఖిత పూర్వకంగా క్షమాపణలు చెప్పారు. తన ఆరోణల్లో నిజం లేదని తెలుసుకొని గతంలో తాను చేసిన వ్యాఖ్యలను ఉపసంహరించుకుంటున్నట్లు పేర్కొంటూ మజీథియాకు కేజ్రీవాల్ లేఖ రాశారు. లేఖను కోర్టుకు కూడా సమర్పించారు. ఈ విషయం మజీథియా గురువారం స్వయంగా వెల్లడిస్తూ, కేజ్రీవాల్‌పై వేసిన కేసును ఇక ఉపసంహరించుకుంటానని తెలిపారు. గత ఆగస్టులో హర్యానా బీజేపీ నేత అవతార్‌సింగ్ భందానకు కూడా ఇదేమాదిరిగా కేజ్రీవాల్ క్షమాపణలు చెప్పారు. ఈ నేపథ్యంలో కేజ్రీవాల్ ఇదే విధంగా కేంద్రమంత్రి అరుణ్‌జైట్లీకి సైతం క్షమాపణలు చెప్పే అవకాశం ఉన్నదని కొన్ని వర్గాలు పేర్కొన్నాయి. అరుణ్‌జైట్లీ గతంలో ఢిల్లీ క్రికెట్ సంఘం నాయకుడిగా ఉన్నప్పుడు పెద్ద ఎత్తున అవినీతికి పాల్పడ్డారని కేజ్రీవాల్ ఆరోపించగా జైట్లీ పరువునష్టం దావా వేశారు.

రన్‌వేపై బంగారం వాన!

రష్యాలో విమానం నుంచి కింద పడిన 3,400 కిలోల పుత్తడి



మాస్కో: రష్యాలో బంగారం వాన కురిసింది. విమానం నుంచి బంగారు కడ్డీలు కుప్పలు కుప్పలుగా కిందకు పడ్డాయి. దాదాపు 3.4టన్నుల బంగారం(3,400కిలోలు) రన్‌వేపై పడిపోయింది. దీంతో అధికారులు ఆ బంగారు కడ్డీలను స్వాధీనం చేసుకున్నారు. రష్యాలోని టాస్ వార్తాసంస్థ తెలిపిన వివరాల ప్రకారం.. నింబూస్ ఎయిర్‌లైన్స్‌కు చెందిన ఏఎన్-12 సరుకు రవాణా విమానం గురువారం యాకుత్స్క్ నుంచి క్రాస్నోయార్క్స్‌కు బయలుదేరింది. అందులో 9.3 టన్నుల బంగారం(9,300కిలోలు), ఇతర లోహాలు ఉన్నాయి. అయితే విమానం యాకుత్స్క్ నుంచి గాలిలోకి ఎగరగానే దాని తలుపు తెరుచుకుంది. దీంతో 172 బంగారు కడ్డీలు రన్‌వేపై పడిపోయాయి. వాటి బరువు దాదాపు 3.4 టన్నులు ఉంటుంది. వెంటనే విమానాశ్రయ అధికారులు ఆ కడ్డీలను స్వాధీనం చేసుకొని దర్యాప్తు ప్రారంభించారు. బంగారంతో నిండిపోయిన రన్‌వే దృశ్యాలు సోషల్‌మీడియాలో హల్‌చల్ చేస్తున్నాయి.

ఇష్టం వచ్చినట్టు రాయొద్దు

వెబ్‌సైట్లు, ఎలక్ట్రానిక్ మీడియాలో అసత్య కథనాలపై సుప్రీంకోర్టు ఆగ్రహం

మీడియా మరింత బాధ్యతగా వ్యవహరించాలని సూచన

నిరాధార, నిందాపూర్వక కథనాలు జర్నలిజం సంస్కృతి కాదని వ్యాఖ్య

న్యూఢిల్లీ, మార్చి 15:



ఎలక్ట్రానిక్ మీడియా, వెబ్‌సైట్లలో వస్తున్న అసత్య కథనాలపై సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. నిరాధారమైన, నిందాపూర్వక కథనాలను ప్రచురించొద్దని స్పష్టం చేసింది. తమను తాము చర్చి వేదికపై ఉన్న పోప్‌లుగా భావించొద్దని చీఫ్ జస్టిస్ దీపక్‌మిశ్రా నేతృత్వంలోని ధర్మాసనం సూచించింది. ఓ వెబ్‌సైట్ మీద పరువునష్టం కేసులో దాఖలైన పిటిషన్‌పై గురువారం ప్రధాన న్యాయమూర్తితో పాటు జస్టిస్ ఏఎం ఖాన్‌విల్కర్, డీవై చంద్రచూడ్‌తో కూడిన ధర్మాసనం విచారణ జరిపింది. మీడియా బాధ్యతాయుతంగా ప్రవర్తించాలని, ముఖ్యంగా ఎలక్ట్రానిక్ మీడియా, వెబ్‌సైట్లు మరింత జాగ్రత్తగా ఉండాలని పేర్కొన్నది. మీడియాను నియంత్రించాలన్న ఆలోచన సుప్రీంకోర్టుకు ఎన్నటికీ లేదని, మీడియా గొంతునొక్కేందుకు జరిగిన పలు ప్రయత్నాలను తాను తిప్పికొట్టానని ప్రధాన న్యాయమూర్తి చెప్పారు. కానీ నిరాధార కథనాల విషయంలో ఎలక్ట్రానిక్ మీడియా మరింత బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. వెబ్‌సైట్లలో రాసినదాని ఆధారంగా కథనాలు ప్రసారం చేశామంటే కుదరదన్నారు. ఏది పడితే అది రాయడం జర్నలిజం సంస్కృతి కాదన్నారు. 'వాళ్లకు ఇష్టం వచ్చినట్టు రాసే స్వేచ్ఛ ఉన్నదా? మనసుకు ఏది అనిపిస్తే అది రాసేస్తే ఎలా? ఏదో ఒకటి రాసేసి తప్పించుకుందామనుకుంటున్నారా? అలాంటి కథనాలు కోర్టు ధిక్కరణ కిందికి వస్తాయి. నిరాధార కథనాలను సృష్టించడం, ప్రచారం చేయడం జర్నలిజం సంస్కృతి కాదు' అని పేర్కొన్నారు. తాము ప్రత్యేకంగా చానళ్ల పేర్లను ప్రస్తావించదలుచుకోలేదని, కానీ కొందరు తమను తాము వేదికపై ఉన్న పోప్‌లుగా ఊహించుకుంటూ ఏదైనా చెప్పొచ్చనే రీతిలో వ్యవహిస్తున్నారని ధర్మాసనం విమర్శించింది. ప్రతి ఒక్కరూ చట్టానికి అనుగుణంగా బాధ్యతాయుతంగా నడుచుకోవాలని సూచించింది. గుజరాత్‌కు చెందిన 'ది వైర్' అనే వెబ్‌సైట్ బీజేపీ జాతీయ అధ్యక్షుడు అమిత్‌షా కొడుకు జాయ్‌షా కంపెనీపై ఓ వార్తను ప్రచురించింది. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాతే కంపెనీ టర్నోవర్ పెరిగిందని ఆరోపించింది. దీంతో జయ్‌షా రూ.100 కోట్ల పరువు నష్టం కోరుతూ గత ఏడాది అక్టోబర్‌లో గుజరాత్ హైకోర్టును ఆశ్రయించారు. నిరాధార కథనం రాసినందుకు సదరు రిపోర్టర్‌తోపాటు వెబ్‌సైట్ నిర్వాహకులపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని తన పిటిషన్‌లో కోరారు. ఈ పిటిషన్‌ను కొట్టివేయాలని ఆ వెబ్‌సైట్ కోరగా హైకోర్టు తోసిపుచ్చింది. కేసును దిగువ కోర్టుకు బదిలీ చేస్తూ ఈ ఏడాది జనవరి 8న తీర్పునిచ్చింది. దీంతో ఆ వెబ్‌సైట్ నిర్వాహకులు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై గురువారం విచారణ జరిపిన ధర్మాసనం ఏప్రిల్ 12వ తేదీ వరకు విచారణ నిలిపివేయాలని గుజరాత్ దిగువ కోర్టును ఆదేశించింది.

అకౌంటెన్సీ పరీక్ష ప్రశ్నాపత్రం లీక్ కాలేదు

విద్యార్థులు పుకార్లను నమ్మవద్దు: సీబీఎస్‌ఈ

న్యూఢిల్లీ, మార్చి 15: పన్నెండో తరగతికి చెందిన అకౌంటెన్సీ పరీక్ష ప్రశ్నాపత్రం లీక్ కాలేదని సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్(సీబీఎస్‌ఈ) తెలిపింది. ఈ పశ్నాపత్రం లీక్ అయినట్లు పుకార్లు వచ్చాయని, వాటిని నమ్మవద్దని సూచించింది. పుకార్లపై పోలీసులకు ఫిర్యాదు చేశామని పేర్కొంది. అకౌంటెన్సీ పరీక్ష ప్రశ్నాపత్రం లీక్ అయినట్లు తనకు ఫిర్యాదులు అందాయని, దీనిపై చర్యలు తీసుకుంటామని ఢిల్లీ డిప్యూటీ సీఎం మనీశ్ సిసోడియా ట్వీట్ చేశారు. కష్టపడి చదివిన విద్యార్థులకు అన్యాయం జరుగనివ్వమని, కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ప్రశ్నాపత్రం లీకేజీపై పోలీసులకు ఫిర్యాదు చేయాలని విద్యాశాఖను ఆదేశించారు. దీంతో వెంటనే సీబీఎస్‌ఈ అధికారులు స్పందించారు. 'ఎక్కడ కూడా ప్రశ్నాపత్రం లీక్ కాలేదు. కొందరు కావాలనే పుకార్లు సృష్టిస్తున్నారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేశాం' అని తెలిపారు.



ఎన్సీపీ అధినేత శరద్‌పవార్‌తో సోనియాగాంధీ



ఫరూఖ్ అబ్దుల్లా



మమతా బెనర్జీ



రాహుల్‌గాంధీ



లాలూప్రసాద్

2019లో మహా కూటమి?

విపక్షాలకు ఊతమిచ్చిన యూపీ, బీహార్ ఉప ఎన్నికల ఫలితాలు

హస్తినలో జోరుగా సాగుతున్న సంప్రదింపులు

సోనియా, శరద్‌పవార్‌ల మధ్య చర్చలు జరిగాయన్న ఎన్సీపీ నేత

శరద్‌పవార్‌ను కలిసిన రాహుల్‌గాంధీ.. మాయావతితో భేటీ అయిన అఖిలేశ్ యాదవ్

ఈ నెల 28న మరోసారి సమావేశం కానున్న విపక్ష పార్టీలు

న్యూఢిల్లీ, మార్చి 15:

ఉత్తర్‌ప్రదేశ్, బీహార్ రాష్ట్రాలలో జరిగిన లోక్‌సభ ఉప ఎన్నికల్లో ప్రతిపక్షాల విజయం మరోసారి మహాకూటమిపై చర్చకు తెరలేపింది. ఉత్తర్‌ప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో ఘోరపరాజయం పాలైన సమాజ్‌వాది పార్టీ ఏడాది తిరగకుండానే లోక్‌సభ ఉప ఎన్నికల్లో భారీ విజయాలు నమోదు చేయడంతో వచ్చే సార్వత్రిక ఎన్నికల నాటికి బీజేపీని ఓడించేందుకు మహాకూటమి ఏర్పడవచ్చన్న ఊహాగానాలు ఊపందుకుంటున్నాయి. ఇందుకు అనుగుణంగానే యూపీ, బీహార్ ఉప ఎన్నికల ఫలితాలు వెలువడిన వెంటనే బుధవారం రాత్రి నుంచి వివిధ పార్టీల నేతల మధ్య సంప్రదింపులు, చర్చలు ప్రారంభమయ్యాయి. ఆయా పార్టీల నేతలు చేస్తున్న వ్యాఖ్యలు సైతం ఇందుకు ఊతమిచ్చే విధంగా ఉన్నాయి. ఉప ఎన్నికల ఫలితాలు మహ కూటమి ఏర్పాటుకు ప్రతిపక్ష పార్టీల్లో నైతిక స్థయిర్యాన్ని కల్పించాయని నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (ఎన్సీపీ)ఎంపీ మజీద్ మెమన్ పేర్కొన్నారు. మహాకూటమి ఏర్పాటుకు కాంగ్రెస్ మాజీ అధ్యక్షురాలు సోనియాగాంధీ, ఎన్సీపీ అధ్యక్షుడు శరద్‌పవార్ ఇప్పటికే చర్చలు ప్రారంభించారని ఆయన వెల్లడించారు. యూపీ, బీహార్ ఉప ఎన్నికల ఫలితాలు వెలువడిన కొద్ది గంటల్లోనే కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ శరద్‌పవార్‌తో మాట్లాడారు. ఈ నెల 28న రాహుల్ తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమతా బెనర్జీతో ఢిల్లీలో భేటీ కానున్నారు. 'మహాకూటమి వాస్తవ రూపం దాల్చుతున్నది' అని నేషనల్ కాన్ఫరెన్స్ (ఎన్సీ) నాయకుడు, జమ్ముకశ్మీర్ మాజీ సీఎం ఫరూక్ అబ్దుల్లా పేర్కొన్నారు. బీఎస్పీ మద్దతుతో ఎస్పీ అభ్యర్థులు విజయాలు సాధించడాన్ని ఆయన గుర్తుచేస్తూ మహాకూటమి వల్ల ఎటువంటి ఫలితాలు వెలువడుతాయో యూపీలో స్పష్టమైందని వ్యాఖ్యానించారు. సోనియాగాంధీ ఇటీవల ఢిల్లీలో ఇచ్చిన విందుకు ఎన్సీ అధ్యక్షుడు ఒమర్ అబ్దుల్లా హాజరయ్యారు. 2019 లోక్‌సభ ఎన్నికలకు ముందు ప్రతిపక్ష పార్టీల కూటమి ఏర్పాటు కోసమే ఆ విందు నిర్వహించినట్టు తెలుస్తున్నది. యూపీ, బీహార్ ఫలితాలు భావసారూప్యత ఉన్న ప్రతిపక్ష పార్టీలన్నీ ఐక్యమయ్యేలా ప్రభావం చూపుతాయని సీపీఐ నాయకుడు డీ రాజా అన్నారు. అయితే మహాకూటమిపై సాగుతున్న చర్చల గురించి సమాజ్‌వాదీ నాయకుడు రామ్‌గోపాల్ యాదవ్ మాత్రం 'వేచి చూడండి' అని అన్నారు. ఈ ఫలితాలపై తమ కార్యకర్తలు సంతోషంగా ఉన్నారని, వారు సంతృప్తి పడితే మరిన్ని ఓట్లు పడుతాయని చెప్పారు.

మాయావతికి రాహుల్ స్నేహ హస్తం?

బీఎస్పీ వ్యవస్థాపకుడు కాన్షీరాం జయంతిని పురస్కరించుకొని రాహుల్‌గాంధీ గురువారం ఆయనకు ఘనంగా నివాళులర్పించారు. కాన్షీరాం గొప్ప సామాజిక సంస్కర్త అని వ్యాఖ్యానించారు. కేంద్రంలో మహాకూటమి ఏర్పాటుకు ప్రయత్నాలు జరుగుతుండటం, యూపీలో బీఎస్పీ మద్దతుతో ఎస్పీ విజయం సాధించిన నేపథ్యంలో రాహుల్ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. రాహుల్ వ్యాఖ్యలను బీఎస్పీ అధినేత్రి మాయావతికి ఆయన స్నేహ హస్తం అందించేవిగా ఉన్నట్టు పరిశీలకులు భావిస్తున్నారు. మరోవైపు రాహుల్‌గాంధీ బుధవారం రాత్రి ఎన్సీపీ నాయకుడు శరద్‌పవార్‌ను ఆయన ఇంటికి వెళ్లి కలుసుకున్నారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీకి వ్యతిరేకంగా ప్రతిపక్షాలన్నీ ఐక్యంగా గట్టిపోటీనివ్వాలని ఇద్దరు నేతలు చర్చించినట్టు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. ఈ నెల 28న శరద్‌పవార్ నిర్వహించనున్న ప్రతిపక్ష పార్టీల సమావేశానికి తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమతా బెనర్జీ కూడా హాజరవుతారని భావిస్తున్నారు.

బువా-భతీజా అనుబంధం!



మాయావతి



అఖిలేశ్

మాయావతి నేతృత్వంలోని బీఎస్పీ మద్దతుతో రెండు లోక్‌సభ స్థానాలను గెలుచుకున్న సమాజ్‌వాదీ పార్టీ ఇక ముందు కూడా ఆ పొత్తును కొనసాగించే అవకాశాలు కనిపిస్తున్నాయి. గతాన్ని మరచిపోవాలని, బీఎస్పీతో తమ సంబంధాలు సానుకూలంగా ఉన్నాయని ఎస్పీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్ వ్యాఖ్యానించడం ఈ ఊహాగానాలకు ఊతమిస్తున్నది. బద్ధవిరోధులుగా ఉన్న ఎస్పీ, బీఎస్పీ పార్టీలు బీజేపీని ఓడించేందుకు ఈ ఎన్నికల్లో చేతులు కలిపాయి. గోరఖ్‌పూర్ సీటును యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్, ఫూల్పూర్ నియోజకవర్గాన్ని డిప్యూటీ సీఎం కేశవ్ ప్రసాద్ మౌర్య ఖాళీ చేయడంతో ఆ స్థానాలకు జరిగిన ఎన్నికల్లో ఎస్పీ అభ్యర్థులు విజయం సాధించిన సంగతి తెలిసిందే. ఫలితాలు వెలువడిన వెంటనే రెండు పార్టీల కార్యకర్తలు మాయావతి, అఖిలేశ్‌ను ఉద్దేశించి 'బువా భతీజా (మేనత్త, మేనల్లుడు) జిందాబాద్' అని నినాదాలు చేయడం రానున్న రోజుల్లో ఎస్పీ, బీఎస్పీల స్నేహం మరింత బలపడనుందనడానికి సంకేతంగా పరిశీలకులు భావిస్తున్నారు. బీఎస్పీ మద్దతుతోనే ఈ విజయం సాధ్యమైందని గ్రహించిన అఖిలేశ్ యాదవ్ ఫలితాలు వెలువడిన వెంటనే బుధవారం సాయంత్రం స్వయంగా మాయావతి ఇంటికి వెళ్లి ధన్యవాదాలు తెలిపారు. ఇక కాంగ్రెస్‌తో తమ సంబంధాలు ఎప్పుడూ సానుకూలంగానే ఉన్నాయని అఖిలేశ్ పేర్కొన్నారు. రాహుల్, తాను యువకులమని, దేశం ఎదుర్కొంటున్న సమస్యలకు తామిద్దరం కలిసి పరిష్కారాలు వెతుకాల్సి ఉంటుందని చెప్పారు.

మోదీ అహంకారం వల్లే ఓటమి



యూపీ, బీహార్ లోక్‌సభ ఉప ఎన్నికల్లో బీజేపీ ఓటమిపై ఆ పార్టీ ఎంపీ శత్రుఘ్న సిన్హా సొంత పార్టీ నేతలపై విమర్శలు గుప్పించారు. అహంకారం, అసహనం, అతి విశ్వాసం వల్లనే బీజేపీ ఓటమిపాలైందని ఆయన పరోక్షంగా ప్రధాని మోదీపై విమర్శలు సంధించారు. 'అహంకారం, అసహనం, అతి విశ్వాసం ప్రజాస్వామిక రాజకీయాలను ఖూనీ చేస్తాయని నేను పదే పదే చెప్తూనే ఉన్నాను. అవి ట్రంప్‌లో ఉన్నా లేక మిత్రపక్షాలు లేదా ప్రతిపక్ష పార్టీలలో ఉన్నా నష్టమే' అంటూ శత్రుఘ్న ట్వీట్ చేశారు.



గురువారం లోక్‌సభలో విపక్షాల నిరసన

తీరు మారని పార్లమెంట్

- తొమ్మిదో రోజూ నిరసన బాటే
- చర్చ లేకుండానే లోక్‌సభలో రెండు బిల్లుల ఆమోదం

న్యూఢిల్లీ, మార్చి 15: పార్లమెంట్ బడ్జెట్ మలి విడుత సమావేశాల తీరు మారలేదు. వరుసగా తొమ్మిదో రోజు ఎటువంటి కార్యకలాపాలు చేపట్టకుండానే ఉభయ సభలు శుక్రవారానికి వాయిదా పడ్డాయి. సభ్యుల నిరసనల మధ్యనే గ్రాట్యూటీ చెల్లింపు (సవరణ)బిల్లు, ప్రత్యేక సాయం (సవరణ) బిల్లులను ఎటువంటి చర్చ లేకుండా లోక్‌సభ మూజువాణి ఓటుతో గురువారం ఆమోదించింది. ఉదయం లోక్‌సభ సమావేశం కాగానే ప్రశ్నోత్తరాల సమయం చేపట్టేందుకు స్పీకర్ సుమిత్రా మహాజన్ సిద్ధమవుతుండగా విపక్ష సభ్యులు వెల్‌లోకి దూసుకొచ్చారు. రిజర్వేషన్ల కోటా పెంపునకు టీఆర్ఎస్, ఏపీకి ప్రత్యేక హోదా కోసం టీడీపీ, పీఎన్బీ కుంభకోణంపై చర్చకు కాంగ్రెస్, తృణమూల్ కాంగ్రెస్ సభ్యులు ప్లకార్డులతో నిరసన తెలిపారు. లెఫ్ట్ సభ్యులు తమ స్థానాల్లో నిలబడి నినాదాలు చేశారు. దీంతో స్పీకర్ సుమిత్ర మహాజన్ బిల్లులను మూజువాణి ఓటుతో ఆమోదించినట్లు ప్రకటించి సభను వాయిదా వేశారు. మరోవైపు రాజ్యసభ మూడు సార్లు వాయిదా పడింది. మధ్యాహ్నం రాజ్యసభ సమావేశం కాగానే డిప్యూటీ చైర్మన్ పీజే కురియన్ మాట్లాడుతూ కీలకమైన ఆర్థిక బిల్లు, ద్రవ్య వినిమయ బిల్లుల ఆమోదానికి సహకరించాలని విపక్షానికి విజ్ఞప్తి చేశారు. టీడీపీ, అన్నాడీఎంకే, కాంగ్రెస్ సభ్యులు ప్లకార్డులతో వెల్‌లో నిరసన తెలుపుతుండటంతో కురియన్ తొలుత ఐదు నిమిషాల పాటు. తర్వాత శుక్రవారానికి సభను వాయిదా వేశారు.

కార్తీ చిదంబరానికి సుప్రీంకోర్టులో ఊరట

ఈ నెల 26 వరకు అరెస్ట్ చేయొద్దని ఈడీకి ఆదేశం

న్యూఢిల్లీ: ఐఎన్ఎక్స్ మీడియా కేసులో కాంగ్రెస్ సీనియర్ నేత పీ చిదంబరం కొడుకు కార్తీకి సుప్రీంకోర్టులో గురువారం ఊరట లభించింది. ఈ కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) కార్తీని అరెస్టు చేయకుండా ఢిల్లీ హైకోర్టు ఇచ్చిన ఆదేశాల్ని ఈ నెల 26 వరకూ పొడిగించింది. మనీ ల్యాండరింగ్ కేసుల్లో నిందితుల్ని అరెస్టు చేయటానికి ఈడీకి ఉన్న అధికారాలపై నెలకొన్న గందరగోళాన్ని కూడా తొలగిస్తామని సుప్రీంకోర్టు పేర్కొన్నది. ఈ మేరకు ఢిల్లీ హైకోర్టులో కార్తీతోపాటు ఇతరులు దాఖలు చేసిన అన్ని కేసులను తమ వద్దకే సుప్రీంకోర్టు ధర్మాసనం బదిలీ చేసింది. తదుపరి విచారణను మార్చి 26కి వాయిదా వేసింది.

అమ్మా మక్కల్ మున్నేట్ర కజగం

- దినకరన్ కొత్త పార్టీ
- జయలలిత చిత్రంతో పార్టీ జెండా

మదురై, మార్చి 15:

తమిళనాడులో మరో కొత్త రాజకీయపార్టీ ఏర్పాటైంది. అన్నాడీఎంకే నుంచి బహిష్కృతుడైన టీటీవీ దినకరన్ కొత్త పార్టీ స్థాపించారు. దివంగత సీఎం జయలలితను గుర్తు చేసే విధంగా ఈ పార్టీకి 'అమ్మా మక్కల్ మున్నేట్ర కజగం'(ఏఎంఎంకే) అని పేరు పెట్టినట్లు ఆయన ప్రకటించారు. నలుపు, తెలుపు, ఎరుపు రంగుల పట్టీలతో మధ్యన జయలలిత ముఖచిత్రంతో కూడిన జెండాను పార్టీ పతాకంగా ఎంపిక చేసినట్లు మదురైకి సమీపంలోని మేలూరులో గురువారం జరిగిన బహిరంగ సభలో వెల్లడించారు. పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు.



కొత్త పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న దినకరన్

కొత్త పార్టీ ఏర్పాటు సందర్భంగా దినకరన్ తమ అనుచరులను ఉద్దేశించి ప్రసంగించారు. అన్నాడీఎంకేను, పార్టీ రెండాకుల గుర్తును, అధికారాన్ని తిరిగి దక్కించుకోవడమే తమ లక్ష్యమని దినకరన్ ప్రకటించారు.

భారత్‌లో మా దౌత్యాధికారులకు

వేధింపులు: పాక్

చర్చించడానికి భారత్‌లోని పాక్ హై కమిషనర్‌కు పిలుపు

ఇస్లామాబాద్: భారత్‌లోని తమ దౌత్యాధికారులను, వారి కుటుంబాలను భారత్ ఇంటెలిజెన్స్(నిఘా) అధికారులు వేధిస్తున్నారని పాకిస్థాన్ ఆరోపించింది. దీనిపై చర్చించడానికి భారత్‌లోని పాక్ హైకమిషనర్ సోహెల్ మహమూద్‌ను పాకిస్థాన్‌కు పిలిపించింది. భారత్‌లో ఉంటున్న తమ దౌత్యాధికారులకు, వారి కుటుంబసభ్యులకు భద్రత కల్పించాల్సిన బాధ్యత భారత ప్రభుత్వంపై ఉన్నదని పేర్కొంది. కానీ, వేధింపులను నివారించడంలో భారత ప్రభుత్వం విఫలమైందని ఆరోపించింది. వేధింపులపై వివరణ ఇవ్వాల్సిందిగా పాక్‌లోని భారత డిప్యూటీ హైకమిషనర్ జేపీ సింగ్‌కు సమన్లు జారీ చేసినట్లు వివరించింది.

సంతోషంలో మన స్థానం 133

- పాకిస్థాన్‌కు 75వ ర్యాంకు
- మొదటిస్థానంలో ఫిన్‌లాండ్



న్యూఢిల్లీ: ప్రపంచంలో సంతోషకర దేశాల జాబితాలో భారత్ బాగా వెనుకబడిపోయింది. మన కంటే పాకిస్థాన్ ముందు వరుసలో ఉన్నది. ఐక్యరాజ్య సమితి (ఐరాస) వెల్లడించిన '2018 సంతోషంగా ఉన్న దేశాల నివేదిక'లో ఈ విషయం వెల్లడైంది. ఈ జాబితాలో మొత్తం 156 దేశాలు ఉండగా, అందులో భారత్ 133వ స్థానంలో ఉంది. అయితే పొరుగున ఉన్న పాకిస్థాన్ 75స్థానంలో ఉండటం విశేషం. అంతేకాదు భారత్ కన్నా బంగ్లాదేశ్, నేపాల్, శ్రీలంక, చైనా ముందువరుసలో ఉన్నాయని ఆ నివేదిక తెలిపింది. కాగా ఫిన్‌లాండ్ మొదటిస్థానంలో ఉన్నదని పేర్కొంది. ప్రజల ఆయుర్దాయం, అవినీతి తదితర అంశాలను ప్రామాణికంగా తీసుకొని ఈ ర్యాంకులు కేటాయించారు.

ఇక ఉగ్రవాదులకు స్వర్గధామం అరారియా

బీహార్ ఉపఎన్నికల్లో ఓటమిపై కేంద్రమంత్రి గిరిరాజ్‌సింగ్ అసహనం



గిరిరాజ్‌సింగ్

న్యూఢిల్లీ: బీహార్‌లోని అరారియా లోక్‌సభ ఉపఎన్నికల్లో ఓటమిపై బీజేపీ నాయకులు తీవ్ర అసహనానికి గురవుతున్నారు. ముస్లిం జనాభా అధికంగా ఉన్న ఈ స్థానాన్ని ఎలాగైనా దక్కించుకోవాలని సీఎం నితీశ్‌కుమార్ నేతృత్వంలోని జేడీయూ సహాయంతో తీవ్రంగా పోరాడిన బీజేపీ ఆశలు అడియాశలయ్యాయి. దీంతో ఆగ్రహానికి గురైన కేంద్ర మంత్రి గిరిరాజ్‌సింగ్ ఇక అరారియా జిల్లా ఉగ్రవాదులకు స్వర్గధామంగా మారుతుందని గురువారం వివాదాస్పద ఆరోపణలు చేశారు.

రాజ్యసభకు ఏడుగురు కేంద్రమంత్రులు ఏకగ్రీవం

23న తెలంగాణ సహా 6 రాష్ట్రాల్లో ఎన్నికలు



రవిశంకర్ ప్రసాద్



ప్రకాశ్ జవదేకర్

న్యూఢిల్లీ, మార్చి 15: రవిశంకర్ ప్రసాద్, ప్రకాశ్ జవదేకర్‌తోపాటు ఏడుగురు కేంద్రమంత్రులు రాజ్యసభకు వారి సొంత రాష్ట్రాల నుంచి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ విషయాన్ని ఎన్నికల కమిషన్ గురువారం ప్రకటించింది. మరోవైపు తెలంగాణ సహా ఆరు రాష్ట్రాల్లో రాజ్యసభ స్థానాలకు ఈనెల 23న ఎన్నికలు జరిపేందుకు రంగం సిద్ధం చేసింది. ఆర్థిక మంత్రి అరుణ్‌జైట్లీ తదితరులు ఈ ఎన్నికల్లో పోటీ చేయనున్నారు. న్యాయశాఖ మంత్రి రవిశంకర్ బీహార్ నుంచి, మానవ వనరుల మంత్రి జవదేకర్ మహారాష్ట్ర నుంచి గెలుపొందారు. పెట్రోలియంశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్, సామాజిక న్యాయశాఖ మంత్రి థావర్‌చంద్ గెహ్లాట్ మధ్యప్రదేశ్ నుంచి, ఆరోగ్యశాఖ మంత్రి జేపీ నడ్డా హిమాచల్ ప్రదేశ్ నుంచి విజయం సాధించారు. గుజరాత్ నుంచి నాలుగు రాజ్యసభ స్థానాలకు జరిగిన ఎన్నికల్లో బీజేపీ, కాంగ్రెస్ చెరి రెండు సీట్లు గెలుచుకున్నాయి. బీజేపీ నుంచి పోటీ చేసిన ఇద్దరు కేంద్రమంత్రులు పురుషోత్తం రూపాలా, మన్సుక్ మాండవీయ, కాంగ్రెస్ నుంచి రంగంలోకి దిగిన నారన్ రత్వా, అమీ యాగ్నిక్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ విధంగా గుజరాత్, మహారాష్ట్ర, ఎంపీ, బీహార్, ఏపీ, హిమాచల్‌ప్రదేశ్, ఒడిశా, రాజస్థాన్, హర్యానా రాష్ట్రాల్లో ప్రధాన పార్టీల అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. 16 రాష్ట్రాల్లో 58 రాజ్యసభ సీట్లకు ద్వైవార్షిక ఎన్నికలు జరుగాల్సి ఉండగా, ఇప్పటి వరకు 10 రాష్ట్రాల్లో ఎన్నికలు పూర్తయ్యాయి.

నాయకులను తిడితే జైలుకే!

- ఇండోనేషియాలో అమల్లోకి కొత్త చట్టం

జకార్తా: ఇండోనేషియాలో గురువారం అమలులోకి వచ్చిన ఓ చట్టం తీవ్ర విమర్శలపాలవుతున్నది. ఈ చట్టం ప్రకారం జాతీయస్థాయి రాజకీయ నాయకులను గనుక సాధారణ పౌరులు విమర్శిస్తే జైలు శిక్ష విధించేలా నిబంధనలను రూపొందించారు. దేశంలో ప్రజాస్వామ్య విలువలకు ఇది గొడ్డలి పెట్టు లాంటిదని ప్రజాస్వామ్యవాదులు ఆరోపిస్తున్నారు. ఈ చట్టం ప్రకారం పార్లమెంట్ లేదా సభ్యులపట్ల అగౌరవంగా మాట్లాడినా నేరమే. ఈ నేరానికి ఎన్నేండ్లు జైలు శిక్ష విధించాలనే నిబంధనలను మాత్రం రూపొందించలేదు. దీంతో భారీ శిక్షలు పడే అవకాశం ఉన్నదని పలువురు భావిస్తున్నారు.

ఇరాన్ అణ్వస్త్రాన్ని తయారుచేస్తే మేమూ చేస్తాం

సౌదీ రాజు మహ్మద్ బిన్ సల్మాన్ వెల్లడి

వాషింగ్టన్: ఇరాన్ తయారు చేస్తే, తాము కూడా రూపొందిస్తామని సౌదీ అరేబియా రాజు మహ్మద్ బిన్ సల్మాన్ తెలిపారు. ఇరాన్ సుప్రీం నాయకుడు అయతుల్లా ఖైమేనీని హిట్లర్‌తో పోల్చారు. తమకు అణ్వస్త్రాన్ని రూపొందించాలన్న ఆలోచనే లేదన్నారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో సమావేశమయ్యేందుకు వాషింగ్టన్ చేరుకున్న సల్మాన్ ఓ టీవీ చానెల్‌కు ఇంటర్వ్యూ ఇచ్చారు. 'నాడు అడాల్ఫ్ హిట్లర్ ఎంత ప్రమాదకారో పలు ప్రపంచ దేశాలు తమను కబళించే వరకు గుర్తించలేదు. కానీ మధ్యప్రాచ్యంలో అదే పరిణామం జరుగాలని నేను కోరుకోవడం లేదు' అని ఆయన స్పష్టం చేశారు.

మా నాన్న ఆధార్ వివరాలు తిరిగిచ్చేయాలి

సుప్రీంకోర్టును ఆశ్రయించిన ఓ కొడుకు

న్యూఢిల్లీ: ఓ విచిత్రమైన కేసులో, ఓ వ్యక్తి ఆధార్ కార్డు కోసం సేకరించిన తన తండ్రి బయోమెట్రిక్ వివరాలను తిరిగి తనకిచ్చేలా యూఐడీఏఐని ఆదేశించాలని కోరుతూ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. తన తండ్రి మరణించినందున ఇక ఆయన వివరాలు యూఐడీఏఐకి పనికిరావని, అవి దుర్వినియోగం అయ్యే అవకాశం ఉందని బెంగళూరు వాసి సంతోష్ మిన్ బీ పేర్కొన్నారు. ఏడాదిన్నర క్రితం పీఎఫ్ కార్యాలయంలో లైఫ్ సర్టిఫికెట్ భర్తీ చేసేటప్పుడు అధికారులు దురుసుగా ప్రవర్తించడంతో పొందిన అవమానభారంతో మరణించారని తెలిపారు. వృద్ధాప్యం, కండ్లకు క్యాటరాక్ట్ శస్త్రచికిత్స జరిగిన కారణంగా ఆ రోజు ఆయనకు నిర్వహించిన బయోమెట్రిక్ పరీక్ష విఫలమైందని చెప్పారు. ఆధార్ కార్డులు జారీచేసే యూఐడీఏఐ సంస్థను తన తండ్రి బయోమెట్రిక్ వివరాలను ఒక ముద్రణ రూపంలో తిరిగిచ్చేయాలని కోర్టు ఆదేశించాలని, తాను వాటిని భావితరాల కోసం దాచి ఉంచుకుంటానని చెప్పారు. ఈ కేసుపై తదుపరి విచారణ ఈ నెల 20న జరుగనుంది.

నమస్తే తెలంగాణ
విహారం
[హైదరాబాద్]
శుక్రవారం 16 మార్చి 2018

హబ్సీల గూడు.. హబ్సీగూడ

ప్రపంచంలోనే ఒక ప్రత్యేకమైన గుర్తింపు కలిగిన నగరం హైదరాబాద్. ఇక్కడి ప్రతీ ఏరియాకూ ఒక్కో విశిష్టత ఉంటుంది. ఆ విశిష్టతను బట్టే వాటి పేర్లు ప్రాధాన్యతను సంతరించుకొన్నాయి. అలాంటిదే హబ్సీగూడ. హైదరాబాద్‌లో ఈ ప్రాంతం గురించి ప్రత్యేకంగా పరిచయం అవసరం లేదు. అసలీ ప్రాంతానికి ఆ పేరెలా వచ్చిందో తెలుసా?

పూర్వకాలంలో ఈశాన్య ఆఫ్రికాకు చెందిన హబ్సీలు హైదరాబాద్‌కు వలస వచ్చేవారట. ఇక్కడి పాలకుల దగ్గర కూలీలుగా, పశువుల కాపరులుగా పనిచేసేవారు. అలా వచ్చినవారు ఒక దగ్గర స్థావరాన్ని ఏర్పర్చుకుని స్థిరపడిపోయారు. వారి పేరు మీదనే ఈ ప్రాంతం హబ్సీగూడగా స్థిరపడిపోయింది. నిజానికి ఆఫ్రికా, భారత్ మధ్య సంబంధాలు శతాబ్దాల పూర్వం నుంచే కొనసాగుతున్నాయి. అలా ఆఫ్రికా ఖండం నుంచి ఎక్కువమంది బానిసలుగా, వర్తకులుగా భారత్‌కు అటు పిమ్మట హైదరాబాద్‌కు వచ్చారు. అనుకోకుండా జరిగిన కొన్ని యుద్ధాల్లో, దురాక్రమణల్లో కీలక పాత్ర పోషించారు. ద్వార పాలకులుగా, సైనికులుగా, అంగరక్షకులుగా సేవలు అందించేవారు. గోల్కొండ సుల్తాన్లు కూడా తమ అంగరక్షక పరివారంలో ఈ ఆఫ్రికన్లు చోటు కల్పించారు. ప్రధానమైన సైనిక కార్యకలాపాల్లోనూ వారికి ప్రాముఖ్యతనిచ్చేవారు. కాలక్రమేణ వారి ప్రాధాన్యం పెరిగి.. బానిసలుగా వచ్చినవారు బాద్‌షాలుగా మారిపోయారు. అలాంటివారిలో ఒకరు మాలిక్ అంబర్. సైనిక వ్యూహకర్తగా, మొఘల్ చక్రవర్తులను ఎదిరించిన ధీశాలిగా పేరు గడించాడు. ఒక్క హైదరాబాద్‌లోనే కాదు దేశంలో చాలా ప్రాంతాల్లో ఈ హబ్సీల మూలాలు కనిపిస్తాయి. ఆనాటి హబ్సీల వారసులు నేటికీ హైదరాబాద్ హబ్సీగూడలో కనిపిస్తారు. సో.. హబ్సీగూడ పేరు వెనకున్న కథ ఇదన్నమాట.



ట్రావెలాగ్ - 11



పక్షిగూడు స్టేడియం!

చైనా వాల్ మీద ఆ చివర్నించి ఈ చివరి దాకా నడిచినవారు ఎవరూ లేరు. 2000 సంవత్సరం అక్టోబర్‌లో డియోగో అజుబెల్ అనే అతను ఆరంభించి పదిహేను నెలల పాటు దాని మీద 4000 కిలోమీటర్లు (మూడింట రెండు వంతులు మాత్రమే) నడిచి 2001 సంవత్సరం డిసెంబర్ 31న ముగించాడు. అతను ప్రయాణంలో తీసిన వీడియోలని నేషనల్ జియోగ్రాఫిక్ ఛానల్ ఓ కార్యక్రమంగా ప్రసారం చేసింది.

'ది గ్రేట్ వాల్ ఆఫ్ ఇండియా గురించి మీలో ఎవరికైనా తెలుసా?' హేరిస్ మమ్మల్ని అడిగాడు. సౌత్ ఇండియన్స్‌కి పెద్దగా తెలీదు. కాని ఢిల్లీ నించి వచ్చిన గుప్తాజీ చెప్పాడు రాజస్థాన్‌లో ఉందని. దాన్ని ఎవరు, ఎప్పుడు నిర్మించారంటే మాత్రం ఎవరూ చెప్పలేకపోయారు. మళ్లీ హేరిసే చెప్పాడు. 'ఏడు వందల సంవత్సరాల క్రితం కుంభల్ ఘడ్‌లో మేవార్ రాజా రాణా కుంభ ముప్ఫై ఆరు కిలోమీటర్ల పొడవైన ది గ్రేట్ వాల్ ఆఫ్ ఇండియాని నిర్మించాడు' అని. 2013 జూన్‌లో దీన్ని యునెస్కో ప్రపంచ వారసత్వ ప్రదేశాల జాబితాలో చేర్చిందని, ఇది కొన్ని చోట్ల పదిహేను అడుగుల వెడల్పు కూడా ఉంటుందని ఇంటర్నెట్‌లో చదివాను. పురాతన రక్షణ ఉచ్చులు నేటికీ అక్కడక్కడా పనిచేస్తూండటంతో అందులో చిక్కుకుంటే ప్రమాదం. చైనా వాల్‌ని పర్యాటకులు ఎక్కచ్చు. కాని ది గ్రేట్ వాల్ ఆఫ్ ఇండియాని మాత్రం ఎవరూ ఎక్కకూడదనే నియమం ఉంది.

12 లైన్ల రోడ్డు.. ఒలింపిక్ క్రీడలు

చైనాలో పబ్లిక్ బాత్‌రూమ్స్ అత్యంత అపరిశుభ్రంగా ఉన్నాయి. ఖరీదైనా ఎయిర్ కండిషన్డ్ మాల్స్‌లో కూడా ఇండియాలో లాగా కాకుండా చాలా అశుభ్రంగా ఉన్నాయి. చైనా వాల్ దగ్గర ఉన్న బాత్ రూమ్స్ ఇంకా భయంకరంగా ఉన్నాయి.

పన్నెండున్నరకి అంతా బయలుదేరి మళ్లీ బీజింగ్ నగరంలోకి ప్రవేశించాం. దారిలో హేరిస్ గోల్డెన్ మాస్క్ షో గురించి చెప్పాడు. 'బీజింగ్‌లో గోల్డెన్ మాస్క్ షో అనే నాటకం ప్రదర్శించబడుతోంది. ప్రపంచంలోనే ఇలాంటి షో ఇంకోటి లేదు. గ్రూప్ కన్సెషన్‌తో టిక్కెట్ ధర 280 యువాన్స్. విఐపి సీట్‌లో కూర్చోపెడతాను. రేపు సాయంత్రం ఐదున్నరకి షో. వరు రావాలంటే వారు నాకు రేపు డబ్బు ఇవ్వాలి. ఈ షో మీకు ఒన్స్ ఇన్ ఎ లైఫ్ టైమ్ అవకాశం'.

ట్వల్వ్ లేన్స్ రోడ్డు (వాహనాలు వెళ్లేందుకు ఆరు – వచ్చేందుకు ఆరు లేన్స్) మీద దాన్ని దాటడానికి కట్టిన ఓ పెడస్ట్రియల్ ఫుట్ ఓవర్ బ్రిడ్జి పక్కన బస్సు ఆగింది. 'మనం ఛావోయాంగ్ డిస్ట్రిక్ట్‌లో ఉన్నాం. 2008లో బీజింగ్‌లో ఒలింపిక్ క్రీడలు ఇక్కడే జరిగాయి. అందుకోసం ఇక్కడ ప్రత్యేకంగా ఒలింపిక్స్, ఇంకా సమ్మర్ పారా ఒలింపిక్స్ కోసం నిర్మించిన ఆ స్టేడియం చూడండి. పక్షి గూడులా కనిపిస్తుంది. కాబట్టి దీన్ని ముద్దుగా బర్డ్స్ నెస్ట్ అని పిలుస్తారు. ఇది మెయిన్ స్టేడియం. ఫుట్‌బాల్, వెయిట్ త్రో, డిస్కస్ త్రో, జావెలిన్ త్రో, రన్నింగ్ ట్రాక్ మొదలైన క్రీడలన్నీ ఇందులోనే జరిగాయి. 2003 డిసెంబర్‌లో దీని నిర్మాణం మొదలుపెట్టి 2008 జూన్‌లో ప్రారంభోత్సవం చేశారు. ఒలింపిక్స్ ఆటలు పూర్తయ్యాక దీన్ని పర్యాటక ఆకర్షణగా మార్చారు. ఇప్పుడు ఇక్కడ జాతీయ, అంతర్జాతీయ క్రీడలు నిర్వహిస్తున్నారు. దీని విస్తీర్ణం వంద చదరపు మైళ్లు. మొత్తం ఎనభై వేల ఫిక్స్‌డ్ సీట్లు, పదకొండు వేల టెంపరరీ సీట్లు ఉన్నాయి. ప్రస్తుతం ఈ బీజింగ్ నేషనల్ స్టేడియంని ఫుట్‌బాల్ గేమ్స్‌కి వాడుతున్నారు. దీని నిర్మాణ ఖర్చు 42 కోట్లు 80 లక్షల అమెరికన్ డాలర్స్‌కి సమానం. దీన్ని ఓ స్విస్ ఆర్కిటెక్చర్ ఫర్మ్ నిర్మించింది. దీనికి కన్సల్టెంట్‌గా చైనీస్ ఆర్టిస్ట్ ఐ వీవీ అనే అతను పనిచేశాడు. ఐతే మీ టూర్‌లో ఇది కేవలం ఫొటో స్టాప్ మాత్రమే. కారణం, పార్కింగ్ నించి లోపలికి చాలా దూరం నడవాలి. పైగా ఎంట్రన్స్ టిక్కెట్ కూడా ఉంది. ఇప్పటికే మీరు గ్రేట్‌వాల్ మీద నడిచి చాలా అలసిపోయారు. ఫుట్ ఓవర్ బ్రిడ్జి నించి ఫొటోకి స్టేడియం మొత్తం కవర్ అవుతుంది. పది నిమిషాలు ఫొటోలకి టైం ఇస్తున్నాను' అని చెప్పాడు హేరిస్.



ఇన్‌యాంగ్ బొమ్మలు

ఆ బ్రిడ్జ్ ఎక్కడానికి, దిగడానికి ఎస్కలేటర్, మెట్లు ఉన్నాయి. పక్కనే పేవ్‌మెంట్ మీద ఒకతను సైకిల్ రిక్షా మీద పుల్లలు గుచ్చిన మాంసం చీకులని అమ్ముతున్నాడు. అవన్నీ శుభ్రంగా ఈగలు వాలకుండా ఉన్నాయి. ఒలింపిక్స్ జరిగిన సమయంలో బీజింగ్ నగరంలోని రెస్టారెంట్లలో కుక్కమాంసాన్ని నిషేధించారని చదివాను.

కుడివైపు నించి మెట్లెక్కి బ్రిడ్జి మీదకి చేరుకున్నాం. బ్రిడ్జి మీద పిల్లల బొమ్మలు, టోపీలు, బెలూన్లు, ఇన్ అండ్ యాంగ్ బొమ్మలు మొదలైనవి అమ్ముతున్నారు. చైనాలో స్త్రీని ఇన్ అని, పురుషుల్ని యాంగ్ అని అంటారు. వీరి కలయికని ఇన్‌యాంగ్‌గా పేర్కొంటారు. ఈ ఇన్‌యాంగ్ సింబల్ ఎక్కడ ఉంటే, అక్కడ బ్యాలెన్స్ (విజయం) ఉంటుందని వారి నమ్మకం. కాళ్లు కనబడకుండా కూర్చున్న లక్ష్మీదేవి, రథం మీది శ్రీకృష్ణుడు, అర్జునుడి బొమ్మ విషయంలో కూడా మనకి ఇలాంటి నమ్మకమే ఉంది. యత్ర పార్థో ధనుర్ధరః అనే శ్లోకం అర్థం ఇదే.

అక్కడి నించి దూరంగా స్టేడియం, దాని ముందు చక్కటి లాండ్‌స్కేప్ కనిపిస్తోంది. గుండ్రంగా ఉన్న ఆ స్టేడియం చుట్టూ నిలువుగా ఉన్న ఇనుప పిల్లర్స్ వల్ల పక్షి పుల్లలతో కట్టే గూడును గుర్తు తెచ్చేలా కనిపిస్తోంది. ఫొటోలు తీసుకున్నాక బస్సు ఎక్కాం.

(ఇంకా ఉంది)

... మల్లాది వెంకట కృష్ణమూర్తి

పెరుగుతున్న విగ్రహం.. పెద్దపల్లి వరాహస్వామి

దశావతారాల్లో ప్రసిద్ధమైనది వరాహావతారం. జల ప్రళయంలో చిక్కుకున్న భూమాతను.. శ్రీ మహావిష్ణువు వరాహావతారం ఎత్తి కోరలపై ఎత్తిపట్టి రక్షించాడని పురాణాలు చెబుతున్నాయి. ఆ స్వామే ప్రస్తుత పెద్దపల్లి జిల్లా కమాన్‌పూర్‌లో దివరాహస్వామిగా పూజలందుకొంటున్నాడు.



హిరణ్యాక్షుడి రాక్షస కాండ నుంచి భూమాతను రక్షించేందుకు అవతరించిన వరాహస్వామికి మనదేశంలో ఆలయాలు చాలా తక్కువ. తెలుగు రాష్ట్రాల్లో కేవలం రెండు ప్రాంతాల్లోనే స్వామివారికి ఆలయాలు ఉండేవి. తిరుమలలోని శ్రీ వెంకటేశ్వరస్వామి సన్నిధిలో ఒకటి ఉండగా, ఇంకోటి పెద్దపల్లి జిల్లా కమాన్‌పూర్‌లో ఉన్నది. అలక చెంది భూలోకానికి వచ్చిన లక్ష్మీదేవిని వెతుకుతూ శ్రీవారు వచ్చినప్పుడు.. వరాహస్వామే ఆయనకు ఆశ్రయమిచ్చారట. అందుకు ప్రతిగా తన కొండకు వచ్చే భక్తులు మొదట వరాహస్వామినే దర్శించుకొనేలా వరమిచ్చారట శ్రీవారు.

కొంగు బంగారం

తిరుమల వరాహస్వామి తర్వాత అంతటి ప్రసిద్ధిచెందిన క్షేత్రం కమాన్‌పూర్ ఆదివరాహస్వామి సన్నిధి. విశేషమైన చరిత్ర కలిగిన ఈ స్వామి.. కోరిన కోర్కెలు తీరుస్తూ భక్తుల కొంగుబంగారంగా విలసిల్లుతున్నాడు. వరాలిచ్చు ఆది వరాహస్వామిగా ప్రఖ్యాతి పొందిన స్వామి.. ప్రతి నిత్యం అర్చనలు, ప్రత్యేక పూజలు అందుకుంటున్నాడు. స్వామి దర్శనార్థం తెలంగాణ నలుమూలల నుంచి అశేషసంఖ్యలో భక్తులు తరలివస్తుంటారు.

ఏటికేడు పెరుగుతున్న విగ్రహం

కొన్నేళ్ల క్రితం చిన్న ఎలుక ఆకారంలో వెలిసిన ఆది వరాహస్వామి విగ్రహం.. ఏటికేడు పెరుగుతూ ఉండడం విశేషం. ప్రస్తుతం విగ్రహం రెండున్నర అడుగుల కంటే ఎక్కువగా పెరిగింది. ఈ రాతి విగ్రహంపై వెంట్రుకలు కనిపించడం అబ్బురపరుస్తుంది. ఈనేల స్వామివారు నడయాడిన ప్రాంతంగా చెప్పుకొనేందుకు స్పష్టమైన ఆనవాళ్లున్నాయి. ఆయన నడిచి వచ్చిన పాదాల గుర్తులు సమీపంలోని మరో బండరాయిపై దర్శనమిస్తాయి. ఇవి సాక్షాత్తు ఆ దేవదేవుడి పాదముద్రికలుగా కొలుస్తారు భక్తులు.



ఎక్కడ ఉన్నది?

ఈ క్షేత్రం పెద్దపల్లి జిల్లా కమాన్‌పూర్ మండల కేంద్రంలో ఉన్నది. కమాన్‌పూర్, జూలపల్లి గ్రామాల శివారులో వెలిసింది.

ఎలా వెళ్లాలి?

హైదరాబాద్ నుంచి పెద్దపల్లి చేరుకొని, అక్కడి నుంచి ఈ క్షేత్రానికి చేరుకోవచ్చు. మంథని వెళ్లే బస్సులన్నీ ఈక్షేత్రం మీదుగానే వెళుతాయి. పెద్దపల్లి, గోదావరిఖని మధ్య కమాన్‌పూర్ మీదుగా బస్సులు, ఆటోలు కూడా అందుబాటులో ఉన్నాయి. సొంత వాహనాల్లోనూ చేరుకోవచ్చు.

స్థల పురాణం!

సుమారు ఆరు వందల సంవత్సరాల క్రితం ఒక మహర్షి ఈ ప్రదేశంలో తపస్సు చేస్తుండగా.. స్వామి వారు కలలో ప్రత్యక్షమై వరం కోరమన్నాడట. అందుకు సంతోషించిన మహర్షి.. స్వామిని ఇక్కడే వెలిసి ప్రజలకు ఎలాంటి ఆపదా రాకుండా కాపాడమని వేడుకున్నాడట. నిస్వార్థమైన ఆయన కోరికను మన్నించి స్వామివారు ఇక్కడ వెలిశారని ఇక్కడి శాసనాల ద్వారా తెలుస్తున్నది.

ఇక్కడి ఆదివరాహస్వామికి వరాలస్వామిగా పేరు. ఈ స్వామి సన్నిధిలో ఏదైనా కోరిక కోరుకుంటే తప్పక నెరవేరుతుందని భక్తుల ప్రగాఢ విశ్వాసం. అలా ఎందరో భక్తులు తమ కోరికలు నెరవేరినందుకు.. మొక్కులు చెల్లిస్తుంటారిక్కడ.

గుడిలేని దేవుడు

అందరికీ వరాలిచ్చే ఈ వరాహస్వామికి మాత్రం గుడి ఉండదు. పచ్చనిచెట్లు, బండరాళ్ల మధ్యే కొలువై ఉంటాడు. క్షణం తలుచుకో..అనుక్షణం కాపాడుతానంటాడు. కొన్నేళ్ల క్రితం ఒక భక్తుడు స్వామివారికి గుడికట్టాలని సంకల్పించాడట. అయితే స్వామివారు కలలో కనిపించి.. తనకు ఆలయం వద్దని చెప్పడంతో విరమించుకున్నాడట. ఆ సొమ్మును భక్తులకు సౌకర్యాలు కల్పించేందుకు వెచ్చించాడట. అలా స్వామివారి మహత్మ్యం రాష్ట్ర నలుమూలలా వ్యాపించడంతో భక్తుల తాకిడి ఎక్కువైంది.

... మధుకర్ వైద్యుల

వెచ్చని శీతాకాలం!

శీతాకాలం వెచ్చగా ఉండడమేమిటి? చల్లగా ఉంటుంది కదా! అని ఆశ్చర్యపోతున్నారా. అది ఎక్కడో తెలుసుకోవాలనుకుంటున్నారా? తెలిస్తే మాత్రం ఔరా అనకుండా ఉండలేరు.

ప్రపంచంలో సాధారణ ప్రాంతాలకు వింటర్ సీజన్ కొన్ని నెలల పాటే వస్తుంది. అయితే హిమప్రాంతాల్లో ఆ చల్లదనం ఏడాది పొడవునా ఉంటుంది. ఆర్కిటిక్ సముద్ర ప్రాంతంలో అది మరీ ఎక్కువ. మామూలు రోజుల్లోనే అక్కడ ఉష్ణోగ్రత మైనస్ డిగ్రీల్లో ఉంటుంది. అలాంటి శీతాకాలంలో ఎంత దారుణంగా ఉంటుందో ఊహించుకోవచ్చు. అయితే ఈసారి అక్కడ శీతాకాలం కాస్త వెచ్చగా వచ్చి వెళ్లిందట. రికార్డు స్థాయిలో ఎన్నడూ లేనంతగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయని పరిశోధకులు చెబుతున్నారు. ఇలాంటి పరిస్థితిని ఇంతకు ముందెన్నడూ ఆర్కిటిక్‌లో చూడలేదని స్పష్టంచేశారు. సాధారణంగా ఫిబ్రవరి వచ్చిందంటే చాలు కేప్‌మొర్రిస్‌లో గడ్డకట్టిపోయేంత చలి ఉంటుందని, కానీ ఈసారి అక్కడ వెచ్చని ఉష్ణోగ్రతలు నమోదయ్యాయట. ఆర్కిటిక్ పరిసర ప్రాంతమంతా సాధారణం కంటే 18 డిగ్రీల ఉష్ణోగ్రత ఎక్కువగా నమోదైనట్టు గుర్తించారు. ఆర్కిటిక్‌లో ఇలాంటి హాటెస్ట్ వింటర్ ఒక రికార్డుగాఎబుతున్నారు. సముద్ర మంచు కప్పబడిన విస్తీర్ణం పోయినేడాదితో పోలిస్తే ఈసారి తక్కువగా ఉండడాన్ని గమనించిన శాస్త్రవేత్తలు ఇది రికార్డు వింటర్‌గా నిర్ధారించారు. ఆర్కిటిక్‌లో వచ్చిన వెచ్చని శీతాకాలంగా అభివర్ణిస్తున్నారు. అంతేకాదు శీతాకాలంలోనే ఇంతలా కరిగిపోయిన మంచు, వేసవిలో మరింత కరిగిపోయే అవకాశం లేకపోలేదంటున్నారు.



మీరు తరచుగా ప్రయాణాలు చేస్తుంటారా? దేశవ్యాప్తంగా ఊళ్లు చుట్టి వస్తుంటారా? పుణ్యక్షేత్రాలైనా, విహారయాత్రలైనా... వినోదం కోసమైనా, విజ్ఞానం కోసమైనా... మీరు చేసిన ప్రయాణం మాకెంతో ప్రియమైనది. మీ ప్రయాణానుభవాలు మరెందరికో ఉపయోగపడవచ్చు.

సరదాగా నిరంతర ప్రయాణాలు చేస్తున్నా, ఒత్తిడి నుంచి ఉపశమనం కోసం అప్పుడప్పుడూ టూర్లు వెళ్తున్నా... మీరు వెళ్లిన ప్రదేశం, దాని విశిష్టత, అక్కడి మీ అనుభవాలు, వెళ్లడానికి కారణాలు... వివరంగా మాకు రాసి పంపండి. మీ భావాలూ, భావోద్వేగాలు, అనుభవాల సమాహారాన్ని పేపర్‌పై పెట్టండి. అక్షరబద్ధం చేయండి. అంతేకాదు.. మీ ఊళ్లో, మీ చుట్టుపక్కల ప్రదేశాల్లో ఏమైనా ప్రత్యేకతలున్నా, పుణ్యక్షేత్రాలూ, జాతరలూ, ప్రత్యేక సంప్రదాయాలున్నా మాకు తెలుపండి. మీ పేరుతో ప్రచురిస్తాం.

మరింకేం.. రాయడం మొదలుపెట్టండి.



మా చిరునామా
విహారం (నా ప్రయాణం), నమస్తే తెలంగాణ, తెలంగాణ పబ్లికేషన్స్ ప్రై. లిమిటెడ్, రోడ్ నెం. 10, బంజారాహిల్స్, హైదరాబాద్ – 34.
viharam@ntnews.com

సుడోకు

డైలీ సుడోకు 151 సమాధానం

1	5	4	9	3	8	2	7	6
6	7	9	1	4	2	8	3	5
8	2	3	7	5	6	4	9	1
4	8	5	2	7	9	6	1	3
7	3	1	6	8	4	5	2	9
9	6	2	3	1	5	7	8	4
5	1	6	8	2	3	9	4	7
2	9	7	4	6	1	3	5	8
3	4	8	5	9	7	1	6	2

1. నిలువుగా, అడ్డంగా ప్రతివరుసలోనూ 1 నుంచి 9 వరకు అంకెలను నింపాలి.
2. ఒకసారి రాసిన అంకెను మరోసారి నింపకూడదు.
3. ప్రతి గడిలోనూ నింపిన అంకెను మళ్లీ నింపకూడదు.

సమాధానం రేపటి సంచికలో

డైలీ సుడోకు - 152

4		6				2		9
5	7		2		6			
		1			5			8
6		3	4	8	1	7		
7			5			3		
		5						
	8	9				4	3	
	6							1
3		4					6	7

ట్వీట్



ఒక ఉదయం..
ఒక కొత్త నైపుణ్యం నేర్చుకుంటూ..



కెవిన్ పీటర్సన్
@KP24

పీటర్సన్‌ను ట్విట్టర్‌లో ఫాలో అవుతున్న వారి సంఖ్య
3,647,673

కామన్‌మ్యాన్ వాయిస్

ప్రసంగం రెండుసార్లు విన్నాక నాకు అర్థమయ్యిందేంటంటే.. లోకేశం, బాలయ్య, టీవీ9 రజినీకాంత్, బీకాంలో ఫిజిక్స్, డైపర్ ఆది, స్కూల్ కొరివి దయ్యం.. వీళ్లందరిలో లేని నేర్చుకోవడం అనే అరుదైన లక్షణం పవనాల్లో పిసరంత(మరీ ఎక్కువ కాదు) ఉందని.

–Indus Martin

ప్రజాస్వామ్య పరిరక్షణ దీక్ష అనే పేరు పెట్టుకున్నారు. కానీ అసెంబ్లీని మించిన ప్రజాస్వామ్యం ఎక్కడుంటుందో తెలియదు. ప్రజాస్వామ్యానికే నిలువెత్తు నిదర్శనం అయిన అసెంబ్లీని అగౌరవపరిచి ప్రజాస్వామ్య పరిరక్షణ అంటూ బయలుదేరిన విధానాన్ని చూసిన జనం ఇంతకన్నా పెద్ద జోక్ ఏముంటుందని నవ్వుకుంటున్నారు.


–నజీర్ మహ్మద్

వైరల్ వీడియో



ఒక ఉద్యోగి ఆటోడ్రైవర్‌లా ప్రవర్తిస్తే ఎలా ఉంటుంది? రచ్చ రచ్చ అవుతుంది. కావాలంటే చూడండి ఈ రచ్చ.

TSP's If Employees Behave like Autowalas
Total views : 1,064,787+
Published on Mar 12, 2018


TRIDENT ARTS
NORTHSTAR ENTERTAINMENT PVT. LTD.
HIGHLY ACCLAIMED AWARD WINNING FILM
ఉగాది శుభాకాంక్షలతో నేడే విడుదల
LADY SUPERSTAR Nayanthara in
కర్తవ్యం
PRODUCERS SHARRATH MARAR - R. RAVINDRAN
WRITTEN & DIRECTED BY GOPI NAINAR
SINDHU GRAFIX PAVAN KUMAR
EXECUTIVE PRODUCER M.SRINIVASA RAO
PETER HEIN GHIBRAN RUBEN OMPRAKASH LALGUDI N ILAYARAJA GULABI SRINU
RAJESH M. MURTHY UMA DEVI RAVI RANGANATHAN RAJU RAJA KRISHNAN NAREN-MURTHY S. KALAI SELVAN PRO. SKN



అసెంబ్లీలో ఆర్థిక మంత్రి ఈటలకు అభినందనలు తెలుపుతున్న మంత్రి హరీశ్‌రావు

సాహిత్య కళారంగాల వికాసానికి ప్రోత్సాహం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఈ ఏడాది బడ్జెట్‌లో సాహిత్య సాంస్కృతిక కళారంగాల వికాసం కోసం రూ.58 కోట్లు కేటాయించారు. రాష్ట్ర ప్రభుత్వం 2014 నుంచి తెలంగాణ వైతాళికుల పేరిట ఇస్తున్న అవార్డులకు, తెలంగాణ సంస్కృతికి ఆయువుపట్టుగా ఉన్న బతుకమ్మ పండుగ నిర్వహణకు నిధులు కేటాయించారు. బోనాల పండుగను తెలంగాణ అంతటా ఘనంగా నిర్వహించేందుకు నిధులను వ్యయంచేస్తారు. సాహిత్యఅకాడమీ ద్వారా పరిశోధనలు, ప్రచురణలకు కూడా కేటాయింపులు జరిపారు.

టీఎస్సార్టీసీని గట్టెక్కించేందుకు నిధులు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: నష్టాల్లో ఉన్న ఆర్టీసీని ఆదుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం 2018-19 వార్షిక బడ్జెట్‌లో రూ.975 కోట్లు కేటాయించింది. కొత్త బస్సుల కొనుగోలుకు రూ.140 కోట్లు, రీయింబర్స్‌మెంట్, సంస్థ ఇస్తున్న రాయితీల కోసం రూ.520 కోట్లు, ఇప్పటి వరకు తీసుకున్న రుణాలకు ప్రభుత్వ పూచీకత్తు కింద రూ.315 కోట్లను కేటాయించారు. ప్రధానంగా సంస్థను ప్రగతి బాటలో నడిపించాలనే సంకల్పంతోనే భారీగా నిధులు కేటాయించడంపై ఆర్టీసీ అధికారులు హర్షం వ్యక్తంచేశారు.

రాజ్‌భవన్‌కు రూ. 21 కోట్లు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రప్రభుత్వం రాజ్‌భవన్ కార్యకలాపాల నిర్వహణకు రూ.21 కోట్లు కేటాయించింది. ఇందులో గవర్నర్ జీత భత్యాలతో పాటు కార్యాలయ నిర్వహణ, అధికారులు, సిబ్బంది జీతభత్యాలు కూడా కలిపి ఉన్నాయి. నిర్వహణ పద్దు కింద రూ.18.97 కోట్లు, ప్రగతి పద్దుకింద రూ.2.17 కోట్లను రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించింది. రాజ్‌భవన్ సెక్రటేరియట్ నిర్వహణకు రూ. 42.09 లక్షలు, రాజ్‌భవన్ గార్డెన్ నిర్వహణకు రూ.3 లక్షలు కేటాయించారు.

వ్యవసాయంలో యాంత్రీకరణ	– రూ. 522.00 కోట్లు
రైతులకు వడ్డీలేని రుణాలు	– రూ. 500 కోట్లు
నియోజకవర్గ అభివృద్ధి పథకం	– రూ. 480 కోట్లు
ఉద్యోగులు మరియు జర్నలిస్టుల ఆరోగ్య పథకం	– రూ. 300 కోట్లు
యాదిగిరిగుట్ట టెంపుల్ డెవలప్‌మెంట్ అథారిటీ	– రూ.250 కోట్లు
వేములవాడ టెంపుల్ డెవలప్‌మెంట్ అథారిటీ	– రూ.100 కోట్లు
భద్రాచలం టెంపుల్ డెవలప్‌మెంట్ అథారిటీ	– రూ.100 కోట్లు
బాసర టెంపుల్ డెవలప్‌మెంట్ అథారిటీ	– రూ.50 కోట్లు
ధర్మపురి టెంపుల్ డెవలప్‌మెంట్ అథారిటీ	– రూ.50 కోట్లు
కలెక్టరేట్ల నిర్మాణం	– రూ. 500 కోట్లు
కమాండ్ కంట్రోల్ సెంటర్	– రూ.280.80 కోట్లు
విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్	– రూ.10 కోట్లు
రజకుల సహకార సొసైటీ	– రూ.250 కోట్లు



హైదరాబాద్ రోడ్ల అభివృద్ధికి **750 కోట్లు**




ఎన్నారైశాఖకు నిధులు భేష్

తెలంగాణ ప్రభుత్వం గురువారం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఎన్నారై శాఖకు రూ.100 కోట్లు కేటాయించడం హర్షణీయం. తద్వారా తెలంగాణ ప్రభుత్వం దేశంలోని అన్ని రాష్ట్రాలకు ఆదర్శంగా, మార్గదర్శకంగా నిలిచింది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు, ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి కే తారకరామారావుకు తెలంగాణ ఎన్నారైల తరపున ధన్యవాదాలు తెలుపుతున్నాం.

– మహేశ్ బిగాల, టీఆర్‌ఎస్ ఎన్నారై కో ఆర్డినేటర్, న్యూజెర్సీ

పట్టణాభివృద్ధికి ప్రథమ ప్రాధాన్యం

- హైదరాబాద్ అభివృద్ధికి రూ.3503 కోట్లు
- వరంగల్ నగర అభివృద్ధికి రూ.300 కోట్లు



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలో పట్టణీకరణ వేగంగా పెరుగుతున్న నేపథ్యంలో అందుకనుగుణంగా ప్రభుత్వం బడ్జెట్‌లో భారీగా నిధులు ప్రతిపాదించింది. పురపాలకశాఖకు పెద్దఎత్తున రూ.7251 కోట్లు ప్రతిపాదించింది. గత ఏడాదికంటే అదనంగా రూ.662 కోట్లు కేటాయించింది. బడ్జెట్‌లో పురపాలకశాఖకు ప్రతిపాదించిన బడ్జెట్‌లో అగ్రభాగం హైదరాబాద్‌కు కేటాయించింది. సుమారు కోటి జనాభా ఉన్న హైదరాబాద్‌కు రూ.3503 కోట్ల నిధులు కేటాయించారు. జలమండలికి రూ.1420.50 కోట్లు, మెట్రోరైల్‌కు రూ.200 కోట్లు, హెచ్‌ఎండీఏకు రూ.250 కోట్లు, ఔటర్ రింగ్‌రోడ్ పనులకు రూ.235 కోట్లు, కులీ కుతుబ్‌షా అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (కుడా)కి రూ.4 కోట్లు, మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్‌కు రూ.377.35 కోట్లు కేటాయించారు. వచ్చే 40 ఏండ్ల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకున్న సర్కారు.. ట్రాఫిక్‌కు చెక్‌పెట్టాలనే లక్ష్యంతో హైదరాబాద్ రోడ్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌కు రూ.566.02 కోట్లు, హైదరాబాద్ మెట్రో ఎయిర్‌పోర్ట్ ఎక్స్‌ప్రెస్‌కు రూ.400 కోట్లు, మల్టీ మోడల్ సబర్బన్ రైల్ ట్రాన్స్‌పోర్ట్ సిస్టమ్‌కు రూ.50 కోట్లు కేటాయించారు. హైదరాబాద్ తర్వాత అతిపెద్ద నగరమైన వరంగల్‌ను అభివృద్ధికి ప్రతిఏటా ప్రభుత్వం బడ్జెట్‌లో రూ.300 కోట్లు కేటాయిస్తున్నది. ఈ సారి కూడా అంతేమొత్తం కేటాయించింది. స్మార్ట్ సిటీలకు రూ.89.39 కోట్లు, అమృత్ పట్టణాలకు రూ.313.63 కోట్లు బడ్జెట్‌లో ప్రతిపాదించారు. యాదగిరిగుట్ట ఆలయ అభివృద్ధి అథారిటీకి రూ.250 కోట్లు, వేములవాడ ఆలయ అభివృద్ధి అథారిటీకి రూ.100 కోట్లు, భద్రాచలం ఆలయ అభివృద్ధి అథారిటీకి రూ.100 కోట్లు, ధర్మపురి ఆలయ అభివృద్ధి అథారిటీకి రూ.50 కోట్లు, బాసర ఆలయ అభివృద్ధి అథారిటీకి రూ.50 కోట్లు కేటాయించారు. స్వచ్ఛభారత్ కార్యక్రమానికి రూ.125 కోట్లు, వడ్డీలేని రుణాలకు రూ.141.64 కోట్లు, కొత్త మున్సిపాలిటీల అభివృద్ధికి రూ.1933.37 కోట్లు, అర్బన్ మిషన్ భగీరథకు రూ.4.28 కోట్లు బడ్జెట్‌లో ప్రభుత్వం ప్రతిపాదించింది. రాష్ట్రంలోని మిగతా కార్పొరేషన్లలో అభివృద్ధి పనుల కోసం రూ.400 కోట్లు కేటాయించింది.

ఆర్థిక క్రమశిక్షణకు ప్రాధాన్యం

- సమగ్ర ఆర్థిక నిర్వహణ విధానం కోసం రూ.44.17 కోట్లు
- ప్రత్యేక అభివృద్ధి నిధికి రూ.2,264.10 కోట్లు
- నియోజకవర్గాల అభివృద్ధి నిధికి రూ.362.25 కోట్లు
- గజ్వేల్ డెవలప్‌మెంట్ అథారిటీకి రూ.65 కోట్లు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు భారీ ఎత్తున ఖర్చుచేస్తున్న సర్కారు.. ఆర్థిక క్రమశిక్షణకూ ప్రాముఖ్యమిస్తున్నది. నిధుల కేటాయింపులు, ఖర్చుల విషయంలో ఉదారంగా వ్యవహరిస్తున్నప్పటికీ, ఎక్కడ కూడా నిధులు వృధా కాకుండా, దారి మళ్లకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నది. అలాగే ప్రభుత్వ ఆదాయానికి ఎక్కడా గండిపడకుండా పకడ్బందీ చర్యలు చేపట్టింది. ఆర్థికశాఖ ప్రత్యేకంగా సమగ్ర ఆర్థిక నిర్వహణ విధానాన్ని అమల్లోకి తెచ్చింది. ఈ విధానాన్ని నిర్వహించడం కోసం బడ్జెట్‌లో రూ.44.17 కోట్లు కేటాయించింది. ఆర్థిక క్రమశిక్షణను పాటిస్తున్న ఆర్థికశాఖ అదే సమయంలో తీసుకున్న రుణాల చెల్లింపులపై దృష్టి కేంద్రీకరించింది. ముఖ్యంగా తీసుకున్నరుణాలకు షెడ్యూల్ ప్రకారం చెల్లింపులు చేసేవిధంగా బడ్జెట్‌లో కేటాయింపులు జరిపింది. ఈ మేరకు వివిధ సంస్థల నుంచి తీసుకున్న రుణాలకు వడ్డీతో సహా అసలు కూడా కొంతకొంత చెల్లించే విధంగా ఈ బడ్జెట్‌లో రూ.11,691.11 కోట్లు పక్కనపెట్టింది. అలాగే జీవితకాలం ప్రభుత్వంలోని వివిధ శాఖలు, సంస్థలలో పనిచేసి, పదవీ విరమణ చేసిన ఉద్యోగులకు ఇవ్వాల్సిన ప్రయోజనాలు, పెన్షన్లకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా బడ్జెట్‌లో రూ.11,673.60 కోట్లు కేటాయించింది. పదవీ విరమణ చేసిన ఉద్యోగికి ఇవ్వాల్సినవన్నీ ఇచ్చి ప్రభుత్వ వాహనంలో సగౌరవంగా ఇంటికి పంపించాలని ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు ఇదివరకే ఆదేశించారు. ఉద్యోగుల జీతభత్యాలతోపాటు పెన్షన్ల కోసం ఆర్థికశాఖ ప్రతినెల రూ.2వేల నుంచి రూ.2500 కోట్లు కేటాయిస్తున్నట్టు తెలిసింది. అలాగే ప్రణాళికశాఖ కింద పలు పథకాలకు ప్రభుత్వం భారీగా నిధులు కేటాయించింది. ప్రత్యేక అభివృద్ధి నిధికి రాష్ట్ర ప్రభుత్వం ఈ బడ్జెట్‌లో రూ.2264.10 కోట్లు కేటాయించింది. అలాగే ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల నియోజకవర్గ అభివృద్ధి నిధికి రూ.362.26 కోట్లు ప్రతిపాదించింది. విపత్కర పరిస్థితులలో నిధుల వినియోగానికి ఉద్దేశించిన క్రూషియల్ బ్యాలెన్సింగ్ ఫండ్‌కు ప్రభుత్వం రూ.155 కోట్లు కేటాయించింది. గజ్వేల్ డెవలప్‌మెంట్ అథారిటీకి రూ.65 కోట్లు, బ్రాహ్మణ పరిషత్‌కు రూ.100 కోట్లు కేటాయించింది.

యూనివర్సిటీలకు మహర్దశ

- బడ్జెట్‌లో భారీగా రూ.820 కోట్లు కేటాయింపు
- విద్యాశాఖకు రూ.13,278.17 కోట్లు
- పాఠశాల విద్యాశాఖకు రూ.10,830.29 కోట్లు
- ఉన్నత, సాంకేతిక విద్యాశాఖకు రూ.2,447.87 కోట్లు

శాఖ	నిర్వహణ పద్దు	ప్రగతి పద్దు	మొత్తం
పాఠశాల విద్యా శాఖ	8,685.79 కోట్లు	2,144,50 కోట్లు	10,830.29 కోట్లు
ఉన్నత విద్యా శాఖ	1,663.63 కోట్లు	361.93 కోట్లు	2,025.56 కోట్లు
సాంకేతిక విద్యా శాఖ	361.46 కోట్లు	60.85 కోట్లు	422.31 కోట్లు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలోని యూనివర్సిటీలకు మహర్దశ పట్టబోతున్నది. 2018-19 వార్షిక బడ్జెట్‌లో మొత్తం యూనివర్సిటీల కోసం భారీగా నిధులు పెంచింది. యూనివర్సిటీలలో టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బంది జీతభత్యాలతోపాటు అభివృద్ధిపైనా ప్రభుత్వం దృష్టి సారించింది. అందుకు రూ.820 కోట్లు కేటాయించింది. ఇందులో సింహభాగం యూనివర్సిటీలలో నూతన భవన నిర్మాణాలు, అభివృద్ధికి రూ.210 కోట్లు ఇవ్వాలని ప్రతిపాదించారు. యూనివర్సిటీల పద్దు కింద ఉస్మానియా యూనివర్సిటీకి రూ.369.54 కోట్లు, కాకతీయ యూనివర్సిటీకి రూ.112.41 కోట్లు కేటాయించినట్టు బడ్జెట్‌లో తెలిపారు. రాష్ట్రంలోని 11 యూనివర్సిటీలలో త్వరలో 1,061 టీచింగ్ పోస్టుల భర్తీకి త్వరితగతిన నోటిఫికేషన్లు విడుదల కాబోతున్నాయి. అలాగే నాన్-టీచింగ్ పోస్టులను కూడా భర్తీ చేసే ఆలోచనలో యూనివర్సిటీలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో యూనివర్సిటీల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్ కేటాయింపుల రూపంలో ఇతోధికంగా చేయూతను అందిస్తున్నది. గురువారం రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో ప్రవేశ పెట్టిన వార్షిక బడ్జెట్‌లో విద్యాశాఖకు రూ.13,278.17 కోట్లు నిధులు కేటాయించినట్టు ప్రకటించారు. దానిలో పాఠశాల విద్యాశాఖకు రూ.10,830.29 కోట్లు, ఉన్నత విద్యాశాఖకు రూ.2,025.56 కోట్లు, సాంకేతిక విద్యాశాఖకు రూ.422.31 కోట్లు బడ్జెట్‌లో కేటాయించారు.



ఇందులో నిర్వహణ పద్దు కింద రూ.10,710 కోట్లు, ప్రగతి పద్దు కింద రూ.2,567.29 కోట్లు కేటాయించారు. ఇందులో రాష్ట్రంలో కొనసాగుతున్న 131 ప్రభుత్వ డిగ్రీ కాలేజీల అభివృద్ధికి రూ.247 కోట్లు ఇచ్చారు. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన పనులు కూడా శరవేగంగా కొనసాగుతున్నాయని బడ్జెట్‌లో తెలిపారు. అలాగే రాష్ట్రంలో 11 కొత్త ప్రభుత్వ పాలిటెక్నిక్‌ల నిర్మాణాల కోసం రూ.95 కోట్లు కేటాయించారు. పాఠశాల విద్యాశాఖలో మధ్యాహ్న భోజన పథకం కోసం రూ.468 కోట్లు కేటాయించారు. రాష్ట్రీయ మాధ్యమిక శిక్షా అభియాన్‌కు రూ.806.28 కోట్లు, సర్వశిక్షా అభియాన్‌కు రూ.741, సర్వశిక్షా అభియాన్ నిర్మాణాల కోసం మరో రూ.317 కోట్లు బడ్జెట్‌లో ప్రతిపాదించారు. అలాగే యూనివర్సిటీలు, డిగ్రీ కాలేజీల అభివృద్ధికి బడ్జెట్‌లో రూ.74.25 కోట్లు కేటాయించారు.

యూనివర్సిటీల వారీగా కేటాయింపులు (రూ.కోట్లలో)

యూనివర్సిటీ/కాలేజీ పేరు	నిర్వహణ పద్దు	ప్రగతి పద్దు	మొత్తం కేటాయింపు
ఉస్మానియా యూనివర్సిటీ	309.54	60.00	369.54
కాకతీయ యూనివర్సిటీ	87.11	25.30	112.41
బీఆర్ అంబేద్కర్ ఓపెన్‌వర్సిటీ	10.44	20.00	30.44
పొట్టి శ్రీరాములు తెలుగువర్సిటీ	19.49	20.02	39.51
తెలంగాణ యూనివర్సిటీ	23.76	20.00	43.76
మహాత్మాగాంధీ యూనివర్సిటీ	19.49	25.00	44.49
శాతవాహన యూనివర్సిటీ	8.70	20.00	28.70
పాలమూరు యూనివర్సిటీ	6.63	20.00	26.63
జేఎన్టీయూహెచ్	72.04	—	72.04
ఆర్జీయూకేటీ	34.50	—	34.50
జేఎన్‌యూఎఫ్‌ఏ	10.37	—	10.37
జేఎన్టీయూ మంథని కాలేజీ	5.03	—	5.03
జేఎన్టీయూ సుల్తాన్‌పూర్	4.60	—	4.60
	611.88	210.32	822.20

పరిశ్రమల రంగంలో ప్రగతి

- అభివృద్ధిలో ప్రధాన శాఖల పోటీ
- సామాజిక ఆర్థిక ముఖచిత్రం-2018లో వెల్లడి



హైదరాబాద్, నమస్తే తెలంగా: బడ్జెట్ సందర్భంగా విడుదలచేసిన తెలంగాణ రాష్ట్ర సామాజిక ఆర్థిక ముఖచిత్రం-2018లో రాష్ట్రంలోని ప్రధానమైన రంగాలన్నీ అభివృద్ధిలో పరుగులు పెడుతున్నట్టుగా తేలింది. వ్యవసాయం, పరిశ్రమలు, పర్యావరణం, ఆరోగ్యం, మౌలిక వసతులు, విద్య, సంక్షేమం, పట్టణీకరణ, సేవలరంగాల్లో తెలంగాణలో ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలు, తీసుకున్న చర్యలు, అమలు చేస్తున్న పథకాల వల్ల కలిగిన అభివృద్ధిని పట్టికలు, గ్రాఫ్‌ల ద్వారా వివరించారు. దేశంలో ఇటీవలే ఏర్పాటైన రాష్ట్రమైనా.. ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు పరిపాలనా దక్షత, సామాన్యుల కోణంలో ఆలోచించే దూరదృష్టి, క్షేత్రస్థాయిలో ప్రజల సమస్యలకు పరిష్కారాలు, పక్కా ప్రణాళిక, పకడ్బందీగా అమలుతో.. అభివృద్ధిలో అగ్రస్థానంలో కొనసాగించేలా చేస్తున్నాయి.

వ్యవసాయం, అనుబంధ రంగం

2016-17లో నికరంగా 47.74 లక్షల హెక్టార్లలో పంటలను సాగుచేశారు. అడువులు 26.98 లక్షల హెక్టార్లు. ఇది మొత్తం విస్తీర్ణంలో 24.07శాతం. 2017-18లో ఆహార పంటల సాగువిస్తీర్ణం 31.87 లక్షల హెక్టార్లు కాగా పంటల ఉత్పత్తి 95.01 లక్షల టన్నులు. 2016-17లో సాగువిస్తీర్ణం 34.39 లక్షలహెక్టార్లు కాగా.. పంటల ఉత్పత్తి 101.29 లక్షల టన్నులు. నూనెగింజల దిగుబడి 5.77 లక్షల టన్నులు. 2016-17లో పత్తిసాగు విస్తీర్ణం 14.09 లక్షల హెక్టార్లు ఉండగా.. 2017-18లో 19.03 లక్షల హెక్టార్లు. వీటితోపాటు ఉద్యాన పంటల కింద కూడా పండ్లు, కూరగాయలు, సుగంధద్రవ్యాలు, పూలను భారీగా సాగుచేస్తున్నారు. గుడ్లు, పౌల్ట్రీ, మాంసం ఉత్పత్తుల్లోనూ ప్రగతి సాధించింది.

పరిశ్రమలు

తెలంగాణ ప్రభుత్వం వినూత్న అనుసరిస్తున్న నూతన పారిశ్రామిక విధానాల ఫలితంగా జాతీయ, అంతర్జాతీయ సంస్థలు, కంపెనీలు తెలంగాణవైపు దృష్టి సారిస్తున్నాయి. పారిశ్రామిక వార్షిక సర్వే (ఏఎస్‌ఐ 2014-15)ప్రకారం 2009-10లో 7,729 పరిశ్రమలు ఉండగా..2014-15నాటికి వీటి సంఖ్య 11,995కు పెరిగింది. అంటే దాదాపు 55శాతం పరిశ్రమలు పెరిగాయి. అలాగే ఈ కాలంలో ఉత్పత్తి కూడా 40శాతం మేరకు పెరిగింది. సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల విషయానికి వచ్చేసరికి.. 2014 జూన్ తరువాత ఉత్పత్తులు ప్రారంభించిన యూనిట్లు మొత్తం 13,671 ఉండగా.. వీటిద్వారా రూ.7130కోట్ల పెట్టుబడులు వచ్చాయి. 1,45,512 మందికి ఉపాధి లభించింది. టీఎస్‌ఐపాస్ ద్వారా 25.1.2018 నాటికి ప్రారంభించిన పరిశ్రమలను పరిశీలిస్తే.. మొత్తం 6117 పరిశ్రమలు రాగా.. వాటి కింద రూ.1,18,041 కోట్ల పెట్టుబడులు వచ్చాయి. 4,42,962 మందికి ఉపాధి, ఉద్యోగాలు లభించాయి. ఇక మైన్స్, మినరల్స్ విషయంలోనూ గణనీయమైన ప్రగతి నమోదయ్యింది. 2011-12లో రూ. 1207.82 కోట్ల ఆదాయం రాగా.. 2014-15లో రూ.1968.27 కోట్ల ఆదాయం వచ్చింది. 2016-17లో రూ.3169.70కోట్లు రావడం గమనార్హం.

మౌలిక వసతుల కల్పన

తెలంగాణ ప్రభుత్వం మౌలిక వసతుల కల్పనపై దృష్టి సారించింది. వివిధ ప్రాజెక్టులను, చెరువులను బాగుచేసేందుకు మిషన్ కాకతీయ పథకాన్ని చేపట్టింది. రాష్ట్రం ఆవిర్భావం నాటికి తెలంగాణలో విద్యుత్ గరిష్ఠ డిమాండ్‌లో 2700 మెగావాట్ల లోటుఉండేది. విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం మెరుగుపర్చి నిరంతరాయ విద్యుత్‌ను అందిస్తున్నది. రోడ్ల విస్తరణపై ప్రత్యేక దృష్టి సారించింది. వీటితోపాటు మిషన్ భగీరథ ద్వారా రాష్ట్రంలోని ప్రతి ఇంటికీ నల్లా నీళ్లు ఇవ్వాలనే పథకం శరవేగంగా పూర్తవుతోంది.

సేవల రంగం

సేవలరంగంలో ప్రధానమైనది ఐటీ. హైదరాబాద్ నుంచి ఐటీసేవల ఎగుమతుల్లో అగ్రస్థానంలో ఉంది. ఐటీ శాఖపై మంత్రి కేటీఆర్ ప్రత్యేక దృష్టి సారించడంతో గడిచిన మూడేండ్లలో ఐటీ ఎగుమతుల విలువ భారీగా పెరిగింది. గడిచిన మూడేండ్లలో ఐటీ సంస్థల సంఖ్యకూడా పెరిగింది. 2014-15లో 1200ఐటీ యూనిట్లలో 3,71,774 మంది ఉద్యోగాలు పొందారు. 2016-17లో 1500 యూనిట్లకు గాను 4,31,891 మందికి ఉద్యోగాలు వచ్చాయి. తెలంగాణలో పర్యాటక రంగంకూడా విస్తృతంగా అభివృద్ధి చెందుతోంది. రాష్ట్రం ఏర్పడిన తరువాత ప్రభుత్వం తీసుకున్న చర్యలతో స్థానిక, దేశ, విదేశీ పర్యాటకుల సంఖ్య గణనీయంగా పెరుగుతూ వస్తోంది.

పరిశ్రమలశాఖకు 1286 కోట్లు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: బడ్జెట్‌లో పరిశ్రమలశాఖకు రూ.1286 కోట్లు కేటాయించారు. ఇందులో ప్రగతి పద్దు కింద రూ.1098.76 కోట్లు కేటాయించగా నిర్వహణ పద్దకు రూ.186.96 కోట్లు కేటాయించారు. రాష్ట్రంలో పరిశ్రమలను ఏర్పాటును ప్రోత్సహించడానికి రూ.256.14 కోట్లు కేటాయించారు. పారిశ్రామికంగా రాష్ట్రంలో ఉన్న అవకాశాలను ప్రపంచవ్యాప్తంగా పారిశ్రామికవర్గాలకు వివరించడానికి ప్రచారానికి, ఇతర ఖర్చులకు రూ.30 కోట్లు కేటాయించారు. పారిశ్రామిక రంగానికి సహాయక గ్రాంట్లు అందించడానికి రూ.172 కోట్లు ఇవ్వనున్నారు. పరిశ్రమలకు ప్రోత్సాహకాలు అందించే విద్యుత్ రాయితీలకు రూ.130 కోట్లు, పారిశ్రామికవేత్తలకు పావలా వడ్డీకి రుణాలు అందించడానికి రూ.100 కోట్లు, చిన్న, సూక్ష్మ తరహా పరిశ్రమ ఖాయిలా పడకుండా ఆదుకోవడానికి రూ.40 కోట్లు కేటాయించారు. టీఎస్‌ఐఐసీ ద్వారా పరిశ్రమలకు అవసరమైన మౌలిక సదుపాయాలు, భూముల కొనుగోళ్లకు రూ.100 కోట్లను కేటాయించారు. చేనేత జౌళిశాఖకు రూ.70 కోట్లు, నేతన్నల ఆర్థికసహాయం, సహాయక గ్రాంట్ల కోసం రూ.26.91 కోట్లు, చేనేత, జౌళి పరిశ్రమల అభివృద్ధికి ఆర్థిక సహాయం కోసం రూ.43.15 కోట్లు, గనులశాఖలో ఇసుక అన్వేషణపై పరిహారం కోసం రూ.30 కోట్లు, చెరుకు సరఫరాదారులకు కొనుగోలు పన్ను ప్రోత్సాహకాలకు సహాయానికి రూ.17.62 కోట్లు కేటాయించారు.

23న రాజ్యసభ ఎన్నికలు

- పోటీలో నలుగురు ఉండటంతో తప్పని పోలింగ్
- నామినేషన్ల ఉపసంహరణకు ముగిసిన గడువు
- బరిలో టీఆర్‌ఎస్ నుంచి ముగ్గురు, కాంగ్రెస్ నుంచి ఒకరు
- టీఆర్‌ఎస్ అభ్యర్థుల గెలుపు ఖాయం!

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలో రాజ్యసభ ఎన్నికలు తప్పనిసరి అయ్యాయి. మూడు స్థానాలకు నలుగురు అభ్యర్థులు పోటీ పడుతుండటంతో ఈ నెల 23న పోలింగ్ జరుగనున్నది. నామినేషన్ల ఉపసంహరణకు గురువారం గడువు ముగిసింది. టీఆర్‌ఎస్ తరపున జోగినిపల్లి సంతోష్‌కుమార్, బండ ప్రకాశ్, లింగయ్య యాదవ్ పోటీలో ఉండగా.. కాంగ్రెస్ పక్షాన పోరిక బలరాంనాయక్ బరిలో ఉన్నారు. శాసనసభలో అధికార టీఆర్‌ఎస్‌కు పూర్తి బలం ఉండటంతోపాటు, మిత్రపక్షమైన ఎంఐఎం మద్దతు ఇవ్వడంతో టీఆర్‌ఎస్ అభ్యర్థుల గెలుపు లాంఛనమే కానున్నది.

కేసీఆర్ ఎజెండానే జాతీయ ఎజెండా

తెలంగాణ అభివృద్ధి నమూనాతో జాతీయ రాజకీయాల్లోకి ముఖ్యమంత్రి
చంద్రశేఖర్‌రావు ఫ్రంట్ కోసం దేశవ్యాప్తంగా ఎదురుచూపు
కాంగ్రెస్, బీజేపీలను ప్రజలు నమ్మేస్థితిలో లేరు.. మీడియాతో మంత్రి కేటీఆర్



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: సీఎం కేసీఆర్ ఎజెండానే జాతీయ ఎజెండా కానున్నదని ఐటీశాఖ మంత్రి కేటీర్ పేర్కొన్నారు. సామాన్య ప్రజలకు ఏం కావాలో అదే సీఎం కేసీఆర్ ఎజెండాలో ఉంటుందన్నారు. తెలంగాణ అభివృద్ధి నమూనాతో ఆయన జాతీయ రాజకీయాల్లోకి వెళ్తారన్నారు. గత ఎన్నికల్లో గుజరాత్ సీఎంగా ఉన్న నరేంద్ర మోదీ.. ఆ రాష్ట్ర మోడల్ పేరుతో జాతీయ రాజకీయాల్లోకి వెళ్లిన విషయాన్ని గుర్తుచేశారు. గురువారం అసెంబ్లీలాబీలో మీడియా ప్రతినిధులతో కేటీఆర్ ముచ్చటించారు. తాము పది పార్టీలతో కూటమి కట్టే ప్రయత్నం చేయడంలేదన్నారు. ఉత్తరప్రదేశ్, బీహార్ ఉపఎన్నికల ఫలితాలు కేసీఆర్ ఆలోచన ధోరణిని ప్రజలు సమర్థిస్తున్నట్టు ఉన్నాయని వ్యాఖ్యానించారు. యూపీలో బీజేపీ, కాంగ్రెస్‌కు ఎదురుదెబ్బ తగిలిందని, సమాజ్‌వాదీ పార్టీ గెలుపుతో ప్రజలు ప్రాంతీయ పార్టీల వైపు మొగ్గు చూపుతున్నారని స్పష్టమైందని చెప్పారు. బీజేపీ, కాంగ్రెస్‌కు కాలం చెల్లిందని, ఆ పార్టీలను ప్రజలు ఇక నమ్మేస్థితిలో లేరన్నారు. కొత్త ఫ్రంట్ ఏర్పాటుకావాలని దేశవ్యాప్తంగా ఎదురుచూస్తున్నారన్నారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలను సస్పెండ్ చేస్తే ప్రజలు పట్టించుకొనే పరిస్థితి లేదని, కాంగ్రెస్ నాయకులది అధికార ఆరాటమేనన్న సంగతి ప్రజలకు తెలిసిపోయిందన్నారు. మంత్రి హరీశ్‌రావు ప్రజల ఆశయాలు, ఆకాంక్షల కోసమే నాడు శాసనసభలో నిరసన వ్యక్తంచేశారని చెప్పారు. ఈ ప్రాంత బిడ్డగా కేసీఆర్ తెలంగాణ సాధించి రుణం తీర్చుకున్నారని, పౌరుడిగా కొత్త ఫ్రంట్ ఏర్పాటుచేసి భారతమాత రుణం తీర్చుకుంటారన్నారు. పేర్కొన్నారు. ఇప్పటికే యావత్ దేశం తెలంగాణ వైపు చూస్తున్నదని, కేసీఆర్ సరికొత్త రాజకీయాలకు స్పందిస్తున్నదని చెప్పారు.

ఏదీ శాశ్వతంకాదు

యూపీ ఉప ఎన్నికల ఫలితాలతో ఏదీ శాశ్వతంకాదని మరోసారి తేలిందని మంత్రి కేటీఆర్ పేర్కొన్నారు. ఆయన ట్విట్టర్‌లో స్పందిస్తూ 'యూపీలో రెండు లోక్‌సభస్థానాల ఉప ఎన్నికల ఫలితాలు ఆసక్తికరంగా ఉన్నాయి. ఈ ఫలితం బీజేపీకి ఏదీ శాశ్వతంకాదనే స్పష్టమైన సందేశాన్నిచ్చింది. మరో జాతీయపార్టీ మళ్లీ ధరావతును కోల్పోయింది' అని ట్వీట్‌చేశారు.

ఎన్నికల తరువాత సభలో ఉండేది టీఆర్‌ఎస్, ఎంఐఎంలే

- విద్యుత్‌శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: వచ్చే ఎన్నికల తరువాత అసెంబ్లీలో టీఆర్‌ఎస్, ఎంఐఎం పార్టీల సభ్యులు మాత్రమే ఉంటారని విద్యుత్‌శాఖ మంత్రి జీ జగదీశ్‌రెడ్డి తెలిపారు. ఇద్దరు ఎమ్మెల్యేల బహిష్కరణపై ప్రజాక్షేత్రానికి వెళతామని చెప్పిన కాంగ్రెస్ నేతలు న్యాయస్థానానికి ఎందుకెళుతున్నారని ప్రశ్నించారు. గురువారం టీఆర్‌ఎస్‌ఎల్పీ కార్యాలయంలో ఆయన మీడియాతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. కాంగ్రెస్ నాయకులకు ఎక్కడికైనా వెళ్లే స్వేచ్ఛ ఉందని, కానీ ఫ్రీఫైనల్‌లోనే గెలువలేనివారు ఫైనల్‌లో ఎలా గెలుస్తారని మంత్రి జగదీశ్‌రెడ్డి ఎద్దేవాచేశారు. సభలో ప్రతిపక్షం లేకుంటే అధికారపక్షానికి కూడా బోరుగానే ఉంటుందని చెప్పారు. కొన్నిపార్టీలతో ఫ్రంట్ అనేది కేసీఆర్ ఉద్దేశం కాదని, కొత్తఫ్రంట్‌పై ముఖ్యమంత్రి అసెంబ్లీలో స్పష్టంగా వివరించారని అన్నారు. తెలంగాణ ప్రజలను ఏకతాటిపైకి తీసుకొచ్చి ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించినట్టే.. దేశప్రజలను కూడా గుణాత్మకమార్పువైపు నడిపించే శక్తి కేసీఆర్‌కు ఉందని చెప్పారు. 70 ఏండ్లుగా దేశాన్ని పాలిస్తున్న పార్టీలు ప్రజలకు మంచినీళ్లు కూడా ఇవ్వలేకపోయాయన్నారు. ప్రజలను సంఘటితం చేసేందుకు జాతీయ పార్టీనా.. మరొకటా అనేది కేసీఆర్ నిర్ణయిస్తారని చెప్పారు.

రాష్ట్రానికి రావాల్సిన నిధులివ్వండి

- ఢిల్లీలో కేంద్ర మంత్రులను కోరిన మంత్రి హరీశ్‌రావు
- కందుల కొనుగోలు, బకాయిలు, సాగునీటి అంశాలపై భేటీ
- మూడురోజుల్లో బకాయిల విడుదలకు వ్యవసాయమంత్రి రాధామోహన్‌సింగ్ హామీ





గురువారం సాయంత్రం ఢిల్లీలో కేంద్రమంత్రులు నితిన్ గడ్కరీ, రాధామోహన్‌సింగ్‌ను కలిసి పుష్పగుచ్ఛాలు అందజేస్తున్న మంత్రి హరీశ్‌రావు. చిత్రంలో ఎంపీలు జితేందర్‌రెడ్డి, కొత్త ప్రభాకర్‌రెడ్డి, బీబీ పాటిల్ కూడా ఉన్నారు.

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రానికి రావాల్సిన నిధులను వెంటనే ఇవ్వాల్సిందిగా రాష్ట్ర నీటిపారుదల, మార్కెటింగ్‌శాఖ మంత్రి హరీశ్‌రావు కేంద్ర మంత్రులను కోరారు. ఆయన గురువారం ఢిల్లీలో జలవనరులశాఖ మంత్రి నితిన్‌గడ్కరీ, వ్యవసాయ శాఖ మంత్రి రాధామోహన్‌సింగ్‌ను కలిసి బకాయిలపై, ఇతర అంశాలపై చర్చించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. కందుల కొనుగోలు విషయంలో కేంద్రం నుంచి అనుకున్నంత సహకారం అందడం లేదన్నారు. రాష్ట్రంలో రూ.1400 కోట్ల కందులను కొనుగోలు చేస్తే కేంద్రం నుంచి 400 కోట్ల మేరకే సహకారం అందిందని తెలిపారు. వాటిలో రూ.220 కోట్లు మాత్రమే విడుదలయ్యాయ, మిగిలిన రూ.180 కోట్లు 45 రోజులుగా విడుదల కాక రైతులు రాష్ట్రంలో ఆందోళన చేస్తున్నారన్నారు. సీఎం కేసీఆర్ బ్యాంక్ గ్యారంటీ ఇవ్వడం ద్వారా వెయ్యి కోట్లతో రాష్ట్రప్రభుత్వం కొనుగోలు చేసిందని చెప్పారు. రెండు లక్షల 54 వేల మెట్రిక్ టన్నుల కందులను రాష్ట్రప్రభుత్వం కొనుగోలు చేయగా, అందులో కేంద్రం కేవలం 75 మెట్రిక్ టన్నులే కొన్నట్టు తెలిపారు. బకాయిలను విడుదల చేయాలని కోరగా, మూడు రోజుల్లో నిధులు చెల్లిస్తామంటూ కేంద్ర వ్యవసాయ మంత్రి రాధామోహన్ సింగ్ హామీ ఇచ్చినట్టు హరీశ్‌రావు పేర్కొన్నారు. యాసంగి సీజన్‌లో మినుములు, సన్‌ఫ్లవర్, పెసర్లు విరివిగా ఉత్పత్తి అయ్యాయని చెప్పారు. ఈ పంటలకు మద్దతు ధర కల్పిస్తూ ఉత్తర్వులు ఇవ్వాలని కేంద్రమంత్రిని కోరగా శుక్రవారం ఉత్తర్వులు జారీ చేస్తామని హామీ ఇచ్చారన్నారు. కాళేశ్వరం నుంచి గోదావరి ప్రాణహిత, మహారాష్ట్రలో విదర్భ నుంచి సముద్ర ప్రయాణానికి సంబంధించిన రివర్ నావిగేషన్ అంశంపై కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీతో చర్చించినట్టు హరీశ్‌రావు తెలిపారు. త్వరలోనే ఒక సమావేశం ఏర్పాటు చేయనున్నట్టు కేంద్రమంత్రి చెప్పినట్టు పేర్కొన్నారు. మిషన్ కాకతీయలో భాగంగా రూ.185 కోట్లతో 176 చెరువులకు ప్రతిపాదనలు చేశామని కేంద్రమంత్రికి వివరించామన్నారు. తమ ప్రతిపాదనలను పరిశీలించి నిధులను మంజూరుచేయాలని అధికారులను ఆదేశించారని తెలిపారు. కేంద్రమంత్రులను కలిసిన సమయంలో మంత్రి హరీశ్‌రావు వెంట ఎంపీలు జితేందర్‌రెడ్డి, కొత్త ప్రభాకర్‌రెడ్డి, బీబీ పాటిల్ ఉన్నారు.

అమెరికాలో ఎంపీ కవిత పుట్టినరోజు వేడుకలు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: అమెరికాలోని అట్లాంటాలో నిజామాబాద్ ఎంపీ, తెలంగాణ జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత పుట్టినరోజు వేడుకలను ఎన్నారై కో-ఆర్డినేటర్ మహేశ్ బిగాల ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో టీఆర్ఎస్ యూఎస్ఏ సలహాదారుడు రామడుగు శివకుమార్, ఉప్పల గోవర్ధన్‌రెడ్డి, తెలంగాణ జాగృతి ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ పల్లా, నిరంజన్ పొద్దుటూరి, గౌతమ్‌గోలి, రవిచందర్, శేఖర్‌పుట్ట, శ్రీధర్ కొంతాల, శంకర్‌రెడ్డి గంద్ర, శ్రీనివాస్ దుర్గం, గణేశ్ కాసం, రమేశ్ వెనుకదాసుల, బాలు, నరేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఫారం-C, నోటిఫికేషన్

(భూసేకరణ పునరావాసం, పునరావాస కల్పనలో పారదర్శకత మరియు హేతుబద్ధమైన పరిహారాన్ని పొందే హక్కు (తెలంగాణ సవరణ) చట్టం- 2016, కేంద్రచట్టం 21/2017) ద్వారా సవరించబడిన భూసేకరణ పునరావాసం, పునరావాస కల్పనలో పారదర్శకత మరియు హేతుబద్ధమైన పరిహారాన్ని పొందే హక్కు చట్టం -2013 సెక్షన్ 11(1) మరియు 10ఎ మినహాయింపు అనుసరించి)

(రూల్ 4/12 చూడుము)

తెలంగాణ ప్రభుత్వము, రెవెన్యూ (భూసేకరణ) శాఖ

కలెక్టర్ ఫైల్ నం. ఇ1/730/2018 తేది: 13/03/2018

రెవెన్యూ డివిజనల్ అధికారి ఫైల్ నం. బి/42/2018 తేది: 08/03/2018

[illegible]

[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]

[illegible]

DIPR No. 1724/LA/PP/2017-18

పదోతరగతి పరీక్షలు ప్రారంభం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రవ్యాప్తంగా గురువారం పదోతరగతి పరీక్షలు ప్రారంభమయ్యాయి. మొదటి లాంగ్వేజీ పేపర్-1 పరీక్షలో 985 పరీక్ష కేంద్రాలను ఫ్లయింగ్ స్క్వాడ్‌లు పరిశీలించాయని, తొలిరోజు పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించామని ప్రభుత్వ పరీక్షల విభాగం డైరెక్టర్ బీ సుధాకర్ చెప్పారు. ఇద్దరు విద్యార్థులు మాల్‌ప్రాక్టీస్ చేస్తూ పట్టుబడ్డారని పేర్కొన్నారు. పరీక్షల విధుల నుంచి ఒక ఇన్విజిలేటర్‌ను రిలీవ్ చేశామన్నారు. విద్యార్థులు 45 నిమిషాలముందే పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు.




సచివాలయంలో మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ను కలిసిన సినీ దర్శకుల సంఘం అధ్యక్షుడు ఎన్ శంకర్, సభ్యులు

దర్శకుడు ఎన్ శంకర్‌కు మంత్రులు తలసాని, జగదీశ్‌రెడ్డి అభినందనలు

హైదరాబాద్: రాష్ట్ర సినిమాటోగ్రఫీ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్, విద్యుత్‌శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి సినీదర్శకుడు ఎన్ శంకర్‌ను అభినందించారు. తెలుగు చలనచిత్ర దర్శకుల సంఘం అధ్యక్షుడిగా ఎన్నికైన శంకర్ గురువారం సచివాలయంలో తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. హైదరాబాద్‌లో చిత్ర పరిశ్రమ అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై వారితో మంత్రి తలసాని చర్చించారు. త్వరలో చిత్రరంగ ప్రముఖులతో సమావేశం నిర్వహించి సమస్యలపై చర్చిస్తామన్నారు. క్యాంపు కార్యాలయంలో మంత్రి జగదీశ్‌రెడ్డిని దర్శకుల అసోసియేషన్ కమిటీ సభ్యులతో ఎన్ శంకర్ కలిశారు. జయం మనదేరా వంటి సామాజిక స్ఫూర్తిని కలిగించిన సినిమాలకు దర్శకత్వం వహించిన నల్లగొండ జిల్లాకు చెందిన శంకర్ తెలుగు సినీదర్శకుల సంఘం అధ్యక్షుడిగా ఎన్నికవడం అభినందనీయమని జగదీశ్‌రెడ్డి అన్నారు. శంకర్ మరిన్ని సామాజిక నేపథ్యం కలిగిన సినిమాలను తెరకెక్కించాలని ఆకాంక్షించారు.

కేసీఆర్ నాయకత్వంలో వర్గీకరణ

- రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ మందుల సామేల్



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: సీఎం కేసీఆర్ నాయకత్వంలో ఎస్సీ వర్గీకరణను సాధించుకుందామని రాష్ట్ర గిడ్డంగుల సంస్థ కార్పొరేషన్ చైర్మన్ మందుల సామేల్ అన్నారు. గురువారం తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. మాదిగలకు మనోధైర్యం కల్పించిన సీఎం కేసీఆర్‌కు మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు తెలిపారు. విద్యతోనే మాదిగల బతుకు మార్చాలనే సంకల్పంతో సీఎం కేసీఆర్ రెసిడెన్షియల్ స్కూల్స్ ఏర్పాటుచేశారని చెప్పారు. వర్గీకరణపై మాదిగలపై సీఎం కేసీఆర్‌కు అవగాహన ఉందన్నారు. 2001లో టీఆర్ఎస్ పార్టీ తరుపున కేసీఆర్ అప్పటి ప్రధాని వాజపేయికి ఏబీసీడీ వర్గీకరణపై లేఖ రాశారని గుర్తుచేశారు. ఆ తరువాత కాంగ్రెస్ ప్రభుత్వానికి కూడా లేఖ రాశారన్నారు. వర్గీకరణకు టీఆర్ఎస్ ప్రభుత్వం ఇప్పటికే అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపించిందని, సీఎం కేసీఆర్, డిప్యూటీ సీఎం కడియం శ్రీహరి ప్రధాని మోదీకి స్వయంగా లేఖ రాశారని తెలిపారు. అయినా కేంద్రం నుంచి స్పందన లేదని మండిపడ్డారు. దీంతో స్వయంగా కేసీఆర్ పోరాటం చేయాలని నిర్ణయించారన్నారు. ఈ సమావేశంలో నత్తి మైసయ్య, పాలడుగు శ్రీనివాస్, చాదంటి యాదగిరి, మేరి మాదిగ పాల్గొన్నారు.



పౌరసరఫరాల భవన్‌లో వినియోగ తరంగిణి సంచికను ఆవిష్కరిస్తున్న కమిషనర్ సీవీ ఆనంద్

వినియోగదారుల చట్టంలో మార్పులు రావాలి

- పౌరసరఫరాలశాఖ కమిషనర్ సీవీ ఆనంద్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: వినియోగదారుల హక్కుల పరిరక్షణ చట్టంపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని పౌరసరఫరాలశాఖ కమిషనర్ సీవీ ఆనంద్ తెలిపారు. ప్రపంచ వినియోగదారుల దినోత్సవాన్ని పురస్కరించుకొని వినియోగ తరంగిణి ప్రత్యేక సంచికను గురువారం పౌరసరఫరాలభవన్‌లో ఆవిష్కరించారు. 30 ఏండ్ల కిందట జాతీయవినియోగదారుల చట్టం ఏర్పడిందని, అప్పటినుంచి సామాజిక, ఆర్థిక, రాజకీయరంగాలతోపాటు డిజిటల్, మార్కెటింగ్ రంగాలు, ఆన్‌లైన్‌షాపింగ్ లావాదేవీల్లో మార్పులు జరిగాయన్నారు. ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా వినియోగదారుల రక్షణ కోసం చట్టంలో మార్పులు తీసుకురావాల్సిన ఆవశ్యకత ఏర్పడిందన్నారు. కొత్త రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకునేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించిందన్నారు. ఏప్రిల్ నుంచి మీ సేవాకేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

నూతన పంచాయతీల ఏర్పాటుపై మంత్రి పోచారం సమీక్ష

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: కామారెడ్డి జిల్లాలో నూతన పంచాయతీల ఏర్పాటుపై మంత్రి పోచారం శ్రీనివాసరెడ్డి గురువారం అసెంబ్లీ ఆవరణలోని సమావేశ మందిరంలో సమీక్షించారు. నూతనంగా ఏర్పాటు చేయబోయే పంచాయతీలపై చర్చించారు. ఈ సమావేశంలో మిషన్ భగీరథ వైస్‌చైర్మన్ వేముల ప్రశాంత్‌రెడ్డి, ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్, ఎమ్మెల్యేలు ఏనుగు రవీందర్‌రెడ్డి, హన్మంత్‌షిండే, గణేశ్ గుప్తా, బాజిరెడ్డి గోవర్ధన్, కామారెడ్డి జిల్లా కలెక్టర్ సత్యనారాయణ, నిజామాబాద్ జిల్లా కలెక్టర్ రామ్మోహన్‌రావు పాల్గొన్నారు.

శాసనసభ సభ్యత్వం రద్దుపై హైకోర్టుకు కోమటిరెడ్డి, సంపత్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: శాసనసభ సభ్యత్వం రద్దుచేయడాన్ని సవాల్‌చేస్తూ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, సంపత్‌కుమార్ హైకోర్టును ఆశ్రయించారు. శాసనసభ నుంచి బహిష్కరించడం, తాము ప్రాతినిధ్యం వహిస్తున్న నల్లగొండ, ఆలంపూర్ అసెంబ్లీ నియోజకవర్గాలకు శాసనసభలో ప్రాతినిధ్యం లేదని శాసనసభ కార్యదర్శి జారీచేసిన గెజిట్ నోటిఫికేషన్‌ను నిలిపివేయాలని పిటిషన్‌లో పేర్కొన్నారు. ఈ వ్యాజ్యాన్ని జస్టిస్ బీ శివశంకర్‌రావు నేతృత్వంలోని ధర్మాసనం శుక్రవారం విచారించనున్నది.

వేసవి సెలవులను ఇంటర్న్‌షిప్ కోసం ఉపయోగించండి

హైదరాబాద్: అమరావతిలో వెల్లూరు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (విట్) విశ్వవిద్యాలయం ఏర్పాటుచేయటం గొప్ప విషయమని ఆంధ్రప్రదేశ్ పంచాయతీ రాజ్, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ అన్నారు. అమరావతిలో గురువారం జరిగిన విట్ వార్షికోత్సవానికి ముఖ్యఅతిథిగా హాజరైన లోకేశ్.. ఏపీలో అంతర్జాతీయ ప్రమాణాలతో విద్యాలయం ఉండాలనే ఉద్దేశంతో సీఎం చంద్రబాబు ఆహ్వానించారని తెలిపారు. విద్యార్థులు వేసవి సెలవులను ఇంటర్న్‌షిప్ కోసం వాడుకోవాలని లోకేశ్ సూచించారు. ఈ కార్యక్రమంలో విట్ కులపతి జీ విశ్వనాథన్, విట్ ఏపీ వైస్ ప్రెసిడెంట్ శేఖర్ విశ్వనాథన్, ఉపకులపతి శుభాకర్, విట్ ఏపీ రిజిస్ట్రార్ శివకుమార్ పాల్గొన్నారు.

ఏపీలో మూడు రాజ్యసభ స్థానాలు ఏకగ్రీవం

అమరావతి, నమస్తే తెలంగాణ: ఆంధ్రప్రదేశ్‌లో మూడు రాజ్యసభ స్థానాలు ఏకగ్రీవమయ్యాయి. రాష్ట్రంలో ఉన్న మూడు స్థానాలకు నామినేషన్ల ఉపసంహరణ అనంతరం టీడీపీ నుంచి సీఎం రమేశ్, కనకమేడల రవీంద్రకుమార్, వైసీపీ నుంచి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి మాత్రమే పోటీలో నిలిచారు. నామినేషన్ల గడువు గురువారంతో ముగియడంతో మూడు స్థానాలకు ముగ్గురే పోటీలో ఉండటంతో ఎన్నిక ఏకగ్రీవమైంది.

ప్రధాని మోదీ కుట్రరాజకీయాలు

- పవన్, జగన్‌లను ఉసిగొల్పుతున్నారు
- తమిళనాడు తరహాలో కుట్ర
- ఏపీ సీఎం చంద్రబాబు ఫైర్

హైదరాబాద్/అమరావతి, నమస్తే తెలంగాణ: ఇప్పటివరకు ప్రధాని మోదీ, బీజేపీలపై ప్రత్యక్షంగా విమర్శలు చేయని చంద్రబాబు మారిన రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో నేరుగా వ్యాఖ్యలు చేశారు. తెలుగుదేశం పార్టీని దెబ్బతీసేందుకు మోదీ కక్షగట్టి కుట్రపూరితంగా వ్యవహరిస్తున్నారని, ఇందులోభాగంగా ఏపీ ప్రతిపక్షనేత జగన్‌మోహన్‌రెడ్డి, జనసేన అధినేత పవన్‌కల్యాణ్‌ను ఉసిగొల్పుతున్నారని చంద్రబాబు ఫైర్ అయ్యారు. తమిళనాడు తరహాలో ఏపీలో తమను టార్గెట్‌గా చేసుకుని వైరిపక్షాలను అంతర్గతంగా కుట్రలతో రెచ్చగొడుతున్నారని ధ్వజమెత్తారు. గురువారం నిర్వహించిన టెలికాన్ఫరెన్స్‌లో పార్టీ ఎంపీలు, వ్యూహ, సమన్వయ కమిటీ సభ్యులతో మాట్లాడారు. దేశవ్యాప్తంగా ప్రజల్లో మోదీ, బీజేపీ పట్ల వ్యతిరేకత పెరుగుతున్నదన్నారు. ఉత్తరప్రదేశ్, బీహార్‌లో వెల్లడైన ఉపఎన్నికల ఫలితాలే దీనికి నిదర్శనమన్నారు. బీజేపీకి కౌంట్‌డౌన్ ప్రారంభమైందని చెప్పారు. ఈ పరాజయం మార్పునకు నాందిగా పేర్కొన్నారు. పవన్ వ్యాఖ్యలపై లోకేశ్ స్పందిస్తూ తాత, నాన్న పేరు తనకు వస్తుందో లేదో తెలియదు కానీ వారికి చెడ్డపేరు మాత్రం తీసుకురానని తెలిపారు. టీడీపీ మంత్రులు, ఎమ్మెల్యేలు ఏపీ వ్యాప్తంగా సభలు, సమావేశాలు పెట్టి చంద్రబాబు, లోకేశ్‌పై పవన్‌చేసిన వ్యాఖ్యలను ఖండించే పనిలో పడ్డారు.

ఎన్డీయే నుంచి టీడీపీ బయటకు?

ఎన్డీయే నుంచి బయటకువచ్చే అంశంపై కీలక నిర్ణయం తీసుకునేందుకు టీడీపీ పొలిట్‌బ్యూరో శుక్రవారం సమావేశం కానున్నది. తాజా రాజకీయ పరిణామాలపై చర్చించి తదుపరి వ్యూహం సిద్ధం చేసుకోనున్నారు. ఎన్డీయేలో ఇంకా కొనసాగడం భావ్యం కాదనే అభిప్రాయాన్ని అధికశాతం నేతలు వ్యక్తంచేసిన నేపథ్యంలో దీనిపై సమాలోచనలు చేస్తున్నట్టు సమాచారం.

వైసీపీ అవిశ్వాసానికి టీడీపీ మద్దతు

ఏపీకి ప్రత్యేకహోదా కోసం వైసీపీ ఎంపీలు శుక్రవారం కేంద్ర ప్రభుత్వంపై పెట్టనున్న అవిశ్వాస తీర్మానానికి మద్దతివ్వాలని టీడీపీ నిర్ణయించింది. పార్టీ సీనియర్ నేతలతో చర్చించిన మీదట ఏపీ సీఎం చంద్రబాబు ఈ నిర్ణయం తీసుకున్నారు. వైసీపీ ఎంపీ సుబ్బారెడ్డి అవిశ్వాస తీర్మానం నోటీసును గురువారం లోక్‌సభ సచివాలయానికి అందజేశారు.

రాజకీయ నేతలపై పవన్ విమర్శలు

ప్రజలు పన్నులు కడుతారని, రాజకీయ నాయకులు కట్టడం లేదని, ఏదైనా అంటే దాడులు చేస్తున్నారని జనసేన అధినేత, సినీనటుడు పవన్‌కల్యాణ్ వ్యాఖ్యానించారు. విజయవాడలో గురువారం ఆయన ప్రవాసాంధ్రుల సమావేశంలో మాట్లాడుతూ.. సమాజాన్ని సమగ్రంగా చూసే ఆలోచనా విధానం ప్రస్తుత రాజకీయాల్లో లేదన్నారు. చట్టానికి దొరక్కుండా తప్పుడు పనులు చేయగలమని కొందరు అనుకుంటారని, అటువంటివారు ధర్మానికి దొరికిపోతారన్నారు. భవిష్యత్‌లో తాను తప్పు చేస్తే కూడా శిక్షించాలని సూచించారు.

జీఎస్టీ బాదుడు ఎక్కువే

- అత్యంత సంక్లిష్టమైన వాటిలో ఇదీ ఒకటి
- ప్రపంచ బ్యాంకు నివేదిక



న్యూఢిల్లీ, మార్చి 15: ఒకే దేశం.. ఒకే మార్కెట్.. ఒకే పన్ను పేరుతో కేంద్రంలోని నరేంద్ర మోదీ సర్కారు ప్రతిష్ఠాత్మకంగా అమల్లోకి తెచ్చిన వస్తు, సేవల పన్ను (జీఎస్టీ) అత్యంత సంక్లిష్టమైన వాటిలో ఒకటంటూ ప్రపంచ బ్యాంకు పేర్కొన్నది. అంతేగాక భారత్‌లో ఈ పన్ను బాదుడు చాలా ఎక్కువేనని అభిప్రాయపడింది. డజనుకు పైగా కేంద్ర, రాష్ట్ర పన్నులను విలీనం చేసి 1,200ల వస్తువులు, 500లకుపైగా సేవల కోసం దేశవ్యాప్తంగా గతేడాది జూలై 1న జీఎస్టీని ప్రవేశపెట్టిన విషయం తెలిసిందే. అయితే ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ఈ తరహా పరోక్ష పన్నుల్లో అత్యధిక పన్ను రేటున్న వాటిలో భారతీయ జీఎస్టీ రెండో స్థానంలో ఉందని ప్రపంచ బ్యాంకు తన తాజా నివేదికలో వెల్లడించింది. 115 దేశాల్లో అమలవుతున్న పరోక్ష పన్ను విధానాలపై అధ్యయనం చేసిన ప్రపంచ బ్యాంకు.. భారత జీఎస్టీ విధానం అత్యంత సంక్లిష్టమైన వాటిలో ఒకటిగా ఉందన్నది. 49 దేశాల్లో జీఎస్టీ.. ఒకే శ్లాబులో ఉన్నదని, 28 దేశాల్లో రెండు శ్లాబుల్లో ఉన్నదని చెప్పిన ప్రపంచ బ్యాంకు.. ఐదు దేశాల్లో మాత్రమే సున్నా కాకుండా నాలుగు, అంతకంటే ఎక్కువ రకాల జీఎస్టీ శ్లాబులున్నాయన్నది. ఈ దేశాల్లో భారత్‌తోపాటు ఇటలీ, లగ్జెంబర్గ్, పాకిస్తాన్, ఘనా దేశాలున్నాయి. వీటిలో ఎక్కువ జీఎస్టీ రేటు ఉన్న దేశాల్లో భారత్ రెండోదని బుధవారం విడుదల చేసిన తమ ద్వైవార్షిక భారతీయ అభివృద్ధి ప్రగతి నివేదికలో ప్రపంచ బ్యాంకు తెలిపింది. దేశీయ జీఎస్టీ నిర్మాణం ప్రధానంగా 0, 5, 12, 18, 28 శాతాలతో ఐదు శ్లాబుల్లో ఉంటుందన్న సంగతి తెలిసిందే. ప్రత్యేకంగా బంగారంపై 3 శాతం, విలువైన రాళ్లపై 0.25 శాతం చొప్పున జీఎస్టీని వసూలు చేస్తున్నారు. అయితే జీఎస్టీ భారం ఎక్కువగా ఉందన్న ఆందోళన క్రమంలో జీఎస్టీ మండలి సమావేశాల్లో ఆయా వస్తువులు, సేవలపై పన్ను రేట్లను కేంద్రం తగ్గిస్తూ వస్తున్నది. గతేడాది కూడా గరిష్ఠ రేటైన 28 శాతం శ్లాబు నుంచి 178 రకాల ఉత్పత్తులను తొలగించి, తక్కువ శ్లాబుల్లో వేశారు. శ్లాబులూ ఎక్కువగా ఉన్నాయన్న విమర్శలపై 12, 18 శాతాల శ్లాబులను విలీనం చేసే యోచనలోనే ఉన్నామని జైట్లీ గతంలోనే చెప్పారు.

రుణ ఎగవేతదారులపై కొరడా

- దేశం విడిచి వెళ్లొద్దు
- 91 మందికి కేంద్ర ఆర్థిక శాఖ ఆదేశాలు

న్యూఢిల్లీ, మార్చి 15: రుణ ఎగవేతదారులపై కేంద్రం కొరడా ఝుళిపించింది. బ్యాంకుల నుంచి తీసుకున్న రుణాలను ఎంతకూ చెల్లించని సంస్థలతో సంబంధాలున్న 91 మందికి దేశం విడిచి వెళ్లొద్దంటూ కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ ఆదేశాలు జారీ చేసింది. బ్లూంబర్గ్ వివరాల ప్రకారం వీరి విదేశీ ప్రయాణాలను నిషేధిస్తున్నట్లు స్పష్టం చేసింది. ఈ జాబితాలో ఉద్దేశపూర్వక రుణ ఎగవేత సంస్థలకు చెందిన యజమానులు, డైరెక్టర్లున్నారు. రూ.50 కోట్ల కంటే ఎక్కువ బకాయిలున్నవారు, ఈ రుణాలకు పూచీకత్తుగా ఉన్నవారు తమతమ పాస్‌పోర్టు వివరాలను వెల్లడించాలంటూ ఇప్పటికే బ్యాంకులూ కోరుతున్నాయి. ఇటీవల ఆర్బీఐ కూడా లెటర్స్ ఆఫ్ అండర్‌టేకింగ్ (ఎల్‌వోయూ)లను జారీ చేయరాదంటూ బ్యాంకులను ఆదేశించిన విషయం తెలిసిందే. దేశంలోనే అతిపెద్ద బ్యాంకింగ్ కుంభకోణంగా చెప్పుకుంటున్న పీఎన్‌బీ రూ.13,000 కోట్లకుపైగా మోసం ఈ ఎల్‌వోయూల ఆధారంగానే జరిగిన సంగతి విదితమే. ఈ స్కాంలో కీలక పాత్రధారులైన నీరవ్ మోదీ, ఆయన మేనమామ మెహుల్ చోక్సీలు, ఇతర కుటుంబ సభ్యులంతా కూడా విదేశాలకు పారిపోయారు. అంతకుముందు రుణాల ఎగవేత కేసులో విజయ్ మాల్యా లండన్‌కు పారిపోగా, జతిన్ మెహెతా, లలిత్ మోదీ ఇలా ఎందరో బ్యాంకులను మోసం చేసి, దేశంలో ఆర్థిక నేరాలకు పాల్పడి విదేశాలకు చక్కేశారు.



29,077
(రూ.కోట్లలో)
ద్రవ్యలోటు



వ్యవసాయానికి కేటాయింపులు భేష్

మూడేండ్లుగా బడ్జెట్‌లో కేటాయించిన నిధులు దాదాపు 95 శాతం ఖర్చయ్యాయి. వ్యవసాయ రంగానికి పెద్దఎత్తున నిధులు ఇచ్చారు. విద్య, వైద్య రంగాలకు భారీ స్థాయిలో కేటాయింపులు చేశారు.

– పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ప్రభుత్వ విప్

వాణిజ్య

సెన్సెక్స్ 33,685 ↘ 150
నిఫ్టీ 10,360 ↘ 51

మళ్లీ అదే శాఖలో..

- పీఎన్‌బీ బ్రాడీ హౌజ్ శాఖలో మరో కేసును నమోదు చేసిన సీబీఐ
- చంద్రీ పేపర్స్‌కు రూ.9 కోట్ల ఎల్‌వోయూలు

న్యూఢిల్లీ, మార్చి 15: పీఎన్‌బీకు చెందిన ముంబై బ్రాడీ హౌజ్ శాఖ.. చంద్రీ పేపర్స్ అండ్ అల్లీడ్ ప్రొడక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్‌కు మోసపూరితంగా జారీ చేసిన రూ.9 కోట్ల లెటర్స్ ఆఫ్ అండర్‌టేకింగ్స్ (ఎల్‌వోయూ)కు సంబంధించి కేంద్ర దర్యాప్తు సంస్థ సీబీఐ తాజాగా మరో కేసును నమోదు చేసింది. రిటైర్డ్ పీఎన్‌బీ ఉద్యోగి గోకుల్‌నాథ్ శెట్టితోపాటు ఈ శాఖ సింగిల్ విండో ఆపరేటర్ మనోజ్ ఖారత్‌లపై ఎఫ్‌ఐఆర్ దాఖలు చేసింది. సంస్థ, దాని డైరెక్టర్లనూ నిందితులుగా పేర్కొన్నది. రూ.13 వేల కోట్లకుపైగా పీఎన్‌బీ కుంభకోణంలోనూ ఈ శాఖ నుంచే అక్రమంగా ఎల్‌వోయూలు జారీ అయిన విషయం తెలిసిందే. నీరవ్ మోదీ, మెహుల్ చోక్సీలకు వందలకొద్ది ఎల్‌వోయూలను ఇక్కడి ఉన్నతాధికారులు మోసపూరితంగా జారీ చేయగా, సదరు అధికారుల్లో శెట్టి, ఖారత్‌లే కీలకం కావడం గమనార్హం.

డెవలపర్లు స్వీయ నియంత్రణ పాటించాలి!

- భారత ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు



న్యూఢిల్లీ, నమస్తే తెలంగాణ: నిర్మాణ రంగంలో క్రమశిక్షణ అతికీలకమని.. స్వీయ నియంత్రణ పాటించని డెవలపర్లను ఈ రంగం నుంచి తొలగించాలని భారత ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు సూచించారు. గురువారం క్రెడాయ్ కాన్‌క్లేవ్ 2018 ముగింపు సదస్సుకి ముఖ్య అతిథిగా ఆయన విచ్చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రంగం ఏదైనా కఠిన నిర్ణయాలను తీసుకుంటేనే.. విజయ్ మాల్యా, నీరవ్ మోదీ వంటివారు పుట్టుకురారని తెలిపారు. అలాంటి వారు దేశానికి అప్రతిష్ఠ తెస్తున్నారని ఒకింత అసహనం వ్యక్తం చేశారు. కాగా, పర్యావరణ పరిరక్షణ పేరిట నిర్మాణాల అనుమతులు ఆలస్యం చేయడం దారుణమైన విషయమన్నారు. భారత నిర్మాణ రంగం.. భవన నిర్మాణ కార్మికుల ఆరోగ్యం, విద్యపై దృష్టి సారించాలని పిలుపునిచ్చారు. నిర్మాణ సంస్థలు వృత్తి నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. చౌక గృహాలను ప్రైవేటు డెవలపర్లు తప్పకుండా చేపట్టాలన్న ఆయన వీటికి అనుమతులను అతివేగంగా అందజేయాలని తెలిపారు. మరోవైపు విజయవాడ, హైదరాబాద్‌లో న్యూయార్క్ కంటే ఎక్కువగా భూముల ధరలున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితిలో మార్పులు రావాలని హితవు పలికారు. ధరలు దిద్దుబాటు జరిగినప్పుడే అటు గృహనిర్మాణ రంగానికి, ఇటు ప్రజలకు లాభదాయకమన్నారు. ఇదిలావుంటే దేశీయ బ్యాంకింగ్ రంగంలో వెలుగుచూస్తున్న మోసాలపై పార్లమెంట్‌లో తప్పక చర్చ జరుగాల్సిన అవసరం ఉందని ఈ సందర్భంగా వెంకయ్య అభిప్రాయపడ్డారు. ఇక క్రెడాయ్ జాతీయ అధ్యక్షుడు జక్సేషా మాట్లాడుతూ.. ఏ రంగంపై నియంత్రణ విధించినా.. అది అభివృద్ధికి సోపానం కావాలన్నారు. కెడాయ్ చైర్మన్ గీతాంబర్ ఆనంద్ మాట్లాడుతూ.. ప్రభుత్వం చౌక గృహాలకు పూర్తిస్థాయిలో ప్రోత్సాహాన్ని ఇవ్వాలని సూచించారు. దేశంలోని 23 రాష్ట్రాల్లో క్రెడాయ్ సంఘం ఏర్పాటైందని.. దాదాపు పన్నెండు వేల డెవలపర్లు ఇందులో సభ్యులుగా ఉన్నారని వెల్లడించారు. ఇలాంటి సదస్సులను క్రమం తప్పకుండా నిర్వహించడం వల్ల నిర్మాణ రంగంలో కొత్త పోకడలు ప్రతిఒక్కరికీ తెలుస్తాయని క్రెడాయ్ హైదరాబాద్ ఉపాధ్యక్షుడు ఆదిత్యాగౌరా తెలిపారు.



హైదరాబాద్‌లోని బిగ్ 'సి' షోరూంలో సామ్‌సంగ్ గెలాక్సీ ఎస్9, ఎస్9 ప్లస్ మొబైల్స్‌ను ఆవిష్కరిస్తున్న సినీనటి సమంత. చిత్రంలో కంపెనీ సీఎండీ బాలు చౌదరి, డైరెక్టర్లు స్వప్న కుమార్, బాలాజీ రెడ్డి, గౌతమ్ రెడ్డి తదితరులు

బంగారు తెలంగాణ దిశగా

సామాజిక, ఆర్థిక ముఖచిత్రం-2018లో వెల్లడి

- 14.1 శాతం వృద్ధిరేటుతో పరుగులు..
- సర్వతోముఖాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలే కారణం



హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

'మన పోటీ పక్క రాష్ట్రాలతో కాదు.. దేశంతో.. ఇతర దేశాలతో..' అంటూ రాష్ట్ర మంత్రి కల్వకుంట్ల తారకరామారావు (కేటీఆర్) చెప్పిన మాటలు వాస్తవంగా నిజమవుతున్నాయి. దేశంలో 29వ రాష్ట్రంగా ఏర్పడిన తెలంగాణను అన్నిరంగాల్లో ముందుంచాలనే దూరదృష్టి, పక్కా ప్రణాళిక, పకడ్బందీగా అమలు, సరైన మార్గదర్శకత్వం, సరైన సమయంలో సరైన నిర్ణయంతో ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు ఆహరహం శ్రమిస్తుండటంతో.. నిర్దేశించుకున్న లక్ష్యాలను దాటి తెలంగాణ రాష్ట్రం అభివృద్ధిలో పరుగులు పెడుతూ.. 'బంగారు తెలంగాణ' దిశగా మునుముందుకు సాగుతున్నది.

గురువారం రాష్ట్ర శాసనసభలో ఆర్థికమంత్రి విడుదల చేసిన సామాజిక, ఆర్థిక ముఖచిత్రం–2018 (సోషియో ఎకానమిక్ ఔట్‌లుక్)లో రాష్ట్రం బంగారు తెలంగాణ దిశగా సాగుతున్న బలమైన సంకేతాలను స్పష్టం చేసింది. ఆర్థికవృద్ధి రేటు నుంచి మొదలుకుని రాష్ట్ర తలసరి ఆదాయం వరకు.. జాతీయ స్థూల ఉత్పత్తి (జీడీపీ)లోనూ దేశంలో అతిపిన్న వయసున్న రాష్ట్రమైన తెలంగాణ తన వాటాను గణనీయంగా పెంచుకుంటూ ఆర్థిక భాగస్వామ్యాన్ని దృఢతరం చేసుకుంటూ ముందుకు సాగుతున్నది. తాజాగా విడుదల చేసిన సామాజిక, ఆర్థిక ముఖచిత్రం–2018లో పేర్కొన్న అంశాలవారీగా పరిశీలిస్తే.. రాష్ట్రం అన్నిరంగాల్లో ముందుకు సాగుతున్నట్టు స్పష్టమవుతుంది.


గడిచిన ఆరేండ్లలో రాష్ట్ర స్థూల దేశీయోత్పత్తి

ఆర్థిక సంవత్సరం	జీఎస్‌డీపీ (రూ. కోట్లలో)	వృద్ధిరేటు (శాతంలో)
2012–13	4,01,594	11.7
2013–14	4,51,580	12.4
2014–15	5,05,849	12.0
2015–16 (ఎస్ఆర్ఈ)	5,63,356	11.4
2016–17 (ఎఫ్ఆర్ఈ)	6,41,985	14.0
2017–18 (ఏఈ)	7,32,657	14.1


రాష్ట్ర స్థూల దేశీయ ఉత్పత్తి (జీఎస్‌డీపీ)–2017–18

రాష్ట్ర ఆర్థిక గణాంకశాఖ 2017–18 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి విడుదల చేసిన రాష్ట్ర స్థూల దేశీయ ఉత్పత్తి (జీఎస్‌డీపీ)లో గణనీయమైన ప్రగతి నమోదైంది. ఈ ఆర్థిక సంవత్సరం ధరలలో చూసుకుంటే వృద్ధిరేటు 14.1 శాతంతో తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి పథంలో దూసుకుపోతున్నది. 2017–18లో తెలంగాణ జీఎస్‌డీపీ రూ.7.33 లక్షల కోట్లుగా నమోదైంది. 2016–17 సంవత్సరంలో జీఎస్‌డీపీ రూ. 6.42 లక్షల కోట్లు కాగా.. 14.1 శాతం వృద్ధి సాధించింది. రాష్ట్రం ఆవిర్భవించిన సంవత్సరంలో (2014–15) 12 శాతం వృద్ధి రేటు నమోదు కాగా.. మూడేండ్లలో 14.1 శాతానికి వృద్ధిరేటు చేరుకోవడం గమనార్హం.

జాతీయవృద్ధిలో భాగస్వామ్యం



తాజాగా విడుదల చేసిన సామాజిక ఆర్థిక ముఖచిత్రంలో అంశాలవారీగా పరిశీలిస్తే.. కొన్ని అంశాల్లో జాతీయ వృద్ధిలో తెలంగాణ భాగస్వామ్యం మరింత బలపడుతున్నట్టుగా తేటతెల్లం అవుతుంది. జాతీయ స్థూల ఉత్పత్తిలో (జీడీపీ)లో రాష్ట్ర వాటా గణనీయంగా పెరుగుతూ వస్తున్నది. 2011–12లో రాష్ట్ర దేశీయ ఉత్పత్తి రూ.3,59,434 కోట్లు కాగా.. జాతీయ స్థూల ఉత్పత్తి రూ.87,36,329 కోట్లు. జీడీపీలో తెలంగాణ వాటా 4.11 శాతం వరకు ఉంది. 2014–15 ఆర్థిక సంవత్సరానికి వచ్చేసరికి తెలంగాణ జీఎస్డీపీ రూ.5,05,849 కోట్లు.. జాతీయ స్థూల ఉత్పత్తి రూ. 1,24,67,959 కోట్లు. జీడీపీలో రాష్ట్ర వాటా 4.06 గా నమోదైంది. ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడిన తరువాత అభివృద్ధిలో ఏమాత్రం తగ్గకుండా ముందుకు సాగుతూనే ఉన్నది. 2017–18లో జీడీపీలో మన రాష్ట్ర వాటా 4.37 శాతానికి చేరడం గమనార్హం.



వృద్ధిరేటులో దేశంతో పోటీ


ప్రత్యేకరాష్ట్రంగా ఏర్పడిన తర్వాత తెలంగాణ రాష్ట్ర ఆర్థికవృద్ధి రేటు గణనీయంగా పెరుగూతూ వస్తున్నది. రాష్ట్రం ఏర్పడక ముందు(2012–13 నుంచి 2013–14) ఏటా 4.2 శాతంతో వృద్ధిరేటు నమోదవ్వగా.. రాష్ట్రం ఏర్పడిన తరువాత 2014–15 నుంచి 2017–18 మధ్యలో ఏటా సగటున 9.0 శాతం నమోదైంది. రాష్ట్రం ఏర్పడక ముందు నమోదైన వృద్ధిరేటు అప్పటి జాతీయ వృద్ధిరేటు (5.9 శాతం) కన్నా తక్కువగా ఉండటం గమనార్హం. రాష్ట్రం ఏర్పడిన తరువాత నమోదైన 9.0 వృద్ధిరేటు జాతీయ వృద్ధి రేటు (7.3 శాతం) కన్నా అధికంగా ఉంది. దీనికి ప్రధాన కారణం.. రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రి కేసీఆర్ తీసుకుంటున్న విప్లవాత్మకమైన, వినూత్నమైన పథకాలు, చర్యలు.

జిల్లాల వారీగా తలసరి ఆదాయం (రూపాయల్లో)

జిల్లాలవారీగా తలసరి ఆదాయం తీసుకుంటే.. 2016–17 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రంగారెడ్డి జిల్లా రూ.3,68,747 తలసరి ఆదాయంతో తొలిస్థానంలో ఉండగా.. రూ.3,15,745తో రెండోస్థానంలో హైదరాబాద్, రూ.1,81,104తో మేడ్చల్ జిల్లా మూడోస్థానంలో ఉన్నాయి. అతితక్కువ తలసరి ఆదాయంతో నాగర్‌కర్నూల్ జిల్లా రూ. 82,694తో చివరిస్థానంలో ఉన్నది.

ఆదిలాబాద్	93,588
కుమ్రంభీం ఆసిఫాబాద్	1,03,822
మంచిర్యాల	1,04,891
నిర్మల్	98,129
నిజామాబాద్	1,04,868
జగిత్యాల	91,885
పెద్దపల్లి	1,29,723
జయశంకర్ భూపాలపల్లి	1,15,774
భద్రాద్రి కొత్తగూడెం	1,26,084
మహబూబాబాద్	1,07,684
వరంగల్ రూరల్	1,03,914
వరంగల్ అర్బన్	91,333
కరీంనగర్	1,20,173
రాజన్న సిరిసిల్లా	99,687
కామారెడ్డి	86,608
సంగారెడ్డి	1,64,698
మెదక్	1,10,345
సిద్దిపేట	1,28,701
జనగామ	1,00,216
యాదాద్రి భువనగిరి	1,31,749
మేడ్చల్	1,81,104
హైదరాబాద్	3,15,745
రంగారెడ్డి	3,68,747
వికారాబాద్	87,891
మహబూబ్‌నగర్	86,237
జోగులాంబ గద్వాల	1,01,977
వనపర్తి	94,774
నాగర్‌కర్నూల్	82,694
నల్లగొండ	1,04,660
సూర్యాపేట	1,13,348
ఖమ్మం	1,08,133

జాతీయ తలసరి ఆదాయం కన్నా రాష్ట్ర తలసరి ఆదాయం మిన్న



ఇక తలసరి ఆదాయం విషయానికి వస్తే.. తెలంగాణ రాష్ట్ర తలసరి ఆదాయం జాతీయ తలసరి ఆదాయం కన్నా ఎంతో ఎక్కువగా ఉన్నది. సొంత రాష్ట్రం ఏర్పడిన తర్వాత తలసరి ఆదాయం గణనీయంగా పెరుగుతూనే ఉంది. 2011–12లో అది రూ.91,121గా ఉన్న రాష్ట్ర తలసరి ఆదాయం.. 2017–18లో రూ.1,75,534కు చేరింది. అంటే 2011–12తో పోల్చుకుంటే 93 శాతం తలసరి ఆదాయం పెరిగింది. ఇదే సమయంలో జాతీయ తలసరి ఆదాయం మన రాష్ట్ర తలసరి ఆదాయం కన్నా తక్కువగా ఉంది. 2011–12లో జాతీయ తలసరి ఆదాయం రూ. 63,462 కాగా.. 2017–18లో రూ.1,12,764గా నమోదైంది.


సయాటికాతో బాధపడుతున్నారా ?

తుంటి నుండి వెనుక వైపు కాలులోను, పిక్కలలోను విపరీతమైన నొప్పి, తిమ్మిరిగా ఉండడం, రెండు కాళ్ళ కండరాలు బలహీనంగా ఉండడం, సూదులు పొడిచినట్లుండడం, అశాంతి చికాకుగా ఉండటాన్ని సయాటికా నొప్పిని సూచిస్తుంది. అసలు సయాటికా అంటే మన శరీరంలోని అన్ని నరాల్లోను పొడవైన నరం సయాటికా నరం. అది నడుములోని వెన్నుపాము నుండి ప్రారంభమై పిరుదుల నుంచి పిక్కలకు పాదాల్లోని స్పర్శను గ్రహించడానికి తోడ్పడుతుంది.

సయాటికా నరం ప్రయాణించే మార్గంలో నొప్పి వస్తున్నప్పుడు సయాటికా అంటారు. నిజానికి ఇది ఒక లక్షణం, వెన్నుపూసల మధ్య నుంచి డిస్క్ జారటం వంటి నరాల వ్యాధి స్థితి.సయాటికా నొప్పి వచ్చినపుడు బాధపడకుండా తగిన చికిత్స తీసుకుంటూ సరైన జాగ్రత్తలు పాటిస్తే 4 నుండి 8 వారాల్లో తగ్గిపోతుంది.

లక్షణాలు: లక్షణాలు అందరిలో ఒకే విధంగా ఉండకపోవచ్చు.

నొప్పి: నములుతున్నట్టు ఉండే నొప్పి ముందుగా నడుములో ప్రారంభమై పిరుదులలోకి అక్కడినుండి తొడల్లోకి అక్కడి నుండి పిక్కల్లోకి ప్రసరించడం సయాటికాలోని ప్రధాన లక్షణం. సయాటికా నరం ప్రయాణించే మార్గం మొత్తం నొప్పిగా అనిపించవచ్చు. ముఖ్యంగా తొడ వెనుక భాగంలోను, పిక్కల్లోను నొప్పి స్పష్టంగా కనిపిస్తుంది. సయాటికా లక్షణాలు వివిధ రకాల స్థాయిలో ఉంటాయి. నొప్పి మామూలుగా ఉండవచ్చు లేదా తీవ్రంగా ఉండవచ్చు లేదా అసౌకర్యంగా ఉండవచ్చు లేదా షాక్ కొట్టినట్టు, ఝుల్లుమనవచ్చు. దగ్గినపుడుగాని, తుమ్మినపుడు గాని, ఎక్కువసేపు కూర్చున్నపుడు గాని సమస్య తీవ్రతరం కావచ్చు. రెండు కాళ్లలో ఒకే విధంగా కాకుండా ఏదో ఒక కాలు నొప్పి ఎక్కువ ఉండవచ్చు.



తిమ్మిర్లు, కండరాల బలహీనత: సయాటికా నరం ఒత్తుకుపోవడం వల్ల కాలులో తిమ్మిరిగా అనిపిస్తుంది. ముఖ్యంగా నరం ప్రయాణించే మార్గం అంటే కాలులోను, పాదాలలోను మొద్దుబారినట్లు అనిపిస్తుంది. కొన్ని సందర్భాలలో ఒక కాలులో నొప్పి తీవ్రంగా ఉంటే ఇంకో కాలిలో తిమ్మిర్లు ఉంటాయి. ● సూదులు గుచ్చుకున్నట్టు పాదంలో ఎక్కువగా ఉంటుంది. మలమూత్రాల మీద నియంత్రణ కోల్పోవటం ● ఇది చాలా అరుదుగా కనిపించే లక్షణం. ఈ లక్షణం చాలా ప్రమాదకరమైన స్థితిని సూచిస్తుంది. దీన్ని "కాడా ఈక్వినా సిండ్రోమ్" అంటారు. దీనికి వెంటనే చికిత్స అవసరం.

కారణాలు: ● హర్నిమేటెడ్ డిస్క్ ● హర్నిమేషన్ అంటే వెన్నుపూసల మధ్య ఉండే డిస్క్ పక్కకు జారటం. వెన్నుపామును నొక్కటం సయాటికా నొప్పికి అతి ప్రధాన లక్షణం. దీనివల్ల సయాటికా నరం ప్రారంభపు భాగంలో బయటకుపోయి నొప్పి వస్తుంది. నడుము భాగంలో ఉండే వెన్నుపూసలను లంబార్ వర్టెబ్రే అంటారు. వీటి మధ్య మృదులాస్థితో తయారైన డిస్క్‌లు ఉంటాయి. ఇవి వెన్నుపూసలను తేలికగా ఒకదాని మీద మరొకటి కదలడానికి, వంగడానికి, ఆపటానికి సహాయపడతాయి. అలాగే కదలికల సమయంలో జనించే ఒత్తిళ్లను గ్రహిస్తూ షాక్ అబ్జార్బర్‌గా పనిచేస్తాయి. వయసు పెరిగేకొద్ది ఈ డిస్క్‌లు దెబ్బతినడం మొదలవుతుంది. శుష్కించుపోవచ్చు లేదా మందం తగ్గవచ్చు. లేదా స్థిరత్వం కోల్పోయి పెళుసుగా తయారు కావచ్చు. సమయం గడిచే కొద్ది డిస్క్ వెలుపల భాగాన్ని ఆవరించి ఉండే మాస్కులస్ అనే నిర్మాణంలో పగుళ్లు తయారవుతాయి. ఫలితంగా ఈ పగుళ్ల నుంచి డిస్కు మధ్యభాగంలో ఉండే జిగురు వంటి పదార్థం వెలుపలికి చొచ్చుకు వస్తుంది. దీన్ని హర్నిమేషన్ అంటారు. దీని సయాటిక్ నరం నొక్కుకుపోయి కాలులో గాని నడుములో గాని లేదా రెండింటిలో గాని నొప్పి మొదలవుతుంది. ఒకవేళ నడుము చివరిభాగంలో ఒత్తుకుపోతే తిమ్మిర్లు, సూదులతో గుచ్చినట్టు ఉండటం, కండరాల బలహీనత వంటివి సైతం ఉంటాయి.

లంబార్ స్పైనల్ స్టీనోసిస్: వెన్నుపూసల మధ్య ఉండే స్పైనల్ కెనాల్ అనే చాకెట్‌లో వెన్నుపాము ప్రయాణిస్తుంది. వెన్నుపాము అనేది అనేక నరాల తంతువుల సముదాయం. నరాలు కట్టకట్టినట్లు ఒక పెద్ద తాడు లాగ అమరి వెన్నుపాములా ఉంటుంది.

● దీని నుండి నరాల శాఖలు వెన్నుపూసల ద్వారా వెలుపలికి వస్తాయి. ఇవి శరీరానికి మెదడుకు మధ్య సమాచారాన్ని కొనసాగిస్తుంటాయి. ఒకవేళ ఏదైనా కారణం చేత వెన్నుపాము ప్రయాణించే కెనాల్ ఇరుకుగా మారితే కెనాల్ స్టినోసిస్ అంటారు. ఇలా జరగటం వల్ల నరాల మీద ఒత్తిడి పడుతుంది. నరాల ఆధీనంలో ఉండే కండరాలపై ఒత్తిడితో నొప్పి వస్తుంది. వెన్ను చివరి భాగంలో ఒత్తిడిపడితే నడుము భాగానికి గాని కంటి భాగానికి గాని ప్రయాణించే నరాలు దెబ్బతింటాయి.

స్పాండిలో–లిస్థిసిస్: వెన్నుపూసల మధ్యన ఉండే డిస్కులు శుష్కించుకుపోవటం వల్ల వెన్నుపూసలు ఒకదాని మీద మరొకటి సరిగా అమరకుండా ముందుకు జరుగుతాయి. దీనితో వాటి మధ్య నుండి వచ్చే సయాటికా నరం పైన ఒత్తిడి పడుతుంది.

పైరీ ఫార్మిస్ సిండ్రోమ్: పైరీ ఫార్మిస్ సిండ్రోమ్‌లో పైరిఫార్మిస్ అనే కండరం సయాటికా నరం పైన అమరి ఉంటుంది. నడుము భాగంలోని వెన్ను వద్దకు వచ్చి తొడ ఎముక వద్ద అంతమవుతుంది. ఒకవేళ కండరంలో ఒత్తిడి పెరిగి కండరం బిగుసుకుపోవటంతో పాటు సయాటికా నరం మీద కూడా ఒత్తిడి పెరుగుతుంది. నొప్పి నడుము నుండి మొదలై తొడ వరకు విస్తరిస్తుంది. అయితే మోకాళ్ల కంటే క్రిందకు ప్రసరించదు. ఎక్కువ సమయం పాటు కూర్చోవటం, మోటారు వాహనాల యాక్సిడెంట్లు, నడుస్తున్నపుడు జారి కింద పడడం వంటి వాటి వల్ల పైరిఫార్మిస్ సిండ్రోమ్ ప్రాప్తిస్తుంది.

స్పైనల్ ట్యూమర్స్: వెన్నుపాములోని అంతర్గత భాగంలో గాని, వెన్నుపాము కప్పి ఉంచే పొరల్లో గాని, వెన్నుపాముకు, వెన్నుపూసలకు మధ్యన ఉండే ప్రదేశంలో గాని పెరుగుదలలు మొదలైనపుడు వెన్నుపాము నొక్కుకుపోయి సయాటికా వస్తుంది.

జాగ్రత్తలు: రెస్ట్ (విశ్రాంతి) మంచి పోషకాహారం తీసుకోవాలి. ● నొప్పి నివారణకు (మైల్డ్) తేలికపాటి వ్యాయామం చేయాలి.

హోమియో చికిత్సా విధానము: సయాటికాకు "పాజిటివ్ హోమియోపతి"లో చాలా అద్భుతమైన వైద్యం అందుబాటులో ఉంది. రోగి యొక్క వ్యాధి లక్షణంగా వారి యొక్క మానసిక, శారీరక స్థితిగతులను పరిగణలోకి తీసుకొని కాన్‌స్టిట్యూషనల్ పద్ధతిలో వైద్యం చేయబడుతుంది. దీనితో ఎలాంటి దుష్ప్రభావాలు లేకుండా చాలా సింపుల్ మందులతో ఎలాంటి ఆహార నియమాలు లేకుండా చాలా అద్భుతంగా పనిచేస్తాయి. వ్యాధి నయం కావటానికి సమయం చాలా పడుతుందనే అపోహ నిజం కాదు. కేవలం దీర్ఘకాల సమస్యలకు మాత్రమే సమయం కాస్త ఎక్కువ పడుతుంది. ఎంతకాలం మనం ఈ వైద్యం తీసుకున్నా కాని ఎలాంటి దుష్ఫలితాలు ఉండవు. నిశ్చింతగా, సురక్షితంగా ఈ వైద్యంను వాడుకోవచ్చు.

గ్రామీణ ప్రాంతాల్లో చేపల మార్కెట్లు

- ఉత్పత్తిలో అగ్రస్థానంలో నిలిచేందుకు ప్రోత్సాహం
- ఆక్వాఎక్స్ ఇండియా-2018 ప్రారంభోత్సవంలో మంత్రి తలసాని



గురువారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన ఆక్వాఎక్స్-2018 ప్రారంభోత్సవ కార్యక్రమంలో రొయ్యను పరిశీలిస్తున్న రాష్ట్ర మత్స్య శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్. చిత్రంలో ఇతర ఉన్నతాధికారులు

హైదరాబాద్, నమస్తేతెలంగాణ : రాబోయే రోజుల్లో తెలంగాణ రాష్ట్రాన్ని చేపల ఉత్పత్తిలో దేశంలో అగ్రగామిగా నిలిపేలా మత్స్యకారులను ప్రోత్సహిస్తామని రాష్ట్ర పశుసంవర్ధక, పాడిపరిశ్రమాభివృద్ధి, మత్స్యశాఖ మంత్రి తలసాని శ్రీనివాస యాదవ్ అన్నారు. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి చేపల ఉత్పత్తి పెంపుకోసం చర్యలు తీసుకుంటున్నటు గురువారం హైదరాబాద్‌లో జరిగిన ఆక్వాఎక్స్ ఇండియా–2018 ప్రదర్శనను ప్రారంభించిన అనంతరం మంత్రి అన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో చేయని విధంగా ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్ రావు చేపల వృత్తిపై ఆధారపడి జీవిస్తున్న వారి జీవితాల్లో వెలుగులు నింపుతున్నారన్నారు. గ్రామాల్లో కుల సంఘాల మధ్య ఉన్న విభేదాలను మత్స్యకారులు పక్కన పెట్టి....ప్రపంచంలో మారుతున్న సాంకేతికానికి అనుగుణంగా పరిజ్ఞానాన్ని వినియోగించుకొని ముందుకు వెళ్లాలని మంత్రి సూచించారు. సమైక్య రాష్ట్రంలో ఫెడరేషన్లకు చాలిచాలని నిధుల కేటాయింపు ఉండేదని...తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత రూ.1,000 కోట్లతో రాష్ట్రంలోని సాగునీటి ప్రాజెక్టులు, రిజర్వాయర్లు, చెరవుల్లో పెద్ద ఎత్తున చేప పిల్లలను వదిలినట్లు చెప్పారు. ప్రస్తుత సంవత్సరంలో 80 కోట్ల చేపపిల్లలను పంపిణీ చేయాలనుకుంటున్నట్లు మంత్రి తెలిపారు. దేశంలో మొదటిసారిగా రిజర్వాయర్లలో మంచినీటి రొయ్యలను ప్రయోగాత్మకంగా పెంచుతున్నట్లు చెప్పారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాలలో చేపల మార్కెట్లను నిర్మించనున్నట్లు, తద్వారా చేపల ఉత్పత్తిలో గణనీయమైన ప్రగతి సాధించేందుకు అవకాశం ఉందన్నారు. రాష్ట్రంలో చేపల ఉత్పత్తి పెరిగేందుకు అవసరమైన వనరులు సంవృద్ధిగా ఉన్నాయన్న మంత్రి.. టెక్నాలజీని వినియోగించుకోవడం ద్వారా ఉత్పత్తిని మరింత పెంచుకోవచ్చన్నారు. ఇందుకు అనువైన స్థలాల్లో ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేసే వారికి ప్రభుత్వం అన్ని రకాలుగా సహాయ సహకారాలు అందించనున్నట్లు చెప్పారు. తెలంగాణలో ఉన్న నీటివనరులను వినియోగించుకొని ఆక్వాకల్చర్‌ను అభివృద్ధి చేయడంపై ప్రభుత్వం దృష్టి సారించాలని ఇటలీ ప్రతినిధి రోహణి శివసింగే సూచించారు. ఆసియాలోనే మొదటిసారిగా ఇంతపెద్ద ఎక్స్‌పోను నిర్వహించడం గర్వకారణమని మత్స్యశాఖ కమిషనర్ సువర్ణ అన్నారు. పట్టణాలతో పోలిస్తే గ్రామీణ ప్రాంతాల్లో చేపల వినియోగం ఎక్కువన్నారు. పట్టణాలలో కూడా చేపల వినియోగం పెంచేందుకు ఇలాంటి ప్రదర్శనలు దోహదం చేస్తాయన్నారు.

మమతా బెనర్జీ సన్నిహితుడు అరెస్ట్

- కెనరా బ్యాంక్ మోసం కేసులో

కోల్‌కతా, మార్చి 15: కెనరా బ్యాంక్ మోసం కేసులో కేంద్ర దర్యాప్తు సంస్థ సీబీఐ స్పీడ్ పెంచింది. బ్యాంకుకు ఆర్‌పీ ఇన్ఫోసిస్టమ్ రూ.515 కోట్ల మోసం చేసిన కేసులో బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ సన్నిహితుడు ప్రముఖ వ్యాపారవేత్త శిబాజీ పంజా, కౌస్తవ్ రేలను సీబీఐ గురువారం అరెస్ట్ చేసింది. అంతకుముందు కోల్‌కతాలోని వీరిద్దరి ఇండ్లపై, కార్యాలయాలపై సీబీఐ వర్గాలు సోదాలు నిర్వహించి పలు కీలక పత్రాలు స్వాధీనం చేసుకున్నట్లు తెలుస్తున్నది.

ఐపీవోకి క్యాప్స్‌టన్

హైదరాబాద్, మార్చి 15: హైదరాబాద్ కేంద్రస్థానంగా భద్రత, ఇతర సదుపాయాలు సమకూర్చే క్యాప్స్‌టన్ వచ్చే వారంలో ఐపీవోకి రాబోతున్నట్లు ప్రకటించింది. ఈ సందర్భంగా కంపెనీ సీఎండీ శ్రీకాంత్ మాట్లాడుతూ..వ్యాపారాన్ని మరింత విస్తరించాలనే ఉద్దేశంతో ఐపీవోకి రావాలని నిర్ణయించినట్లు, తద్వారా రూ.21.19 కోట్ల నిధులను సేకరించనున్నట్లు చెప్పారు. రూ.10 ముఖ విలువ కలిగిన 23 లక్షల షేర్లను ఆఫర్ ఫర్ సేల్ రూట్‌లోనే విక్రయించనున్నది. ఒక్కో షేరు ధరను రూ.92గా నిర్ణయించింది.



పరీక్ష రాసిన విద్యార్థులు రాజేశ్వర్, శ్రీనివాస్‌రెడ్డి, శిరీష, సాయితేజ, కుసుమ

దుఃఖాన్ని దిగమింగి..

కన్నవారు కాలం చేసినా.. టెన్త్ పరీక్ష రాసిన తనయులు

నమస్తే తెలంగాణ, నెట్‌వర్క్: కన్న వారు కాలం చేసినా, దుఃఖాన్ని దిగమింగుకొని, తనయులు గురువారం పదో తరగతి పరీక్ష రాశారు. నిజామాబాద్ జిల్లా మాక్లూర్ మండలం గుత్పకు చెందిన విద్యార్థి రాజేశ్వర్ తల్లి సాయమ్మ అనారోగ్యంతో బుధవారం రాత్రి మృతి చెందింది. వికారాబాద్ జిల్లా యాలాల మండలం నాగసముందర్‌లో శ్రీనివాస్‌రెడ్డి తండ్రి మోహన్‌రెడ్డి, యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి మండలం అనంతారంలో శిరీష తండ్రి రాములు మరణించారు. కాగా, కరీంనగర్ జిల్లా చిగురుమామిడిలో సాయితేజ తండ్రి బాలయ్య గురువారం ఉదయం మృతి చెందారు. నాగర్‌కర్నూల్ జిల్లా ఊర్కొండ మండలం జగబోయిన్‌పల్లిలో కుసుమ తల్లి కవిత మృతి చెందారు. కాగా, ఈ విద్యార్థులంతా పరీక్ష రాసిన తర్వాత అంత్యక్రియల్లో పాల్గొన్నారు.



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు-కొల్హాపూర్ ఎక్స్‌ప్రెస్ రైలును మహబూబాబాద్ ఎంపీ సీతారాంనాయక్, ఖమ్మం ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డిలు మణుగూరు వద్ద గురువారం జెండా ఊపి ప్రారంభించారు. అదే రైలులో కొత్తగూడెం వరకు ప్రయాణించారు. అక్కడ కూడా ఈ రైలుకు జెండా ఊపారు. - భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, నమస్తే తెలంగాణ

ఆ ఉద్యోగులను ఆంధ్రాకు పంపాలి

నాగార్జునసాగర్: విద్యుత్‌సంస్థ నుంచి ఆంధ్రా ఉద్యోగులను వెంటనే పంపాలని తెలంగాణ ఇంజినీర్లు డిమాండ్ చేశారు. గురువారం నల్లగొండ జిల్లా నాగార్జునసాగర్ పైలాన్ వద్ద టీఎస్ జెన్‌కో కార్యాలయం ఎదుట భోజన విరామ సమయంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా టీఎస్ జెన్‌కో ఏడీఈ సందీప్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రం ఆవిర్భవించిన తర్వాత అక్కడ పనిచేస్తున్న 1250 మంది ఆంధ్రా ఉద్యోగులను 2015 జూన్‌లో రిలీవ్ చేసినా, వీరిని ఆంధ్రా ప్రాంతంలో విధుల్లోకి తీసుకోకపోవడంతో మూడేండ్లుగా అక్కడ విధులు నిర్వహించక పోయినా ప్రభుత్వం జీతాలు చెల్లిస్తూ వస్తున్నదన్నారు.

నేడు, రేపు చిరుజల్లులు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: అరేబియా సముద్రంలో అల్పపీడన ప్రభావంతో రాష్ట్రవ్యాప్తంగా శుక్ర, శనివారాల్లో పలుచోట్ల ఉరుములు, మెరుపులతో కూడిన చిరుజల్లులు కురిసే అవకాశం ఉన్నదని తెలంగాణ స్టేట్ డెవలప్‌మెంట్ ప్లానింగ్ సొసైటీ (టీఎస్‌డీపీఎస్) అధికారులు తెలిపారు. గురువారం భద్రాద్రి కొత్తగూడెం, జయశంకర్ భూపాలపల్లి, కుమ్రంభీం ఆసిఫాబాద్, నల్లగొండ, నిజామాబాద్, మెదక్, సిద్దిపేట జిల్లాల్లో అత్యధికంగా 38 డిగ్రీల చొప్పున మగినిన చోట్ల 36 నుంచి 37 డిగ్రీల మధ్య గరిష్ఠ ఉష్ణోగ్రతలు రికార్డయ్యాయి. హైదరాబాద్‌లో 26 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత, గరిష్ఠంగా 36.7 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైనట్టు అధికారులు వెల్లడించారు.

మనది పేదల ప్రభుత్వం

అభివృద్ధి, సంక్షేమ పథకాల్లో దేశానికే ఆదర్శం: మంత్రి కేటీఆర్.. సిరిసిల్లలో అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభం

రాజన్న సిరిసిల్ల ప్రతినిధి, నమస్తే తెలంగాణ: 'పేదల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న ప్రభుత్వం మనది.. ఇన్ని సంక్షేమ పథకాలు ఏ రాష్ట్రం కూడా చేపట్టలేదు.. అభివృద్ధిలో దేశానికే ఆదర్శంగా తెలంగాణ నిలిచింది' అని మున్సిపల్ పట్టణాభివృద్ధి, ఐటీ శాఖల మంత్రి కేటీఆర్ పేర్కొన్నారు. రాజన్నసిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం కొత్తపల్లిలో టీఆర్ఎస్ కార్యకర్త దేవయ్య పెద్దకర్మకు హాజరయ్యారు. అనంతరం సిరిసిల్ల జిల్లా కేంద్రంలో పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు. బైపాస్ రోడ్డులో నిర్మిస్తున్న నూతన సమీకృత కలెక్టరేట్ సముదాయ పనులను పరిశీలించారు. పనుల్లో వేగం పెంచాలని, నాణ్యత ఉండేలా చూడాలని అధికారులు, కాంట్రాక్టర్లను ఆదేశించారు. పేదలకు కార్పొరేట్ స్థాయిలో సేవలందించేలా సర్కారు దవాఖానలను బలోపేతం చేసినట్టు మంత్రి కేటీఆర్ తెలిపారు. సిరిసిల్ల జిల్లా ఏరియా దవాఖానకు సిటీస్కాన్ మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. మూత్ర పిండాల వ్యాధిగ్రస్తుల కోసం డయాలసిస్ కేంద్రాన్ని ఇప్పటికే ఏర్పాటు చేశామన్నారు. మంత్రి వెంట కలెక్టర్ కృష్ణభాస్కర్, టెస్కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు, టీఆర్ఎస్ నాయకుడు చీటి నర్సింగరావు, మున్సిపల్ చైర్‌పర్సన్ సామల పావనీ, టీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు జిందం చక్రపాణి, సెస్ చైర్మన్ లక్ష్మారెడ్డి, వైస్‌చైర్మన్ లగిశెట్టి శ్రీనివాస్ ఉన్నారు.



సిరిసిల్లలో పార్క్‌ను ప్రారంభిస్తున్న మంత్రి కేటీఆర్. చిత్రంలో టెస్కాబ్ చైర్మన్ కొండూరి, కలెక్టర్ కృష్ణభాస్కర్

క్యాన్సర్ బాధితురాలికి మంత్రి కేటీఆర్ భరోసా



బాధితురాలు రాజేశ్వరి కూతురిని ఓదారుస్తున్న మంత్రి కేటీఆర్

సిరిసిల్ల రూరల్: మంత్రి కేటీఆర్ మరోసారి ఔదార్యాన్ని చాటుకున్నారు. క్యాన్సర్‌తో బాధపడుతున్న మహిళకు అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. సిరిసిల్ల మండలం పెద్దూరుకు చెందిన రాజేశ్వరి(55) బీడీ కార్మికురాలు. ఆమె భర్త రాజయ్య ఇటీవలే దుబాయ్ వెళ్లగా, కూతురు సుధతో కలిసి ఉంటున్నది. రాజేశ్వరి ఏడాదిగా క్యాన్సర్‌తో బాధపడుతూ ఖరీదైన వైద్యం చేయించుకోలేక ఇబ్బందులు పడుతున్నది. గురువారం పెద్దూరుకు వచ్చిన మంత్రి కేటీఆర్‌ను సర్పంచ్ లక్ష్మి, ఎంపీపీ శ్రీలత సమక్షంలో కలిశారు. స్పందించిన మంత్రి హైదరాబాద్‌లోని ప్రైవేటు దవాఖానల్లో వైద్యం చేయిస్తానని హామీ ఇచ్చారు. అలాగే, టీఆర్ఎస్ నాయకుడు దేవయ్య దశదిన కర్మకు హాజరైన మంత్రి కేటీఆర్.. 'అధైర్యపడొద్దు.. మీ కుటుంబానికి బాసటగా ఉంటా.. మీ కొడుకుల చదువు బాధ్యతతోపాటు వారి పేరిట రూ.5లక్షల చొప్పున డిపాజిట్ చేస్తా'నని బాధిత కుటుంబానికి భరోసా ఇచ్చారు.

ప్రజాసంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

తిరుమలాయపాలెం: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా టీఆర్ఎస్ ప్రభుత్వం అనేక రకాల పథకాలు అమలు చేస్తున్నట్టు రోడ్లు భవనాల శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెంలో డబుల్ బెడ్‌రూం ఇండ్లను గురువారం సాయంత్రం మంత్రి తుమ్మల ప్రారంభించారు. అనంతరం రూ.30లక్షల ఈజీఎస్ నిధులతో చేపట్టే సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి మాట్లాడుతూ.. నిరుపేదల సొంతింటి కల నెరవేర్చే లక్ష్యంతో దేశంలో ఎక్కడా లేని విధంగా సీఎం కేసీఆర్ డబుల్ బెడ్‌రూం ఇండ్ల నిర్మాణం చేపట్టినట్టు తెలిపారు. ఇంటింటికీ తాగునీరు అందించే లక్ష్యంతో మిషన్ భగీరథ పథకాన్ని చేపట్టామని, ఉగాది రోజు నుంచి ఈ పథకం ద్వారా తాగునీటిని అందిస్తామన్నారు. కల్యాణలక్ష్మి పథకం మొత్తాన్ని మరింత పెంచినట్టు తెలిపారు. బోదకాలతో బాధపడుతున్న వారికి నెలకు రూ. వెయ్యి పింఛన్ ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించినట్టు చెప్పారు. త్వరలోనే వారికి పింఛన్లు మంజూరవుతాయన్నారు. సమావేశంలో రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ కొండబాల కోటేశ్వరావు, కలెక్టర్ లోకేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెంలో డబుల్ బెడ్‌రూం ఇండ్లను ప్రారంభిస్తున్న మంత్రి తుమ్మల



ఆదిలాబాద్‌లో సీఎం కేసీఆర్ ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేస్తున్న టీఆర్ఎస్ నాయకులు

జనరంజక బడ్జెట్

కేటాయింపులపై సంబురాలు

నమస్తే తెలంగాణ నెట్‌వర్క్: అసెంబ్లీలో గురువారం ఆర్థిక మంత్రి ఈటల రాజేందర్ ప్రవేశపెట్టిన బడ్జెట్ జనరంజకంగా ఉన్నదని ఆయా వర్గాల వారు హర్షం వ్యక్తం చేశారు. అన్ని వర్గాల ప్రజలు సీఎం కేసీఆర్, ఆర్థిక మంత్రి ఈటల రాజేందర్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. కరీంనగర్‌లో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఏనుగు రవీందర్‌రెడ్డి ఆధ్వర్యంలో సంబురాలు జరిపారు. గిరిజన విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో, ఆదిలాబాద్‌లోని మంత్రి జోగు రామన్న నివాసం వద్ద కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి, పటాకులు కాల్చారు. బోథ్ నియోజకవర్గానికి అధిక నిధులు కేటాయించడంపై నేరడిగొండ, గుడిహత్నూర్, ఇచ్చోడలో కేసీఆర్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేసి సంబురాలు జరుపుకొన్నారు. జగిత్యాల జిల్లా ధర్మపురి క్షేత్ర అభివృద్ధికి రూ.50 కోట్లు కేటాయించడంపై ధర్మపురిలో సీఎం కేసీఆర్, ప్రభుత్వ చీఫ్‌విప్ కొప్పుల ఈశ్వర్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. వ్యవసాయానికి పెద్దపీట వేశారంటూ రైతులు నల్లగొండ మండలం బుద్ధారంలో సీఎం కేసీఆర్, మంత్రి ఈటల ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేశారు.



జగిత్యాల జిల్లా ధర్మపురిలో సీఎం కేసీఆర్, చీఫ్‌విప్ కొప్పుల ఈశ్వర్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

టీఆర్ఎస్‌లో చేరికలు

భిక్కనూరు/ఉప్పునుంతల: కామారెడ్డి జిల్లా భిక్కనూరు మండలం కంచర్ల గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు 45 మందితోపాటు తిప్పాపూర్ అంబేద్కర్ సంఘం సభ్యులు, వీడీసీ సభ్యులు 40 మంది దాకా గురువారం టీఆర్ఎస్‌లో చేరగా, వీరికి ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. నాగర్‌కర్నూల్ జిల్లా ఉప్పునుంతల మండల పరిధిలోని వెల్టూర్ గ్రామానికి చెందిన 20మంది టీడీపీ, కాంగ్రెస్ నాయకులు హైదరాబాద్‌లో ఎమ్మెల్యే గువ్వల బాలరాజు సమక్షంలో పార్టీలో చేరారు.



కామారెడ్డి జిల్లా భిక్కనూరులో నాయకులను టీఆర్ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న గంప గోవర్ధన్

మెట్రో

నగరానికి భారీగా నిధులు



బడ్జెట్‌లో కేటాయించిన ప్రభుత్వం సదుపాయాలకు పెద్దపీట

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: ప్రభుత్వం అసెంబ్లీలో గురువారం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో గ్రేటర్ హైదరాబాద్‌కు భారీగా నిధులు కేటాయించింది. నగర ప్రజల సదుపాయాలకు, అభివృద్ధి పనులకు పెద్దపీట వేసింది. రోడ్ల అభివృద్ధి, తాగునీటి వసతి మెరుగుపరుచడం, మెట్రోరైలు, మూసీనది అభివృద్ధితోపాటు వైద్యానికి పెద్దపీట వేసింది. శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా పోలీస్ కమిషనరేట్‌కు తగినన్ని నిధులు కేటాయించారు. జలమండలికి ఎక్కువ నిధులు కేటాయించడంతోపాటు ఔటర్ రోడ్ల అభివృద్ధి కోసం హెచ్‌ఎండీఏకు కూడా నిధుల వరద పారించారు. నగరంలో ప్రయాణ సౌకర్యం మెరుగుపరిచేందుకు ఎక్కువగా నిధులు కేటాయించి నగర ప్రజలపై ప్రభుత్వం చిత్తశుద్ధిని కనబరిచింది. మెట్రోరైలుకు ప్రభుత్వం రూ.600 కోట్లను కేటాయించింది. ఇందులో రూ.400 కోట్లను రెండో దశకోసం కేటాయించారు. ఎంఎంటీఎస్ విస్తరణలో భాగంగా రెండో దశకు రూ.50 కోట్లు కేటాయించారు. కళలను ప్రోత్సహించేందుకు తెలంగాణ కళాభారతికి రూ.40 కోట్లు, జర్నలిస్టు భవన్‌కు రూ.5 కోట్లు కేటాయించారు. నగరంలోని ప్రధాన దవాఖానలైన నిమ్స్‌తోపాటు ఎంఎన్‌జేకు పెద్దమొత్తంలో నిధులు ఇచ్చారు.

సంస్థ	కేటాయింపులు (రూ. కోట్లలో)
జీహెచ్ఎంసీ	71
హెచ్ఎండీఏ	485
జలమండలి	1420.5
మూసీ అభివృద్ధి	377
రోడ్ కార్పొరేషన్	566
డెవలప్‌మెంట్ అథారిటీ పోలీస్ కమిషనరేట్	492
మెట్రోరైలు	600
ఎంఎంటీఎస్	50
నిమ్స్ దవాఖాన	50.7
ఎంఎన్‌జే దవాఖాన	15
తెలంగాణ కళాభారతి	40
జర్నలిస్టుల భవన్	5

నాపై కాదు.. రాజ్యాంగంపై దాడి

చట్టసభలపై గౌరవాన్ని కాపాడాలంటే కఠిన నిర్ణయాలు తప్పనిసరి

అసెంబ్లీలో జరిగిన ఘటన దురదృష్టకరం: మండలి చైర్మన్ స్వామిగౌడ్

సరోజినీదేవి కంటి దవాఖాన నుంచి డిశ్చార్జి

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ/మెహిదీపట్నం: అసెంబ్లీలో తనపై జరిగిన దాడిని రాజ్యాంగంపై జరిగిన దాడిగా శాసన మండలి చైర్మన్ స్వామిగౌడ్ అభివర్ణించారు. మూడు రోజులుగా మెహిదీపట్నంలోని సరోజినీదేవి కంటి దవాఖానలో చికిత్స పొందుతున్న స్వామిగౌడ్‌ను గురువారం డిశ్చార్జి చేశారు. దవాఖాన సూపరింటెండెంట్ డాక్టర్ రవీందర్‌గౌడ్ తన వైద్యసిబ్బందితో ఉదయం స్వామిగౌడ్‌కు వైద్య పరీక్షలు నిర్వహించారు. గాయపడిన కంటికి డ్రెస్సింగ్ చేసి దవాఖాన నుంచి డిశ్చార్జి చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో స్వామిగౌడ్ మాట్లాడారు. సోమవారం అసెంబ్లీలో కాంగ్రెస్ నాయకులు విసిరిన హెడ్‌ఫోన్ తగిలి తన కుడి కంటికి గాయమైందని, జాతీయగీతం ప్రారంభం కావడంతో నొప్పిని భరించానని చెప్పారు. గవర్నర్‌ను పంపేంతవరకు వేచి చూశానని, ఆ తర్వాత సీఎం కేసీఆర్ సూచన మేరకు డిప్యూటీ స్పీకర్ పద్మాదేవేందర్‌రెడ్డి తనను మెహిదీపట్నం సరోజినీదేవి కంటి దవాఖానకు తీసుకొచ్చారన్నారు. ఇక్కడికి రాగానే సూపరింటెండెంట్ డాక్టర్ రవీందర్‌గౌడ్ తక్షణం స్పందించి తన బృందంతో మెరుగైన వైద్యాన్ని అందించారని చెప్పారు. కాంగ్రెస్ నాయకులపై తీసుకున్న చర్యలపై స్పందిస్తూ.. చట్టసభలపై గౌరవాన్ని కాపాడాలంటే కొన్ని కఠిన నిర్ణయాలు తీసుకోవాల్సి వస్తుందన్నారు. చట్టసభలను హుందాగా నడుపుకుందామని పిలుపునిచ్చారు. వ్యక్తులను గౌరవించకపోయినా రాజ్యాంగాన్ని గౌరవించాలని చెప్పారు.

సిబ్బంది ఆప్యాయతపై కంటతడి

సరోజినీదేవి కంటి దవాఖాన సిబ్బంది అనుక్షణం తనను కంటికి రెప్పలా చూసుకున్నారని చెప్పారు. కిందిస్థాయి సిబ్బంది గంటకు ఒకసారి వచ్చి 'సార్.. నొప్పి ఎలా ఉంది' అని అడుగడం వారి ఆప్యాయతను తెలిపిందంటూ స్వామిగౌడ్ కంటతడి పెట్టారు. దవాఖాన సూపరింటెండెంట్ డాక్టర్ రవీందర్‌గౌడ్ మాట్లాడుతూ.. స్వామిగౌడ్ కంటి గాయం తగ్గిందని, ఆయనకు నాలుగు రోజుల పాటు విశ్రాంతి అవసరమని తెలిపారు. కార్నియా దెబ్బతినడంతో తమ సిబ్బందితో మూడురోజుల పాటు నాణ్యమైన వైద్యం అందించి కంటిచూపును పూర్తిగా రికవరీ చేయగలిగామన్నారు. వారం రోజుల తర్వాత మరోసారి పరీక్షిస్తామని చెప్పారు. అంతకుముందు శాసన మండలి డిప్యూటీ చైర్మన్ నేతి విద్యాసాగర్ దవాఖానలో స్వామిగౌడ్‌ను పరామర్శించారు. డిశ్చార్జి సందర్భంగా తనకు చికిత్స అందించిన దవాఖాన సూపరింటెండెంట్ డాక్టర్ రవీందర్‌గౌడ్, కంటి వైద్య నిపుణులు డాక్టర్ రాజలింగం, డాక్టర్ మోదిని, డాక్టర్ శ్రీనివాస్ ప్రసాద్, ఆర్ఎంవో డాక్టర్ నజాఫీబేగంతోపాటు నర్సింగ్, కిందిస్థాయి సిబ్బందికి స్వామిగౌడ్ కృతజ్ఞతలు తెలిపారు. డిశ్చార్జి సమయంలో ఆయన సతీమణి మనోరమ, కొడుకు కిరణ్‌గౌడ్, గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ పత్తి ప్రవీణ్‌కుమార్ తదితరులు వెంట ఉన్నారు.



డిశ్చార్జి అనంతరం మీడియాతో మాట్లాడుతున్న మండలి చైర్మన్ స్వామిగౌడ్. చిత్రంలో దవాఖాన సూపరింటెండెంట్ డాక్టర్ రవీందర్‌గౌడ్ తదితరులు

పాతబస్తీలో నగల దోపిడీకి ముంబైలో ప్లాన్

ప్రధాన నిందితుడి అరెస్ట్.. రూ.6 లక్షల సొత్తు స్వాధీనం



కేసు వివరాలు వెల్లడిస్తున్న సీపీ అంజనీకుమార్

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: పాతబస్తీలోప ట్టపగలు బంగారు ఆభరణాల తయారీ దుకాణంలో దోపిడీకి తెగబడ్డ ముఠా నాయకుడిని హైదరాబాద్ సౌత్‌జోన్ పోలీసులు అరెస్ట్ చేశారు. అతడి నుంచి రూ.6 లక్షల విలువైన ఆభరణాలను రికవరీ చేశారు. గురువారం హైదరాబాద్ సీపీ అంజనీకుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 6న పాతబస్తీ పేట్లబురుజులో నేతాయిదాస్‌కు చెందిన బంగారం దుకాణంలో ముంబైకి చెందిన దోపిడీ ముఠా ఐదు కిలోల బంగారాన్ని దోచుకొని పరారయ్యింది. నేతాయిదాస్‌కు ముంబైలోనూ మరో దుకాణం ఉన్నది. ముంబైకి చెందిన అమ్జద్ క్వాజా అమీన్ షేక్, నేతాయిదాస్‌కు హైదరాబాద్‌లోనూ మరో దుకాణం ఉన్నదని తెలుసుకొని దోపిడీకి ప్లాన్ చేశారు. అమ్జద్ మరో 9 మందితో కలిసి ముఠాను ఏర్పాటు చేసుకొని, హైదరాబాద్‌కు వచ్చి రెండు సార్లు రెక్కీ నిర్వహించాడు. ఈ సందర్భంగా దుకాణానికి సంబంధించిన పూర్తి వివరాలు సేకరించాడు. ముఠా సభ్యులంతా వేర్వేరు ప్రాంతాలకు చెందినవారు. దోపిడీ చేయడానికి నిర్ణయించుకున్న రోజు నాలుగు గ్రూపులుగా వచ్చి పేట్లబురుజులోని బంగారం దుకాణం వద్దకు చేరుకొని ఆభరణాలతోపాటు, సీసీటీవీ డీవీఆర్‌లను ఎత్తుకెళ్లారు. ఈ కేసును ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న పోలీసులు దాదాపు 300 సీసీ కెమెరాలను విశ్లేషించి, నిందితులను గుర్తించారు. నిందితులు ఘటనాస్థలంలో ముంబైకి చెందిన ఓ దినపత్రికను వదిలేయడం పోలీసులకు కీలక ఆధారంగా మారింది. సీసీ కెమెరాల్లోని అనుమానితుల ఫొటోలతో ముంబై తదితర ప్రాంతాల్లో 17 బృందాలు గాలింపు చేపట్టాయి. ప్రధాన నిందితుడు అమ్జద్‌ను పోలీసులు అరెస్ట్ చేసి అతని నుంచి 20 తులాల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. మిగతా నిందితుల కోసం గాలింపు ముమ్మరం చేశారు. ఇప్పటికే అమ్జద్‌పై ముంబై, షోలాపూర్, నాగ్‌పూర్‌లో దోపిడీ, దొంగతనాల కేసులు 40 నమోదై ఉన్నట్టు సీపీ తెలిపారు. ఈ సమావేశంలో సౌత్‌జోన్ డీసీపీ సత్యనారాయణ పాల్గొన్నారు.

కురుమ, యాదవులకు ప్రభుత్వం ప్రాధాన్యం

వచ్చేనెలలో కృతజ్ఞత సభను విజయవంతం చేస్తాం

కురుమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు యెగ్గె మల్లేశం

అబిడ్స్, నమస్తే తెలంగాణ: త్వరలో చేపట్టబోయే నామినేటెడ్ పదవుల్లో కురుమ, యాదవులను చైర్మన్, డైరెక్టర్లుగా నియమిస్తామని సీఎం కేసీఆర్ ప్రకటించడంపై కురుమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, కురుమ రత్న యెగ్గె మల్లేశం కృతజ్ఞతలు తెలిపారు. గురువారం హైదరాబాద్‌లోని రాష్ట్ర కురుమ సంఘం భవనంలో ఆయన మాట్లాడుతూ సీఎం కేసీఆర్ ముందుగా ప్రకటించిన విధంగా యాదవ కులానికి చెందిన బడుగు లింగయ్యయాదవ్‌ను రాజ్యసభ్య అభ్యర్థిగా ప్రకటించడం పట్ల సంతోషం వ్యక్తంచేశారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత సీఎం కేసీఆర్ కురుమ, యాదవుల అభ్యున్నతికి అనేక సంక్షేమ పథకాలను చేపడుతున్నారన్నారు. ప్రధానంగా కురుమ, గొల్లలకు 75 శాతం సబ్సిడీతో గొర్రెలను పంపిణీ చేయడంతో ఆర్థికంగా నిలదొక్కుకుంటున్నారన్నారు. గొల్ల, కురుమల సంక్షేమానికి రూ.10 కోట్లతోపాటు పది ఎకరాల స్థలాన్ని కేటాయించడంపై ఆనందం వ్యక్తంచేశారు. చట్టసభల్లో కురుమలకు ప్రాతినిధ్యం లేదని గుర్తించిన సీఎం ఎమ్మెల్సీ పదవిని కేటాయిస్తానని చెప్పడంతోపాటు నామినేటెడ్ పదవులను కేటాయిస్తామని ప్రకటించడంపై కురుమ, యాదవులంతా సంతోషం వ్యక్తం చేస్తున్నారని వివరించారు. సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞతగా వచ్చేనెల 29వ తేదీన జింఖానా మైదానంలో లక్షల మంది కురుమ, యాదవులతో భారీ బహిరంగ సభ ఏర్పాటు చేస్తామని, ఈ సందర్భంగా సీఎంను సన్మానిస్తామన్నారు. కార్యక్రమంలో కురుమ ట్రస్ట్ బోర్డు వైస్ చైర్మన్ దేవర రాజేశ్వర్, రాష్ట్ర కురుమ సంఘం ప్రధాన కార్యదర్శి తమగొండ రాజేశ్వర్, జంట నగరాల కురుమ సంఘం అధ్యక్షుడు బండారి నారాయణ, కోశాధికారి రెక్కల కొండల్‌రాజ్, కురుమ యువత ప్రధాన కార్యదర్శి తూంకుంట అరుణ్ కుమార్, కాలె అమర్‌నాథ్, లింగయ్య కురుమ, వెంకటయ్య పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కురుమ సంఘం అధ్యక్షుడు యెగ్గె మల్లేశం



తౌహాస్ అక్రమాలపై రవాణాశాఖ అధికారులతో చర్చిస్తున్న మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి

తౌహాస్ అక్రమాలపై క్రిమినల్ కేసులు

- పెద్ద అంబర్‌పేటలో 9.37 ఎకరాలు దుర్వినియోగంపై చర్యలు
- రవాణాశాఖ మంత్రి మహేందర్‌రెడ్డి ఆదేశాలు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ట్రక్కు ఆపరేటర్స్ హైవే ఎమినిటీస్ సొసైటీ (తౌహాస్)కి హైదరాబాద్‌లోని పెద్ద అంబర్‌పేటలో కేటాయించిన 9.37 ఎకరాల స్థలాన్ని సొసైటీ చైర్మన్‌కు తెలియకుండా కార్యదర్శి మహ్మద్ ఖాన్ ప్రైవేట్ వ్యక్తులకు లీజుకు ఇవ్వడంపై రవాణాశాఖ మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తంచేశారు. అక్రమార్కులపై క్రిమినల్ కేసులు పెట్టి కఠినంగా శిక్షించాలని ఆదేశించారు. గురువారం సచివాలయంలో రవాణాశాఖ అధికారులు, లారీ ఓనర్స్ అసోసియేషన్ ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో మంత్రి మాట్లాడారు. ప్రభుత్వ ఆస్తులను అన్యాక్రాంతం చేస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదన్నారు. తౌహాస్ భూములను కోర్టుకు వెళ్లి రక్షించుకోవాలని అధికారులకు సూచించారు. వరంగల్‌లో తౌహాస్‌కు కేటాయించిన ఎనిమిది ఎకరాల్లో నాలుగు ఎకరాలు కబ్జాకు గురైందని, వెంటనే విచారణ జరిపి స్థలాన్ని స్వాధీనం చేసుకోవాలని ఆదేశించారు. మేడ్చల్ జిల్లా పేట్‌బషీరాబాద్, కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్, కామారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లా బాలానగర్‌లో తౌహాస్‌కు ఇచ్చిన ప్రభుత్వ భూమల వివరాలు, వాటి స్థితిగతులపై సమగ్ర నివేదికను తయారుచేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా లారీ ఓనర్స్ అసోసియేషన్‌కు సంబంధించిన పలు సమస్యల పరిష్కారానికి కమిటీని నియమించారు. జేటీసీలు పాండురంగనాయక్, రమేశ్, డీటీసీ ప్రవీణ్‌రావు, లారీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు భాస్కర్‌రెడ్డి, దుర్గాప్రసాద్ సభ్యులుగా ఉన్నారు. ఈ కమిటీ ఏపీలో అమలవుతున్న సింగిల్ పర్మిట్‌విధానంపై క్షేత్రస్థాయిలో అధ్యయనం చేయాలని మంత్రి సూచించారు. సమావేశంలో రవాణాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సునీల్‌శర్మ తదితరులు పాల్గొన్నారు. మరోవైపు రవాణాశాఖ అధికారులతో మంత్రి శుక్రవారం అత్యవసర సమావేశం నిర్వహించనున్నారు. జిల్లాల్లోని డీటీవోలు, డీటీసీలు హాజరుకానున్నారు. తౌహాస్‌కు కేటాయించిన భూముల అన్యాక్రాంతంపై ఆరా తీయనున్నట్టు సమాచారం.

క్వార్టర్స్‌లో సింధు

జిందాపోల్‌పై గెలుపు.. ఆల్ ఇంగ్లండ్ చాంపియన్‌షిప్




బర్మింగ్‌హామ్: భారత బ్యాడ్మింటన్ స్టార్ పీవీ సింధు.. ఆల్ ఇంగ్లండ్ చాంపియన్‌షిప్‌లో క్వార్టర్‌ఫైనల్ బెర్త్‌ను ఖాయం చేసుకుంది. గురువారం జరిగిన మహిళల సింగిల్స్‌లో ప్రపంచ మూడో ర్యాంకర్ సింధు 21-13, 13-21, 21-18తో నిచాన్ జిందాపోల్ (థాయ్‌లాండ్)పై కష్టపడి గెలిచింది. గంటా 7 నిమిషాల పాటు జరిగిన ఈ మ్యాచ్‌లో థాయ్ అమ్మాయి తీవ్ర ప్రతిఘటనను చూపెట్టింది. అయితే ముఖాముఖి రికార్డులో 2-1తో ఉన్న సింధు.. ప్రత్యర్థి కొట్టిన ప్రతి షాట్‌కు దీటైన సమాధానం చెప్పింది. వరుసగా ఆరు పాయింట్లతో తొలి గేమ్‌ను మొదలుపెట్టిన తెలుగమ్మాయి ఒక్కసారిగా 7-3 ఆధిక్యంలోకి వెళ్లింది. వెంటనే బ్యాక్‌హ్యాండ్ ర్యాలీలతో ఆధిక్యాన్ని 15-7కు పెంచుకుంది. ఈ దశలో థాయ్ ప్లేయర్ కొట్టిన చాలా షాట్లు నెట్‌కు తాకడంతో సింధు 20-13కు చేరుకుని అలవోకగా గేమ్‌ను చేజిక్కించుకుంది. రెండో గేమ్‌లో అటాకింగ్ గేమ్ మొదలుపెట్టిన జిందాపోల్.. 7-3 ఆధిక్యంలోకి వెళ్లింది. బ్యాక్‌హ్యాండ్ రిటర్న్‌ల్లో ఇబ్బందులు ఎదుర్కొవడం సింధు ఆటను దెబ్బతీసింది. ర్యాలీలతో దుమ్మురేపిన థాయ్ ప్లేయర్ 11-3కు వెళ్లినా.. పట్టువదలకుండా పోరాడిన సింధు ఆధిక్యాన్ని 10-14కు తగ్గించింది. అయితే అప్పటికే కాస్త అలసిపోయిన సింధు జడ్జిమెంట్ తప్పిదాలతో 13-17తో వెనుకబడింది. ఈ దశలో థాయ్ అమ్మాయి వరుసగా 3 పాయింట్లు నెగ్గి మ్యాచ్‌లో నిలిచింది. నిర్ణయాత్మక మూడో గేమ్‌లో ఇరువురు ప్రతి పాయింట్ కోసం హోరాహోరీగా పోరాడారు. జిందాపోల్ కొట్టిన బ్యాక్‌హ్యాండ్ షాట్లను తీయడంలో ఇబ్బందిపడ్డ సింధు.. ప్రత్యర్థిపై ఒత్తిడి పెంచడంలో సఫలమైంది. ఫలితంగా 3-0తో మొదలైన సింధు ఆధిక్యం.. 8-7కు పెరిగింది. ఓవైపు కోచ్ గోపీచంద్ సలహాలు స్వీకరిస్తూనే సింధు రిటర్న్ షాట్లలో మరింత పరిణతి చూపెట్టింది. ఫలితంగా 9-9తో ఉన్న స్కోరును 11-9, 15-12కి తీసుకెళ్లింది. ఈ దశలో జిందాపోల్ పుంజుకోవడం, సింధు కొట్టిన షాట్స్ నెట్‌కు తగలడంతో స్కోరు 16-16, 18-18తో సమమైంది. కానీ నెట్ వద్ద సూపర్ డ్రాప్స్‌తో మ్యాచ్ పాయింట్‌కు చేరువైన సింధుకు.. థాయ్ ప్లేయర్ కొట్టిన రిటర్న్ షాట్ లక్ష్యం చేరకపోవడంతో విజయం సొంతమైంది. పురుషుల సింగిల్స్ ప్రీక్వార్టర్స్‌లో హెచ్‌ఎస్ ప్రణయ్ 21-10, 21-19తో టామి సుగియార్తో (ఇండోనేసియా)పై గెలిచి క్వార్టర్స్‌లోకి అడుగుపెట్టాడు.

ఆసీస్‌దే సిరీస్

వడోదరా: ఆల్‌రౌండ్ షోతో అదరగొట్టిన ఆస్ట్రేలియా మహిళల జట్టు.. గురువారం జరిగిన రెండో వన్డేలోనూ 60 పరుగుల తేడాతో భారత్‌పై గెలిచింది. దీంతో మూడు మ్యాచ్‌ల సిరీస్‌ను మరోటి మిగిలి ఉండగానే 2-0తో కైవసం చేసుకుంది. ముందుగా ఆసీస్ 50 ఓవర్లలో 287/9 స్కోరు చేసింది. బోల్టన్ (84), పెర్రీ (70 నాటౌట్), మూనీ (56) రాణించారు. తర్వాత భారత్ 49.2 ఓవర్లలో 227 పరుగులకే కుప్పకూలింది. మంధన (67) టాప్ స్కోరర్. వస్త్రాకర్ (30), దీప్తి శర్మ (26) ఓ మాదిరిగా ఆడినా.. మిగతా వారు నిరాశపర్చారు. నికోలస్ బోల్టన్‌కు మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డు లభించింది.

సెమీస్‌లో హలెప్

ఏటీపీ టోర్నీ



ఇండియానా వెల్స్(యూఎస్‌ఏ): ప్రపంచ నంబర్‌వన్ సిమోనా హలెప్ ఇండియానా వెల్స్ టెన్నిస్ టోర్నీ సెమీస్ చేరింది. క్రొయేషియా అమ్మాయి పెట్రా మాట్రిక్‌తో గురువారం హోరాహోరీగా సాగిన మ్యాచ్‌లో 6-4,6-7(5/7),6-3 స్కోరుతో విజయం సాధించింది. సెమీస్‌లో హలెప్ ..జపాన్ స్టార్ నవోమి ఒసాకతో తలపడనుంది. కాగా, మరోవైపు జపాన్ అమ్మాయి ఒసాక 6-2,6-3 స్కోరుతో కరోలినా ప్లిస్కోవాను ఓడించి సెమీస్ చేరుకుంది.

క్వార్టర్ ఫైనల్లో ఫెదరర్: జెరెమీ చార్డీతో గురువారం జరిగిన క్వార్టర్‌ఫైనల్లో 7-5,6-4 స్కోరుతో వరుససెట్లలో ఫెదరర్ విజయం సాధించాడు. క్వార్టర్స్‌లో దక్షిణ కొరియాకు చెందిన చుంగ్ హైయోన్‌తో తలపడనున్నాడు.

ట్రిపుల్ సెంచరీ దిశగా జాఫర్


ఇరానీకప్‌లో రికార్డు



నాగ్‌పూర్: దేశవాళీ దిగ్గజం వసీం జాఫర్ నలభై ఏండ్ల వయసులోనూ ఇరవై ఏండ్ల కుర్రాడిలా బ్యాటింగ్ చేస్తూ రికార్డులు కొల్లగొడుతున్నాడు. ఇరానీకప్‌లో భాగంగా రెస్టాఫ్ ఇండియాతో జరుగుతున్న మ్యాచ్‌లో విదర్భ ఆటగాడు జాఫర్ ట్రిపుల్ సెంచరీ (285 బ్యాటింగ్) దిశగా దూసుకుపోతున్నాడు. దీంతో విదర్భ రెండో రోజు ఆట ముగిసే సమయానికి తొలి ఇన్నింగ్స్‌లో 3 వికెట్ల నష్టానికి 598 పరుగులు చేసింది. భారీ ద్విశతకం నమోదు చేయడంతో ఇరానీకప్‌లో అత్యధిక వ్యక్తిగత స్కోరు సాధించిన ఆటగాడిగా జాఫర్ రికార్డులకెక్కాడు. అంతకు ముందు ఈ రికార్డు మురళీ విజయ్ (266) పేరిట ఉండేది. అంతేకాదు ఇరానీకప్‌లో వరుసగా ఆరు హాఫ్ సెంచరీలు సాధించిన ఆటగాడిగా గుండప్ప విశ్వనాథ్ సరసన చేరాడు. ఫస్ట్ క్లాస్ కెరీర్‌లో 35వ శతకం సాధించిన జాఫర్ అద్వితీయమైన బ్యాటింగ్‌పై మాజీలు ప్రశంసలు కురిపిస్తున్నారు. తొలి రోజు ఆటలో 113 పరుగులు చేసిన ఈ ముంబైకర్..రెండో రోజు మరింత చెలరేగి ఆడి డబుల్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. ఇతడికి తోడు సతీష్ (120) కూడా శతకం సాధించి అదరగొట్టాడు. ఈ ఇద్దరూ మూడో వికెట్‌కు 289 పరుగుల భారీ భాగస్వామ్యం నెలకొల్పారు. రెస్టాఫ్ బౌలర్లు ఎంత శ్రమించినా క్రీజులో పాతుకుపోయిన జాఫర్, వాంఖడే (44 బ్యాటింగ్)తో కలిసి విదర్భను భారీ స్కోరు దిశగా తీసుకెళుతున్నాడు. ఇతడు మూడో రోజు ఆటలో మరో 15 పరుగులు చేస్తే ట్రిపుల్ సెంచరీ సాధిస్తాడు. ఆ తర్వాత విదర్భ ఇన్నింగ్స్‌ను డిక్లేర్డ్ చేసే అవకాశం ఉంటుంది. జాఫర్ భారత్ తరపున 31 టెస్ట్ మ్యాచ్‌లు ఆడిన జాఫర్ 11 హాఫ్ సెంచరీలు, 5 సెంచరీలు చేశాడు. ఇందులో రెండు డబుల్ సెంచరీలు ఉన్నాయి.

గెలిచినోళ్లే ఫైనల్‌కు

నేడు శ్రీలంక, బంగ్లా ఆఖరి టీ20


తిసారా పెరీరా

రాత్రి 7 నుంచి డీ స్పోర్ట్స్‌లో

కొలంబో: ఓవైపు ప్రతీకారం.. మరోవైపు టైటిల్ పోరుకు అర్హత.. కానీ ఇద్దరి లక్ష్యం గెలుపుబావుట. ఈ నేపథ్యంలో నిదహాస్ ముక్కోణపు టీ20 టోర్నీలో సెమీస్‌లాంటి మ్యాచ్‌కు రంగం సిద్ధమైంది. శుక్రవారం జరిగే ఆఖరి లీగ్ మ్యాచ్‌లో ఆతిథ్య శ్రీలంక, బంగ్లాదేశ్‌తో అమీతుమీ తేల్చుకోనుంది. ఈ మ్యాచ్‌లో గెలిచిన జట్టు ఆదివారం జరిగే టైటిల్ పోరులో భారత్‌తో తలపడుతుంది. కాబట్టి ఇరుజట్లు గెలుపే లక్ష్యంగా బరిలోకి దిగుతున్నాయి. ప్రస్తుతం పాయింట్ల పట్టికలో బంగ్లా, లంక చెరో రెండు పాయింట్లతో ఉన్నాయి. ఈ మ్యాచ్‌కూ వర్షం ముప్పు పొంచి ఉంది. ఒకవేళ వరుణుడి వల్ల మ్యాచ్ ఆగిపోతే మెరుగైన రన్‌రేట్ కారణంగా లంక (-0.072) ఫైనల్‌కు చేరుకుంటుంది. బంగ్లా (-0.436) మూడోస్థానంలో ఉంది. .

నిలబడితేనే..

సొంత అనుకూలతలను సొమ్ము చేసుకోలేకపోతున్న లంక ఈ మ్యాచ్‌పై భారీ ఆశలు పెట్టుకుంది. బంగ్లాను దెబ్బతీయాలంటే ఆల్‌రౌండర్లు నిలకడగా ఆడాల్సిన అవసరం చాలా ఉంది. చండిమల్ గైర్హాజరీతో తిసారా పెరీరా నాయకత్వం చేపట్టనున్నాడు. గుణతిలక, కుశాల్ మెండిస్ శుభారంభాన్నివ్వలేకపోవడం లోటు. కుశాల్ పెరీరా చెలరేగితే బంగ్లాకు ఇబ్బందులు తప్పవు. మిడిల్‌లో తిసారా, శనక, జీవన్ మెండిస్ సత్తా చాటాల్సిన సమయం వచ్చేసింది. బౌలింగ్‌లో లక్మల్, చమీరా, ప్రదీప్‌ల త్రయం ప్రత్యర్థిని బెదిరించే స్థాయిలో బంతులు వేయలేకపోవడంలో ప్రతికూలాంశం. మరి ఈ మ్యాచ్‌లో కనీసం ఇద్దరైనా గాడిలో పడితే బాగుంటుంది. ధనంజయ, మెండిస్ స్పిన్ బాధ్యతలను పంచుకోనున్నారు.

తుది జట్టులో షకీబ్..

ఈ మ్యాచ్ కోసం బంగ్లా పక్కా ప్రణాళికలను సిద్ధం చేసుకుంది. గాయంతో టోర్నీకి దూరమైన ఆల్‌రౌండర్, రెగ్యులర్ కెప్టెన్ షకీబ్ అల్ హసన్‌ను తుది జట్టులోకి రావడంతో బంగ్లా బలం డబుల్ అయ్యింది. అతను వేసే నాలుగు ఓవర్లు బాగా పడితే లంకకు కష్టాలు తప్పవు. దీనికితోడు గతవారం లంకపై రికార్డు విజయాన్ని నమోదు చేసిన బంగ్లా.. దానిని పునరావృతం చేయాలని భావిస్తున్నది. ఈ మ్యాచ్‌లో గెలువడం ద్వారా ఇటీవల తమ దేశంలో లంకేయుల చేతిలో ఎదురైన మూడు సిరీస్‌ల పరాజయానికి ప్రతీకారం తీర్చుకోవాలని కూడా లక్ష్యంగా పెట్టుకున్నారు. తమీమ్, సౌమ్య శుభారంభాన్నిస్తే మిడిలార్డర్‌లో ముష్ఫికర్, లిట్టన్ దాస్, మహ్మదుల్లా స్కోరు పెంచే ప్రయత్నాలు చేస్తారు. బౌలింగ్‌లో ముస్తాఫిజుర్ ఆకట్టుకున్నా.. రుబెల్, హైదర్ పూర్తి సహాయ సహకారాలు అందించాల్సి ఉంది. ఓవరాల్‌గా లంకను నిలువరించాలంటే బంగ్లా అన్ని రంగాల్లో మెరువాలి.


షకీబ్

జట్లు (అంచనా)


శ్రీలంక: తిసారా పెరీరా (కెప్టెన్), గుణతిలక, కుశాల్ మెండిస్, కుశాల్ పెరీరా, ఉపుల్ తరంగ, శనక, జీవన్ మెండిస్, ధనంజయ, లక్మల్, చమీరా, ప్రదీప్.

బంగ్లాదేశ్: షకీబ్ (కెప్టెన్), తమీమ్, సౌమ్య, లిట్టన్ దాస్, ముష్ఫికర్, మహ్మదుల్లా, షబ్బీర్, మెహిది హసన్, ముస్తాఫిజుర్, రూబెల్, అబు హైదర్.

సుందర్ కాదు..వండర్

నమస్తే తెలంగాణ క్రీడా విభాగం

ఆరడుగుల పొడువు..18 ఏండ్ల వయసు..బ్యాటింగ్‌లో ప్రావీణ్యం..బౌలింగ్‌లో వైవిధ్యం..అన్నిటికీ మించిన అంకితభావం..బ్యాట్స్‌మన్‌గా మొదలైన ప్రస్థానం ఆల్‌రౌండర్‌గా మార్చేసిన వైనం..వాషింగ్టన్ సుందర్‌ను భారత జట్టులో సుస్థిర స్థానం ఏర్పరుచుకునే దిశగా తీసుకెళుతున్నాయి..దిగ్గజ స్పిన్నర్లు భారత జట్టులో పునరాగమనం చేయలేకపోతున్న వేళ ..వచ్చిన అవకాశాన్ని చక్కగా సద్వినియోగం చేసుకుంటున్నాడు ఈ చెన్నై చిన్నోడు.. ముక్కోణపు టోర్నీలో అద్భుత రీతిలో వికెట్ల పండుగ చేసుకుంటూ భవిష్యత్‌పై భరోసాను ఏర్పరుచుకుంటున్నాడు.



నిదహాస్ ముక్కోణపు టోర్నీలో భారత యువ స్పిన్నర్ వాషింగ్టన్ సుందర్ అద్భుతమైన ప్రదర్శనతో ఆకట్టుకుంటున్నాడు. బంగ్లాదేశ్‌తో జరిగిన మ్యాచ్‌లో అత్యుత్తమ గణాంకాలు (4-0-22-3) నమోదు చేసి భారత్‌ను దర్జాగా ఫైనల్‌కు చేర్చడంలో కీలకపాత్ర పోషించాడు. ఇప్పటి వరకు ఆడిన 5 టీ20 మ్యాచ్‌ల్లో 8 వికెట్లు పడగొట్టాడు. భారత్‌కు వన్డే, టీ20ల్లో చహల్, కుల్దీప్ స్పిన్నర్లుగా పాతుకుపోగా, ప్రత్యామ్నాయంగా సుందర్ ఎదుగుతున్నాడు. బ్యాట్స్‌మన్‌గానూ సత్తా చాటగల ఈ చెన్నై చిన్నోడికి ఈ టోర్నీలో ఇప్పటి వరకు ఆ అవకాశం రాలేదు. భవిష్యత్‌లో ఆ అవకాశం వస్తే చెలరేగిపోయేందుకు సిద్ధంగా ఉన్నాడు.

> పవర్ ప్లేలో బౌలింగ్ చేయగల నైపుణ్యం ఉండటం నా అదృష్టం. స్వతహాగా నేనూ బ్యాట్స్‌మన్‌నే కనుక వారి మైండ్‌సెట్ ఎలా ఉంటుందో అర్థం చేసుకుంటాను. అందుకు తగ్గట్టుగా బంతులు విసురుతాను. అంతకు ముందు లీగ్ మ్యాచ్‌ల్లో ఎక్కువగా ఆడటం కలిసొచ్చింది. మణికట్టు స్పిన్నర్ల కంటే ఆఫ్ స్పిన్నర్లే ఎక్కువ ప్రభావం చూపగలుగుతారు. వికెట్‌ను అర్థం చేసుకుంటూ నిరంతరం శ్రమిస్తేనే విజయవంతమైన బౌలర్‌గా ఎదుగుతారు.
>
> - వాషింగ్టన్ సుందర్

బ్యాట్స్‌మన్‌గా మొదలుపెట్టి..

ఆఫ్ బ్రేక్ బౌలింగ్‌తో ప్రత్యర్థులను కుప్పకూల్చి వికెట్ల పండుగ చేసుకుంటున్న వాషింగ్టన్ సుందర్ తన కెరీర్‌ను మొదలుపెట్టింది మాత్రం బ్యాట్స్‌మన్‌గానే. 2016 అండర్-19 ప్రపంచకప్‌కు మిడిల్ ఆర్డర్ బ్యాట్స్‌మన్‌గా ఎంపికై తొలి మ్యాచ్‌లోనే హాఫ్ సెంచరీ సాధించి సత్తా చాటాడు. నేపాల్‌తో జరిగిన మ్యాచ్‌లో బౌలింగ్ వేసి రెండు వికెట్లు పడగొట్టాడు. ఆ తర్వాత 2016 రంజీ సీజన్‌లోనూ తమిళనాడు తరపున ముంబైపై అరంగేట్రం చేశాడు. ఓపెనింగ్ బ్యాట్స్‌మన్‌గా తన రంజీ ప్రస్థానం మొదలుపెట్టాడు. తొలి ఇన్నింగ్స్‌లో 2, రెండో ఇన్నింగ్స్‌లో 40 పరుగులు చేశాడు. తమిళనాడు జట్టు ఇతడి సేవలను బ్యాట్స్‌మన్ రూపంలోనే వినియోగించుకున్నది. అదే ఏడాది తమిళనాడు ప్రీమియర్ లీగ్‌లో సుందర్ బౌలర్‌గానూ మెరిశాడు. 9 మ్యాచ్‌లు ఆడి 11 వికెట్లు పడగొట్టాడు. 2017లో ఐపీఎల్‌లోనూ మెరిశాడు. రైజింగ్ పుణె సూపర్ జైంట్స్ తరపున ఆడి కీలకమైన మ్యాచ్‌లో ముంబైపై మూడు వికెట్లు పడగొట్టి తమ జట్టును ఫైనల్‌కు చేర్చడంలో తనవంతు పాత్ర పోషించాడు.

తండ్రి కలను నెరవేర్చాడు..

వాషింగ్టన్ సుందర్ తండ్రి ఎమ్. సుందర్ కూడా క్రికెటరే. అతడు భారత క్రికెట్ జట్టుకు ఆడాలని కలలు కన్నా..అది కలగానే మిగిలిపోయింది. కానీ పట్టువీడలేదు. తాను సాధించాలనుకున్నది తన కొడుకు సాధించాలని తపించాడు. అందుకు తగ్గట్టుగానే శిక్షణ ఇప్పించి వెన్నంటి ప్రోత్సహించాడు. క్రికెట్ తప్ప మరేమీ నేర్పించలేదు. తండ్రి చూపిన బాటలో నడువటమే కాదు, అంకితభావంతో ముందుకు సాగిన సుందర్ భారత జట్టుకు ఆడాలన్న కలను నెరవేర్చుకున్నాడు. అశ్విన్, జడేజా వంటి స్పిన్నర్లు సైతం వన్డే జట్టులోకి తిరిగి రాలేకపోతున్న రోజుల్లో సుందర్‌కు భారత జట్టు నుంచి పిలుపు వచ్చింది. స్వదేశంలో శ్రీలంకతో జరిగిన వన్డే సిరీస్‌లో చోటు దక్కించుకుని అరంగేట్రంలో ఒక వికెట్ పడగొట్టాడు.తన తండ్రి కలను నెరవేర్చి అతడి కండ్లలో ఆనందం చూశాడు. సుందర్ అరంగేట్రం చేసిన మ్యాచ్‌లోనే రోహిత్‌శర్మ డబుల్ సెంచరీ చేయడంతో ఆ మ్యాచ్ సుందర్‌కు చిరస్మరణీయంగా మిగిలిపోయింది.

ఈ 'వాషింగ్టన్' ఏమిటి?

తమిళనాడుకు చెందిన ఇతడికి వాషింగ్టన్ సుందర్ అని పేరెలా వచ్చింది..? అన్న సందేహం చాలా మందిలోనూ ఉన్నది. సుందర్ తండ్రి ఎమ్.సుందర్‌కు క్రికెట్ ఆడేందుకు సరియైన బ్యాట్, దుస్తులు లేని రోజుల్లో వారి ఇంటి దగ్గర్లో ఉండే పీడీ వాషింగ్టన్ అనే మాజీ ఆర్మీ ఉద్యోగి అన్నీ కొనిచ్చి ప్రాక్టీస్ పంపేవాడు. ఎమ్.సుందర్ తమిళనాడు రంజీ జట్టుకు ఎంపికైన సమయంలోనే(1999) పీడీ వాషింగ్టన్ చనిపోయాడు. అదే ఏడాది ఎమ్.సుందర్‌కు కొడుకు జన్మించడంతో పీడీ వాషింగ్టన్‌కు గుర్తుగా తన కొడుకుకు వాషింగ్టన్ సుందర్ అని నామకరణం చేశాడు. ఇక ఇతడి అక్క శైలజా కూడా క్రికెటరే. ఆమె లెగ్ బ్రేక్ బౌలర్. 2016లో తమిళనాడు మహిళా క్రికెట్ జట్టు తరపున 4 టీ20 మ్యాచ్‌లు ఆడింది..

వివేక్‌కు హైకోర్టులో ఊరట



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) అధ్యక్షుడు జీ వివేకానందకు హైకోర్టులో ఊరట లభించింది. వివేక్‌పై హెచ్‌సీఏ అంబుడ్స్‌మన్ వేసిన సస్పెన్షన్‌ను ఆయన హైకోర్టులో సవాల్ చేయగా..న్యాయస్థానం గురువారం నాడు అంబుడ్స్‌మన్ ఉత్తర్వులను సస్పెండ్ చేసింది. ఈ మేరకు జస్టిస్ ఏ వీ శేషసాయి నేతృత్వంలోని ధర్మాసనం మధ్యంతర ఉత్తర్వులు జారీచేసింది. మరోవైపు కార్యదర్శి శేషు నారాయణకు కూడా ఊరట లభించింది. వాద ప్రతివాదనలు జరిగాక ఈ వ్యవహారంపై పూర్తిస్థాయిలో వివరణ ఇవ్వాలని ప్రతివాదులను ఆదేశిస్తూ విచారణను వాయిదావేసింది.

పాక్ ఆటగాళ్ల అతి!

దుబాయ్: పాకిస్థాన్ సూపర్ లీగ్ (పీఎస్‌ఎల్)లో అనూహ్యమైన సంఘటనలు చోటు చేసుకుంటున్నాయి. ఆటతో అభిమానుల మనసులు గెలువాల్సిన క్రికెటర్లు.. మైదానంలో ఆగ్రహావేశాలతో ఊగిపోతున్నారు. క్రీడాస్ఫూర్తిని మరిచి ఒకరిపై ఒకరు బంతులు విసురుకుని చూసేవాళ్లకు చికాకు తెప్పించారు. టోర్నీలో భాగంగా బుధవారం క్వెట్టా గ్లాడియేటర్స్, లాహోర్ క్వాలాండర్స్ మధ్య జరిగిన మ్యాచ్‌లో ఈ సంఘటన చోటు చేసుకుంది. ముందుగా లాహోర్ 20 ఓవర్లలో 186 పరుగులు చేసింది. దీన్ని ఛేదించేందుకు బరిలోకి దిగిన క్వెట్టా 18 ఓవర్లు ముగిసేసరికి 6 వికెట్లకు 153 పరుగులు చేసింది. ఇక ఆ జట్టు గెలువాలంటే 12 బంతుల్లో 34 పరుగులు కావాలి. ఈ దశలో బౌలింగ్‌కు వచ్చిన సోహైల్ ఖాన్.. తొలి బంతిని వైడ్‌గా వేశాడు. తర్వాత మరో మూడు బంతులు వేసిన అతను ఉన్నట్టుండి ఫీల్డింగ్‌లో మార్పులు చేశాడు. ఈ క్రమంలో బౌండరీ వద్ద ఫీల్డింగ్ చేస్తున్న యాసిర్ షాను ఏదో అన్నాడు. అంతే పట్టరాని కోపంతో ఊగిపోయిన షా .. బంతిని బలంగా సోహైల్‌పైకి విసిరాడు. దీన్ని గమనించిన బౌలర్ తృటిలో పక్కకు తప్పుకున్నాడు. కానీ వెంటనే బంతిని అందుకున్న సోహైల్ కూడా యాసిర్ షా వైపు విసిరాడు. ఇంతలో సహచరులు జోక్యం చేసుకుని సర్ది చెప్పడంతో ఇరువురు శాంతించారు. మొత్తానికి ఒకే జట్టులోని ఆటగాళ్ల మధ్య కూడా భేదాభిప్రాయాలు ఉంటాయని మరోసారి బహిర్గతమైంది. ఈ వీడియో ఇప్పుడు సామాజిక మధ్యమాల్లో వైరల్‌గా మారడంతో నెటిజన్లు రకరకాల కామెంట్లు పెడుతున్నారు.

తప్పని తేలితే ఉరితీయండి


షమీ

న్యూఢిల్లీ: మ్యాచ్ ఫిక్సింగ్ చేశానని బీసీసీఐ విచారణలో తేలితే తనను ఉరితీయాలని భారత పేసర్ మహ్మద్ షమీ తీవ్ర ఆవేదనతో చెప్పాడు. పాకిస్థానీ అమ్మాయి నుంచి డబ్బు తీసుకుని మ్యాచ్ ఫిక్సింగ్ చేశాడంటూ అతని భార్య హసీన్ ఆరోపించడంతో బీసీసీఐ అవినీతి నిరోధక శాఖ రంగంలోకి దిగిన సంగతి తెలిసిందే. దీనిపై వివరణ ఇచ్చుకున్న షమీ తాను దేశం కోసం ఎంతో నిజాయతీగా ఆడానని తెలిపాడు. హసీన్ మొదటి పెండ్లి విషయాన్ని దాచిపెట్టి తనతో రెండో పెండ్లి చేసుకున్నదని, షాపింగ్ కోసం డెబిట్ కార్డును విచ్చలవిడిగా వాడిందని చెప్పాడు. అయినా సరే పరిస్థితి ఇంతదాకా వచ్చిన తర్వాత ఇకపై కలిసి జీవించడం కుదరదని తేల్చేశాడు.